www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
వరంగల్
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
పేజీలు: 14
సంపుటి (Volume) : 23
సంచిక (Issue) : 227
శనివారం | 15-11-2025
శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, బహుళపక్షం; తిథి: ఏకాదశి రా.2:38 తదుపరి ద్వాదశి; నక్షత్రం: ఉత్తర రా.11:34 తదుపరి హస్త; వర్జ్యం: శేషం ఉ. 6.57 వరకు; దుర్ముహూర్తం: ఉ.6.23-7.53; అమృతఘడియలు: మ.3.41-5.26; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 6.23; సూర్యాస్తమయం: 5.35
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

కేటీఆర్ అహంకారం తగ్గించుకోవాలి

"ఈ గెలుపుతో బాధ్యత మరింత పెరిగింది. జూబ్లీహిల్స్ ఓటర్లు కాంగ్రెస్‌ను ఆశీర్వదించారు. ఓడితే కుంగిపోవడం.. గెలిస్తే పొంగిపోవడం తెలియదు. హైదరాబాద్‌ను మహా నగరంగా తీర్చిదిద్దుతాం. కిషన్‌రెడ్డి, కేటీఆర్, హరీశ్‌లు సహకరించాలి. ప్రభుత్వానికి సూచనలు చేయాలి. అవసరమైతే ప్రశ్నించాలి. కిషన్‌రెడ్డి తన వ్యవహార శైలిని మార్చుకోవాలి. హరీశ్ అసూయను, కేటీఆర్ అహంకారాన్ని తగ్గించుకోవాలి. కేసీఆర్ క్రియాశీల రాజకీయాల్లో లేరు. ఆయన గురించి మాట్లాడను."

- సీఎం రేవంత్‌రెడ్డి


అభినందనలు అందుకుంటున్న సీఎం రేవంత్‌రెడ్డి

జూబ్లీహిల్స్‌పై కాంగ్రెస్ జెండా

ఉప ఎన్నికలో హస్తం పార్టీ విజయభేరి

- 24,729 ఓట్ల మెజారిటీతో గెలుపొందిన నవీన్ యాదవ్
- నాడు మాగంటి హ్యాట్రిక్.. నేడు ఆయన భార్య ఓటమి
- రాజధానిలో మరో సిటింగ్ స్థానాన్ని కోల్పోయిన బీఆర్ఎస్
- డిపాజిట్ దక్కించుకోని బీజేపీ.. దీపక్‌రెడ్డికి మళ్లీ చుక్కెదురు
- 16 ఏళ్ల తర్వాత జూబ్లీహిల్స్ మళ్లీ 'హస్త'గతం
- నాడు కంటోన్మెంట్.. నేడు జూబ్లీహిల్స్.. జోష్‌లో కాంగ్రెస్


నవీన్ యాదవ్ విజయ చిహ్నం

హైదరాబాద్ సిటీ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ విజయభేరి మోగించింది! రెండు దశాబ్దాల తర్వాత మళ్లీ ఇక్కడ మూడు రంగుల జెండా ఎగిరింది! ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఖాతాలో మరో ఉప ఎన్నిక విజయం నమోదైంది! సిటింగ్ స్థానాన్ని నిలబెట్టుకోవాలి అనుకున్న బీఆర్ఎస్ ఆశలు గల్లంతై.. కాంగ్రెస్‌కు కొత్త ఊపిరి వచ్చింది. ఇక్కడ హోరాహోరీ పోరు ఉంటుందన్న ఎగ్జిట్ పోల్స్, రాజకీయ విశ్లేషకుల అంచనాలను తలకిందులు చేస్తూ కాంగ్రెస్ ఏకపక్ష విజయం నమోదు చేసింది. ఆ పార్టీ అభ్యర్థి వల్లాల నవీన్ కుమార్ యాదవ్ తన సమీప బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతా గోపీనాథ్‌పై 24 వేల పైచిలుకు

మిగతా 13వ పేజీలో...

కేటీఆర్ సెల్ఫ్ గోల్!

ఉప ఎన్నిక కాంగ్రెస్ సర్కార్‌కు రెఫరెండం అని ప్రకటన 12

అధికార పార్టీ కంటే ముందే తానే సవాల్ విసిరి ఓడిన బీఆర్ఎస్

కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు: కేటీఆర్





కర్మ హిట్స్ బ్యాక్..!

ఉప ఎన్నిక ఫలితం తర్వాత ఎక్స్‌లో కవిత పోస్ట్ 2

తప్పు చేస్తే ఎవరైనా గట్టిగా చెప్తా

అందుకే నన్ను సాగనంపారు

మెదక్ జిల్లా పర్యటనలో వ్యాఖ్యలు

జూబ్లీహిల్స్ ఫలితం ఇలా..

పార్టీ	ఓట్లు	ఓట్లశాతం
కాంగ్రెస్	98,988	50.83
బీఆర్ఎస్	74,259	38.13
బీజేపీ	17,061	8.76
ఇతరులు	4,424	2.28


బిహార్ విజయంతో ఢిల్లీలో మోదీ సంబరాలు

డబుల్ ఇంజన్

డబుల్ సెంచరీ

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘన విజయం సాధించారు!
బిహార్లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఘోర పరాభవాన్ని మూటగట్టుకున్నారు!
బిహార్లో బీజేపీ నేతృత్వంలోని కూటమి అపూర్వ విజయాన్ని సొంతం చేసుకుంది!
కార్పెట్ బాంబింగ్ చేసినా.. జూబ్లీహిల్స్‌లో బీజేపీకి డిపాజిట్ కూడా దక్కలేదు!
అసెంబ్లీ, లోక్‌సభ.. ఎన్నిక ఏదైనా ఓటమికి చిరునామాగా రాహుల్ నిలుస్తున్నారు!
ఒకప్పుడు అజేయమనుకున్న బీఆర్ఎస్‌ది కూడా ఇప్పుడు అచ్చంగా అదే బాట!
అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత ప్రతి ఎన్నికలోనూ ఆ పార్టీ తీరు తీసికట్టే!

బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో డబుల్ ఇంజిన్ సర్కారు దుమ్మురేపింది. మోదీ, నితీశ్ కుమార్ జోడీ అద్భుతం చేసింది. ఎన్నికల్లో ఆరింట ఐదొంతుల సీట్లను సాధించి విజయ దుందుభి మోగించింది! రాష్ట్ర అసెంబ్లీలో 243 స్థానాలుంటే ఎన్డీయే 202 సీట్లలో ఘన విజయం సాధించింది. ఇక్కడ బీజేపీ ఏకంగా 88 శాతం స్ట్రైక్ రేట్‌ను సాధించింది! ఆ పార్టీ 101 సీట్లలో పోటీ చేసి ఏకంగా 89 స్థానాల్లో విజయం సాధిస్తే.. పవన్ కల్యాణ్ తరహాలోనే బిహార్లో చిరాగ్ పాసవాన్ ఫీనిక్స్ పక్షిలా ఎదిగి.. 68% స్ట్రైక్ రేట్‌ను

మిగతా 10వ పేజీలో...

బిహార్‌లో ఎన్డీయే ప్రభంజనం

- మొత్తం 243 సీట్లకుగాను 202 చోట్ల గెలుపు
- 89 సీట్లతో అతిపెద్ద పార్టీగా బీజేపీ.. జేడీయూకు 85
- మోదీ మ్యాజిక్.. ఫలించిన నితీశ్ అభివృద్ధి మంత్రం
- నితీశ్‌కు మహిళలు, బీసీల మంగళ హారతులు
- కూటమి విజయంలో చిరాగ్ పాసవాన్ కీలక పాత్ర
- ముస్లిం మెజారిటీ ప్రాంతాల్లోనూ బీజేపీ గెలుపు
- మహాగఠ్ బంధన్‌కు మహా గట్టి దెబ్బ.. 35 సీట్లకే పరిమితం
- బిహారీలను ఇంకా వీడని 'జంగిల్ రాజ్' భయం
- 6 సీట్లకే కాంగ్రెస్ పరిమితం.. మజ్లిస్ ఖాతాలో 5 సీట్లు
- సీఎంగా మరోసారి నితీశ్‌కుమారే!

కాంగ్రెస్ ఇక ముక్కలే..

కాంగ్రెస్ పరాన్నజీవి పార్టీగా మారింది. కూటమిలోని మిత్రపక్షాలను కూడా ముంచుతోంది. ముస్లింలీగ్-మావోయిస్ట్ కాంగ్రెస్‌లా మారింది. కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి విజన్ లేదు. కేవలం నకరాత్మక అజెండానే ఉంది. కాంగ్రెస్ నేతలే అధిష్ఠానం విధానాలను వ్యతిరేకిస్తున్నారు. త్వరలో కాంగ్రెస్ మరోసారి ముక్కలు చెక్కలు కాబోతోంది. 2014 నుంచి ఇప్పటివరకు జరిగిన 3 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ కనీసం మూడంకెల సీట్లను సాధించలేకపోయింది. ఈ విజయం ఎన్నికల సంఘంపై ప్రజల నమ్మకాన్ని మరింత పెంచింది. బిహార్‌లో ఇక ఎప్పటికీ జంగిల్ రాజ్ ప్రభుత్వం తిరిగి రాదు. బిహార్ విజయం బెంగాల్‌లో బీజేపీకి మార్గం సుగమం చేసింది.

- ప్రధాని నరేంద్ర మోదీ

బిహార్ తీర్పు

(మొత్తం సీట్లు 243)

ఎన్డీయే కూటమి	**202**
బీజేపీ	89
జేడీయూ	85
ఎల్‌జేపీ	19
ఇతరులు	9
మహాగఠ్‌బంధన్	**35**
ఆర్జేడీ	25
కాంగ్రెస్	6
ఇతరులు	4
ఇతర పార్టీలు	
మజ్లిస్	5
బీఎస్పీ	1



సారీ.. సర్!

ఓటర్ల జాబితా సవరణపై రాహుల్ గాంధీ పోరాటం ప్రభావం శూన్యం! 11

ఓటు చోరీ విమర్శల్ని పట్టించుకోని ఓటరు

రాహుల్ యాత్ర చేసిన అన్ని సీట్లలో ఓటమి!

ఎన్నికల్లో తొలి నుంచీ అక్రమాలే: రాహుల్

ఎన్నికల వ్యూహకర్త పీకే పార్టీకి జీరో సీట్లు

'పరకామణి' ఫిర్యాదుదారు సతీశ్‌కుమార్

అనుమానాస్పద మృతి!

- రైలు పట్టాల పక్కన విగతజీవిగా జీఆర్పీ సీఐ.. తలకు గాయాలు
- ఇదే కేసులో విచారణకు ఏపీలోని గుంతకల్లు నుంచి తిరుపతికి రైల్లో వెళ్తుండగా ఘటన.. తాడిపత్రి సమీపంలో మృతదేహం
- మృతిపై అనుమానాలు: పోలీసులకు సతీశ్ భార్య ఫిర్యాదు
- ఆస్పత్రి వద్ద బంధువులు, సంఘాల ఆందోళన 3


సతీశ్‌కుమార్ (ఫైల్)

ఈ గెలుపుతో బాధ్యత మరింత పెరిగింది

జూబ్లీహిల్స్ ఓటర్లు కాంగ్రెస్‌ను ఆశీర్వదించారు.. 51% ఓట్లతో అండగా నిలిచారు

- హరీశ్ అసూయను కేటీఆర్ అహంకారాన్ని తగ్గించుకోవాలి
- కిషన్‌రెడ్డి తన వ్యవహార శైలిని మార్చుకోవాలి
- మీడియా సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి
- 17న 'స్థానిక' ఎన్నికలపై నిర్ణయం తీసుకుంటామని వెల్లడి



జూబ్లీహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు ఉత్తమ్‌కుమార్, వాకిటి శ్రీహరి, పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, నవీన్ యాదవ్

హైదరాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలుపుతో తమ బాధ్యత మరింత పెరిగిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. 51 శాతం ఓట్లతో ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించారని, రెండేళ్ల పాలనను పూర్తి చేసుకుంటున్న సందర్భంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్‌ను ఆశీర్వదించారని తెలిపారు. 'అభివృద్ధి కార్యాచరణతో ముందుకు వెళ్లండి, బాధ్యతతో కార్యక్రమాలను నిర్వహించండి' అంటూ దీవించారని పేర్కొన్నారు. తాము దీన్ని బాధ్యతగా స్వీకరిస్తామని, హైదరాబాద్ మహానగరాన్ని మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఎన్నికల్లో నెగ్గితే పొంగిపోవడం, ఓడితే కుంగిపోవడం కాంగ్రెస్‌కు తెలియదని.. ప్రతిపక్షంలో ఉంటే ప్రజా సమస్యలపై పోరాడడం, ప్రభుత్వంలో ఉంటే సమస్యల పరిష్కారానికి ప్రయత్నించడమే తెలుసని అన్నారు. అందుకే ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా పార్టీ ఇంకా మనుగడ సాగిస్తూనే ఉందన్నారు. 51% ఓట్లతో కాంగ్రెస్‌కు ఎన్నడూ లేనంత బలం వచ్చిందని తెలిపారు. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్‌కు 38%, బీజేపీకి 8% ఓట్లు వచ్చాయని వివరించారు. ఉప ఎన్నికలో విజయం సాధించిన అనంతరం రేవంత్‌రెడ్డి శుక్రవారమిక్కడ విలేకరులతో మాట్లాడారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేగా గెలిచిన నవీన్ యాదవ్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క, వాకిటి శ్రీహరి, వివేక్ పాల్గొన్నారు. సీఎం రేవంత్ మాట్లాడుతూ.. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ రాష్ట్రమంతా తిరిగారని, తామూ అలాగే తిరిగామని చెప్పారు. అప్పుడు ప్రజలు తమకు 65 సీట్లు, బీఆర్ఎస్‌కు 38 సీట్లు ఇచ్చారన్నారు. తమకు 38.5% ఓట్లు రాగా, బీఆర్ఎస్‌కు 37% ఓట్లు వచ్చాయని చెప్పారు. 8 సీట్లు బీజేపీకి, 7 సీట్లు మజ్లిస్‌కు ఇచ్చారన్నారు. ఆరు నెలల తర్వాత జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో తమ ఓట్లు 38.5 నుంచి 41 శాతానికి పెరిగాయని గుర్తుచేశారు. 8 ఎంపీ సీట్లు కాంగ్రెస్‌కు ఇవ్వగా.. 35% ఓట్లతో 8 సీట్లను బీజేపీకి, ఒక సీటు మజ్లిస్‌కు కట్టబెట్టారని చెప్పారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని, వాటి అమలుకు కొంత సమయం పడుతుందని, ఈ విషయాలను ప్రజలు అర్థం చేసుకుని తమకు అవకాశం ఇస్తూ వస్తున్నారని చెప్పారు. "రాష్ట్రంలో 60-65% ఆదాయం ఈ జంట నగరాల నుంచే వస్తోంది. దాన్ని అభివృద్ధి, సంక్షేమం కోసం రాష్ట్రం నలుమూలలా ఖర్చు పెడుతున్నాం. ఈ నగరాన్ని కాపాడుకోవడం, ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం ప్రణాళికలను రచించడం వంటి చర్యలను చేపడుతున్నాం" అని అన్నారు

మహానగరంగా తీర్చిదిద్దాలనుకుంటున్నాం



"ప్రజలు మన వ్యవహార శైలిని గమనించి, స్పష్టమైన తీర్పు ఇచ్చారు. హైదరాబాద్‌ను మహా నగరంగా తీర్చిదిద్దుతాం. పెట్టుబడులను ఆకర్షించి నగరాన్ని అభివృద్ధి చేయాలనుకుంటున్నాం. నగరంలో చెత్త సమస్య పెరిగిపోయింది. చెరువులు, కుంటల్లో కబ్జాలను తొలగించి, నగరాన్ని సమస్యల రహితంగా చేయడానికి ప్రణాళికను సిద్ధం చేస్తున్నాం" అని సీఎం రేవంత్ చెప్పారు. బీఆర్ఎస్ సోషల్ మీడియాలో తప్పుడు వార్తలతో ప్రభుత్వాన్ని అవమానిస్తూ విష ప్రచారం చేశారని ఆరోపించారు. హైదరాబాద్‌లో గంజాయి, డ్రగ్స్‌ను అరికట్టడానికి ఈగల్ ఫోర్స్‌ను, కబ్జాలను తొలగించడానికి హైడ్రాను తీసుకొచ్చామని చెప్పారు. తమ ప్రయత్నాలకు బీఆర్ఎస్ సహకరించకపోగా.. ప్రతి సందర్భంలో అడ్డు తగిలిందన్నారు. మూసీ నిర్వాసితుల అంశంలో ప్రతి నిమిషం ప్రధాన ప్రతిపక్షం అడ్డు తగిలిందని పేర్కొన్నారు. కేంద్రం నుంచి రావాల్సిన అనుమతులు, నిధుల విషయంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సహాయ నిరాకరణ చేస్తున్నారని ఆరోపించారు.

కిషన్‌రెడ్డి ప్రచారం చేసినా.. బీజేపీకి 17 వేల ఓట్లే!

"కేటీఆర్, హరీశ్, కిషన్‌రెడ్డిలకు ప్రధాన బాధ్యతలు ఉన్నాయి. రాష్ట్రానికి రావాల్సిన అనుమతులు, నిధులు రాకుండా కిషన్‌రెడ్డి అడ్డు తగులుతున్నారు. మెట్రో, మూసీ ప్రక్షాళన, నగరానికి గోదావరి జలాల తరలింపు, రీజినల్ రింగు రోడ్డు విషయంలో అడ్డుపుల్లలు వేస్తున్నారు. దీన్ని ప్రజలు గమనిస్తున్నారు. అందుకే పార్లమెంటు ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గంలోని ఇదే జూబ్లీహిల్స్ సెగ్మెంటులో 65 వేల ఓట్లు కిషన్‌రెడ్డికి వేసిన ప్రజలు.. ఇప్పుడు కిషన్‌రెడ్డే అభ్యర్థిగా మారి, ప్రచారం చేస్తే బీజేపీకి 17 వేల ఓట్లు మాత్రమే వచ్చాయి. ఆ పార్టీకి డిపాజిట్ గల్లంతైంది. కిషన్‌రెడ్డి తన వ్యవహార శైలిని మార్చుకోవాల్సిన అవసరం ఉంది. 2014, 2019, 2023లలో ఈ ప్రాంతం నుంచి బీజేపీని గెలిపించారు. జంట నగరాల్లో ప్రజలు మెట్రో విస్తరణ, గోదావరి జలాలు, మూసీ ప్రక్షాళన, ఆర్ఆర్ఆర్, రేడియల్ రోడ్లను కోరుకుంటున్నారు. ఈ రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులను ఇతర రాష్ట్రాలకు తీసుకెళుతున్నప్పుడు మీరు అడ్డుకోకుండా ప్రేక్షక పాత్ర పోషించారని ప్రజలు తెలుసుకోవడం వల్లే బీజేపీకి ఇలాంటి పరిస్థితి దాపురించింది. ఇప్పటికైనా కిషన్‌రెడ్డి తెలంగాణ ప్రభుత్వానికి, మహా నగర అభివృద్ధికి సహకరించాలి" అని రేవంత్ కోరారు. "కాంగ్రెస్ పార్టీ ఎన్నికలు వచ్చినప్పుడే రాజకీయాలు మాట్లాడుతుంది. మిగతా సమయాల్లో రాజకీయాల జోలికి పోదు. కిషన్‌రెడ్డిని సాదరంగా ఆహ్వానిస్తున్నా. సచివాలయానికి రండి. కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల గురించి చర్చించుకుందాం. మా ఉప ముఖ్యమంత్రికి సూచన చేస్తున్నా. డిసెంబరు 1నుంచి పార్లమెంటు సమావేశాలు జరగబోతున్నాయి. కేంద్రం వద్ద అనుమతుల కోసం ఉన్న ప్రాజెక్టులు, ఇవ్వాల్సిన నిధులపై ఒక నివేదికను ఎంపీలు, కేంద్ర మంత్రులకు ఇవ్వండి. కేంద్ర మంత్రులు సంజయ్, కిషన్‌రెడ్డి; బీజేపీ, బీఆర్ఎస్ ఎంపీలకు, మన ఎంపీలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించండి" అని సీఎం చెప్పారు.

మీడియా విశ్వసనీయతను కోల్పోవద్దు..

"మీడియాకు ముందే చెప్పా. ఎన్నికల సందర్భంగా వాళ్లు ఏదో ప్రచారం చేస్తారు. మీ విశ్వసనీయతను పోగొట్టుకోకండని చానెళ్లు, పేపర్లకు చెప్పా. బీఆర్ఎస్ ఓడుతుందని, బీజేపీ డిపాజిట్ కోల్పోతుందనీ చెప్పా. ఇప్పుడదే జరిగింది కదా? పెయిడ్ ఆర్టికల్స్ కోసం తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయి. ఓట్ల లెక్కింపులో మూడో రౌండులో బీఆర్ఎస్‌కు 211 ఓట్లు ఎక్కువ రాగానే.. పెద్ద పెద్ద బ్రేకింగులు ఇచ్చారు. ఫలితం మాకు అనుకూలంగా ఉందని తెలుస్తున్నా.. ఆ చానెళ్లు ఇంకా బీఆర్ఎస్‌ను బతికించడానికి ఉత్సాహం చూపాయి. మిగతా రాష్ట్రాల మాదిరిగా చానెళ్లను కనిపించకుండా చేయడం ఒక్క నిమిషం పని. చానెళ్లలో ఇంత బరితెగింపు, అడ్డగోలుతనం పనికి రాదు" అని మీడియా సంస్థలకు రేవంత్ హితవు పలికారు. జూబ్లీహిల్స్ ఎన్నికకు సహకరించిన మీడియా సంస్థలు, ప్రజలు, సీపీఐ, సీపీఎం, మజ్లిస్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయం తన చేతిలో లేదని, కేటీఆర్ చేతిలోనూ లేదని ఒక ప్రశ్నకు సమాధానంగా ఆయన చెప్పారు.

కేసీఆర్ క్రియాశీల రాజకీయాల్లో లేరు

కేసీఆర్‌ను తప్పించి, ఆ కుర్చీని గుంజుకోవాలని హరీశ్, కేటీఆర్ పోటీ పడుతున్నారని మరో ప్రశ్నకు సమాధానంగా సీఎం రేవంత్ చెప్పారు. కేసీఆర్ క్రియాశీల రాజకీయాల్లో లేరు. వారి ఆరోగ్యం కూడా అంతంతమాత్రంగానే ఉంది. అలాంటి నాయకుణ్ని విమర్శించడం భావ్యం కాదని భావిస్తున్నా" అని అన్నారు. 17న క్యాబినెట్ సమావేశంలో మంత్రుల సూచనలు తీసుకుని, స్థానిక సంస్థల ఎన్నికలపై ఒక నిర్ణయానికి వస్తామని చెప్పారు.

నవీన్ యాదవ్‌కు అభినందనలు

ఉప ఎన్నికలో విజయం సాధించిన నవీన్ యాదవ్‌ను సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు అభినందించారు. శాలువా కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేశారు.

అసూయ, అహంకారాన్ని తగ్గించుకోవాలి

"బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ అసూయను తగ్గించుకోవాలి. కేటీఆర్ అహంకారాన్ని తగ్గించుకోవాలి. నీ వయసు నాకంటే తక్కువే. ఇంకా చాలా రోజుల పాటు మనం రాజకీయాల్లో కొనసాగాల్సి ఉంది. అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. వారసత్వ సంపదా కాదు. తాతలు, ముత్తాతల ఆస్తిలో ఎన్టీఆర్ కల్పించిన హక్కు వల్ల ఆడ పిల్లలు కూడా వాటా అడుగుతున్నారు. ఆస్తి కూడా మనకు పూర్తిగా రాదు. ప్రతిపక్షంగా కొంత సంయమనం పాటించాలి. అసెంబ్లీలో హరీశ్ రావు కూర్చుని, మావైపు చూసే చూపులను చూస్తే నిజంగానే ఆ చూపులకు శక్తి ఉంటే.. కాంగ్రెస్ సీట్లు మాడి మసైపోయి, బూడిదైపోయి, భూమిలో కలిసిపోయేటట్లు ఉంటాయి. రక్తమంతా మొహంలోకి తెచ్చుకుని చూస్తుంటాడు. దాన్ని ప్రజలు గమనిస్తున్నారు. ఇక కేటీఆర్‌కు అహంకారం ఉంది. అధికారం పోయినా ఆయనకు అసూయ, ఈయనకు అహంకారం తగ్గలేదు. ఇంకా ప్రభుత్వానికి మూడేళ్లు ఉంది. రెండేళ్లు ఓపిక పట్టండి. చివరి సంవత్సరంలో రాజకీయాలు చేద్దాం. రెండేళ్ల పాటు ప్రతిపక్షంగా సహకరించండి. సమస్యలను లేవనెత్తండి. ప్రభుత్వానికి సూచనలు చేయండి. అవసరమనుకుంటే సమస్యలపై ధర్నా చేయండి. మాకు అభ్యంతరం లేదు. చట్ట సభల్లో చర్చలు చేయండి. ప్రభుత్వాన్ని ప్రశ్నించండి" అని రేవంత్ బీఆర్ఎస్ నేతలకు సూచించారు. "నువ్వు డబ్బులు పెడుతున్న సోషల్ మీడియా నువ్వు చెప్పిందే రాస్తుంది. అదే చదువుకొని, భ్రమలో ఉండి మాట్లాడుతున్నావు. ఫేక్ న్యూస్‌ను నువ్వే క్రియేట్ చేసి, వాటిని నువ్వే నమ్మి, నువ్వే సర్వేల పేరిట కొంత మందికి నగదు ఇచ్చి మాట్లాడుతున్నావు" అని కేటీఆర్‌ను ఎద్దేవా చేశారు.

లోకం తీరు



'జూబ్లీహిల్స్'పై 500 కోట్ల బెట్టింగ్‌లు

- తెలుగు రాష్ట్రాల్లో పందేల జోరు

హైదరాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై తెలుగు రాష్ట్రాల్లో సుమారు రూ.500 కోట్ల మేర బెట్టింగ్‌లు జరిగినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపుపై ధీమాతో ఉన్న ఆయన వర్గం.. ప్రత్యర్థి వర్గానికి గట్టి సవాలు విసిరింది. బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపుపై ఆ పార్టీ శ్రేణులు రూ.లక్ష బెట్టింగ్ పెడితే.. కాంగ్రెస్ అభ్యర్థి గెలుస్తారని రూ.4 లక్షలు ఆఫర్ చేశారు. ఒకవేళ కాంగ్రెస్ అభ్యర్థి ఓడిపోతే.. బీఆర్ఎస్ తరఫున బెట్టింగ్ పెట్టిన వారికి రూ.లక్షకు రూ.4 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. అదే బీఆర్ఎస్ ఓడిపోతే.. కాంగ్రెస్ అభ్యర్థి తరఫున బెట్టింగ్ పెట్టిన వారికి రూ.లక్ష ఇస్తే సరిపోతుంది.. వెంగళరావునగర్‌లో ఓ వ్యక్తి బీఆర్ఎస్ తరఫున తొలుత రూ.10లక్షలు బెట్టింగ్ పెట్టారు. అయితే, ఎగ్జిట్‌పోల్స్, పలు రకాల సర్వేల్లో బీఆర్ఎస్ ఓడిపోతుందనే ప్రచారం జరగడంతో చివరి నిమిషంలో తన బెట్టింగ్‌ను ఉపసంహరించుకోవడం బీఆర్ఎస్ వర్గాల్లో చర్చనీయాంశమైంది. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని టీడీపీ సానుభూతిపరులు ఈ ఎన్నిక మీద బెట్టింగ్ పెట్టేందుకు పోటీపడటం కూడా చర్చనీయాంశమైంది.

కాంగ్రెస్ గెలుపుపై ఏపీ టీడీపీ పందెం

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలుస్తుందని ఏపీ టీడీపీ శ్రేణులు బెట్టింగ్‌లో పోటీ పడ్డాయి. ఉమ్మడి గుంటూరు, కృష్ణా, ప్రకాశం, గోదావరి జిల్లాల్లో భారీగా బెట్టింగ్‌లు జరిగాయి. గుంటూరు ఎల్‌వీఆర్ క్లబ్‌లో వారం రోజులుగా ఇదే సందడి. పల్నాడు జిల్లా వినుకొండలో సుమారు రూ.10 కోట్ల బెట్టింగ్ పెట్టారు. బీఆర్ఎస్ గెలుస్తుందని రూ.లక్ష పెడితే.. ఓడిపోతుందని ప్రత్యర్థులు రూ.2.50లక్షలు పందెం కాశారు. హైదరాబాద్, విజయవాడ, ఖమ్మం, ఏలూరు, భీమవరం, రాజమండ్రి, కడప, వరంగల్, నల్లగొండ జిల్లాల్లో బెట్టింగ్‌లు జోరుగా సాగాయనే చర్చ జరిగింది.

కేంద్రం వైఖరికి వ్యతిరేకంగా జూబ్లీహిల్స్ తీర్పు

- కూనంనేని సాంబశివరావు

హైదరాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానంలో సొంత పార్టీ అభ్యర్థికి డిపాజిట్ గల్లంతైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. పదేళ్ల కిషన్‌రెడ్డి ఎంపీగా ఉన్నప్పటికీ ప్రజా సమస్యల పరిష్కారంలో వైఫల్యంపై, హైదరాబాద్, తెలంగాణపై కేంద్ర ప్రభుత్వ వివక్షపై ప్రజల తీవ్ర వ్యతిరేకతకు ఈ ఫలితం నిదర్శనమని శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ కూడా సమస్యలు తీర్చకపోవడంతో ఆ పార్టీకి ఓటమి తప్పలేదన్నారు. కాంగ్రెస్ విజయంపై హర్షం వ్యక్తం చేశారు. నవీన్ యాదవ్‌కు అభినందనలు తెలిపారు. బిహార్ శాసనసభ ఎన్నికల్లో ఎన్డీఏ విజయం ఆ కూటమిది కాదని, ఎన్నికల సంఘానిదే అని కూనంనేని అన్నారు. ఎన్నికలకు ముందు 75 లక్షల మంది మహిళల బ్యాంకు ఖాతాల్లోకి నితీశ్ ప్రభుత్వం రూ.10 వేల చొప్పున బదిలీ చేసినా ఎన్నికల సంఘం పట్టించుకోలేదన్నారు. ఎస్ఐఆర్ పేరుతో 65 లక్షల ఓట్లు తొలగించారన్నారు. ఇవన్నీ ఎన్డీఏ కూటమి విజయానికి దోహదం చేశాయన్నారు. మహాఘట్‌బంధన్ ఎన్నికల షెడ్యూల్ వచ్చాక కూడా సీట్ల సర్దుబాటు చేసుకోలేకపోవడంతో ప్రజల సానుకూలతను ఉపయోగించుకోలేకపోయిందని ఆయన చెప్పారు.

కర్మ హిట్స్ బ్యాక్!

జూబ్లీహిల్స్ ఫలితం తర్వాత ఎక్స్‌లో కవిత పోస్ట్

- తప్పుచేసేవారు ఎవరైనా గట్టిగా చెబుతా
- అందుకే పార్టీ నుంచి బయటకు పంపారు
- జూబ్లీహిల్స్‌లో ఎవరు గెలిచినా ఒరిగేదేం లేదు
- మెదక్ జిల్లా నర్సాపూర్, రెడ్డిపల్లి పర్యటనలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత



హైదరాబాద్/మెదక్/నర్సాపూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత చేసిన ఎక్స్‌లో చేసిన పోస్ట్ రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. శుక్రవారం సాయంత్రం ఆమె 'కర్మ హిట్స్ బ్యాక్.. (కర్మ ఎవరినీ వదలిపెట్టదు)' అంటూ పోస్ట్ చేశారు. ఆ పోస్ట్ ఎవరిని ఉద్దేశించి పెట్టారంటూ.. రాజకీయ వర్గాలతో పాటు ప్రజల్లోనూ చర్చ కొనసాగుతోంది. బీఆర్ఎస్‌లో అంతర్గతంగా ఇబ్బందులున్నాయని చెబుతూనే.. పలువురు ముఖ్య నేతలపై విమర్శలు చేయడంతో కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆమె చేస్తున్న వ్యాఖ్యలు బీఆర్ఎస్‌కు ఇబ్బందికరంగా మారుతున్నాయి. కవిత వ్యవహార శైలి సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. 'కర్మ హిట్స్ బ్యాక్' అంటూ ఆంగ్లంలో కేవలం ఒకేలైన్‌లో కవిత చేసిన పోస్ట్ వైరల్‌గా మారింది. దీనిపై రకరకాల విశ్లేషణలు చేస్తున్నారు. కాగా.. తప్పు చేసే వారు ఎవరైనా, ఎంతటి వారైనా తాను గట్టిగా వారి పేరు చెప్పడం అలవాటని, అందుకే తనను బీఆర్ఎస్ పార్టీ నుంచి బయటకు పంపారని కవిత చెప్పారు. జాగృతి ఆధ్వర్యంలో జిల్లాల పర్యటనలో భాగంగా శుక్రవారం మెదక్ జిల్లాలో పర్యటించారు. రెడ్డిపల్లిలో కాళేశ్వరం, ఆర్ఆర్ఆర్ రోడ్డులో భూములు కోల్పోయిన రైతులతో సమావేశమై వారి కష్టనష్టాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం మారినా, రైతుల పరిస్థితులు మాత్రం మారడం లేదన్నారు. మార్కెట్ ధరకు అనుగుణంగా రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక చాలా చిన్నదని, అందులో ఎవరు గెలిచినా ప్రజలకు ఒరిగేదేమీ లేదని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఘనపురం ఆనకట్ట ఎత్తు శిలాఫలకానికే పరిమితమైందని కవిత విమర్శించారు. ఈ ఆనకట్ట ఎత్తు పెంచాలని ఆమె డిమాండ్ చేశారు.

కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు రాజకీయం

ఆర్ఎస్ బ్రదర్స్ సమీకరణ ఫలించింది!.. జూబ్లీహిల్స్ ఫలితంపై ఆత్మవిమర్శ చేసుకుంటాం

- అంతర్గతంగా చర్చించుకుంటాం
- రాష్ట్రంలో బీఆర్ఎస్సే ప్రత్యామ్నాయమని తేలింది: కేటీఆర్



హైదరాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉపఎన్నిక నేపథ్యంలో.. కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు రాజకీయం బయటపడిందని.. ఆర్ఎస్ (రేవంత్‌రెడ్డి, సంజయ్‌ను ఉద్దేశించి) బ్రదర్స్ సమీకరణ ఇక్కడ వర్కౌట్ అయినట్లు కనబడుతోందని బీఆర్ఎస్ వర్కింగ్‌ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పోలింగ్‌కు మూడు రోజుల ముందు బండి సంజయ్ చేసిన ప్రచారం.. బీఆర్ఎస్‌పై వ్యతిరేక ప్రభావం చూపిందని పరోక్షంగా ప్రస్తావించారు. బీజేపీ మాత్రం డిపాజిట్ కూడా దక్కించుకోలేకపోయిందన్నారు. జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్‌దే గెలుపని సర్వే సంస్థలు మొదటినుంచీ చెప్పాయని, కాంగ్రెస్ అభ్యర్థి గెలుపుకోసం ఆ పార్టీ ఏం చేసిందో.. అందరికీ తెలుసన్నారు. ఏదేమైనా ప్రజాతీర్పును గౌరవిస్తామని, ఉప ఎన్నిక ఫలితంపై ఆత్మవిమర్శ చేసుకుంటామని, పార్టీలో అంతర్గతంగా చర్చించుకొని వైఫల్యాలను గుర్తించి సరిచేసుకుంటామని పేర్కొన్నారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని.. తమ పార్టీ అధినేత కేసీఆర్ ఎప్పుడూ చెబుతుంటారన్నారు. జూబ్లీహిల్స్ ఫలితాన్ని చూసి కుంగిపోమని, ఏ మాత్రం నిరాశ చెందకుండా.. ప్రధాన ప్రతిపక్షంగా ప్రజలకోసం పనిచేస్తూ.. ప్రభుత్వంపై పోరాటం చేస్తూ ముందుకు వెళ్తామని చెప్పారు. పార్లమెంటు ఎన్నికల తర్వాత.. జరిగిన ఈ ఉప ఎన్నిక ఫలితం ద్వారా బీఆర్ఎస్‌నే రాష్ట్రంలో ప్రత్యామ్నాయమని ప్రజలు తేల్చారని తెలిపారు. పశ్చిమబెంగాల్‌లో జరిగినట్లే.. ఇక్కడా పార్టీ మారిన నేతలను అనర్హులుగా ప్రకటిస్తే.. ఉపఎన్నికలు వస్తాయని ఆశిస్తున్నామని చెప్పారు. ఒక్క జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకే ఇన్ని అపసోపాలు పడిన కాంగ్రెస్.. 10 నియోజకవర్గాల్లో ఉపఎన్నికలు వస్తే ఎలా ఎదుర్కొంటుందోనని ఎద్దేవా చేశారు. గత రెండేళ్లుగా లగచర్ల మొదలు కాంగ్రెస్ చేసిన అనేక అరాచకాలు, అక్రమాలు, అవినీతిని ఎండగడుతూనే ఉంటామని ఆయ చెప్పారు.

హరీశ్‌లాంటి నేతలు, కార్యకర్తలు కష్టపడ్డారు

ఉప ఎన్నికలో పార్టీ అభ్యర్థి మాగంటి సునీత గెలుపుకోసం బీఆర్ఎస్ శ్రేణులు నిరంతరం శ్రమించాయని కేటీఆర్ అన్నారు. పండుగలు, వ్యక్తిగత సమస్యలను పక్కనపెట్టి.. పార్టీకోసం పనిచేసిన కార్యకర్తలు, ఆయా డివిజన్ల పరిధిలోని నాయకులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు తన తండ్రి మరణం తర్వాత కూడా ఓవైపు విషాదంలోనూ.. ఇంటివద్ద నుంచే.. ఉప ఎన్నికకోసం పనిచేశారని కొనియాడారు. ఎమ్మెల్సీ రవీందర్‌రావు తన సోదరుడు చనిపోయిన తర్వాత కూడా ఒకే రోజులోనే పార్టీ ప్రచారంలో పాల్గొన్నారన్నారు. వీరిద్దరే కాదు.. పార్టీకి చెందిన పలువురు తమ ఇబ్బందులను సైతం లెక్కచేయకుండా ఉప ఎన్నిక కోసం 40 రోజులు కష్టపడ్డారని కేటీఆర్ వెల్లడించారు. రాజకీయ అనుభవం లేకపోయినా, ఈ ఎన్నికలో గెలుపు కోసం.. మాగంటి సునీత ఎంతో కష్టపడ్డారన్నారు. ఉప ఎన్నికల్లో పార్టీకి ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు. తెలియజేస్తున్నామన్నారు.రాష్ట్ర ప్రభుత్వ అరాచకాలను, అవినీతిని ఎండగడుతున్న సోషల్ మీడియా వారియర్లు, పార్టీ కార్యకర్తలకు, నేతలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఉప ఎన్నికలో బీఆర్ఎస్ నిజాయితీగా, చిత్తశుద్ధితో పోరాడిందని.. దొంగ ఓటరు కార్డుల పంపిణీ, అక్రమాల గురించి ఎన్నికల సంఘానికి అనేక ఫిర్యాదులు చేశామని తెలిపారు. ఉప ఎన్నికలో అధికార కాంగ్రెస్ ఎలా గెలిచింది..? ఆ పార్టీ వ్యవహరించిన తీరు, ఎన్నికల సంఘం, పోలీసుల పనితీరుపై ప్రజాక్షేత్రంలో చర్చ కొనసాగాలని, మీడియాలోనూ చర్చ జరగాలని ఆయన అన్నారు.

అభివృద్ధికే ప్రజలు పట్టం కట్టారు: మహేశ్ గౌడ్

నిజామాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ప్రజలు అభివృద్ధి, సంక్షేమానికి పట్టం కట్టారని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ఈ గెలుపు పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం నిజామాబాద్‌లోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ప్రభుత్వ సలహాదారుడు సుదర్శన్‌రెడ్డి, షబ్బీర్‌అలీతో కలిసి మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపుకోసం పనిచేసిన ప్రతీ కార్యకర్తకు ఈ విజయాన్ని అంకితం ఇస్తున్నామన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక తీర్పుతో బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు సెలవు చెప్పారని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు గుండుసున్నా వచ్చిందని, ఇక రాష్ట్రంలో ఆ పార్టీకి భవిష్యత్తులేదని ప్రజలు స్పష్టం చేశారన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజాపాలన చేస్తుందని తెలిపారు. నవీన్‌యాదవ్‌ను గెలిపించిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రివర్గం, ప్రతి కాంగ్రెస్ కార్యకర్తదని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 100 సీట్లు సాధిస్తుందని, వచ్చే ఐదేళ్లు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీదే ప్రభుత్వమని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాల పట్ల ప్రజలు సంతృప్తితో ఉన్నారని, అందుకే జూబ్లీహిల్స్ ప్రజలు భారీ విజయాన్ని అందించారని పేర్కొన్నారు. కంటోన్మెంట్ ఉప ఎన్నిక మాదిరిగానే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లోను కాంగ్రెస్‌కు ప్రజలు స్పష్టమైన మద్దతు తెలిపారన్నారు. జూబ్లీహిల్స్ విజయం వచ్చే జీహెచ్ఎంసీ ఎన్నికలకు నాంది అని, జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ ప్రజలు కాంగ్రెస్‌కు పట్టంకట్టడం ఖాయమని తెలిపారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై కాంగ్రెస్ స్పష్టంగా ఉందని, బీసీ రిజర్వేషన్‌లకు అడ్డుపడుతున్న బీజేపీకి జూబ్లీహిల్స్ తీర్పుతో ప్రజలు గుణపాఠం చెప్పారన్నారు.

9 ఏళ్లు ఈ దేశ ప్రజల స్వాతంత్ర్యం కోసం నెహ్రూ జైలు జీవితం గడిపారు

పండిట్ జవహర్ లాల్ నెహ్రూ 136వ జయంతి సందర్భంగా సంగారెడ్డి రామ్‌నగర్‌లోని జగ్గారెడ్డి ఇంటి వద్ద ఘనంగా బాలల దినోత్సవం

- బిహార్ ఎన్నికల్లో ప్రజలు ఓటేశారా..? మిషన్లు ఓటేశాయా? అర్థం కావట్లేదు
- రాహుల్‌కు ఒకటే చెప్పదలుచుకున్న
- బిహార్ పోతే పోయింది.. మీరు ప్రధాని కావాల్సిన అవసరం ఉంది
- ఈ దేశ ప్రజలు క్షేమంగా ఉండాలంటే రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలి
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



సంగారెడ్డిలోని తన ఇంటి వద్ద నిర్వహించిన నెహ్రూ జయంతి ప్రత్యేక కార్యక్రమంలో జగ్గారెడ్డి

సంగారెడ్డి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఈ దేశ ప్రజల స్వాతంత్ర్యం కోసం 9 సంవత్సరాలు అంటే 3,259 రోజులు జైలు జీవితం గడిపిన చరిత్ర పండిట్ జవహర్ లాల్ నెహ్రూదని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి గుర్తు చేశారు. నెహ్రూ 136వ జయంతి సందర్భంగా సంగారెడ్డిలోని రామ్‌నగర్ లోని తన ఇంటి వద్ద జగ్గారెడ్డి ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. జవహర్ లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల త్యాగాల చరిత్రను కళ్లకు కట్టినట్లు ప్రదర్శనలు చేయించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. ఈ దేశ ప్రజలు సంక్షేమంగా ఉండాలంటే రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. నెహ్రూ కుటుంబ త్యాగాల చరిత్ర తెలియక కొందరు రాజకీయ మూర్ఖులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం బాధాకరంగా ఉందని చెప్పారు. బిహార్‌లో ఓట్లేసిన వాళ్లు మనుషులా.. లేక మిషన్లా తెలియడం లేదని సందేహం వ్యక్తం చేశారు. బిహార్ పోతే పోయిందని, రాహుల్ గాంధీ మాత్రం ఈ దేశానికి ప్రధాని కావాలని జగ్గారెడ్డి స్పష్టం చేశారు. త్యాగం.. పాలన.. మరణం.. అనేలా నెహ్రూ కుటుంబ చరిత్ర ఉందని తెలిపారు. దేశం కోసం తమ ఆస్తులతోపాటు ప్రాణాలను కూడా త్యాగం చేశారని కొనియాడారు. జగ్గారెడ్డి ప్రత్యేకంగా నిర్వహించిన నెహ్రూ జయంతికి భారీ స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల, జగ్గారెడ్డి తనయుడు భరత్ సాయిరెడ్డి పాల్గొన్నారు.

యూపీఐతో టోల్ చెల్లింపు

» ఫాస్టాగ్ లేని వాహనదారులకు ఊరట.. నేటి నుంచి అమలు



తూప్రాన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారులపై ఫాస్టాగ్ లేకుండా ప్రయాణించే వాహనదారులకు యూపీఐ చెల్లింపుల రూపంలో కేంద్ర ప్రభుత్వం కల్పించిన ఉపశమనం శనివారం నుంచి అమలు కానుంది. చెల్లుబాటు కాని, పని చేయని ఫాస్టాగ్‌తో టోల్ ప్లాజాలోకి వచ్చిన వాహనాల నుంచి ప్రస్తుతం సాధారణ రుసుము కంటే రెట్టింపు రుసుము వసూలు చేస్తున్నారు. ఉదాహరణకు ఓ వాహనం రూ.100 చెల్లించాలంటే.. ఫాస్టాగ్ లేకుంటే రూ.200 తీసుకుంటున్నారు. అయితే, ఫాస్టాగ్ లేని వాహనదారులు యూపీఐతో చెల్లింపులు చేస్తే 1.25 రెట్లు మాత్రమే చెల్లిస్తే సరిపోతుందని కేంద్రం గత నెలలో కొత్త విధానాన్ని ప్రకటించింది. అంటే, ఓ వాహనం చెల్లించాల్సింది రూ.100 అయితే ఫాస్టాగ్ లేకుంటే యూపీఐ ద్వారా రూ.125 చెల్లిస్తే చాలు అని వెల్లడించింది. నగదు చెల్లింపులు చేసే వారు మాత్రం రూ.200 చెల్లించాలని పేర్కొంది. కేంద్ర ప్రభుత్వం అక్టోబరులో ప్రకటించిన ఈ విధానం శనివారం నుంచి దేశ వ్యాప్తంగా అమలులోకి రానుంది.

ఫోరెన్సిక్ ల్యాబ్‌లో 60 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

హైదరాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు తెలంగాణ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబరేటరీ(ఎఫ్ఎస్ఎల్)లో ఖాళీల భర్తీకి మార్గం సుగమమైంది. రాష్ట్ర పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు(టీఎస్ఎల్‌పీఆర్‌బీ) 60 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా సైంటిఫిక్ ఆఫీసర్, సైంటిఫిక్ అసిస్టెంట్, లాబరేటరీ టెక్నీషియన్ పోస్టులను భర్తీ చేయనున్నారు. ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ఈనెల 27 నుంచి ప్రారంభమవుతుంది. దరఖాస్తులకు తుది గడువు డిసెంబర్ 15. అభ్యర్థులు ఈ పోస్టులకు సంబంధించిన విద్యార్హతలు, ఇతర వివరాల కోసం టీఎస్ఎల్‌పీఆర్‌బీ వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.

బాలల భవితకు ఈబీజీ రూ.60 కోట్లు

హైదరాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవం సందర్భంగా ఈబీజీ గ్రూపు 'చిల్డ్రన్స్ ఆఫ్ లైఫ్' అనే కార్యక్రమాన్ని ప్రారంభించింది. రాబోయే ఐదేళ్లలో లక్ష మంది చిన్నారులకు మెరుగైన జీవితాన్ని అందించాలనే లక్ష్యంతో, ఈ గ్రూపు ఏకంగా రూ.60 కోట్లను కేటాయించనున్నట్లు గ్రూపు ఛైర్మన్ డాక్టర్ ఇర్ఫాన్ ఖాన్ ప్రకటించారు. బాలలకు మంచి ఆహారం, వసతి, దుస్తులు, ఆరోగ్య సంరక్షణ, నాణ్యమైన విద్య, భద్రత కల్పించడమే తమ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యాలని ఆయన వివరించారు. ఈ కార్యక్రమం తొలి దశలో తెలంగాణలోని హైదరాబాద్ (అర్బన్), వనపర్తి (సెమి రూరల్) జిల్లాలతో పాటు కేరళలోని తిరువనంతపురం జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభిస్తున్నామని, మొదటి దశ కోసం రూ.12 కోట్లు ఖర్చుపెడుతున్నామని ఇర్ఫాన్ ఖాన్ వెల్లడించారు. హైదరాబాద్‌లో శుక్రవారం నాడు జరిగిన సమావేశంలో భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ పాల్గొని, ఈబీజీ గ్రూపు సామాజిక బాధ్యతగా చేపట్టిన ఈ కార్యక్రమం తనను ఆకర్షించిందని చెప్పారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏసీబీ తనిఖీలు

» అనధికారికంగా ఉన్న నగదు సీజ్

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): రాష్ట్రంలోని పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏసీబీ అధికారులు శుక్రవారం సోదాలు నిర్వహించారు. ఏసీబీ డీజీ ఆదేశాల మేరకు ఈ తనిఖీలు నిర్వహించినట్లు ఏసీబీ డీఎస్పీలు తెలిపారు. కార్యాలయాల్లోని డాక్యుమెంట్ రైటర్లు, కార్యాలయ సిబ్బంది, వివిధ పనుల నిమిత్తం వచ్చిన వారిని బయటకు వెళ్లకుండా లోపలే ఉంచి వారి వద్దనున్న డాక్యుమెంట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయానికి వచ్చే వారి వద్ద నుంచి వసూలు చేస్తున్న ఫీజు వివరాలను సేకరించారు. ఈ తనిఖీల్లో పలువురు డాక్యుమెంట్ రైటర్లు యజమాని లేకుండానే రిజిస్ట్రేషన్లు చేయిస్తూ వారి వద్దే సంబంధిత పేపర్లు ఉంచుకుంటున్నట్లు గుర్తించి, వారి వద్ద ఉన్న నగదును, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కార్యాలయంతో సంబంధం లేని కొందరు ఏజెంట్లను గుర్తించామని తెలిపారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమ వసూళ్ల కోసం ఓ మహిళా కూలీని నియమించుకుని ఆమెకు రోజుకు రూ.500 చెల్లిస్తున్నట్లు గుర్తించారు. కార్యాలయంలో అనధికారికంగా ఉన్న రూ.63,160 నగదును సీజ్ చేసిన ఏసీబీ అధికారులు ఆ నగదుకు సంబంధించిన వివరాలు వెల్లడించాలని సబ్ రిజిస్ట్రార్ బలరాంయాదవ్‌ను కోరగా ఆయన నుంచి సమాధానం రాలేదని తెలిపారు. సోదాలు పూర్తయిన అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించి వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని ఏసీబీ డీఎస్పీలు తెలిపారు. ఈ సోదాల్లో మహబూబ్‌నగర్ డీఎస్పీ బాలకృష్ణ, వరంగల్ డీఎస్పీ సాంబయ్య, మేడ్చల్ డీఎస్పీ రంగసాని శ్రీధర్, ఖమ్మం డీఎస్పీ రమేశ్, నల్గొండ డీఎస్పీ జగదీశ్ చంద్ర, ఏసీబీ సీఐలు వెంకట్రావు, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

'పరకామణి' ఫిర్యాదుదారు సతీశ్‌కుమార్

అనుమానాస్పద మృతి!

పట్టాల పక్కన విగతజీవిగా జీఆర్పీ సీఐ..

ఇదే కేసులో విచారణకు గుంతకల్లు నుంచి తిరుపతికి రైల్లో వెళ్తుండగా ఘటన


సతీశ్‌కుమార్

» సతీశ్‌కుమార్ శరీరంపై తీవ్ర గాయాల్లేవు కానీ, ముక్కలు ముక్కలైన తల భాగం

» ఇది ప్రమాదం కాదు.. హత్యే!

» కదిలే రైల్లోంచి పడితే శరీరమంతా దెబ్బలుండాలి

» గట్టిగా తలపై బాదినట్టు ఉంది: వైద్యులు

» మృతిపై అనుమానాలు: పోలీసులకు భార్య ఫిర్యాదు

» సర్కారు సీరియస్.. దర్యాప్తునకు 15 బృందాలు

తాడిపత్రి, గుంతకల్లు, అనంతపురం క్రైమ్/పత్తికొండ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): తిరుమల పరకామణిలో చోరీ వ్యవహారంలో ఫిర్యాదుదారు, అనంతపురం జిల్లా గుంతకల్లు రైల్వే డివిజన్ జీఆర్పీ సీఐ వై. సతీశ్‌కుమార్(45) అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. తాడిపత్రి మండలం కోమలి గ్రామ సమీపంలో రైల్వేట్రాక్ వద్ద శుక్రవారం ఉదయం ఆయన మృతదేహం కనిపించింది. పరకామణి చోరీ కేసులో విచారణ కోసం ఆయన తిరుపతికి బయలుదేరి వెళుతుండగా, ఈ ఘటన జరిగింది. రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లో గుంతకల్లు నుంచి గురువారం రాత్రి 12 గంటల సమయంలో ఆయన బయలుదేరారు. ఏ1 బోగీలో 11వ బెర్తును ఆయన రిజర్వు చేసుకున్నారు. తాడిపత్రి సమీపంలోని జుటూరు-కోమలి స్టేషన్ల మధ్య అర్ధరాత్రి దాటిన తరువాత (శుక్రవారం తెల్లవారుజామున 1.45 గంటల సమయంలో) రైలు నుంచి కింద పడిపోయినట్లు భావిస్తున్నారు. ఇది ప్రమాదమా.. హత్యనా.. ఆత్మహత్యా.. అన్నది తెలియాల్సి ఉంది. శుక్రవారం ఉదయం 9.30 ప్రాంతంలో ఓ రైల్వే పాయింట్స్‌మన్ పట్టాల పక్కన సతీశ్ కుమార్ మృతదేహాన్ని చూసి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. జీఆర్పీ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లారు. చొక్కా జేబులో ఐడెంటిటీ కార్డు ఆధారంగా.. మృతి చెందింది జీఆర్పీ సీఐ సతీశ్‌కుమార్‌గా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ముక్కలుచెక్కలుగా పుర్రె..!

సతీశ్‌కుమార్ మృతదేహంపై తీవ్ర గాయాలు లేవు. తల అంతర్భాగం (పుర్రె) మాత్రం పీసులు పీసులయింది. కదిలే రైలు నుంచి కిందపడితే శరీరంలోని ఇతర భాగాలకూ గాయాలు కావాలి. కానీ శరీరంపై గాయాలు లేకపోగా.. తల మాత్రం ముక్కలు ముక్కలైంది. దీంతో ఇది హత్యే అయి ఉంటుందని మృతదేహానికి సీటీ స్కాన్ చేసిన అనంతరం వైద్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కాగా.. రూ.వందల కోట్ల పరకామణి స్కామ్‌లో కీలక ఆధారంగా ఉన్న ఆయన అనుమానాస్పదంగా మరణించడాన్ని ఏపీ సర్కారు సీరియస్‌గా తీసుకుంది. దర్యాప్తు నిమిత్తం రైల్వే, సీఐడీ, పోలీసు విభాగాలకు చెందిన 15 బృందాలను రంగంలోకి దింపింది.

కఠినంగా శిక్షించాలి: చిదంబరమ్మ, తల్లి

"చిన్నప్పటి నుంచి ఎవరి మనసునూ నొప్పించని మనస్తత్వం నా కుమారుడిది. పోలీసు అయ్యాక కూడా అలాగే ఉన్నాడు. ఉద్యోగం, కుటుంబం, మిత్రులు తప్ప వేరే లోకం తెలియదు. అలాంటివాడిని అన్యాయంగా చంపేశారు. నాకు కడుపు కోత మిగిల్చిన వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలి"

అనుమానాలెన్నో..

తిరుపతి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గుంతకల్లు జీఆర్పీ సీఐ సతీశ్ కుమార్ మృతి పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విదేశీ డాలర్లు తస్కరించిన పరకామణి చోరీ కేసులో నిందితుడు రవికుమార్‌పై ఫిర్యాదు చేసిందీ, ఆ తర్వాత లోక్ అదాలత్‌లో కేసును రాజీ చేసుకున్నది సతీశ్‌కుమారే. దీంతో దాదాపు రూ. వంద కోట్ల పరకామణి స్కామ్ కేసులో ఆయనే అత్యంత కీలకమైన వ్యక్తి. హైకోర్టు ఆదేశాల మేరకు సీఐడీ దీనిపై జరుపుతున్న విచారణ కొలిక్కి రావాలంటే సతీశ్‌కుమార్ వెల్లడించే వివరాలే కీలకం. ఈ నేపథ్యంలో తిరుపతిలో జరిగే సీఐడీ విచారణకు హాజరయ్యేందుకు బయల్దేరి మార్గమధ్యంలో సతీశ్‌కుమార్ మరణించడం అనుమానాలకు దారితీస్తోంది. అయితే పరకామణి చోరీ కేసుకు సంబంధించి రెండు సందర్భాల్లో సతీశ్ తీవ్ర ఒత్తిడికి లోనయ్యారని సన్నిహితులు చెబుతున్నారు. రవికుమార్‌ను కాపాడేందుకు ఈ కేసును రాజీ చేసుకోవాలంటూ సతీశ్‌కుమార్‌పై తీవ్ర ఒత్తిళ్లు వచ్చినట్టు సమాచారం. దీనిపై ఈనెల 10న సతీశ్‌కుమార్‌ను సిట్ విచారించింది. మరోసారి తిరుపతిలో సీఐడీ విచారణ కోసమని బయల్దేరిన సతీశ్‌కుమార్.. దానికి మానసికంగా సిద్ధపడే ఉంటారని.. అలాంటి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడాల్సిన అవసరం ఉండదని చెబుతున్నారు. పరకామణి కేసుతో ముడిపడిన బలమైన వ్యక్తులు తాము తప్పించుకునేందుకు హత్య చేయించి ఉండొచ్చన్న ప్రచారం కూడా జరుగుతోంది. కాగా, సతీశ్‌కుమార్ భార్య మమత జీఆర్పీ పోలీసులను కలిసి సతీశ్‌కుమార్ మరణంపై అనుమానాలు ఉన్నాయంటూ లిఖితపూర్వక ఫిర్యాదు ఇచ్చారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

మేడిగడ్డ పునరుద్ధరణపై ఆరోపణలు అసంబద్ధం

» ఒప్పందాలకు లోబడి సహకారం.. ప్రభుత్వానికి ఎల్అండ్‌టీ లేఖ

హైదరాబాద్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణకు ముందుకు రావాలని గుర్తుచేస్తూ నీటిపారుదలశాఖ రాసిన లేఖలోని అంశాలు, ఆరోపణలు అసంబద్ధమైనవని నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ-పీఈఎస్ జాయింట్ వెంచర్ తప్పుపట్టింది. కాంట్రాక్ట్ ఒప్పందంలోని నిబంధనలకు లోబడి సహకరిస్తామని పేర్కొంది. ఈ మేరకు సంస్థ ప్రతినిధి ఎస్.సురేష్‌కుమార్ ఈనెల 11న నీటిపారుదలశాఖ రామగుండం సర్కిల్ ఎస్ఈకి లేఖ రాశారు. నీటిపారుదలశాఖ రాసిన లేఖలోని అంశాలపై త్వరలోనే లేఖ ద్వారా స్పందిస్తామన్నారు. మేడిగడ్డ బ్యారేజీలో ప్రస్తుతం లక్ష క్యూసెక్కుల వరద వస్తుండడంతో పనులు చేయడానికి అవకాశాల్లేవన్నారు. కాఫర్‌డ్యామ్ తొలగింపుతో పాటు మొత్తం పనులకు 6-7 నెలల వ్యవధి అవసరమని తెలిపారు. బ్యారేజీ వద్ద కొత్తగా కాఫర్‌డ్యామ్ నిర్మాణానికి డిజైన్లు అందించాల్సి ఉందని, ఎడమ, కుడి గట్ల క్రాస్‌సెక్షన్స్‌కు సంబంధించిన డ్రాయింగ్‌లను నీటిపారుదల శాఖ ఇంకా అందించలేదంది. ఎన్‌డీఎస్ఏ నివేదిక ప్రకారం డిజైనర్ కన్సల్టెంట్‌ను నియమించారా? అని ప్రశ్నించారు. అవసరమైన సాంకేతిక వివరాలు అందిస్తే.. అప్పుడు వనరుల సమీకరణకు ప్రణాళికలు వేయగలమన్నారు. కాగా, అన్నారం బ్యారేజీ పునరుద్ధరణకు ప్రతిపాదించేవన్నీ అదనపు పనుల కిందే లెక్కలోకి తీసుకుంటామని అన్నారం బ్యారేజీ నిర్మాణ సంస్థ అఫ్కాన్స్ స్పష్టం చేయనుంది. ఈ మేరకు నీటిపారుదలశాఖ రాసిన లేఖపై శనివారం ప్రత్యుత్తరం రాసే అవకాశాలున్నాయి. కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలని, దాంతో బ్యాంకు గ్యారంటీల రూపంలో ఉన్న నిధులను విడుదల చేయాలని కోరే అవకాశాలున్నాయి.

ఆర్ఎంపీ వేధింపులతో యువతి ఆత్మహత్య

కారేపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎంపీ వేధింపులు భరించలేక ఓ యువతి శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడింది. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం రేలకాయలపల్లికి చెందిన సందీప్తి(22)కి, అదే గ్రామంలో ఉంటోన్న ఆర్ఎంపీ వైద్యుడు నరేశ్‌కు మధ్య కొంతకాలం క్రితం స్నేహం ఏర్పడింది. ఈ క్రమంలో నరేశ్ పలు సందర్భాల్లో ఆమెతో కలిసి సెల్ఫీలు తీసుకున్నాడు. ఆ ఫొటోలను అడ్డుపెట్టుకుని పెళ్లి చేసుకోవాలని యువతిని ఒత్తిడి చేశాడు. లేదంటే వారిద్దరు కలిసి దిగిన ఫొటోలను సోషల్ మీడియాలో పెట్టి పరువు తీస్తానంటూ బెదిరింపులకు దిగాడు. ఈ విషయంపై వారం క్రితం.. యువతి తన తల్లిదండ్రులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయినా నరేశ్ సందీప్తి వెంటపడటం ఆపలేదు. దీంతో నరేశ్ వేధింపుల గురించి గ్రామంలో అందరికీ తెలిసి, తన కుటుంబం పరువు పోయిందని భావించిన యువతి ఇంట్లో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు కొత్తగూడెంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందింది. యువతి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు వైద్యుడిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ గోపి తెలిపారు.

అదుపులో మావోయిస్టు నేత ఆజాద్?

» సింగరేణి కార్మిక సంఘం ఆర్గనైజర్ అశోక్ కూడా?

» లొంగిపోయేందుకు వస్తుండగా పట్టుకున్న పోలీసులు

గోవిందరావుపేట, హైదరాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం మొద్దులగూడెం గ్రామానికి చెందిన మావోయిస్టు నేత కొయ్యడ సాంబయ్య అలియాస్ ఆజాద్‌ను ఆ జిల్లా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మావోయిస్టు పార్టీ అనుబంధ సింగరేణి కార్మిక సంఘం ఆర్గనైజర్ అశోక్ కూడా పట్టుబడ్డట్లు తెలుస్తోంది. మూడు రోజుల క్రితం వీరిరువురిని పస్రా సమీపంలో పక్కా సమాచారంతో పట్టుకున్నట్లు వినికిడి. పెద్దఎత్తున ఇరవై ఏళ్ల క్రితం పోరుబాటను ఎంచుకొని అజ్ఞాతంలోకి వెళ్లిన ఆజాద్ ప్రస్తుతం కొత్తగూడెం జిల్లా కార్యదర్శిగా ఉన్నారు. ఆయనతోపాటు సికాస ఆర్గనైజర్ అశోక్ జనజీవన స్రవంతిని ఎంచుకొని లొంగిపోయేందుకు వస్తుండగా పోలీసులు మాటువేసి పట్టుకున్నట్లు తెలుస్తోంది. పోలీసులు వెంటనే వారిని కోర్టులో హాజరుపర్చాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్, కార్యదర్శి ఎన్.నారాయణరావు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. వారిని చిత్రహింసలకు గురిచేస్తున్నారని, ఎటువంటి ప్రాణహాని తలపెట్టవద్దన్నారు. కాగా ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో 10 మంది మావోయిస్టులను పోలీసులు పట్టుకున్నారన్న సమాచారంపై తెలంగాణ పౌర హక్కుల సంఘం రాష్ట్ర కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. అదుపులో ఉన్నవారి ప్రాణాలకు హాని తలపెట్టకుండా వెంటనే కోర్టులో హాజరుపరచాలని డిమాండ్ చేసింది.

పత్తి కొనుగోలుపై నిబంధనలు రద్దు చేయాలి : జాన్‌వెస్లీ

యాచారం/ఖిలా వరంగల్/వరంగల్ వ్యవసాయం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పత్తి కొనుగోలుపై కేంద్ర ప్రభుత్వం విధించిన రైతు వ్యతిరేక విధానాలను తక్షణమే రద్దు చేయాలని సీపీఎం నేతలు, పత్తి రైతుల సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా యాచారం మండలం గున్‌గల్‌లో నిర్వహించిన సీపీఎం జిల్లా వర్క్‌షాప్‌లో రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. 'కపాస్ కిసాన్ యాప్' ద్వారా పత్తి విక్రయానికి స్లాట్ బుక్ చేయాలనే నిబంధనను ఎత్తివేయాలని, దీని వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ఎకరం పొలంలో 7 క్వింటాళ్ల పత్తిని మాత్రమే కొంటామనడం దారుణమని, ఈ నిబంధన ఎందుకు విధించారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వర్షాలకు దెబ్బతిన్న పత్తి, వరి పంటల నష్టాన్ని వ్యవసాయశాఖ అధికారులతో సమగ్రంగా సర్వే చేయించి రైతులను ఆదుకోవాలని ఆయన అన్నారు. వరంగల్‌లోని సీసీఐ వరంగల్ రీజినల్ కార్యాలయం ఎదుట తెలంగాణ పత్తి రైతుల సంఘం ఆధ్వర్యంలో రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కన్వీనర్ భూక్యా చందునాయక్ మాట్లాడుతూ.. తేమతో సంబంధం లేకుండా సీసీఐ ద్వారా పత్తిని ఎక్కడైనా విక్రయించే అవకాశాన్ని కల్పించాలన్నారు. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే పత్తిపై 11 శాతం సుంకాన్ని ఎత్తివేయడాన్ని ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సీసీఐ వరంగల్ రీజినల్ డిప్యూటీ మేనేజర్‌కు అందజేశారు.

17 నుంచి పత్తి కొనుగోళ్లు బంద్

పత్తి పరిశ్రమలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కానందున ఈనె 17 (సోమవారం) నుంచి రాష్ట్రవ్యాప్తంగా సీసీఐ, ప్రైవేటు పత్తి కొనుగోళ్లను నిలిపివేస్తున్నట్లు కాటన్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ నేపథ్యంలో సమస్య పరిష్కారం అయ్యేంత వరకు రైతులు మార్కెట్‌కు పత్తి తీసుకురావద్దని వరంగల్ ఎనుమాముల మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి మల్లేశం శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మహిళా ఓటరు మహత్యం

'పచ్చీస్ సే తీస్, నరేంద్ర ఔర్ నితీశ్' అన్న ఎన్డీయే నినాదాన్ని బిహార్ ప్రజలు నిజం చేశారు. ఎంతగా అంటే, ఎన్నికల సర్వేలకు, ఎగ్జిట్ పోల్స్‌కు అందనంత. ఈ సర్వేలన్నీ అంచనావేసిన కనిష్ఠసంఖ్యకు మరో వందసీట్లు ఎక్కువే బిహారీలు ఎన్డీయేకు ఇచ్చారు. మహాగఠ్బంధన్‌కు దాని కనిష్ఠంలో సగం కోతపెట్టారు. నితీశ్ మళ్ళీ ముఖ్యమంత్రి అవుతారా? అన్న చర్చ ఎప్పటిలాగానే సాగుతోంది. నితీశ్ పార్టీకంటే బీజేపీ ఓ గుప్పెడు సీట్లు ఎక్కువ తెచ్చుకోవడం, చెరో నూటొక్కస్థానాలకూ పోటీపడినా, బీజేపీ స్ట్రైక్‌రేట్ ఎక్కువగా ఉండటం వల్ల ఈ చర్చ సహజం. బీజేపీ పెద్దలు ఎన్నోసార్లు సవినయంగా నితీశ్ నాయకత్వంలోనే తాము నడుస్తున్నామని చెప్పుకున్నా, రాష్ట్రాన్ని స్వయంగా ఏలాలన్న ఉత్సాహం రాష్ట్రస్థాయి నాయకులకు ఉండటం వారితో కొన్ని అనవసరపు వ్యాఖ్యలు చేయిస్తోంది. గతంలో, దీనికి సగం స్థానాలున్న నితీశ్‌ను గద్దెమీదే ఉంచిన బీజేపీ, ఈమారు కేంద్రంలో ఊతాన్ని కూడా ఇస్తున్న స్థితిలో కొత్త విన్యాసాలేమీ జరగకపోవచ్చు. నితీశ్ ఇమేజ్‌తో పోటీపడగల నేత బిహార్‌లో లేకపోవడం బీజేపీకి పెద్ద లోటు.

సమీపగతంలోనే పలుమార్లు ప్లేట్లు ఫిరాయించిన నితీశ్‌ను బిహారీలు ఇంతగా నెత్తినపెట్టుకోవడం ఆశ్చర్యం. ఒకే ఒక్కసారి ఎమ్మెల్యేగా గెలిచిన వ్యక్తి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఇరవైయేళ్ళుగా అధికారంలో కొనసాగడం విశేషం. యాదవేతర ఓబీసీ కులాలు, మహాదళితులు, పస్మండా ముస్లింలకు ఆయన ఆధిపత్య కులాలనుంచి తమను కాపాడగల నాయకుడు. బీజేపీతో చేయి కలిపిన ముస్లిం పరిరక్షకుడు. అగ్రకులాల దృష్టిలో ఆయన హిందుత్వవాది. శాంతిభద్రతల పరిరక్షకుడనీ, మహిళాపక్షపాతి అనీ పేరుంది. దీనికితోడు, సరిగ్గా ఎన్నికలు ప్రకటించిన నాడే దాదాపు కోటి నలభైలక్షలమంది మహిళలకు వారి బ్యాంక్ ఎకౌంట్లలో నేరుగా పదివేల రూపాయలు పడటంతో ఇక తిరుగులేకపోయింది. తాను మళ్ళీ రాగానే ప్రతీ మహిళకూ మొత్తం మూడులక్షలు ముట్టేట్టు చూస్తానని నితీశ్ హామీ ఇచ్చారు. నెలకు ఆరువేలరూపాయల సగటు ఆదాయం కూడా లేని రాష్ట్రంలో ఈ భారీ మనీట్రాన్స్‌ఫర్ మహిళలను ఎంత ప్రభావితం చేసిందో కళకళలాడిన ఆ పోలింగ్ బూత్‌లు ఎప్పుడో స్పష్టంచేశాయి. తాము అధికారంలోకి వచ్చిన ఇరవైరోజుల్లోనే ప్రతీ కుటుంబానికీ ఓ సర్కారీ కొలువు ఇస్తానన్న ఆర్జేడీ అధినేత తేజస్వి హామీ కూడా ఈ నమ్మకం ముందు వమ్ము అయింది.

రాహుల్‌గాంధీకి బిహార్ ఫలితాలు పెద్ద పరాభవం. ఎన్నికలసంఘం తొలిగా ప్రయోగించిన 'సర్' ప్రభావం ఏ మేరకన్న చర్చ అటుంచితే, పోటీచేసిన స్థానాల్లో పదోవంతు మాత్రమే కాంగ్రెస్ గెలుచుకుంది. రాహుల్ ఓట్‌చోరీ ఆరోపణలు, ఓట్ అధికారయాత్రలు జనాన్ని ఆకర్షించాయి కానీ, ఓటు వేయించలేకపోయాయి. అంబానీ, అదానీల ఆవాహన వారికి పట్టలేదు. నితీశ్, మోదీలమీద చేయాల్సిన యుద్ధం ఎన్నికల సంఘం మీదకు మళ్ళిపోవడంతో ప్రజలకు విషయం ఎక్కలేదు, ఫలితం దక్కలేదు. బీజేపీకి సంస్థాగతంగా ఉన్న అనేక బలాలు, బాహువులు బిహార్‌లో కాంగ్రెస్‌కు లేకపోవడం పెద్ద దెబ్బ. పదిహేనేళ్ళలో ఎన్నడూ లేనంత ఘోర పరాజయం పొందిన ఆర్జేడీపని ఇక సరి అంటున్నవారికి, తనకు బీజేపీ, జేడీయూలకంటే ఎక్కువ ఓట్లు వచ్చిన విషయాన్ని తేజస్వి సగర్వంగా గుర్తుచేయవచ్చు. ఓటువాటా తనకూ తగ్గలేదని కాంగ్రెస్ సైతం చెప్పుకోవచ్చు.

కులాన్ని కాదు, కొత్త ఆలోచనలను, విధానాలను దృష్టిలో పెట్టుకొని ఓటువేయండి అంటూ, చదువు, ఉద్యోగం, వలసలు ప్రధాన ఎజెండాగా, ఆయా రంగాల్లో పేరున్న ప్రముఖులను అభ్యర్థులుగా నిలబెట్టిన ప్రశాంత్ కిషోర్ సర్వేలు ఊహించినకంటే ఘోరంగా చతికిలబడిపోయారు. ఆయన పార్టీ ప్రవేశం వల్ల, ప్రత్యక్షంగా గఠ్బంధన్‌కు నష్టం జరిగి, ఎన్డీయేకు పరోక్షంగా లబ్ధిచేకూరిందని ఓ వాదన. తనకుమారుడి పట్టాభిషేకం చూడాలన్న లాలూ కల నెరవేరలేదు. నితీశ్ అనారోగ్యం మీద అధిక ప్రచారం జరిగినా, కొంత వాస్తవమూ లేకపోలేదు. ప్రస్తుతానికి గద్దెనెక్కినా, ఒకటి రెండేళ్ళలో మిత్రపక్షానికి అప్పగించాల్సిందే. బిహార్ ఫలితాలు మోదీకి కదనోత్సాహాన్ని కలిగించాయి. సమరశంఖాన్ని పూరించి, బెంగాల్ మీద తక్షణమే దండయాత్ర ప్రకటించగల శక్తి నిచ్చాయి.

ప్రతిపక్షాన్ని ఎన్నుకోని బిహార్ ఓటర్లు!

బిహార్ అసెంబ్లీ ఎన్నికలలో ప్రజల తీర్పు వెలువడింది. ఓటర్ల మనసులో మాట ఆ తీర్పులో ప్రతిబింబించింది. అధికార కూటమికి 202 సీట్లు లభించగా ప్రతిపక్ష కూటమి మహాగఠ్‌బంధన్‌కు 35 సీట్లు మాత్రమే లభించాయి. ఈ ప్రజాతీర్పును సమస్త భారత పౌరులూ అంగీకరించి తీరాలి. రాబోయే కొత్త ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి ఎవరైనప్పటికీ మన శుభాకాంక్షలు. ఆ మాటకొస్తే మన శుభాకాంక్షలు, శుభాభినందనలకు బిహార్ ప్రజలే మరింత ఎక్కువగా యోగ్యులు.

బిహార్ ఎన్నికల వార్తలు, ఎన్నికల పరిణామాల విశ్లేషణలు, కథనాలు నివేదించడంలో మీడియా తన విధ్యుక్త ధర్మ నిర్వహణను గర్వకారణంగా నిర్వర్తించలేదు. కొన్ని మీడియా సంస్థలు– దినపత్రికలు, టెలివిజన్ చానెల్స్– తొలుత కొంచెం భిన్న మార్గాన్ని అనుసరించినప్పటికీ అంతిమంగా గుంపులో గోవిందయ్యలే అయ్యాయి. క్షేత్ర స్థాయిలో వార్తలు సేకరించే విలేఖర్లు ముక్తకంఠంతో మాట్లాడారు: కులాభిమానాల ప్రాతిపదికన ప్రజలు ఓటు వేస్తారు; నితీశ్ కుమార్‌కు నష్టదాయకమయ్యేలా ప్రభుత్వ వ్యతిరేకత లేదు; తేజస్వి యాదవ్ ఎన్నికల ప్రచారానికి కొత్త శక్తినిచ్చారు కానీ, తన ఆకర్షణ శక్తిని రాష్ట్రీయ జనతాదళ్ సంప్రదాయక ఓటు బ్యాంకు పరిధి ఆవలకు విస్తరింపజేయలేకపోయారు; జన్ సురాజ్ నాయకుడు ప్రశాంత్ కిశోర్ కొత్త భావాలు తీసుకువచ్చారు. అయితే ఓటర్లు ఆయన్ను కొత్తగా రంగంలోకి వచ్చిన నాయకుడుగా, నాయకత్వ సామర్థ్యాలు పరీక్షింపబడని వ్యక్తిగా మాత్రమే పరిగణించారు. సరే, నరేంద్ర మోదీ ఓటర్లతో మమేకమవడం, ఓటర్లు ఆయన ఆకర్షణ శక్తిలో సమ్మిళితమవడం గురించి ప్రత్యేకంగా చెప్పేదేముంది? రాహుల్‌గాంధీ ఎంతకూ ఓట్ చోరీ, నిరుద్యోగిత అంశాలకే పరిమితమయ్యారు. చెప్పుకోదగిన ఇతర విపక్ష నాయకుల తీరుతెన్నులూ ప్రభావశీలంగా లేవు. ఎన్నికల ఫలితాలు మీడియా ముక్తఘోషను సమర్థించాయి. ఏకైక కొత్త విషయం దస్ హజారీ (రూ. 10,000) నగదు బదిలీ. ప్రతి కుటుంబంలోనూ ఒక మహిళకు పోలింగ్ ముందు, పోలింగ్ కాలంలోను, పోలింగ్ అనంతరం ఈ నగదు బదిలీ చేశారు.



▪ పి. చిదంబరం

'పళని' పలుకు

బిహార్ ప్రజల జ్ఞాపకశక్తి చాలా సుదీర్ఘమైనదిగా కనిపిస్తోంది. పదిహేను సంవత్సరాల లాలూ ప్రసాద్ యాదవ్, ఆయన భార్య ప్రభుత్వాల పాలన (1990–2005)ను బాగా గుర్తుచేసుకున్నారు. అయితే ఆ ప్రభుత్వాన్ని ప్రజలు దించివేసినప్పుడు 16 సంవత్సరాల ప్రాయం కూడా లేని తేజస్వి యాదవ్‌నే అనేక అనర్థాలకు బాధ్యుడిని చేశారు! ఇరవై సంవత్సరాల నితీశ్ కుమార్ ప్రభుత్వ పాలనను కూడా గుర్తు చేసుకున్నారు. అయితే అనేక రంగాలలో నితీశ్ పాలనా వైఫల్యంపై వారికి ఎటువంటి నిరసన లేదు!

బిహార్ పేద రాష్ట్రమా? అంతులేకుండా నిరుద్యోగం తాండవిస్తున్న రాష్ట్రమా? ఉపాధిని వెతుక్కుంటూ కోట్లాది బిహారీలు ఇతర రాష్ట్రాలకు వలసపోతున్నారా? రాష్ట్ర జనాభాలో అత్యధికులను అష్టదారిద్ర్యాలు కుంగదీస్తున్నాయా? విద్యావసతులు నాసిరకంగా ఉన్నాయా? ఆరోగ్య భద్రత సదుపాయాలు ఆందోళన కలిగిస్తున్నాయా? 'మద్య నిషేధం' ఉన్నప్పటికీ రకరకాల మద్యం స్వేచ్ఛగా అందుబాటులో ఉండడం లేదూ? ఈ ప్రశ్నలలో ప్రతి ఒక్కదానికీ 'అవును' అనేదే సరైన, స్పష్టమైన సమాధానం. ఈ అసెంబ్లీ ఎన్నికలలో బిహారీలు ఓటు వేసిన తీరుతెన్నులకు ఎవరూ సహేతుకమైన వివరణ ఇవ్వలేకపోతున్నారు. సంజాయిషీ ఎవరు చెబుతారు? పాత్రికేయ ప్రముఖుడు ఒకరు తన కాలమ్‌లో నర్మగర్భంగా ఇలా వ్యాఖ్యానించారు: 'బిహార్ నిన్నగాక మొన్న ఆలోచించినదాన్నే ఈ రోజు కూడా ఆలోచిస్తున్నది'. అది నిజమే కావచ్చు గానీ తాజా ఓటింగ్ తీరు తెన్నులకు సమంజసమైన కారణాలు బహుశా ఎన్నికల అనంతర సర్వేలలో వెల్లడయ్యే అవకాశమున్నది.



ఎన్నికలలో విజయం సాధిస్తున్న ఒక పార్టీ లేదా కూటమి తమ సంస్థాగత సామర్థ్యం కారణంగానే గెలుపును దక్కించుకుంటుంది. ఓటర్లను పోలింగ్ బూత్‌కు తీసుకువచ్చేలా కార్యకర్తలను పురిగొల్పకపోతే ప్రయోజనమేముంది? బిహార్‌లో భారతీయ జనతాపార్టీకి, జనతాదళ్ (యునైటెడ్) పార్టీకి అటువంటి సంస్థాగత దన్ను ఉన్నదని అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు తిరుగులేని రీతిలో రుజువు చేశాయి.

సమస్త బిహారీల సహాయ సహకారాలతో మహాత్మాగాంధీ చరిత్రాత్మకంగా నిర్వహించిన చంపారన్ ఉద్యమ రోజుల స్ఫూర్తిని మళ్లీ ఆవాహన చేసుకోవాలని వర్తమాన బిహారీలకు విజ్ఞప్తి చేస్తున్నాను. అర్హతలు లేని ఉపాధ్యాయులను, గ్రంథాలయాలు, ప్రయోగశాలలు లేని పాఠశాలలు, కళాశాలలను, ఎగ్జామ్ పేపర్స్ లీక్‌ను, పరీక్షలలో మూకుమ్మడి కాపీయింగ్‌ను, పరీక్షల ఫలితాలను కొంత మందికి అనుకూలంగా తారుమారు చేయడాన్ని, విలువలేని డిగ్రీలను, ప్రభుత్వోద్యోగాల రిక్రూట్‌మెంట్ ప్రహసనాలను బిహార్ విద్యార్థులు, యువజనులు ఇంకెంత మాత్రం సహించకూడదు.

బిహార్ ప్రజలను ఒక ప్రత్యామ్నాయ దార్శనికతతో ఉత్తేజితులను చేయడంలోను, మార్పునకై ఒక ప్రగాఢ ఆకాంక్షను వారి మనసుల్లో నెలకొల్పడంలోనూ ప్రతిపక్ష రాజకీయ పార్టీలు విఫలమయ్యాయి. ప్రశాంత్ కిశోర్ కొంతమేరకు ఇలా చేశారు గానీ ఆయన బరువు బాధ్యతలు చాలా పెద్దవి. వాటిని నిర్వర్తించడంలో ఎదురైన అనేక ప్రతిబంధకాలతో ప్రశాంత్ సతమతమయ్యారు. ఓటమికి ప్రధాన ప్రతిపక్షాలదే బాధ్యత. అపార ఆర్థిక వనరులు ఉంటే సరిపోదు. ఓటర్ల వద్దకు లక్షలాది కార్యకర్తలను పంపే సంస్థాగత సామర్థ్యముండాలి. ఎన్నికలలో విజయం లభించేది పార్టీ నాయకులు, అభ్యర్థులతో కాకుండా పార్టీ సంస్థాగత పటిష్ఠత, దీక్షాదక్షులైన కార్యకర్తల వల్లే అన్న సత్యాన్ని గుర్తించాలి. ఎన్నికలలో విజయం సాధిస్తున్న ఒక పార్టీ లేదా కూటమి తమ సంస్థాగత సామర్థ్యం కారణంగానే గెలుపును దక్కించుకుంటున్నాయి. ఓటర్లను పోలింగ్ బూత్‌కు తీసుకువచ్చేలా కార్యకర్తలను పురిగొల్పకపోతే ప్రయోజనమేముంది? బిహార్‌లో భారతీయ జనతాపార్టీకి, జనతాదళ్ (యునైటెడ్) పార్టీకి అటువంటి సంస్థాగత దన్ను ఉన్నదని అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు తిరుగులేని రీతిలో రుజువు చేశాయి.


బిహార్ ఎన్నికలలో భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) సంశయాస్పద పాత్ర పోషించింది. ఎన్నికలు సమీపించిన తరుణంలో బిహార్‌లో మాత్రమే ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమాన్ని చేపట్టింది. పోలింగ్ శాతం పెరుగుదలకు పాక్షిక కారణం ఓటర్ జాబితాలలో మొత్తం ఓట్లు తగ్గిపోవడమే. ఇది 'సర్' మహత్మ్యమే సుమా! పోలింగ్ తేదీలు ప్రకటించడానికి పది రోజుల ముందు 'ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన'ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. దీనిపై ఈసీఐ దృష్టి పెట్టలేదు. పోలింగ్ తేదీలు ప్రకటించడానికి ముందు ప్రారంభమైన నగదు బదిలీ (ప్రతి కుటుంబంలోను ఒక్కో మహిళకు రూ. 10 వేల చొప్పున) ఎన్నికల ప్రచార సమయంలోనూ కొనసాగింది. ఈసీఐ ఏ దశలోను ఇందుకు అభ్యంతరం చెప్పలేదు. రూ.10వేల నగదు బదిలీ ఓటర్లకు లంచంగా ఇవ్వడమే, సందేహం లేదు. మరి తమిళనాడులో సంక్షేమ పథకాల విషయమై ఈసీఐ ఎలా భిన్నంగా వ్యవహరించిందో చూడండి: రైతులకు నగదు మద్దతు పథకం మార్చి 2003లో ప్రారంభమయింది. 2004లో లోక్‌సభ ఎన్నికల తేదీలను ప్రకటించగానే ఆ పథకం అమలును నిలిపివేశారు. ఉచిత కలర్ టీవీ పథకం 2006 నుంచి అమల్లో ఉన్నది. 2011లో అసెంబ్లీ ఎన్నికల ప్రకటన వెలువడగానే ఉచిత కలర్ టీవీల పంపిణీని నిలిపివేశారు. బిహార్‌లో కూడా భారత ఎన్నికల సంఘం పక్షపాత ప్రవర్తన స్పష్టంగా కనిపించింది. ఈసీఐ ఎంతగా నియమ విరుద్ధంగా వ్యవహరించినప్పటికీ అధికార కూటమి ఎన్డీఏ ప్రశస్త విజయాన్ని సాధించిందని ఒప్పుకుని తీరాలి.

అధికార కూటమి అనేక హామీలు ఇచ్చింది. కొత్త ప్రభుత్వం ఆ వాగ్దానాలు అన్నిటినీ నెరవేరుస్తుందా? రాబోయే అయిదేళ్లలో ప్రభుత్వం తన నిర్ణయాలు, చర్యలకు జవాబుదారీ వహించేలా ఎవరు పూచీపడతారు? ఈ విషయం గురించే నేను మరింత ఎక్కువగా ఆందోళన చెందుతున్నాను. బిహార్ ప్రజలు తమ రాష్ట్ర శాసనసభలో ఒక శక్తిమంతమైన ప్రతిపక్షం ఉండేలా ఓటు వేయలేదు. పర్యవసానంగా ప్రజలే ప్రతిపక్షంగా వ్యవహరించాల్సిన అగత్యమేర్పడింది. ఓటు వేయడంతోనే తమ బాధ్యత తీరిపోయిందని ప్రజలు భావించకూడదు. ప్రతిపక్షంగా వ్యవహరించడమనేది ఒక బృహత్తర బాధ్యత. ఓటు హక్కును వినియోగించుకోవడం కంటే సమున్నతమైన కర్తవ్యమది.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

నెహ్రూతో జరగని ఓ మాటామంతీ!

అమెరికన్ యువ రాజకీయవేత్త ఒకరు ఇటీవల జవాహర్‌లాల్ నెహ్రూ పేరును, ఆయన మాటలను స్ఫూర్తిదాయకంగా ప్రస్తావించారు. దశాబ్దాల క్రితం నెహ్రూ గురించి మరో యువ అమెరికన్ భావాలు, అభిప్రాయాలు జ్ఞాపకం చేసుకోవడం సందర్భోచితమే కాకుండా ఉపయోగకరంగానూ ఉంటుంది. ఈ యువ అమెరికన్ డాక్టర్ మార్టిన్ లూథర్ కింగ్. 1950వ దశకం తొలినాళ్లలో డాక్టోరల్ విద్యార్థిగా గాంధీ, భారత స్వాతంత్ర్యోద్యమం గురించిన పుస్తకాలను కింగ్ ఆబగా చదివారు. ఈ అధ్యయనాల సందర్భంగా గాంధీ సహచరుడు, ఆయన వారసుడు జవహర్‌లాల్ నెహ్రూ మానవీయ వ్యక్తిత్వం, మేధా ఔన్నత్యం ఆయనకు పరిచయమయ్యాయి. నెహ్రూ ఆత్మకథ, ఇతర పుస్తకాలు కూడా కింగ్ చదివారు. 1958 నవంబర్‌లో, మూడుపదుల వయసు కూడా లేని కింగ్ కొత్తగా ప్రచురితమైన తన పుస్తకం 'Stride Toward Freedom' ప్రతి నొకదాన్ని భారత ప్రధానమంత్రికి పంపించారు. అమెరికా పౌర హక్కుల ఉద్యమంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించిన 'మోంట్ గోమెరీ బస్ బాయ్‌కాట్' సంఘటన పూర్వాపరాల గురించి కింగ్ పుస్తకం విపులంగా వివరించింది. నెహ్రూకు పంపిన ప్రతిపై కింగ్ ఇలా రాశారు: 'విముక్తి ఉద్యమాల పట్ల మీ శ్రద్ధాసక్తులకు, అణగారిన ప్రజల పట్ల మీ మానవతావాద దృక్పథానికి, భారతదేశ స్వాతంత్ర్యానికి మీరు చేసిన మహోన్నత పోరాటం ద్వారా నాకూ, మోంట్ గోమెరీలోని యాభై వేలమంది నీగ్రోలకు మీరు ఇచ్చిన స్ఫూర్తికి కృతజ్ఞతగా'. కింగ్ సహృదయతకు నెహ్రూ వెన్వెంటనే ప్రతిస్పందించారు. కింగ్‌కు రాసిన లేఖలో ఇలా పేర్కొన్నారు: 'అమెరికాలో జాతి వివక్షను రూపుమాపేందుకు మీరు చేస్తున్న కృషి నాకు చాలా కాలం నుంచీ ఆసక్తిదాయకంగా ఉన్నది. ముఖ్యంగా మీరు మీ ఉద్యమాన్ని నిర్వహిస్తోన్న పద్ధతి నాకు మరింత ఉత్సుకత కలిగిస్తోంది. మీ కృషిపై మరింత మెరుగైన అవగాహనకు రావడానికి మీ పుస్తకం నాకు తోడ్పడుతుందనడంలో సందేహం లేదు. మీరు త్వరలో భారత్ పర్యటనకు రానున్నారని తెలిసింది. న్యూఢిల్లీలో మిమ్ములను కలుసుకునేందుకు నేను సదా ఎదురుచూస్తుంటాను.'



కాకా కలేల్కర్, రాజకుమారి అమృత్ కౌర్ మొదలైన గాంధీజీ సహచరుల ఆహ్వానం మేరకు భారత్‌లో కింగ్ పర్యటించారు. తన సతీమణి కోరెట్టాతో పాటు 1959 ఫిబ్రవరి 10న ఆయన న్యూఢిల్లీకి వచ్చారు. విమానాశ్రయంలో దిగగానే తనను కలవవచ్చిన విలేఖర్లకు ఆయన ముందుగా సిద్ధం చేసుకున్న ఒక ప్రకటనను చదివి విన్పించారు: 'స్నేహితుల్లారా, చాలాకాలంగా మీ మహోన్నత ప్రియధాత్రిని సందర్శించేందుకు ఎదురుచూస్తున్నాను. ఇతర దేశాలకు నేను ఒక పర్యాటకుడిగా మాత్రమే వెళతాను. అయితే భారత్‌కు మాత్రం ఒక యాత్రికుడిగా వచ్చాను. ఎందుకంటే భారత్ అంటే నాకు గాంధీ భూమి. ఆయన సార్వకాలిక మహాత్ముడు. నాకు భారత్ అంటే పండిట్ నెహ్రూ కూడా. ఆయన రాజనీతిజ్ఞత, మేధా వ్యక్తిత్వం ప్రపంచ వ్యాప్తంగా ప్రస్తుతి పొందుతున్నాయి'.

ఫిబ్రవరి 13న తీన్‌మూర్తి భవన్‌లో విందుకు కింగ్‌ను నెహ్రూ ఆహ్వానించారు. బోస్టన్ విశ్వవిద్యాలయంలో కింగ్ పేపర్స్‌ను నేను అధ్యయనం చేస్తుండగా టైప్ చేసిన ఒక డాక్యుమెంట్ నా దృష్టికి వచ్చింది. నెహ్రూతో భేటీలో కింగ్ ప్రస్తావించదలుచుకున్న విషయాల వివరాలు అందులో ఉన్నాయి. ఇవీ ఆ అంశాలు: (1) దేశీయ సమస్యలకు మాత్రమే కాకుండా అంతర్జాతీయ సంబంధాలలోనూ అహింసాయుతమైన సామాజిక పరివర్తనకు దోహదం చేసే గాంధేయ సూత్రాల ప్రస్తుత ప్రాధాన్యం, ప్రాసంగికత ఏమిటి?; (2) భారత ప్రజల సంక్షేమాన్ని ఇతోధికం చేసేందుకు ప్రస్తుతం జరుగుతున్న కృషిలో గాంధేయ పద్ధతుల ప్రాముఖ్యత, సామాజిక ప్రయోజనమేమిటి? గాంధేయ పద్ధతులలో ఎటువంటి మార్పులు అవసరం? దేశ రక్షణ, పారిశ్రామికీకరణతో అవి ఘర్షిస్తున్నాయా? (3) ప్రజాస్వామ్యాన్ని ప్రజలు తిరస్కరించనవసరం లేకుండా ఒక ప్రజాస్వామ్య దేశం తన ప్రజల శ్రేయస్సును వేగవంతంగా సాధించగలదా? ప్రజా సంక్షేమ సాధనలో చైనా లేదా భారత్ మార్గాలలో ఏది ఆదర్శవంతమైనది? ఆఫ్రికా ఏ మార్గంలో ముందుకు సాగాలి?; (4) భారత ప్రజలు, అమెరికాలోని నల్లజాతి ప్రజల మధ్య స్నేహ సంబంధాలను మరింతగా దృఢతరం చేయడమెలా? వంటివి. జ్ఞాపకానికి రాసుకున్న ఆ పత్రంపై కింగ్ సంతకం లేదు. అయితే అది తప్పకుండా ఆయన రాసుకున్నదే అయివుంటుంది. విందులో అతిథులు చాలామంది ఉండడం వల్ల నెహ్రూ–కింగ్ మధ్య వ్యక్తిగత భేటీకి ఆస్కారం లేకపోయింది.

> అహింస ప్రాధాన్యం, గాంధేయ ఆదర్శాల ఉపయుక్తత, ప్రజాస్వామ్య నిరంకుశపాలనా విధానాలలో ఏది ఆసియా, ఆఫ్రికా దేశాలకు సరైనది? భారతీయులు, అమెరికాలోని నల్ల జాతి ప్రజల మధ్య స్నేహ సంబంధాలను దృఢతరం చేయడమెలా? అన్న అంశాలపై జవహర్‌లాల్ నెహ్రూతో మార్టిన్ లూథర్‌కింగ్ చర్చించదలుచుకున్నారు. అనివార్య కారణాల వల్ల ఆ ఇరువురి మధ్య వ్యక్తిగత సమావేశం జరగనేలేదు. ఆ భేటీ జరిగి ఉంటే అది కలకాలం గుర్తుండిపోయే సమాలోచనగా చరిత్రలో స్ఫూర్తిదాయకంగా నిలిచిపోయేది.

కింగ్ దంపతులు మూడు వారాల పాటు దేశ వ్యాప్తంగా పర్యటించారు. కలకత్తా, పట్నా, మద్రాసు, బొంబాయి ప్రాంతాలను సందర్శించి విద్యావేత్తలు, ప్రజాహిత క్రియాశీలురు, గాంధేయవాదులతో సంభాషణలు జరిపారు. సబర్మతి, సేవాగ్రామ్ ఆశ్రమాలను సందర్శించి, గాంధీ స్మృతికి ఘనంగా నివాళులర్పించారు. కింగ్ దంపతులు ఢిల్లీకి తిరిగివచ్చిన తరువాత 'గాంధీ పీస్ ఫౌండేషన్' ఛైర్మన్ జి.రామచంద్రన్ వారి గౌరవార్థం విందు ఇచ్చారు. ఆ విందుకు ప్రధాని నెహ్రూను కూడా ఆహ్వానించారు. అయితే ఆ రోజున తాను రాజధానిలో ఉండలేక పోతున్నందుకు విచారం వ్యక్తం చేస్తూ శ్వేత, నల్లజాతి ప్రజల మధ్య సామరస్యానికి డాక్టర్ మార్టిన్ లూథర్‌కింగ్ ప్రశస్త కృషికి గాను ఆయనను అభినందించేందుకు ఆరాటపడుతున్నానని, కింగ్ దంపతులను కలుసుకోవడం తనకు అమిత ఆనందాన్నిస్తున్నదని రామచంద్రన్‌కు రాసిన లేఖలో నెహ్రూ పేర్కొన్నారు. అమెరికాకు తిరిగివెళ్లిన తరువాత మార్టిన్ లూథర్‌కింగ్‌ను విశేష ప్రజాదరణ ఉన్న కెనడియన్ టీవీ కార్యక్రమం 'ఫ్రంట్ పేజ్ ఛాలెంజ్'లో ఇంటర్వ్యూ చేశారు. 'గాంధీకి మీరు ఏ విధంగా రుణపడి ఉన్నారని' ప్రశ్నించగా 'భారతీయ మహా నాయకుడు తనకు నిస్సందేహంగా ఒక గొప్ప స్ఫూర్తి అని, అయితే జీసస్ నుంచి కూడా ఉత్తేజం పొందానని' కింగ్ చెప్పారు. 'మానవ హుందా కోసం జరిగే ఏ పోరాటంలోనైనా ప్రేమ, అహింస నియమబద్ధమైన ఆదర్శాలుగా ఉండాలనే నిర్ణయానికి వచ్చేందుకు గాంధీ, జీసస్‌ల బోధనలు తనకు ఆలంబన అయ్యాయని కింగ్ వివరించారు. ఆ సంభాషణ తరువాత నెహ్రూ వైపు మళ్లింది. 'నెహ్రూ సైతం అహింసా వాదియేనా' అని కెనడియన్ ప్రశ్నకారుడు ఆశ్చర్యం వ్యక్తం చేయగా కింగ్ ఇలా సమాధానమిచ్చారు: 'స్వాతంత్ర్య పోరాటంలో హింసాత్మక పద్ధతులు అనైతికమూ, ఆచరణ సాధ్యం కానివి అని నెహ్రూ విశ్వసించారు. అయితే అన్ని పరిస్థితులలోను అహింసకు కట్టుబడి ఉండాలన్న గురువు గాంధీతో నెహ్రూ విభేదించారు. దేశ అంతర్గత వ్యవహారాలలో అహింస అనుసరణీయమని, అంతర్జాతీయ ఘర్షణల విషయానికి వస్తే ఏ దేశమైనా విధిగా సైన్యాన్ని నిర్వహించుకోవలసి ఉంటుందని నెహ్రూ గట్టిగా భావిస్తారు.'



▪ రామచంద్ర గుహ

గతానుగతం

భారతీయ రాజనీతిజ్ఞుడి పట్ల మార్టిన్ లూథర్ కింగ్‌కు అపార గౌరవం ఉన్నదని, యువ అమెరికన్ పౌర హక్కుల యోధుడిని నెహ్రూ అమితంగా అభిమానించారని నేను చేసిన ఉటంకింపులు స్పష్టం చేస్తున్నాయి. ఇక ఇప్పుడు ఆ ఇరువురి మధ్య జరగని సంభాషణ విషయానికి మళ్లీ వద్దాం. నెహ్రూతో భేటీలో కింగ్ ప్రస్తావించదలుచుకున్న అంశాలు ఆయన నైతిక, రాజకీయ మేధస్సును వెల్లడిస్తాయి. ఆయన తన జ్ఞాపకానికి రాసుకున్న నాలుగు ప్రధాన ప్రశ్నలను పరిశీలించండి. మొదటిది, దేశీయ వ్యవహారాలు, అంతర్జాతీయ సంబంధాలలో అహింస ప్రాధాన్యమేమిటి? రెండోది, భారతదేశ సామాజిక, ఆర్థిక అభివృద్ధిలో గాంధేయ పద్ధతులు, ఆదర్శాలు ఉపయుక్తమైనవేనా? మూడోది, ప్రజలను కుంగదీస్తున్న పేదరికాన్ని నిర్మూలించడంలో వలసపాలన నుంచి కొత్తగా స్వాతంత్ర్యం పొందిన ఆసియా, ఆఫ్రికా దేశాలకు ప్రజాస్వామ్య పాలన లేక నిరంకుశ పాలనా విధానంలో ఏది సరైనది? నాల్గవది, సమస్త భారతీయులు, అమెరికాలోని నల్లజాతి ప్రజలు తమ మధ్య స్నేహ సంబంధాలను ఎలా పటిష్ఠం చేసుకోగలరు?

1954 ఫిబ్రవరిలో జవహర్‌లాల్ నెహ్రూతో కింగ్ చర్చించదలుచుకున్న ప్రశ్నలు సమకాలీన ఔచిత్యాన్నే కాకుండా కాలాతీత ప్రాధాన్యాన్ని కూడా కలిగి ఉన్నాయనడంలో సందేహం లేదు. 2025లో సైతం సామాజిక, రాజకీయ వివాదాల పరిష్కారంలో అహింసాత్మక పద్ధతుల పాత్ర, ప్రజాస్వామిక, నిరంకుశ పాలనా విధానాల ఆవశ్యకతపై వైవిధ్య వాదనలు, గాంధేయ ఆర్థిక (ఇప్పుడు ప్రత్యేకించి పర్యావరణ) భావాల ప్రాసంగికత, భారత్–అమెరికా సంబంధాల వర్తమానమూ, భవిష్యత్తు మొదలైనవి విశేష స్థాయిలో చర్చనీయాంశాలుగా ఉన్నాయి.

ఈ ప్రశ్నలపై నెహ్రూ, కింగ్ మధ్య సుదీర్ఘ సంభాషణ జరిగి ఉంటే అది కలకాలం గుర్తుండిపోయే, అసాధారణ సమాలోచనగా చరిత్రలో స్ఫూర్తిదాయకంగా ఉండిపోయేది. ఇరువురూ చరిత్ర, రాజకీయ సిద్ధాంతంలో నిరంతర ఆసక్తి, భావోద్వేగ ఉత్సుకత ఉన్నవారే. ఇరువురూ మహా చదువరులే కాకుండా తమ భావాలు, అభిప్రాయాలు సూటిగా, స్పష్టంగా, స్ఫుటంగా వ్యక్తీకరించగల ప్రజ్ఞాపాటవాలు ఉన్నవారే. ఆ మహోన్నత రాజనీతిజ్ఞుడు, మహా మానవతాయోధుడి మధ్య భేటీ జరిగి ఉంటే?! చైనాలో ఏకపార్టీ పాలన కంటే భారతదేశ బహుళ పార్టీ ప్రజాస్వామ్యానికి అనుకూలంగా నెహ్రూ ఎలా వాదించేవారు? నెహ్రూ అనుసరిస్తున్న ఆర్థిక విధానాలను కింగ్ ప్రశ్నించేవారా? పెట్టుబడి అస్తుబిస్తుగాను, శ్రమ శక్తి అపారంగాను ఉన్న భారతీయ సమాజంలో గాంధేయ సూత్రాలకు విరుద్ధంగా భారీ పారిశ్రామికీకరణకు ప్రాధాన్యమివ్వడం అవివేకమని కింగ్ బహుశా సూచించేవారేమో? భారత్–అమెరికా సంబంధాల గతాన్ని వారు ఎలా చూసేవారు? వాటి భవిష్యత్తు ఎలా ఉండాలని వారు కోరుకునేవారు? రాజకీయాలతో పాటు వ్యక్తిగత విషయాలమీద కూడా సంభాషణ జరిగి ఉంటే ప్రణయం, పెళ్లి, కుటుంబ బాంధవ్యాలపై ఇరువురూ తమ భావాలు, అభిప్రాయాలు పరస్పరం పంచుకునేవారేమో? ఈ ప్రశ్నలకు సంభావ్య సమాధానాలు ఆశ్చర్యకరంగానూ ఆలోచింపచేసేవిగానూ ఉండేవి కావూ?

(వ్యాసకర్త చరిత్రకారుడు)

బిర్సాముండా స్ఫూర్తితో ఉద్యమించాలి

భారతదేశ చరిత్రలో ఆధిపత్యం, అణచివేతకు వ్యతిరేకంగా భూమి, భుక్తి, విముక్తి కోసం ఆయుధం పట్టి ఉద్యమాలకు ఊపిరులూదారు ఆదివాసీలు. అనేక పోరాటాలకు పురుడుపోశారు. మేడారం కేంద్రంగా సమ్మక్క సారక్క పోరాటం, బిహార్ కొండలలో పహాడీయుల తిరుగుబాటు, 'జల్, జంగిల్, జమీన్' కోసం జోడేఘాట్ కేంద్రంగా కొమురం భీమ్ పోరాటం, 1836–1860 వరకు రాంజీ నాయకత్వంలో తెల్లదొరలు, నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ఆదివాసీలు ఉద్యమించారు. స్వాతంత్ర్య సంగ్రామంలో సమరశంఖం పూరించారు. తమ అస్తిత్వం కోసం ఆదివాసీలు చేసిన పోరాటాలు ఘనమైనవి. అలాంటి గొప్ప పోరాటాలను చేసిన ఆదివాసీల ఆరాధ్య నాయకుడు బిర్సాముండా. భారతదేశ స్వాతంత్ర్య సంగ్రామంలో బిర్సా చరిత్ర ఒక ప్రధాన ఘట్టం.

జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీ సమీపంలో గల ఉలిహాట్ ప్రాంతంలో 1875 నవంబర్ 15న బిర్సాముండా జన్మించాడు. తండ్రి సుగుణా ముండా, తల్లి కర్మిహాట్. 'ముండా' అనేది ఆ రాష్ట్రంలోని అతి ప్రాచీనమైన ఆదివాసీ తెగ కాగా, పుట్టిన రోజును బట్టి బిర్సా అనే పేరును ఆయనకు పెట్టారు. బిర్సా చిన్నతనం నుంచే ధైర్యసాహసాలు కలిగినవాడు. ఆయన బాల్యమంతా కడు పేదరికంలోనే గడిచింది. ఆదివాసీలపై జరుగుతున్న అణచివేతలు, అవమానాలను చూసి సహించలేకపోయాడు. ప్రారంభంలో ఆదివాసీ ప్రాంతాలు 'గోండ్వానా రాజ్యాలు'గా స్వేచ్ఛగా విలసిల్లినా, ఆంగ్లేయుల రాకతో ఆదివాసీ రాజ్యాలు విచ్ఛిన్నమయ్యాయని గ్రహించాడు. అగ్రవర్ణాల దోపిడీపై గళమెత్తాడు. వడ్డీ వ్యాపారుల దోపిడీని ప్రశ్నించాడు. 'ముండా' ఆదివాసీలకు ప్రాథమిక హక్కులు కావాలని 'జల్, జంగిల్, జమీన్' కోసం విల్లంబులతో అడవి మార్గం పట్టాడు.

19వ శతాబ్దపు చివరి రోజుల్లో బిహార్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో బ్రిటిషు వారికి వ్యతిరేకంగా జరిగిన 'మిలినేరియన్' ఉద్యమానికి బిర్సాముండా నాయకత్వం వహించాడు. పోరాటాన్ని ఉధృతంగా ముందుకు నడిపించాడు. ఆ ఉద్యమ సమయంలోనే బ్రిటిషు సేనలు దొంగచాటుగా బిర్సాను బంధించాయి. ఆయన్ను రాంచీలో జైలులో ఉంచి బ్రిటిషువారు చిత్రహింసలకు గురిచేశారు. 1900 జూన్ 9న ఆ జైలులోనే బిర్సాముండాను కాల్చి చంపారు. చనిపోయే నాటికి ఆయన వయసు కేవలం 25 సంవత్సరాలు!

ఆదివాసీలపై అణచివేతకు, తెల్లదొరల అకృత్యాలకు, వలసవాదానికి, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడిన యోధుడు బిర్సాముండా.

> నూనూగు మీసాల ప్రాయంలోనే ఆత్మగౌరవ, అస్తిత్వ ఉద్యమాలకు ఉగ్గుపాలు పోసిన ఆదివాసీ పోరాట యోధుడు బిర్సాముండా. ఆయన పోరాటస్ఫూర్తితో ఇప్పటి ఆదివాసీ యువతరం తమ హక్కుల కోసం నేటి పాలకవర్గాలపై సమరశంఖం పూరించాలి. ఆ పోరాటానికి సమాజంలోని మేధావులు, విప్లవ సంఘాలు ఆదివాసీలకు అండగా నిలవాలి.



నేటి ఆదివాసీ యువతరానికి ఆయన ఒక మార్గదర్శి, దిక్సూచి. బిర్సాముండా జ్ఞాపకార్థం, గౌరవార్థం మనదేశ పార్లమెంట్ సెంట్రల్ హాల్లో ఆయన చిత్రపటం ఉంచారు. భారతదేశంలో ఈ విధంగా గౌరవం, సత్కారాన్ని పొందిన ఏకైక ఆదివాసీ నాయకుడు బిర్సాముండా. తమ రాష్ట్రంలోని ఒక విమానాశ్రయానికి బిర్సాముండా పేరు పెట్టుకుని జార్ఖండ్ రాష్ట్ర ప్రభుత్వం ఆయన్ను గౌరవించింది. ఆ రాష్ట్రంలోని చాలా ప్రదేశాల పేర్లు, వ్యక్తుల పేర్లు కూడా బిర్సా పేరుతో ముడిపడి ఉంటాయి. ఇది ఆయనకు లభించిన గౌరవం. కానీ నేడు జార్ఖండ్ రాష్ట్రంలో 'ముండా ఆదివాసీ తెగ' అంతరించిపోయే స్థితిలో ఉంది. అస్తిత్వపు అంచున కొట్టుమిట్టాడుతోంది. నేటి పాలకవర్గం సామ్రాజ్యవాద అభివృద్ధి నమూనాతో ఆదివాసీ సమాజాన్ని అంతం చేస్తున్నది. పలు రాష్ట్రాల్లోనూ ఇప్పటికే పరిశ్రమల పేరిట, ప్రాజెక్టుల పేరిట కొన్ని లక్షల ఆదివాసీ కుటుంబాలవారు నిర్వాసితులయ్యారు.

ఆదివాసీ ప్రాంతాల్లో ఖనిజ సంపద, సహజ వనరులపై విదేశీ సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీలు కన్నేశాయి. ఎనిమిది దశాబ్దాల స్వాతంత్ర్య భారతంలో కొన్ని ఆదివాసీ తెగలు ఇప్పటికే కానరాక, మరికొన్ని కనుమరుగు అయ్యే పరిస్థితి నెలకొంది. కేంద్ర గిరిజన సంక్షేమశాఖ లెక్కల ప్రకారమే చూస్తే... దేశంలోని దాదాపు 570 గిరిజన తెగలలో అత్యంత వెనుకబడి, ఏ కోశానా అభివృద్ధికి నోచుకోని తెగలు 75 వరకూ ఉన్నాయి! వాటిలో 19 తెగల ఆదివాసీ జనాభా వెయ్యి కంటే తక్కువే. ఇది ఒక్క రాష్ట్రం పరిస్థితే కాదు, దేశంలో ఆదివాసీలు విస్తరించి ఉన్న 19 రాష్ట్రాల్లోని తెగలన్నిటి పరిస్థితి కూడా. మరో వైపు, అడవుల్లోని బాక్సైట్ నిక్షేపాల మీద బహుళజాతి పరిశ్రమలనే డేగలు వాలితే... ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ నష్టపోతున్నది ఆదివాసీలే. ఈ దేశంలోని ఆదివాసీ బతుకులను బుగ్గిపాలు చేస్తున్నది సర్కారేనన్న సత్యం ప్రస్తుత సమాజానికి తెలియనిది కాదు.

ఈ నేపథ్యంలో దళారీ పాలకవర్గాలకు వ్యతిరేకంగా 'ముండా' ఆదివాసీ పోరాట యోధుడు 'బిర్సాముండా' ఉద్యమస్ఫూర్తిని పుణికిపుచ్చుకుని సామ్రాజ్యవాద పాలకవర్గాలకు వ్యతిరేకంగా మేధావులు, ఆదివాసీ విద్యావంతులు, ఆదివాసీ సంఘాలు, ప్రజాసంఘాలు, విప్లవ సంస్థలు ఆదివాసీలకు అండగా నిలవాలి. వారిని చైతన్యవంతం చేస్తూ ఆదివాసుల ప్రజాస్వామిక హక్కుల కోసం పోరాడాల్సిన తరుణమిది. అప్పుడే బిర్సాముండా ఆత్మకు శాంతి చేకూరుతుంది. ఆయన కలలుగన్న స్వరాజ్యం నెరవేరుతుంది.

▪ వూకె రామకృష్ణ దొర
ఆదివాసీ జర్నలిస్ట్ అసోసియేషన్

(నేడు బిర్సాముండా 150వ జయంతి)


కమలాపూర్‌లో ఘర్షణను అడ్డుకుంటున్న సీఐ హరికృష్ణ

కాంగ్రెస్‌లో భగ్గుమన్న వర్గపోరు

కమలాపూర్‌లో వెంకట్, ప్రణవ్ వర్గాల బాహాబాహీ

కమలాపూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) కమలాపూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీలో ఇరువర్గాల మధ్య పోరు తారాస్థాయికి చేరింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించగా కమలాపూర్‌లో శుక్రవారం వర్గపోరు బహిర్గతమైంది. ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఒడితల ప్రణవ్‌బాబుల వర్గాల మధ్య కొన్ని నెలలుగా చాపకింద నీరులా కుమ్ములాటలు మొదలయ్యాయి. గతంలో ఈ విషయాన్ని గమనించిన ప్రణవ్‌బాబు ఒక సమావేశంలో నియోజకవర్గంలో వర్గాల పోరులేదని, ఉన్నది ఒక్కటే వర్గమని బాహాటంగా ప్రకటించారు. అయినప్పటికీ జూబ్లీహిల్స్ ఎన్నికతో ఇరువర్గాలు ఎవరికి తోచినట్టు వారు సంబురాలకు సిద్ధమయ్యారు. శుక్రవారం సాయంత్రం ఆరు గంటల సమయంలో ఇరువర్గాల నాయకులు, కార్యకర్తలు ఒక్కసారిగా ఎదురయ్యారు. దీంతో వారి మధ్య ఘర్షణ మొదలై తోపులాటలు చోటు చేసుకున్నాయి. బాహాబాహీకి దిగి ఒకరినొకరు దూషించుకున్నారు. ఈ గొడవ దాదాపు గంటపాటు సాగింది. ఈ విషయం తెలుసుకున్న సీఐ హరికృష్ణ, ఎస్ఐ మధు రంగప్రవేశంతో ఘర్షణ సద్దుమణిగింది.


ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్న గంజాయి

రూ.2.55 కోట్ల విలువైన గంజాయి పట్టివేత

వరంగల్ క్రైం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఎక్సైజ్ అధికారుల తనిఖీల్లో 511 కిలోల ఎండు గంజాయి పట్టుబడింది. డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆదేశాల మేరకు శుక్రవారం అమ్మవారిపేటలోని కాకతీయ మెడిక్లీన్ సర్వీసెస్‌లో ఉమ్మడి జిల్లా ఎక్సైజ్‌శాఖ డీసీ అంజన్‌రావు ఆధ్వర్యంలో దాన్ని దహనం చేశారు. మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 60 కిలోలు, హనుమకొండ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 4 కేసుల్లో 57 కిలోలు, వరంగల్ అర్బన్ స్టేషన్ పరిధిలోని 8 కేసుల్లో 102 కిలోలు, కాజీపేట పరిధిలోని 9 కేసుల్లో 126 కిలోలు, ఖిలావరంగల్ పరిధిలోని 12కేసుల్లో పట్టుబడిన 166 కిలోల గంజాయిని దహనం చేశారు. దాని విలువ సుమారు 2.55 కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలోవరంగల్‌అర్బన్ జిల్లా ఎక్సైజ్ అధికారి చంద్రశేఖర్, మహబూబాబాద్ జిల్లా ఎక్సైజ్ అధికారి బి. కిరణ్, ఎక్సైజ్ సీఐలు చంద్రమోహన్, జి.దుర్గాభవాని, ఎస్. ప్రభాకర్‌రెడ్డి, కె. రాజు, చిరంజీవి, ఎస్సైలు పద్మ, రమ్య, కబీర్‌దాసు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో జోష్

- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలుపుతో సంబరాల్లో శ్రేణులు
- గత నెల రోజులుగా జూబ్లీహిల్స్‌లో మకాం వేసిన ఓరుగల్లు నేతలు
- డివిజన్లలో ఉమ్మడి జిల్లా క్యాడర్‌తో విస్తృతంగా ప్రచారం
- స్థానిక ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్‌లో ఊపు తెచ్చిన ఉప ఎన్నిక
- ఇదే జోరుతో లోకల్‌పై జెండా ఎగురవేస్తామనే ధీమాలో హస్తం నేతలు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పార్టీ శ్రేణుల్లో సమరోత్సాహం

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలుపు కాంగ్రెస్ శ్రేణులకు ఉత్సాహాన్నిచ్చింది. గత నెల రోజులుగా పైగా ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ సీనియర్ నేతలు, కార్పొరేషన్ చైర్మన్‌లు హైదరాబాద్‌లో మకాం వేసి ప్రచారం నిర్వహించారు. భారీ మెజారిటీతో కాంగ్రెస్ గెలవటంతో ఓరుగల్లు కాంగ్రెస్‌లో ఉత్సాహం ఉరకలేస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధమవుతున్న క్యాడర్‌కు జూబ్లీహిల్స్ ఫలితం జోష్ నింపుతోంది. ఇదే ఊపుతో స్థానికంలో క్లీన్‌స్వీప్ చేస్తామనే ధీమా క్యాడర్‌లో కనిపిస్తోంది.

జూబ్లీహిల్స్ ప్రచారంలో ఓరుగల్లు శ్రేణులు

జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో గెలుపే లక్ష్యంగా నెల రోజులకు పైగా ఉమ్మడి వరంగల్‌కు చెందిన మంత్రులు సీతక్క, కొండా సురేఖ, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, యశస్వినిరెడ్డి, కేఆర్.నాగరాజు, గండ్ర సత్యనారాయణరావు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, దొంతి మాధవరెడ్డి, రామచంద్రనాయక్, మురళీనాయక్‌లు.. తమకు కేటాయించిన డివిజన్లలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. వీరు తమ సొంత నియోజకవర్గాల నుంచి ద్వితీయ శ్రేణి నేతలను జూబ్లీహిల్స్ ప్రచారానికి తీసుకెళ్లి అక్కడే మకాం వేశారు. వర్షాలు, వరదలతో తీవ్ర నష్టం వాటిల్లిన సమయంలో మాత్రమే ప్రజల్లో కనిపించటమే కాకుండా.. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పట్టుబట్టి సీఎం రేవంత్‌రెడ్డిని వరంగల్ నగరానికి తీసుకవచ్చారు. ఆ తరువాత మళ్లీ జూబ్లీహిల్స్ ప్రచారంలోనే పాల్గొన్నారు. ఓరుగల్లుకు చెందిన కార్పొరేషన్ చైర్మన్లు కూడా హైదరాబాద్‌లోనే మకాం వేసి ప్రచారంలో తమ వంతు పాత్ర పోషించారు. తమకు బాధ్యతలు అప్పగించిన అన్ని డివిజన్లలో కాంగ్రెస్ పార్టీకి ఆధిక్యత రావటం శ్రేణుల్లో ఉత్సాహన్ని నింపింది. ఊహించినట్లుగానే బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానాన్ని 25వేల ఓట్లు ఆధిక్యంతో కైవసం చేసుకోవటం కాంగ్రెస్ క్యాడర్‌లో జోష్ నింపింది. తమ ప్రచారానికి ఫలితం దక్కిందని, ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను, సీఎం రేవంత్‌రెడ్డి పరిపాలనను ప్రజలు స్వాగతించారని కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నారు.

రాబోయే ఎన్నికలకు జూబ్లీ ఊపు..

జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో గెలుపు ప్రభావం రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై పడుతుందని కాంగ్రెస్ నేతలు ధీమాతో ఉన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల నుంచి ప్రతి ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమినే ఎదుర్కొంటున్నది. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సిట్టింగ్ ఎంపీ స్థానాలు వరంగల్, మహబూబాబాద్‌లో ఓటమిని చవిచూసింది. అలాగే వెంటనే జరిగిన వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల ఉప ఎన్నికల్లో సైతం గులాబీ పార్టీకి పరాజయమే ఎదురైంది. ఇటీవల జరిగిన కరీంనగర్ టీచర్, పట్టభద్రుల ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్ ఓటమి చూసింది. తాజాగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కూడా అపజయమే ఎదురుకావటంతో కారు పార్టీ క్యాడర్‌లో నిరుత్సాహం అలుముకుందనే చర్చ జరుగుతోంది. ఉప ఎన్నికలో గెలిచిన ఊపుతో స్థానిక సంస్థల

(మిగతా 7వ పేజీలో)


హనుమకొండ గోకుల్ జంక్షన్‌లో స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ శ్రేణులు


కల్లెడలో చోరీ జరిగిన చోట విచారణ చేస్తున్న పోలీసులు

ఇంటికి తాళం.. దొంగల గాలం

25 తులాల బంగారం, రూ.6 లక్షల నగదు అపహరణ

కల్లెడ గ్రామంలో కలకలం

పర్వతగిరి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని కల్లెడ గ్రామంలో భారీ చోరీ జరిగింది. ఈ సంఘటన శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి... కల్లెడకు చెందిన ఆదొండ సాయిలు వ్యక్తిగత పనుల నిమిత్తం తన సోదరుడితో కలిసి నర్సంపేట మండలంలోని అశోక్ నగర్ పాకాలకు వెళ్లాడు. అలాగే కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి స్థానికంగా ఓ ఫంక్షన్‌కు వెళ్లారు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడి 25 తులాల బంగారం, రూ.6 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. ఇంటికి తిరిగి వచ్చిన కుటుంబ సభ్యులకు ఇల్లు చిందరవందరగా కనిపించింది. దీంతో దొంగతనం జరిగినట్లుగా భావించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో విషయం తెలుసుకున్న మామూనూరు ఏసీపీ వెంకటేష్, పర్వతగిరి సీఐ రాజగోపాల్ సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌ల టీంలతో ఆధారాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్టు వెల్లడించారు. సాయంత్రం వేళ జరిగిన ఈ ఘటన కల్లెడలో కలకలం రేపింది. దొంగతానానికి పాల్పడింది ఎవరనేది మిస్టరీగా మారింది. తెలిసిన వారి పనేనని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

టీచర్ల మెడపై 'టెట్' కత్తి

- సుప్రీంకోర్టు తీర్పుతో ఆందోళన
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 90 శాతం మందికి కష్టాలు
- ఉద్యోగ భద్రతపై ఆందోళన
- ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తులు

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు టెట్ టెన్షన్ పట్టుకుంది. పీఈటీలు, పీడీలు మినహా మిగిలినవారందరూ రెండేళ్లలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్-టీచర్ ఎలిజిబిలిటి టెస్ట్)లో ఉత్తీర్ణత సాధించాలని సుప్రీంకోర్టు ఇటీవల స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఇన్‌సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ తంటా తప్పడం లేదని వాపోతున్నారు. ఐదేళ్లలోపు సర్వీస్ ఉన్న ఉపాధ్యాయులు మినహా మిగతా ఉపాధ్యాయులందరూ టెట్ అర్హత సాధించాలని పేర్కొనడంతో ఉపాధ్యాయుల్లో ఆందోళన నెలకొంది. పంతుళ్ల పదోన్నతులకు టెట్ అర్హత తప్పనిసరిగా మారడంతో ఉపాధ్యాయ లోకం కలవరపడుతోంది. కాగా రాష్ట్ర ప్రభుత్వం టెట్ నోటిఫికేషన్ జారీ చేయడంతో ఉమ్మడి జిల్లా విద్యాశాఖలో టెట్ హాట్ టాపిక్‌గా మారింది.

టెట్‌లో అర్హత సాధించాలనే నిబంధనల నేపథ్యంలో ఉద్యోగ భద్రతపై ఉపాధ్యాయులు సందేహాలు వెలిబుచ్చుతున్నారు. ఎప్పుడో చదివి డీఎస్సీ రాసి అర్హత సాధించి ఉద్యోగంలోకి వచ్చిన వారికి ఇప్పుడు టెట్ అర్హత విధించడం సరికాదని అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే పదోన్నతులు లేకుండా చాలా కాలంగా విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులకు టెట్ అర్హత అనే విషయం ఆందోళన కలిగిస్తోంది. కొత్త సిలబస్ ప్రకారం పాత తరం ఉపాధ్యాయులు టెట్ అర్హత సాధించడం కష్టతరమేనని, వారికి ఇక పదోన్నతులు రాకపోవడం పక్కనబెడితే, ఉద్యోగంలో ఉంచుతారా లేదా అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 90 శాతానికి పైగా...

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో సుమారు 10 వేల మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. వీరిలో పీఈటీలు, పీడీలు మినహా , 2010 తర్వాత ఉద్యోగం సాధించిన వారు పోను దాదాపు 90 శాతం మంది ఉపాధ్యాయులు టెట్ అర్హత సాధించాల్సి ఉందని ఉపాధ్యాయ వర్గాల్లో చర్చ కొనసాగుతోంది. టెట్‌లో అర్హత సాధించాలంటే పరీక్షలో కేటగిరీల వారీగా ఓబీసీలకు 90 శాతం, బీసీలకు 75 శాతం, ఎస్సీ, ఎస్టీలు 60 శాతం మార్కులు తెచ్చుకోవాల్సి ఉంటుంది. ఈ మార్కుల శాతం సైతం ఉపాధ్యాయులకు నిద్రపట్టనివ్వడం లేదని వాపోతున్నారు. గతంలో టెట్ పాసైతేనే పదోన్నతి పొందుతారని ఉండేది. ఇప్పుడు ఏకంగా టెట్ అర్హత సాధించకపోతే ఉద్యోగం ఉండదనే ఉత్తర్వులు ఉపాధ్యాయులను కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి. ఇన్‌సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులందరికీ టెట్ అర్హత నుంచి మినహాయింపును ఇవ్వాలని ఎన్‌సీటీఈకి వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు విజ్ఞప్తులు చేస్తున్నారు. ప్రభుత్వమే చొరవ చూపి సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలని కోరుతున్నాయి.


విద్యార్థులతో ముచ్చటిస్తున్న కలెక్టర్ స్నేహ శబరీష్

పేరెంట్స్ మీటింగ్‌కు హాజరుకావాలి..


- ప్రతీ రోజు పిల్లల కోసం సమయం కేటాయించాలి
- తల్లిదండ్రులకు కలెక్టర్ స్నేహ శబరీష్ సూచన

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతీ నెల నిర్వహించే పేరెంట్స్, టీచర్ల సమావేశానికి విద్యార్థుల తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరుకావాలని కలెక్టర్ స్నేహ శబరీష్ కోరారు. హనుమకొండ జులైవాడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బాలల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌కు ఆమె హాజరయ్యారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు నిర్భయంగా మాట్లాడే విధంగా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలన్నారు. పాఠశాలలో 386మంది విద్యార్థులు ఉండగా పేరెంట్స్ మీటింగ్‌కు తక్కువ మంది వచ్చారని, వచ్చే నెల నుంచి అందరూ రావాలని సూచించారు. ప్రతీరోజు తమ పిల్లలతో పేరెంట్స్ 15నిమిషాలు కేటాయించి మాట్లాడాలన్నారు. తమకు పిల్లలకు మధ్య అంతరం ఏర్పడకుండా చూసుకోవాలన్నారు. పిల్లలు చెడు అలవాట్లకు బానిసలుగా కాకుండా టీచర్లు, తల్లిదండ్రులు పర్యవేక్షించాలన్నారు. మీటింగ్ అనంతరం కలెక్టర్ ప్రీప్రైమరీ విద్యార్థులను ఆత్మీయంగా పలకరించారు. ఈ సమావేశంలో హనుమకొండ ఎంఈవో నెహ్రూ, హెచ్ఎం భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో మావోయిస్టు నేత ఆజాద్?!

సికాస ఆర్గనైజర్ అశోక్ కూడా..

గోవిందరావుపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం మొద్దులగూడెంకు చెందిన మావోయిస్టు నేత కొయ్యడ సాంబయ్య అలియాస్ ఆజాద్‌ను ములుగు జిల్లా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మావోయిస్టు పార్టీ అనుబంధ సింగరేణి కార్మిక సంఘం ఆర్గనైజర్ అశోక్ కూడా పట్టుబడ్డట్లు తెలుస్తోంది. మూడు రోజుల క్రితం వీరిని పస్రా సమీపంలో పట్టుకున్నట్లు వినికిడి. 20 ఏళ్ల క్రితం అజ్ఞాతంలోకి వెళ్లిన ఆజాద్ ప్రస్తుతం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శిగా ఉన్నారు. ఆయనతోపాటు సికాస ఆర్గనైజర్ అశోక్ సరెండర్ అయ్యేందుకు వస్తుండగా పోలీసులు మాటువేసి పట్టుకున్నట్లు తెలుస్తోంది.


పట్టాల మధ్యలో ప్రాణాలు కాపాడుకునేందుకు పడుకున్న వ్యక్తి


సాగిలపడి బతికిపోయాడు..

- కేసముద్రంలో ట్రాక్ దాటుతుండగా కదిలిన గూడ్స్‌రైలు

కేసముద్రం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లాలోని కేసముద్రం రైల్వేస్టేషన్‌లో శుక్రవారం ఓ వ్యక్తి గూడ్స్‌రైలు కింద నుంచి దాటుతుండగా ట్రైన్ కదలడంతో వెంటనే పట్టాల మధ్యలో పడుకొని ప్రాణాలను కాపాడుకున్నాడు. ఉదయం గాంధీసెంటర్ వైపు నుంచి అమినాపురం వైపునకు ఓ గుర్తుతెలియని వ్యక్తి వెళుతున్నాడు. అంతలోనే థర్డ్‌లైను వైపున కామన్ లూప్ లైనులోకి డౌన్‌వైపు నుంచి ఓ గూడ్స్ రైలు వచ్చింది.

రైలు పూర్తిగా ఆగగానే కిందనుంచి ట్రాక్ దాటేందుకు బోగి కిందకు వెళ్లాడు. అయితే సిగ్నల్ పాయిం ట్ వద్దకు రాకపోవడం, వెనుక గార్డు బోగీ లూప్ లైనులోకి రాకపోవడం వల్ల రైలును అప్పుడప్పుడు మళ్లీ కొంత ముందుకు తీసుకువెళ్లి నిలుపుతారు. ఇలా వ్యక్తి దాటుతున్న సమయంలోనే అకస్మాత్తుగా రైలు నెమ్మదిగా ముందుకు కదలడంతో ఆ వ్యక్తి రెండు పట్టాల మధ్య సాగిలపడి పడుకున్నాడు. రెండు బోగీ లు అతని పైనుంచి వెళ్లి మళ్లీ గూడ్స్ రైలు నిలిచింది. దీంతో బతుకు జీవుడా అనుకుంటూ ఆ వ్యక్తి అక్కడి నుంచి వేగంగా వెళ్లిపోయాడు. రైల్వేస్టేషన్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నెలల తరబడి నిర్మాణంలోనే ఉండడంతో నిత్యం గూడ్స్ రైళ్ల కింద నుంచి ట్రాక్ దాటేందుకు ప్రయాణీకులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా వెంటనే ఫుట్ ఓవర్ బ్రిడ్జిని ప్రారంభించాలని కోరుతున్నారు.

నిఖార్సయిన జర్నలిజం ప్రజలపక్షం వహిస్తుంది..


కేయూలో ఎం.ఎస్.ఆచార్య స్మారకోపన్యాసం చేస్తున్న ఎ.కృష్ణారావు

- అన్యాయాన్ని ప్రశ్నించే వారంతా జర్నలిస్టులే
- నిబద్ధతకు నిలువెత్తు నిదర్శనం ఎంఎస్ ఆచార్య
- ప్రముఖ కవి, ఆంధ్రజ్యోతి అసోసియేట్ ఎడిటర్ కృష్ణారావు
- కేయూలో ఎంఎస్ ఆచార్య 7వ స్మారక ఉపన్యాసం 7

17 నుంచి పత్తి కొనుగోళ్లు బంద్

వరంగల్ వ్యవసాయం, నవంబరు 14 (ఆం ధ్రజ్యోతి) : పత్తి పరిశ్రమలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కానందున సోమవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సీసీఐ, ప్రైవేటు పత్తి కొనుగోళ్లను నిలిపివేస్తున్నట్లు కాటన్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపినందున సమస్య పరిష్కారం అయ్యేంత వరకు రైతులు మార్కెట్‌కు పత్తి తీసుకురావద్దని ఏనుమాముల మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి మల్లేశం శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.

ధాన్యం కొనుగోళ్లపై కంట్రోల్ రూమ్

వరంగల్ కలెక్టరేట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోళ్లలో సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ సత్య శారద శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం మిల్లుకు చేరే వరకు పర్యవేక్షణపై, ఫిర్యాదుల పరిష్కారానికి కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. కంట్రోల్ రూం టోల్‌ఫ్రీ నెంబర్ 18004253424, ఫోన్ నెంబర్ 9154252936 నెంబర్లలో సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. కంట్రోల్ రూం ఉదయం 7 నుంచి రాత్రి 8 గంటల వరకు పని చేస్తుందన్నారు.

హేమ హ్యూందాయ్ షోరూంలో

న్యూ వెన్యూ కారు విడుదల



న్యూ వెన్యూ కారును విడుదల చేస్తున్న వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్, హేమ హ్యూందాయ్ షోరూం ఎండీ యుగేంధర్

హనుమకొండ టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ ములుగురోడ్‌లోని హేమ హ్యూందాయ్ షోరూంలో శుక్రవారం న్యూ వెన్యూ కారును వరంగల్ పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్, హేమ హ్యూందాయ్ షోరూం ఎండీ యుగేంధర్ చేతుల మీదుగా మార్కెట్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా యుగేంధర్ మాట్లాడుతూ.. ఈ కారు పెట్రోల్, డీజిల్ వేరియంట్లలో లభ్యమవుతుందని, దీని ధర రూ. ఎక్స్ షోరూం రూ. 7,89, 900 లక్షలు కాగా ఈ కారు న్యూ డిజైన్ ఎక్స్‌టీరియర్, ఇంటీరియర్ ఫ్రంట్ వెంటిలేటెడ్ సీట్స్ 360 కెమెరా లెవల్-2 అడాస్ , 12.3 ఇంచుల టచ్ స్ర్కీన్ , సన్‌రూఫ్ అలాయ్ వీల్స్ , 60+స్టాండర్డ్ సేఫ్టీ ఫ్యూచర్లను కలిగి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు శ్రీధర్, పృథ్వీ, ఆదిత్య, మేనేజర్ మహేష్, షోరూం సిబ్బంది పాల్గొన్నారు.

సహకార వారోత్సవాలు ప్రారంభం



జెండా ఆవిష్కరిస్తున్న టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, డీసీసీబీ సీఈవో వజీర్ సుల్తాన్ తదితరులు

హనుమకొండ సిటీ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): నవంబరు 14 నుంచి 21 వరకు జరిగే సహకార వారోత్సవాలను టెస్కాబ్ చైర్మన్ మార్నేనీ రవీందర్‌రావు ప్రారంభించారు. యేటా మాజీ ప్రధాన మంత్రి జవహర్ లాల్ నెహ్రూ జయంతి రోజు నుంచి వారం రోజుల పాటు వారోత్సవాల నిర్వహణ ఉంటుందని వివరించారు. శుక్రవారం హనుమకొండలోని డీసీసీ బ్యాంక్ కార్యాలయంలో నెహ్రూ జయంతి వేడుకలను నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం వారోత్సవాలను రవీందర్‌రావు ప్రారంభించారు. 72వ అఖిల భారత సహకార వారోత్సవాల నిర్వహణ క్రమంలో ఈ సంవత్సర వారోత్సవాలను ' వికసిత్ భారత్ నిర్మాణంలో సహకార సంఘాల పాత్ర' నినాదంతో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సహకార సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడమే వారోత్సవాల ప్రధాన ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ బ్యాంక్ సీఈవో వజీర్ సుల్తాన్, జీయం జీవీ ఉషశ్రీ, డీజీయం అశోక్, ఏజీయంలు మధు, స్రవంతి, రాజు, కృష్ణమోహన్ తదితర అధికారులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు దళారుల చేతిలో మోసపోవద్దు

- ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి
- కలెక్టర్ సత్యశారద



వర్ధన్నపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ సత్యశారద

వర్ధన్నపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రైతులు దళారుల చేతిలో మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద అన్నారు. వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్య కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ సత్య శారద మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుకు ప్రభుత్వం మద్దతు ధర అందించడంతో పాటు సన్నధాన్యం రైతులకు అదనంగా రూ.500 బోనస్ అందిస్తోందన్నారు. రైతులు ఎవ్వరూ అధైర్యపడవద్దని, ఆఖరి గింజవరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. ధాన్యం తూకం వేయడంలో నిర్వహకులు రైతులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవన్నారు. కాంటాలు నిర్వహించిన ధాన్యం ఎప్పటికప్పుడు కేంద్రాల నుండి మిల్లులకు తరలించాలన్నారు. ఎలాంటి అవకతవకలకు తావులేకుండా ధాన్యం కొనుగోలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో రాంరెడ్డి, తహసీల్దార్ విజయ్‌సాగర్, నిర్వహకులు రూపిరెడ్డి ప్రేమలత, మహేశ్వరి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు మైస సురేశ్, సీనియర్ నాయకుడు పోషల వెంకన్నగౌడ్, కౌన్సిలర్లు సమ్మెట సుధీర్, తుమ్మల రవీందర్, మంచాల రామకృష్ణ, పూజరి రఘు, నాయకులు మహ్మద్ అన్వర్, సీలువేరు శ్రీధర్, పులి శ్రీనివాస్, విలాసరాపు వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

రాయపర్తి: మండలంలోని పెర్కవేడు, రాయపర్తిలో శుక్రవారం జిల్లా కలెక్టర్ సత్యశారద కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి, నిర్వాహకులు, రైతులతో మాట్లాడారు. కనీస సౌకర్యాలు కల్పించకుండా నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నిర్వాహకులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌వో కిష్టయ్య, మేనేజర్ సంధ్యారాణి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్ఆర్పీ భాగ్యలక్ష్మి, వీవోఏలు రమాదేవి, మునిత, దివ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరి: మండలంలోని అన్నారం షరీఫ్, రావూరులోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ సత్యశారద శుక్రవారం సందర్శించారు. రైతులు తెచ్చిన ధాన్యాన్ని వెంటవెంటనే కాంటాలు చేపట్టి, కేటాయించిన రైస్ మిల్లర్లకు పంపించాలన్నారు. రైతులు ధాన్యాన్ని రోడ్ల మీద పోయకుండా ఖాళీ ప్రదేశాలలో ఆరబెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ రామిరెడ్డి, తహసీల్దార్ వెంకటస్వామి, ఎంపీడీవో శంకర్ నాయక్, ఏపీఎం రాజవీరు, మార్కెటింగ్ అధికారి భాగ్యలక్ష్మి, ఐకేపీ, సీసీలు, మహిళా సంఘాలు, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): హనుమకొండ పెద్దమ్మగడ్డలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్/జూనియర్ కళాశాల (టీజీఎంఆర్ఎస్, జేసీ)బాలుర-1 విభాగంలో చదువుతున్న విద్యార్థులు పలు క్రీడాంశాల్లో సత్తా చాటి రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ఐ అండర్-19 క్రీడా పోటీలకు ఎంపికైనట్లు పీడీ అంబాల రవికుమార్ తెలిపారు. ఇటీవల హనుమకొండ లోని జేఎన్ఎస్ లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ)అండర్-19 ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో టీజీఎంఆర్ఎస్, జేసీ బాలురు 11మంది విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి అర్హత సాధించారని రవికుమార్ తెలిపారు. (హాకీలో) బి. శరణ్ తేజ్, ఆర్.సాయిచరణ్‌లు, (బేస్‌బాల్, లాన్ టెన్నిస్)లో ఎండీ. గౌస్‌పాషా, (సాఫ్ట్ బాల్) ఎండీ. అక్బర్ అలీ, (టగ్ ఆఫ్ వార్)లో ఎండీ. రిజ్వాన్, కే. సుమంత్, ఎండీ. అజాం లు, (క్యారమ్స్)లో ఎండీ. చాంద్‌పాషా, ఎస్ కే. అతిఫ్, (ఫెన్సింగ్)లో ఆర్. సాయి చరణ్, కె.సుమంత్, వి. లోకేష్ త్వరలో వివిధ జిల్లా కేంద్రాల్లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ఐ పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

ఈ సందర్భంగా విజేతలను ఉమ్మడి వరంగల్ జిల్లా టీజీఎంఆర్ఎస్, జేసీ రీజినల్ లెవల్ కోఆర్డినేటర్ (ఆర్ఎల్‌సీ) జంగా సతీష్, టీజీఎంఆర్ఎస్, జేసీ బాలుర విభాగం ప్రిన్సిపాల్ ఎం. అన్నపూర్ణ, పాఠశాల, కళాశాల కో-ఆర్డినేటర్లు శ్రవణ్, శారద, పాఠశాల పీఈటీ వెలుగాటి రాజిరెడ్డి శుక్రవారం అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.



వాక్‌థాన్‌లో పాల్గొన్న అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

బాలల హక్కుల పరిరక్షణకు కృషి

ఏఆర్ అదనపు డీసీసీ వేముల శ్రీనివాస్

వరంగల్ క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ, పోలీస్ శాఖ, స్వచ్ఛంద సంస్థలు బాలల హక్కుల పరిరక్షణకు వివిధ మార్గాల్లో కృషి చేస్తున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఏఆర్ అదనపు డీసీసీ వేముల శ్రీనివాస్ అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్‌లైన్, యాంటి హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ పోలీస్, ఎఫ్ఎంఎం ఎస్ఎస్ఎస్, డాన్‌బాస్కో నవజీవన్ స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో శుక్రవారం వాకథాన్ కార్యక్రమం వరంగల్ పోలీస్ కమిషనరేట్ నుండి హనుమకొండ కలెక్టరేట్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు డీసీసీ శ్రీనివాస్ మాట్లాడుతూ బాలల పరిరక్షణ కోసం జిల్లాలో వివిధ మాధ్యమాల ద్వారా బాల్య వివాహాల నియంత్రణ, బాలల అక్రమ రవాణా, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, ముఖ్యంగా ఆన్లైన్ లైంగిక వేధింపులకు గురికాకుండా అప్రమత్తత చర్యలు చేపడుతున్నట్లు తెలియచేశారు. సైబర్‌క్రైమ్ ఏసీపీ గిరికుమార్ మాట్లాడుతూ.. బాలల సంరక్షణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ముఖ్యంగా కుటుంబ వ్యవస్థలో మార్పు రావాలని అన్నారు. జిల్లా సంక్షేమ అధికారి జె. జయంతి మాట్లాడుతూ.. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో బాలల పరిరక్షణకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

కార్యక్రమంలో చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ సభ్యులు కజాంపురం దామోదర్, సందసాని రాజేంద్ర ప్రసాద్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మాజీ చైర్ పర్సన్ అనితా రెడ్డి, సీడీపీవో విశ్వజ, బాల రక్షా భవన్ కో ఆర్డినేటర్ సీహెచ్. అవంతి, యాంటి హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఇన్స్పెక్టర్ జె. శ్యామ్ సుందర్, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఇంచార్జీ అధికారి ఎస్. ప్రవీణ్ కుమార్, డెమో అశోక్ రెడ్డి, వాకథాన్‌లో పాల్గొన్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో పాటు అంగన్‌వాడీ టీచర్స్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్స్ ట్రైనీ పోలీసులు పాల్గొన్నారు.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ తనిఖీలు



భూపాలపల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఏసీబీ అధికారులు

భూపాలపల్లిటౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఏజెంట్లు, మధ్యవర్తులు, డాక్యుమెంట్ రైటర్ల వద్ద రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు ఉంటున్నట్లు గుర్తించామని వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపారు. శుక్రవారం భూపాలపల్లి పట్టణంలోని సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ సాంబయ్య మాట్లాడుతూ ఏసీబీ డీజీ ఆదేశాల మేరకు తాము తనిఖీలు చేపట్టడం జరిగిందన్నారు. మధ్యాహ్నం 3గంటలకు తనిఖీలు ప్రారంభించి కొనసాగిస్తున్నామని తెలిపారు. ఈ తనిఖీల్లో ఏజెంట్లు, మధ్యవర్తులు, డాక్యుమెంట్ రైటర్లు నేరుగా సబ్‌రిజిస్ట్రార్ వద్దకు వచ్చి పనులు చేయిస్తున్నారని చెప్పారు. ఇది సరైన పద్ధతి కాదన్నారు. సంబంధిత భూమి యజమానే అధికారి వద్దకు వచ్చి డాక్యుమెంట్లు సమర్పించి రిజిస్ట్రేషన్ చేసుకుని తానే స్వయంగా డాక్యుమెంట్లు తీసుకువెళ్లాలని అన్నారు. కానీ, భూపాలపల్లిలో మాత్రం ఏజెంట్లు, డాక్యుమెంట్ రైటర్లు తమ వెంట డాక్యుమెంట్లు తీసుకువెళ్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఇలాంటి అవకతవకలను గుర్తించామని తెలిపారు. ఈ విషయంపై నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు సమర్పిస్తామని తెలిపారు. ఈ క్రమంలో విచారణ అనంతరం చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎల్.రాజు, ఎస్.రాజు తదితరులు పాల్గొన్నారు.



బిర్లా ఓపెన్ మైండ్స్ స్కూల్‌లో స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొన్న విద్యార్థులు

క్రీడలతో మానసిక ప్రశాంతత

బిర్లా ఓపెన్ మైండ్స్ స్కూల్ చైర్మన్ వెంకటేశ్వర్‌రావు

ఖిలావరంగల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు క్రీడలు మానసిక ప్రశాంతతను కలిగిస్తాయని బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్స్ చైర్మన్ ఎన్. వెంకటేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం నగరంలోని రంగశాయిపేటలోని బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్లో సౌత్ ఇండియా స్పోర్ట్స్ మీట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ క్రీడా ఉత్సవాలకు తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలనుంచి సుమారు 1100 వందల మంది క్రీడాకారులు, విద్యార్థులు హాజరయ్యారు. ఈ క్రీడలలో క్రికెట్, వాలీబాల్, స్విమ్మింగ్, బాస్కెట్‌బాల్, ఆర్చరీ, కబడ్డీ, ఖో-ఖో, క్యారంబోర్డు, చెస్, ఫుట్‌బాల్ తదితర విభాగాల్లో క్రీడాపోటీలను నిర్వహించారు. ఈ వేడుకలలో సౌత్ మాస్టర్ ఫ్రాన్సిస్ డైరెక్టర్లు సందీప్ ఎలమంచిలి, విష్ణుదేవారెడ్డి, హుజురాబాద్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ సరితారెడ్డి, మొమిస్ ప్రిన్సిపాల్, డైరెక్టర్స్ జయప్రకాశ్, పంచలి దాస్, శమిలా, రామక్రిష్ణారెడ్డి, నిషా వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జేఎస్ పరంజ్యోతి, వివిధ పాఠశాలల డైరెక్టర్లు, కోచ్‌లు, క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మంచి నడవడికతో డయాబెటిస్ నివారణ



వాకథాన్‌ను ప్రారంభిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి,రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం

కేయూ క్యాంపస్ నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మంచి నడక, నడవడికతో అందరూ డయాబెటిస్‌ను నివారించుకోవాలని కేయూ వీసీ ప్రొఫెసర్ కె. ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ప్రపంచ డయాబెటిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కేయూ మొదటి గేటు నుంచి గోపాల్‌పూర్‌వరకు వాకథాన్ నిర్వహించారు. వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం పరుగును ప్రారంభించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ.. రోజూ నడక, వ్యాయామం, బరువు నియంత్రణతో డయాబెటిస్‌ను అదుపులో ఉంచుకోవచ్చునని అన్నారు. విద్యార్థులకు పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలను నిర్వహించి బహుమతులను అందచేశారు. అలాగే ఉచితంగా సీపీఆర్ కిట్లను అందచేశారు. ఈ కార్యక్రమంలో కార్డియాక్ స్పెషలిస్టు డాక్టర్ మేఘన భగీరథ్, కేయూ స్టూడెంట్ అఫైర్స్ డీన్ ప్రొఫెసర్ మామిడాల ఇస్తారి, ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య, ప్రొఫెసర్ ఈసం నారాయణ, డాక్టర్ బైరి నిరంజన్, రాధిక, సూర్యనారాయణ, సుజాత, సునీత, భాగ్య, సంగీత్‌కుమార్ పాల్గొన్నారు.

మధుమేహ పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ



ఎంజీఎంలో మాట్లాడుతున్న వైద్యులు

వరంగల్ మెడికల్: ఎంజీఎం ఆస్పత్రిలో మధుమేహ పిల్లల కోసం ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు ఆస్పత్రి ఎండోక్రైనాలజిస్టులు డాక్టర్ శ్రవణ్, డాక్టర్ సుమన తెలిపారు. ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎంజీఎంలో వారు మాట్లాడుతూ.. పిల్లల కోసం, పెద్దల కోసం వేర్వేరుగా ఓపీ సేవలను ప్రతి బుధవారం, శుక్రవారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పిల్లలకు ఏడు నుంచి రూ. 10వేల విలువజేసే మందులను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ఉస్మానియా, గాంధీ తరువాత ఎంజీఎంలోనే ఈ తరహా సేవలు అందుతున్నాయని వివరించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

అదేవిధంగా హనుమకొండలోని అభయ హాస్పటల్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మధుమేహ వైద్య శిబిరం నిర్వహించారు. ఫిజిషియన్, డయాబెటాలజిస్టు డాక్టర్ వైద్యం గౌతం మధుమేహ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 100 మందికి ఒక్కొక్కరికి రూ.2500 విలువ గల టెస్టులు ఉచితంగా నిర్వహించారు. శిబిరంలో నరహరి సుధాకర్‌రెడ్డి, హరికిషన్‌రెడ్డి, చొప్పరి సోమయ్య, రాజేందర్, పాము శ్రీనివాస్, వైద్యం రాజగోపాల్, జూలూరి చంద్రశేఖర్, సీనియర్ జర్నలిస్టు గడ్డం కేశవమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బీసీ ఐక్య సంఘర్షణ సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా సారంగపాణి



వడ్డెపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి):బీసీ ఉద్యమంలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న అమరవాది సారంగపాణి బీసీ ఐక్య సంఘర్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. బీసీ ఐక్య సంఘర్షణ సమితి జాతీయ అధ్యక్షుడు వీజీఆర్ నారగోని ఆదేశం మేరకు జాతీయ ప్రధాన కార్యదర్శి ఏదునూరి రాజమొగిలి శుక్రవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని అమరవాది సారంగపాణి అన్నారు.

ఇసుక ట్రాక్టర్ ఢీకొని బాలిక మృతి



పూజ(ఫైల్)

దేవరుప్పుల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ బాలల దినోత్సవం రోజునే జనగామ జిల్లా దేవరుప్పుల మండలంలోని రాంబోజిగూడెం గ్రామంలో విషాదం నెలకొంది. శుక్రవారం పాఠశాలకు వెళ్తున్న బాలికపై నుంచి ఇసుక ట్రాక్టర్ దూసుకెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. రాంబోజి గూడెంకు చెందిన నక్కిరెడ్డి కృష్ణారెడ్డి కూతురు పూజ(15), కుమారుడు ఉన్నాడు. వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కాగా, పూజ చిన్నమడూర్ ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. ఉదయం పాఠశాలకు బయలుదేరిన పూజను, రాంబోజిగూడెం శివారులో చిన్నమడూర్‌కు చెందిన ఇసుక ట్రాక్టర్ డ్రైవర్ గుర్రం కుమార్ నిర్లక్ష్యంగా నడిపి ఢీ కొట్టాడు. ఈ ఘటనతో బాలిక మృతి చెందగా, తల్లిదండ్రులు, గ్రామస్థులు సంఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా, ఎలాంటి ఫిర్యాదు అందలేదని వెల్లడించారు.

మత్స్యకారుల సమస్యలను పరిష్కరించాలి


టీఎంకే ఎంకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్

వడ్డెపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మత్స్య కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ మత్స్యకారులు- మత్స్య కార్మిక సంఘం (టీఎంకే- ఎంకేఎస్) హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి గొడుగు వెంకట్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కరీంనగర్‌లో ఈ నెల 25 నుంచి 27 వరకు నిర్వహించే టీఎంకే- ఎంకేఎస్ 4వ రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్‌ను హనుమకొండ పాత బస్‌డిపో వద్ద గల చేపల మార్కెట్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీఎంకే- ఎంకేఎస్ జిల్లా అధ్యక్షుడు నిమ్మల విజేందర్, ఉపాధ్యక్షులు జనగిరి దుర్గయ్య, జిల్లా నాయకులు సమ్మయ్య, వనమ్మ, పద్మ, రజిత, స్వప్న పాల్గొన్నారు.

హాస్టల్ నుంచి విద్యార్థి పరార్

వర్ధన్నపేట రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్పరపల్లి క్రాస్ రోడ్డు వద్ద ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే హాస్టల్ నుంచి విద్యార్థి పారిపోయిన ఘటన శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. వర్ధన్నపేట ఎస్సై సాయిబాబు కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. ఎంజేపీ హాస్టల్‌లో ఏడో తరగతి చదువుతున్న బాలుడు గురువారం మధ్య రాత్రి 2.40 గంటల సమయంలో అనుమతి లేకుండా బయటకు వెళ్లిపోయాడు. శుక్రవారం ఉదయం లేచిన తర్వాత అతడి ఆచూకీ కనిపించకపోవడంతో ఉపాధ్యాయులు వారి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. దీంతో అతడి ఆచూకీ కోసం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు గాలిస్తున్నారు.

బీఎస్సీ నర్సింగ్ 2వ ఫేస్‌లో అవకాశం కల్పించాలి



వీసీ నందకుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

వరంగల్ మెడికల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బీఎస్సీ నర్సింగ్ విద్యార్థులకు సెకండ్ ఫేస్ ఆప్షన్ కల్పించాలని కోరుతూ కాళోజీ హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ నందకుమార్‌రెడ్డికి శుక్రవారం ఏఐఎస్ఎఫ్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శరత్, పార్థు మాట్లాడుతూ పేద, మధ్య తరగతి విద్యార్థులు పెద్ద ఎత్తున దరఖాస్తు చేసుకోవడం వల్ల చాలా మంది కౌన్సెలింగ్ అవకాశం కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. వారి కోసం తక్షణమే రెండో ఫేస్ ఆప్షన్ ఇవ్వాల్సిన అవసరం ఉందని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు శ్రేయాస్, భరత్, ప్రశాంత్‌కుమార్ పాల్గొన్నారు.



ఖాళీల భర్తీ కలేనా ?

వరంగల్ టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సంరక్షణలో భాగంగా ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాల్లో సిబ్బంది కొరత ఉంది. ఖాళీగా ఉన్న టీచర్, ఆయా పోస్టులను భర్తీ చేయకపోవడంతో బాలింతలు, గర్భిణులు, చిన్నారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు వరంగల్ జిల్లాలో అంగన్‌వాడీ టీచర్ పోస్టులు ఎప్పుడు భర్తీ చేస్తారా ? అని ఆశావహులు ఎదురుచూస్తున్నారు. వరంగల్ ప్రాజెక్టు పరిధిలో 24 టీచర్, 64 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

అదేవిధంగా వర్ధన్నపేట ప్రాజెక్టు పరిధిలో 20 టీచర్, 127 ఆయా పోస్టులు, నర్సంపేట ప్రాజెక్టు పరిధిలో 22 టీచర్, 93 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మొత్తం వరంగల్ జిల్లాలో 66 టీచర్ పోస్టులు, 284 ఆయా(హెల్పర్లు) పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిని భర్తీ చేసేందుకు ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఆశావాహులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఉన్న అంగన్‌వాడీ టీచర్లకే పక్కన ఉన్న కేంద్రాలకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తున్నారు.

- వరంగల్ జిల్లా వ్యాప్తంగా 919 అంగన్‌వాడీ కేంద్రాలు
- జిల్లాలో 66 టీచర్, 284 ఆయా పోస్టులు ఖాళీ
- టీచర్లపై అదనపు భారం
- ఎదురుచూస్తున్న ఆశావహులు

వరంగల్ జిల్లాలో మొత్తం 919 కేంద్రాలు..

వరంగల్ జిల్లాలో వరంగల్, వర్ధన్నపేట, నర్సంపేట ప్రాజెక్టుల పరిధిలో 37 సెక్టార్లతో 919 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, వీటిలో 4,019 మంది గర్భిణులు, 4,562 మంది బాలింతలు, 7,796 మంది బడి పిల్లలు, 47,548 మంది ఆరు సంవత్సరాలలోపు చిన్నారులు ఉన్నారు. 21,878 మందికి పూర్వ ప్రాథమిక విద్య, పౌష్టికాహారం అందిస్తున్నారు. టీచర్లకు నెలకు రూ.13 వేలు, ఆయాలకు రూ.7,800 వేతనం ఇస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నడిచే అంగన్‌వాడీ కేంద్రాల్లో చివరిసారిగా 2020-21లో ఖాళీ పోస్టులను భర్తీ చేసినప్పటికీ అప్పటి నుంచి ఇప్పటి వరకు అనేక పోస్టులు ఖాళీ ఏర్పడ్డాయి. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు 65 సంవత్సరాలకు ఉద్యోగ విరమణ చేయాలని గత ఏడాది రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

2023 నవంబరు నెలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల పోస్టులను భర్తీ చేయకపోవడంతో వాటిపై ఆశలు పెట్టుకున్న మహిళలు ఆందోళన చెందుతున్నారు.



త్వరలో నోటిఫికేషన్ వస్తుంది..
- బి.రాజమణి, జిల్లా సంక్షేమాధికారి

రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్లు, ఆయా పోస్టులకు త్వరలోనే నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు సమాచారం ఉంది. ఇప్పటికే జిల్లాలో ఖాళీగా ఉన్న టీచర్, ఆయా పోస్టుల వివరాలు సేకరించాం. కొన్ని కేంద్రాల్లో టీచర్లకే అదనపు బాధ్యతలు అప్పగించాం. ఆయాలు లేని కేంద్రాల్లో కూడా టీచర్లే పని చేస్తున్నారు.

సక్రమంగా అందని పౌష్టికాహారం..

జిల్లాలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయకపోవడంతో లబ్ధిదారులకు పౌష్టికాహారం సక్రమంగా అందడం లేదు. గ్రామాలు, పట్టణాల్లో ఉండే గర్భిణులు, బాలింతలు, ఐదేళ్లలోపు పిల్లలు రక్తహీనతకు గురి కాకుండా, శారీరకంగా బలహీనపడకుండా ఉండేందుకు అంగన్‌వాడి కేంద్రాల ద్వారా ప్రతీరోజు పాలు, ఉడకబెట్టిన కోడిగుడ్డుతో పాటు ఆకుకూరలు, ఇతర కూరలతో పౌష్టికాహారం అందిస్తున్నారు. కేంద్రాల్లో టీచర్లు ఉంటేనే అందరికీ పౌష్టికాహారం సక్రమంగా అందుతుంది. అదేవిధంగా ఆరోగ్య, ఇతర సర్వేల బాధ్యతలను కూడా అంగన్‌వాడి టీచర్లకే అప్పగిస్తుంటారు. టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్న కేంద్రాల నిర్వహణ బాధ్యతను పక్క కేంద్రాల టీచర్లకు అప్పగించడంతో వారిపై అదనపు పనిభారం పడుతున్నది. ఆయా పోస్టులు ఖాళీగా ఉన్న కేంద్రాల్లో టీచర్లే ఆ భారాన్ని మోస్తూ ఇబ్బందులకు గురవుతున్నారు. ఆయాలు లేని కేంద్రాల్లో టీచర్లకు సర్వే బాధ్యతలు అప్పగించడంతో కేంద్రాలు మూతపడే ప్రమాదం ఉంది.

మారిన నిబంధనలు..

గతంలో అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు పదో తరగతి ఉత్తీర్ణత నిబంధన ఉండేది. కానీ కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్, ఆయా పోస్టులకు కనీసం ఇంటర్ ఉత్తీర్ణత ఉండాలని నిబంధన పెట్టింది. వయో పరిమితి 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలని పేర్కొంది. ఖాళీల్లో 50 శాతం ఆయాలకు పదోన్నతి ద్వారా భర్తీ చేయాలని నిబంధనల్లో పేర్కొంది. అయినా కూడా పోస్టులను భర్తీ చేయకపోవడంతో ఆశావహులు కళ్లల్లో వత్తులేసుకుని ఎదురు చూస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడి కేంద్రాల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని నిరుద్యోగ మహిళలు కోరుతున్నారు.



ఆచార్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కృష్ణారావు, ప్రతాప్‌రెడ్డి, శ్రీధర్, రాజగోపాలచార్య

నిఖార్సయిన జర్నలిజం

ప్రజలపక్షం వహిస్తుంది..

ప్రముఖ కవి, ఆంధ్రజ్యోతి అసోసియేట్ ఎడిటర్ కృష్ణారావు

కేయూ క్యాంపస్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సమాజంలో అన్యాయాలను ప్రశ్నించే వారందరూ జర్నలిస్టులేనని ప్రముఖ కవి, ఆంధ్రజ్యోతి అసోసియేట్ ఎడిటర్ ఎ.కృష్ణారావు అభిప్రాయపడ్డారు. నగరలోఠని కేయూ పరిపాలన భవనంలో శుక్రవారం వరంగల్ మొదటి తరం జర్నలిస్టు, జనధర్మ ఎడిటర్ ఎంఎస్ ఆచార్య 7వ స్మారక ఉపన్యాసం జరిగింది. వీసీ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రాంచంద్రం అధ్యక్షతన జరిగిన సమావేశంలో మొదటగా ఎంఎస్ కుటుంబ సభ్యులు ప్రొఫెసర్ రాజగోపాలచార్య, మాడభూషి శ్రీధరాచార్యులతో కలిసి ఎంఎస్ ఆచార్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన కృష్ణారావు... 'జర్నలిజం- మారుతున్న ప్రమాణాలు' అనే అంశంపై కీలక ప్రసంగం చేశారు.

రామాయణ, మహాభారత కావ్యాలన్నీ సమాజంలో చెడుపై మంచి సాధించే విజయాన్ని చెబుతున్నాయన్నారు. జర్నలిజం ఎల్లప్పుడూ సమాజంలో మంచిని పెంచి ప్రజల పక్షాన నిలుస్తుందన్నారు. సమాజంలో భిన్నాభిప్రాయాలు కలిగిన వర్గాలు వారికి అనుకూలమైన సంపాదకీయాలను ఆదరించేవారన్నారు. గోరా శాస్త్రి, వావిలాల గోపాలకృష్ణయ్య, ఏబీకే ప్రసాద్ లాంటి అనేక మంది ఉద్దండులు జర్నలిజంలో విలువను పెంపొందించేందుకు చిత్తశుద్ధితో పనిచేశారని కొనియాడారు.

వార్తకు రంగు, రుచి, వాసన ప్రధానం కాదని వాస్తవికతే ప్రాణమన్నారు. జర్నలిస్టులకు సమాజంపై సునిశిత పరిశీలన ఉండాలని, సబ్జెక్టుపై పట్టు ఉండాలని సూచించారు. విషయంపై జర్నలిస్టులకే స్పష్టత లేకపోతే సమాజానికి ఏం చెబుతారని ప్రశ్నించారు. భారతీయ సంస్కృతి, ఆచారాలు గొప్పవని, అయితే మతం, కులం పేరుతో రాజకీయాలు చేయడం మంచిది కాదని అన్నారు. ప్రస్తుతం దేవుడిని రాజకీయాల కోసం వాడుకునే పరిస్థితులు తలెత్తాయన్నారు. అవగాహనతో రాసే రచనే సాహిత్యమని, కవులకు, జర్నలిస్టులకు భాషపై పట్టు ఉండాలని సూచించారు.

తెలుగు జర్నలిజంలో ఆచార్య సేవలు గొప్పవని కీర్తించారు. సమాజ స్పందనను జర్నలిస్టులు తమ వార్తల్లో ప్రతిబింబింపచేస్తారన్నారు. అనేక మంది జర్నలిస్టులను ఎంఎస్ ఆచార్య తీర్చిదిద్దారని గుర్తుచేశారు. కేయూసీ, కేఎంసీ, ఆర్ఈసీ, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ సాధనకు ఆచార్య జర్నలిజం తోడ్పడిందన్నారు. ప్రజాస్వామ్య సుస్థిరతకు పత్రికలు సాధనాలని, జర్నలిస్టులు తటస్థంగా వ్యవరించాలని సూచించారు. యువత సమాజంలోని దుర్మార్గాలను, వివక్షను ప్రశ్నించాలన్నారు. సమాజంలో అంబేద్కర్ చూపిన మార్గం శ్రేయస్కరమన్నారు.

కేయూ వీసీ కె.ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. జర్నలిజం బాధ్యత గొప్పదని, అయితే బ్లాక్‌మెయిల్, దోపిడీ ఘటనలు సమాజాన్ని పెడదోవ పట్టిస్తున్నాయని విచారం వ్యక్తం చేశారు. అంతకుముందు రిజిస్ట్రార్ వల్లూరి రాంచంద్రం కృష్ణారావును సభకు పరిచయం చేశారు. ఎం.రాజగోపాలచారి, శ్రీధరాచార్యులు మాట్లాడుతూ.. ఎంఎస్ ఫౌండేషన్ కార్యకలాపాలను, ఎంఎస్ రచనలను వివరించారు. అనంతరం కృష్ణారావును ఘనంగా సన్మానించారు. సమావేశంలో రిటైర్డ్ ప్రొఫెసర్ చింతకింది రాజేశం, కాత్యాయని విద్మహే, మామిడి లింగయ్య, ప్రొఫెసర్ మల్లారెడ్డి, కట్ల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తుల పంచాయితీతోనే

కవిత బయటకు వెళ్లింది..

- జూబ్లీహిల్స్‌లో గెలుపు సీఎం రేవంత్‌రెడ్డి పాలనకు నిదర్శనం
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గత పది ఏళ్లలో ఎమ్మెల్యే మొదలుకొని సీఎం వరకు, కల్వకుంట్ల కుటుంబం వరకు తెలంగాణ పైన పడి దోచుకున్నారని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆరోపించారు. శుక్రవారం జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గంలోని 198 మంది లబ్ధిదారులకు రూ.1.05 కోట్ల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందించారు. ఈ సందర్భంగా కడియం మాట్లాడుతూ కల్వకుంట్ల కుటుంబంలో ఆస్తుల పంచాయితీ వచ్చిందని, అధికారంలో ఉన్నప్పుడు దోచుకున్న వేలకోట్ల రూపాయల సొమ్ములో తన వాటా ఇవ్వడం లేదని కవిత బహిరంగంగా మాట్లాడిందని తెలిపారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులు కవిత మీ పైన చేస్తున్న ఆరోపణల పైన సమాధానం చెప్పిన తర్వాతే కాంగ్రెస్ ప్రభుత్వంపైన ఆరోపణలు చేయాలన్నారు. ఇటీవల కవిత మాట్లాడుతూ వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికి రూ.1100 కోట్లు మంజూరు చేస్తే అవి సరిపోవని హరీశ్‌రావు అంచనాలను రూ.1700 కోట్లకు పెంచి రూ.600 కోట్లు అక్రమంగా దోచుకున్నాడని తెలిపారన్నారు. వీటికి సమాధానం ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం పైన అసత్య ఆరోపణలు చేయడం సిగ్గుచేటు అన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ మెజార్టీతో గెలుపొందడం ప్రభుత్వ తీరుకు, సీఎం రేవంత్ రెడ్డి పాలనకు నిదర్శనమన్నారు. 2023 ఎన్నికల సమయంలో హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ ఒక్క స్థానం కూడాగెలుచుకోలేదని, అధికారంలోకి వచ్చిన తరువాత జరిగిన కంటోన్మెంట్, జూబ్లీహిల్స్‌లో విజయం సాధించడం కాంగ్రెస్ పార్టీకి రెఫరెండమని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

మేడారం బస్సులకు టికెట్ ధరలు ఖరారు

హనుమకొండ టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాబోయే మేడారం జాతరకు వెళ్లే భక్తుల కోసం ఆర్టీసీ వరంగల్ నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు వరంగల్ ఆర్ఎం డి.విజయభాను శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పల్లె వెలుగు బస్సులకు టికెట్ ధర పెద్దలకు రూ. 130, పిల్లలకు రూ. 80, ఎక్స్‌ప్రెస్ బస్సులకు టికెట్ ధర పెద్దలకు రూ. 180, పిల్లలకు రూ. 110 ఖరారు చేసినట్లు తెలిపారు. అలాగే హనుమకొండ బస్టాండ్ నుంచి మేడారానికి వెళ్లే భక్తుల కోసం నవంబరు 16న ఆదివారం హనుమకొండ బస్టాండ్ నుంచి బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పల్లె వెలుగు బస్సులు ఉదయం 6.10, 7, 8, 9, మధ్యాహ్నం 12.10, 1, 1.40, 2.30, రాత్రి 8. 20 గంటలకు బస్సులు అందుబాటులో ఉంటాయని, మేడారం నుంచి హనుమకొండకు ఉదయం 5.45, 9.45, 10.15, 11.15, సాయంత్రం 3.15, 4.17, 5.30, 6 గంటలకు బస్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. మహిళలకు మహాలక్ష్మి పథకం వర్తిస్తుందని, వారు ఉచితంగా ప్రయాణం చేయవచ్చని తెలిపారు.

రైతు వ్యతిరేక విధానాలను రద్దు చేయాలి

తెలంగాణ పత్తి రైతుల సంఘం నేతలు » సీసీఐ రీజినల్ కార్యాలయం ఎదుట ధర్నా



శివనగర్‌లో సీసీఐ రీజినల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

ఖిలా వరంగల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను రద్దు చేయాలని తెలంగాణ పత్తి రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ భూక్యా చందు నాయక్, రాష్ట్ర కో-కన్వీనర్ మూడ్ శోభన్ నాయక్‌లు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం శివనగర్‌లోని సీసీఐ వరంగల్ రీజినల్ కార్యాలయం ఎదుట పత్తి రైతులతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తేమతో నిమిత్తం లేకుండా సీసీఐ ద్వారా రైతులు పండించిన పత్తిని ఎక్కడైనా స్వేచ్ఛగా విక్రయించే అవకాశాన్ని కల్పించాలన్నారు. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే పత్తిపై 11 శాతం సుంకాన్ని ఎత్తివేయడాన్ని ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. కపాస్ కిసాన్ యాప్ వలన కౌలు రైతులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సీసీఐ ఆధ్వర్యంలో గతంలో మాదిరిగా ప్రతీ ఎకరాకు 12 క్వింటాల్ కొనుగోలు చేయాలనే నిర్ణయాన్ని రద్దు చేసి, రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ క్వింటాల్‌కు రూ. 475బోనస్ అమలు చేయాలన్నారు. మ్యాపింగ్ పద్ధతిని అమలు చేయొద్దని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సీసీఐ వరంగల్ రీజినల్ డిప్యూటీ మేనేజర్‌కు అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఈసంపల్లి బాబు, రాష్ట్ర కో-కన్వీనర్ పి. కృష్ణారెడ్డి, చెల్పూరి రాము, రజనీకాంత్, రాష్ట్ర నాయకులు బొబ్బ వెంకటరెడ్డి, నల్లపు సుధాకర్, మార్తినేని పాపారావు, చల్ల నరసింహారెడ్డి, కోరబోయిన కుమారస్వామి, రామావత్ మీట్యా నాయక్, గారంపల్లి సంతోష్, ప్రతాపనేని వెంకటరెడ్డి, రమేష్, కాసాని సిద్ధులు, కొత్త వెంకట్‌రెడ్డి, మద్దోని రామచోక్యం, బుచ్చిరెడ్డి, శ్రీకాంత్, బురానుద్దీన్, రాజయ్య, వాసుదేవ్, రైతులు పాల్గొన్నారు.

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ

- నర్సంపేటలో ధర్మశాస్త్ర ఆలయంలో మండల పూజ మహోత్సవం ప్రారంభం
- మహాన్నదానం ప్రారంభించిన కమిటీ సభ్యులు
- డిసెంబరు 15న మహా పడిపూజ

నర్సంపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : నర్సంపేటలోని ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయంలో డిసెంబరు 27 వరకు జరుగనున్న 25వ మండల పూజ వేడుకలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ సేవా చారిటబుల్ ట్రస్టు చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్, ఆలయ కమిటీ చైర్మన్ పైసా సురేశ్ కమిటీ సభులతో కలిసి శుక్రవారం మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయం 5.15 గంటలకు సుప్రభాత సేవ కార్యక్రమంతో మండల పూజ ప్రారంభమైనట్లు తెలిపారు. గూడ రామకృష్ణశర్మ, అతని కుమారులు పవన్‌శర్మ, హరీశ్ శర్మలు వేదమంత్రోచ్ఛరణల నడుమ మహా గణపతి హోమం, ఓంకార ధ్వజారోహణం, గోపూజ, హోమగుండ ఆవిర్భావం, సుదర్శన హోమపూజలను మాలధారులు, భక్తులతో చేయించారన్నారు. 15న మహాధ్వజారోహణం, పుష్పాభిషేకం, మహాపడిపూజ నిర్వహిస్తామన్నారు. డిసెంబరు 1, 2, 4, 6 తేదీలలో దాతలచే పుష్పాభిషేకం పడిపూజలను ఆలయ అర్చకుడు దినేశ్‌మిశ్రా నిర్వహిస్తారన్నారు. 8న పల్లివేట కార్యక్రమం, 9న మాధన్నపేటలో పంబా ఆరాట్ వేడుకలను దాతలతో గురుస్వామి వెంకటేశ్‌శర్మ వైభవంగా నిర్వహించనున్నారని పేర్కొన్నారు. జనవరి 1న పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి-సునంద దంపతులతో పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. మహాన్నదాన కార్యక్రమం ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో నిర్వహిస్తామని వారు వివరించారు.



హోమం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, మాలధారులు

మహాన్నదానం ప్రారంభం

ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయంలో మధ్యాహ్నం 12.30 గంటలకు నర్సంపేట మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ సేవా చారిటబుల్ ట్రస్టు చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్, ఆలయ చైర్మన్ పైసా సురేశ్ కమిటీల సభ్యుల ఆధ్వర్యంలో జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గోనెల రవీందర్, కార్యదర్శి బూరల సత్యనారాయణ, కోశాధికారి ఇరుకు కోటేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు దేవునూరి అంజయ్య, నర్సంపేట డివిజన్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గందం నరేందర్, కార్యదర్శి ఎస్.మాధవశంకర్, కోశాధికారి కురంగడ్ల రవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక నైవేద్య పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట ఆలయ కమిటీ ప్రతినిధులు, సభ్యులు మాధారపు చంద్రశేఖరం, చింతల కమలాకర్ రెడ్డి, కొమాండ్ల బూపాల్‌రావు, దొడ్డ రవీందర్, అనంతుల రాం నారాయణ, భూపతి లక్ష్మీనారాయణ, మల్యాల ప్రవీణ్, మల్యాల వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

- ఎన్‌హెచ్‌ఎం నాయకుడు రుక్ముద్దీన్
- హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులు

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)లో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్‌లో పని చేస్తున్న ఉద్యోగులకు రెండు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని ఎన్‌హెచ్‌ఎం జిల్లా నాయకులు ఎండీ రుక్ముద్దీన్, డాక్టర్ అరుణ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు హనుమకొండ కలెక్టరేట్ ఎదుట శుక్రవారం నల్లబ్యాడ్జీలు ధరించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యోగులకు ప్రతీ నెల 1వ తేదీన వేతనాలు చెల్లించాలని, సుప్రీంకోర్టు తీర్పు మేరకు ఉద్యోగులందరికీ సమాన పనికి సమాన వేతనం వెంటనే అమలు చేయాలని అన్నారు. ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయడంతో పాటు మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన 180 రోజుల సెలవులు మంజూరు చేయాలన్నారు. ఈ ధర్నాలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల జిల్లా నాయకులు మహేందర్, సురేష్, నవీన్‌కుమార్, వినోద్‌కుమార్, రాజేంద్రప్రసాద్, అనిత, విజేత, సుష్మ, అనూష, కనిష్క, ప్రవీణ్, సుదర్శన్, వినోద్, రాకేష్, నరేష్, రహమాన్, సందీప్‌కుమార్‌తో పాటు డీపీఎంయూ, పీడీఎంఓఎస్, డీటీసీవో, జీఎంహెచ్, మిడ్ వైఫారిస్, ఎస్ఎన్‌సీయూ, సీఎల్ఎంసీ, టీ-హబ్, ఏఎన్ఎంలు, నర్సింగ్ ఆఫీసర్లు, ఎల్‌టీ, అకౌంటెంట్లు, సీవోలు, అటెండర్లు పాల్గొన్నారు.

ఎస్డీఎల్‌సీఈ వార్షిక పరీక్షల ఫలితాలు విడుదల

కేయూ క్యాంపస్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ దూర విద్యకేంద్రం వార్షిక పరీక్షల ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం వర్సిటీ పరిపాలన భవనంలో ఫలితాలను విడుదల చేశారు. బీఏలో మొదటి ఏడాదిలో 8శాతం, రెండో, మూడో ఏడాదిలో 14శాతం, బీబీఏ మొదటి ఏడాదిలో 10శాతం, రెండో, మూడో ఏడాదిలో 11 శాతం, బీకామ్ మొదటి, రెండో ఏడాదిలో 25 శాతం, మూడో ఏడాదిలో 26శాతం, ఎంఎస్సీ సీఎస్ మొదటి ఏడాదిలో 7, రెండో ఏడాదిలో 8 శాతం, మూడో ఏడాదిలో 11 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఈ కార్యక్రమంలో ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొట్టిన ఇసుక ట్రాక్టర్

ఐదుగురు టీచర్లు, డ్రైవర్‌కు గాయాలు





గాయపడిన టీచర్లు రాధిక, కళావతి, డ్రైవర్ మల్లేష్

మహబూబాబాద్ రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ మునిసిపల్ పరిధి శనిగపురం శివారు కుమ్మరికుంట తండా వద్ద శుక్రవారం ప్రయాణికులతో వెళ్తున్న ఆటోను ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ఐదుగురు ఉపాధ్యాయినీలు, ఆటోడ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. బాధితులు తెలిపిన కథనం ప్రకారం.. గంగారం మండలం మర్రిగూడెంకు చెందిన మద్దెల సింధూజ, డోర్నకల్ మండల కేంద్రానికి చెందిన సాంపల్లి స్వరూప, కుంటిగొర్ల రాధ, వరంగల్ జిల్లా చెన్నరావుపేటకు చెందిన వేర్పులకొండ శైలజ, మానుకోట పట్టణానికి బానోత్ కళావతి (ఐదుగురు టీచర్లు), నేరడలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్నారు. శుక్రవారం వారు మహబూబాబాద్ జిల్లా కేంద్రం నుంచి ఆటోలో కురవి మండలం నేరడ కేజీబీవీ పాఠశాలకు వెళ్తున్నారు. బోరింగ్ తండాకు చెందిన ట్రాక్టర్ ఇసుక లోడుతో చిన్నగూడూరు నుంచి మానుకోట వస్తుండగా శనిగపురం శివారు కుమ్మరికుంటతండా మలుపు వద్ద ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ఐదుగురు టీచర్లతో పాటు పర్వతగిరికి చెందిన ఆటోడ్రైవర్ పచ్చిపాల మల్లేష్ తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో వారిని వెంటనే జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఇందులో తీవ్రంగా గాయపడ్డ డోర్నకల్‌కు చెందిన ఉపాధ్యాయురాలు రాధ, మానుకోటకు చెందిన కళావతిని ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్య చికిత్స కోసం ఖమ్మంకు తరలించారు.

కాంగ్రెస్‌లో జోష్

(5వ పేజీ తరువాయి)

ఎన్నికలను ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమవుతోంది. బీసీ లకు 42శాతం రిజర్వేషన్లను కల్పించేందుకు ప్రభుత్వం తీసుకువచ్చిన ఆర్డినెన్స్‌ను ఇటీవల సుప్రీంకోర్టు కొట్టివేయటంతో కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక ఎన్నికలపై డైలామలో పడింది. అయితే పార్టీ పరంగా బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇచ్చి, లోకల్ బాడీ ఎన్నికలు నిర్వహించాలని పార్టీ భావిస్తోందనే చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీకి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో దక్కిన విజయం భారీ ఊపునిచ్చినట్టయింది. కాంగ్రెస్ పాలన పట్ల ప్రజల్లో వ్యతిరేకత లేదనే సంకేతాలను ఓటర్లు ఇచ్చారనే చర్చ పార్టీలో జరుగుతుంది. గెలుపు ఊపులో ఉన్నప్పుడే లోకల్ బాడీ ఎన్నికలు నిర్వహించాలని పార్టీ శ్రేణులు కూడా అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నాయి.

ఉమ్మడి జిల్లాలో 6జడ్పీ చైర్మన్‌లను గతంలో బీఆర్ఎస్ జెండా ఎగురవేసింది. ఈసారి కాంగ్రెస్ జెండా ఎగురవేయాలనే లక్ష్యంతో అధిష్టానం ఉంది. మెజార్టీ ఎంపీపీ, జడ్పీటీసీలు, సర్పంచ్ స్థానాల్లో పాగా వేయాలనే వ్యూహంతో ప్రభుత్వం లోకల్ పోరుకు సైరన్ మోగించవచ్చునని కాంగ్రెస్ శ్రేణులు ఊవ్విళ్లురుతున్నాయి. దీనికి తోడు జిల్లా కాంగ్రెస్ కమిటీలను కూడా ఈ వారంలోనే ప్రకటించే అవకాశం ఉందని టాక్ వినబడుతోంది. మరోవైపు గత పార్లమెంట్ ఎన్నికల ముందు కాంగ్రెస్ గూటికి చేరిన స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పై చర్య తీసుకోవాలని బీఆర్ఎస్ కోర్టును ఆశ్రయించింది. కోర్టు ఆదేశాలతో ఫిరాయింపులపై చర్యలు తీసుకునేందుకు స్పీకర్ సిద్ధం అవుతున్నారు. అయితే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో విజయంతో స్పీకర్ ఏ నిర్ణయం తీసుకున్నా.. ఎదుర్కొనేందుకు క్యాడర్ రెడీ అవుతోంది. కాగా, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో విజయంతో కాంగ్రెస్ శ్రేణులు జోరుగా విజయోత్సావాలు జరుపుకుంటున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనేక మండలాల నుంచి కాంగ్రెస్ పార్టీ ద్వితీయ శ్రేణి నేతలు, కార్యకర్తలు జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారానికి వెళ్లారు. దీంతో ఇది వారి వ్యక్తిగత విజయంగా భావించి సంబరాల్లో ఊరేగుతున్నారు.

ఘనంగా కార్తీక సమారాధన

వేయి స్తంభాల ఆలయంలో లక్ష బిల్వాలతో అర్చన

హనుమకొండ కల్చరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): త్రిదళం, త్రిగుణాకారం అంటూ పరమేశ్వరుడైన రుద్రేశ్వరుడిని వందలాది మంది భక్తులు కొలుస్తూ బిల్వాలతో అర్చన నిర్వహించారు. చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో కార్తీకశుద్ధ దశమి శుక్రవారం మహాలక్ష్మీ దేవి ఉద్భవించిన మారేడుదళాలతో వైభవంగా లక్ష బిల్వార్చన నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో వేద పండితులు మణికంఠశర్మ, సందీప్ తదితరుల వేద మంత్రాల మధ్య ప్రముఖ ఆధ్యాత్మికవేత్త చిట్టిరెడ్డి రాంరెడ్డి లక్ష్మీ దంపతులు ఉభయ దాతలుగా వ్యవహరించి వైదిక కార్యక్రమాన్ని జరిపించారు. అనంతరం అన్నం పరబ్రహ్మ స్వరూపం అంటూ ఆలయ ప్రాంగణంలోని దేవతా వృక్షాల కింద పెద్ద ఎత్తున కార్తీక సమారాధన పేరిట ఏర్పాటు చేసిన వన భోజనాల్లో ఆలయాన్ని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు. కార్తీక వేళ మహాలక్ష్మీ ప్రీతికరంగా ఆలయ ప్రాంగణంలో అమ్మవారిని కొలుస్తూ మహిళలు దీపాలను వెలిగించుకున్నారు. ఈవో అనిల్ కుమార్ పర్యవేక్షించారు.

నవీన్‌యాదవ్ గెలుపుతో కాంగ్రెస్ సంబరాలు

బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేసిన పార్టీ శ్రేణులు

వడ్డేపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. దీన్ని పురస్కరించుకొని హనుమకొండ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ సంపత్ యాదవ్ ఆధ్వర్యంలో శనివారం హనుమకొండ ఎన్జీవోస్ కాలనీ రోడ్డులోని గోకుల్ జంక్షన్‌లో కాంగ్రెస్ శ్రేణులు బాణా సంచాలను పేల్చి, స్వీట్లు పంపిణీ చేసుకొని, రంగులు పులుముకొని సంబరాలను నిర్వహించారు. సీఎం రేవంతన్న నాయకత్వం వర్థిల్లాలి.. జై కాంగ్రెస్.. జైజై కాంగ్రెస్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తాళ్లపెల్లి మేరి, తేల్లు సుగుణ కిశోర్, బొల్లు లలిత యాదవ్, సూత్రపు కవిత, బంక చంద్రశేఖర్ యాదవ్, బొల్లు బాలు, బొంగు చేరాలు, బర్ల అనిల్, సిలువేరు పాల్సన్, కుక్కముడి రవీందర్, ఎండీ రఫీక్, పోశాల హరీష్, బొల్లు దశరథ్, రాగుల సోమయ్య, బొల్లు శంకర్ యాదవ్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డేపల్లి చర్చి సర్కిల్‌లో..

జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ఎమ్మెల్యేగా విజయం సాధించడాన్ని పురస్కరించుకొని హనుమకొండ వడ్డేపల్లి చర్చి జంక్షన్‌లో 58వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తాళ్లపెల్లి సుధాకర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు మిఠాయిలు పంపిణీ చేసుకొని టపాసులను పేల్చి సంబరాలను జరుపుకున్నారు. కార్యక్రమంలో ఫిషర్‌మెన్ కాంగ్రెస్ స్టేట్ డైరెక్టర్ మండల సమ్మయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు తాళ్లపెల్లి విజయ్, తాళ్లపెల్లి రవీందర్(జేకే), తాళ్లపెల్లి మేరి, శనిగరపు అనిత తదితరులు పాల్గొన్నారు.

47వ డివిజన్‌లో..

కాజీపేట (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపును కాంక్షిస్తూ శుక్రవారం కాజీపేటలో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు పసునూరి మనోహర్ ఆధ్వర్యంలో డీజిల్‌కాలనీలో బాణసంచా పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో 47వ డివిజన్ అధ్యక్షుడు షేక్ అజ్గర్, పేయింటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గబ్బెట ఎల్లేశ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు అరూరి సాంబయ్య, దువ్వ రాజులు, రాజారపు యాదగిరి, బొడ్డు దేవయ్య, ఎర్ర శ్రీనివాస్‌తో పాటు స్థానికులు పాల్గొన్నారు.



డీసీసీ భవన్ వద్ద సంబరాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో విజయం హర్షణీయం

న్యూశాయంపేట (ఆంధ్రజ్యోతి) : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ విజయం హర్షణీయమని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు హర్షం వ్యక్తం చేశారు. బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీనివాస్‌రావు మాట్లాడారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి ప్రజలకు అభినందనలు తెలియజేస్తున్నామని తెలిపారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న లోక్‌సభ నియోజకవర్గమైన జూబ్లీహిల్స్‌లో బీజేపీకి డిపాజిట్ రాకపోవడం సిగ్గుచేటన్నారు. బిహార్‌లో ఎన్నికల కమిషన్ విజయం సాధించిందని, బీజేపీ కూటమిది కాదని ఎన్నికల సంఘానిదేనన్నారు. ఎన్నికల ముంగిట బీహార్ రాష్ట్రంలో 75లక్షల మంది మహిళల బ్యాంకు ఖాతాల్లో నితీష్ కుమార్ ప్రభుత్వం రూ.10వేల నగదు బదిలీ చేసినా ఎన్నికల సంఘం ఏ మాత్రం పట్టించుకోలేదని ఆరోపించారు.

హనుమకొండలో..

హనుమకొండ సిటీ (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ గెలుపుపై యువజన కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరిపారు. శుక్ర వారం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయం ప్రాంగణంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి తోట పవన్ ఆధ్వర్యంలో జరిగిన సంబురాల్లో బాణసంచా పేల్చి, మిఠాయిలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తోట పవన్ మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని 'నువ్వు మొగోడివైతే' అంటూ కేటీఆర్ గతంలో వ్యాఖ్యలు చేశారని గుర్తు చేశారు. ఉప ఎన్నికలో కాంగ్రెస్ గెలుపుతో కేటీఆర్ అభాసుపాలయ్యారని విమర్శించారు. ఆయనకు చీర, మల్లెపువ్వులను పంపిస్తున్నట్లు తోట పవన్ తెలియచేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మనోహర్, సుమన్, శ్రీకాంత్, రఘు, రామక్రిష్ణ, గౌస్‌పాషా, యాసిన్, ప్రకాశ్, స్వామి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మడికొండలో..

మడికొండ (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ఘన విజయం సాధించడంతో మడికొండ చౌరస్తాలో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు నిర్వహించుకున్నారు. స్వీట్లు పంచి బాణసంచా పేల్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తొట్ల రాజు యాదవ్, నార్లగిరి కుమారస్వామి, సారంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, వస్కుల శంకర్, పైడిపాల రఘుచందర్, కుర్ల మోహన్, బైరి లింగమూర్తి, గుర్రం జ్యోతి అమర్‌నాథ్, బైరి రాజు, వస్కుల శ్రీను, గడుసు రాజు, వస్కుల బాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బల్దియా కమిషనర్ చహత్ బాజ్‌పాయ్

ప్రతీరోజు చెత్త సేకరణ జరగాలి

జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రతీరోజు 90 శాతం చెత్త సేకరణ జరగాలని, ఎక్విప్‌మెంట్ రిపోర్టు ఉండాలని బల్దియా కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో శానిటేషన్ విభాగం ఇన్‌స్పెక్టర్లు, జవాన్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాంపూర్ డంపింగ్ యార్డ్‌కు చేరే చెత్త పరిమాణం తగ్గించేలా చర్యలు చేపట్టాలని, 66 డివిజన్‌లలో పెరిగిన చెత్తను, చెట్లను శుభ్రం చేయాలన్నారు. ప్రస్తుతం బయో కంపోస్ట్ యూనిట్లు వచ్చాయని, త్వరలో బయో మిథనైజేషన్ ప్లాంట్లు వస్తాయని అన్నారు. సోర్స్ సెగ్రిగేషన్ (తడిపొడి చెత్తను వేరుచేయడం) మొదలుపెట్టాలన్నారు. స్వచ్ఛ ఆటోలకు తడి పొడి చెత్తను వేరుగా అందించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతీ ఆటోకు 20 కిలోల సామర్థ్యం గల డస్ట్‌బిన్‌లను అందించాలన్నారు. ట్రేడ్ లైసెన్స్ వసూలు పారదర్శకంగా జరగాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడితే జరిమానా విధించాలని ఆదేశించారు. సమావేశంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్‌వో రాజేశ్, శానిటరి సూపర్‌వైజర్‌లు నరేందర్, గోల్కొండ శ్రీనివాస్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు

హనుమకొండ టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ బాలసముద్రంలోని జిల్లా గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ అజీజ్‌ఖాన్, సంస్థ కార్యదర్శి కె. శశిజాదేవి ఆధ్వర్యంలో ఈ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మహ్మద్ అజీజ్‌ఖాన్ మాట్లాడుతూ.. పాఠకులకు, నిరుద్యోగులకు పోటీ పరీక్షల పుస్తకాలు, ఉచిత వైఫై, కంప్యూటర్ సెక్షన్, రూ. 5 భోజనం, త్వరలో లేడీస్‌కు రీడింగ్ హాల్, ఆడిటోరియం, దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ తోట వెంకన్న, నెక్కొండ కవిత, కిషన్, మానస, రాంప్రసాద్, బిన్ని లక్ష్మణ్, బొమ్మతి విక్రమ్, కందుల సృజన్‌కాంత్, గ్రంథాలయ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాల అందజేత

హనుమకొండ సిటీ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎంబీబీయస్ సీటు సాధించిన నిరుపేద విద్యార్థి విద్యశ్రీకి ప్రథమ సంవత్సర పాఠ్య పుస్తకాలను కాంగ్రెస్ నాయకుడు విష్ణురెడ్డి ఉచితంగా అందచేశారు. శుక్రవారం హనుమకొండలోని ప్రజాభవన్‌లో జరిగిన కార్యక్రమంలో విద్యశ్రీ కుటుంబాలకు పాఠ్య పుస్తకాలను ఆయన అందజేశారు.

'వనభోజనాలకు తరలి రావాలి'

న్యూశాయంపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఖిలావరంగల్ మధ్యకోటలోని చిల్డ్రన్స్ పార్కులో ఈ నెల 16న జరిగే గోపా కార్తీక మాస వనభోజనాల కార్యక్రమానికి ఉమ్మడి జిల్లాకు చెందిన గౌడ కులస్థులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని గోపా జిల్లా అధ్యక్షులు డాక్టర్ చిర్ర రాజుగౌడ్ పిలుపునిచ్చారు. న్యూశాయంపేటలోని గౌడ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో రాజుగౌడ్ మాట్లాడారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, గోపా రాష్ట్ర అధ్యక్షుడు బండి సాయన్న, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్‌లు హాజరవుతారన్నారు. గోపా జిల్లా నాయకులు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్, బొనగాని యాదగిరి గౌడ్, గునిగంటి రమేష్, నాల్లం ఆనంద్ గౌడ, పి. అనిల్‌గౌడ్ పాల్గొన్నారు.

బీజేపీ సంబరాలు

కాజీపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : బీహార్ ఎన్నికల్లో ఎన్‌డీఏ ప్రభుత్వం విజయం సాధించినందుకు కాజీపేట చౌరస్తాలో శుక్రవారం బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. బీజేపీ ఉపాధ్యక్షుడు చిర్ర నర్సింగ్ గౌడ్ ఆధ్వర్యంలో కాజీపేట చౌరస్తాలో బాణసంచా పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో ఇదే తరహాలో బీజేపీ గెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు చాంద్‌పాషా, పెసరు తిలక్ కుమార్, మెలుగూరి ఈశ్వర్, తిలక్ కుమార్, చిలువేరు చిరంజీవి, దామెరుప్పుల మొగిలి పాల్గొన్నారు.



స్వీట్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

'బీసీ రిజర్వేషన్లు అమలయ్యే వరకు ఉద్యమిస్తాం'

కేయూ క్యాంపస్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలయ్యే వరకు ఉద్యమిస్తామని కేయూ పాలక మండలి సభ్యుడు చిర్ర రాజుగౌడ్ అన్నారు. కేయూ దూరవిద్యకేంద్రం ఆవరణలో బీసీ విద్యార్థి జేఏసీ నేతృత్వంలో నిర్వహిస్తున్న బీసీ ధర్మదీక్షలు శుక్రవారం 5వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రిజర్వేషన్ల విషయంలో కేంద్రంపై ఒత్తిడి పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం అఖిల పక్ష కమిటీలను ఏర్పాటు చేయాలని, బీసీలను ఏకం చేసి ఉద్యమాన్ని ఉధృతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి జేఏసీ చైర్మన్ ఆరెగంటి నాగరాజు, నాగరాజు పటేల్, తిరుపతి, అజయ్‌సింగ్, సుమన్‌రాజ్, అన్వేశ్, రవితేజ, రాజశేఖర్, బొస్కే నాగరాజు, సాయికృష్ణ, రాజేశ్, శరత్‌చంద్రగౌడ్, రాజేశ్, ప్రశాంత్, వీరస్వామి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ఉత్పత్తులను ప్రోత్సహించాలి

కలెక్టర్ స్నేహ శబరీష్

వడ్డేపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామీణ మహిళలు తయారుచేసిన ఉత్పత్తులను ప్రతీ ఒక్కరు కొనుగోలు చేసి వారిని ప్రోత్సహించాలని కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ లోని నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సెర్ప్, నాబార్డు సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినీ సరస్ ఫెయిర్‌ను శుక్రవారం లాంచనంగా ఆమె ప్రారంభించారు. జిల్లా గ్రామీణ, పట్టణ స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన చేనేత, హస్తకళలు, ఆహార ఉత్పత్తుల స్టాల్స్‌ను కలెక్టర్ పరిశీలించారు. విక్రయించే వస్తువుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రదర్శనలో 40 స్టాల్స్‌లో 62 రకాల ఉత్పత్తులను ఏర్పాటు చేశారు. ఈ మినీ సరస్ ఫెయిర్ ఈ నెల 14నుంచి 23 వరకు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్, హనుమకొండ డీఆర్‌డీవో మేన శ్రీను, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నవీన్‌కుమార్, మెప్మా పీడీ జోనా, నాబార్డు ఏజీఎంలు చంద్రశేఖర్, చైతన్య, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ మహేందర్, అడిషనల్ డీఆర్‌డీవో సెర్ప్ వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఏ డీపీఎంలు , ఏపీఎంలు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



ఎగ్జిబిషన్‌లో చేనేత చీరలను తిలకిస్తున్న కలెక్టర్ స్నేహ శబరీష్

ప్రభుత్వ ఐటీఐ కళాశాలకు

కొత్త భవనాన్ని నిర్మించాలి

ఏఐడీఎస్‌వో రాష్ట్ర కార్యదర్శి ఎ. సత్యనారాయణ

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ములుగు రోడ్డులోని ఐటీఐ కళాశాలకు నూతన భవనాన్ని నిర్మించాలని ఏఐడీఎస్‌వో రాష్ట్ర కార్యదర్శి ఎ. సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం విద్యార్థులు ఐటీఐ నుంచి ర్యాలీ నిర్వహించి ములుగు రోడ్డు జంక్షన్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ... 1959లో నిర్మించిన భవనం శిథిలావస్థకు చేరుకుందని, విద్యార్థులకు ఎలాంటి మౌలిక వసతులు లేవని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఐటీఐకి అన్ని హంగులతో కూడిన నూతన భవనాన్ని నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, మధుసూదన్, తరుణ్, ఐటీఐ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కేయూ ఐక్యూఏసీ

డైరెక్టర్‌గా నరసింహాచారి

కేయూ క్యాంపస్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కేయూ ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ (ఐక్యూఏసీ) నూతన డైరెక్టర్‌గా ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహాచారి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు గురువారం కేయూ వీసీ, రిజిస్ట్రార్లు ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి, వల్లూరి రామచంద్రంలు ఆయనకు ఉత్తర్వులు అందచేశారు. రెండేళ్ళ కాలానికి ఆయనను డైరెక్టర్‌గా నియమించారు. నరసింహాచారి ప్రస్తుతం సుబేదారిలోని యూనివర్సిటీ పీజీ కళాశాల ప్రిన్సిపాల్‌గా కొనసాగుతున్నారు. గతంలో కేయూ పరీక్షల నియంత్రణాధికారిగా, కేయూ అడ్మిషన్స్ డైరెక్టరేట్ జాయింట్ డైరెక్టరేట్‌గా, టీజీఐసెట్ కన్వీనర్‌గా, ఐక్యూఏసీ సెల్ డైరెక్టర్‌గా పనిచేశారు. కేయూ కామర్స్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా కొంతకాలం పాటు పనిచేశారు. ఈ సందర్భంగా ఆయనను బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.

నేడు వద్దిరాజు సోదరుల

స్మృతి పురస్కారం ప్రదానం

హనుమకొండ కల్చరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని ప్రముఖ సాహితీ సంస్థ సహృదయ ఆధ్వర్యంలో వద్దిరాజు సోదర కవుల స్మృత్యర్థం యేటా ప్రదానం చేసే సాహితీ పురస్కారోత్సవం శనివారం హనుమకొండ వడ్డేపల్లిలోని పిఆర్‌రెడ్డి భవన్‌లో నిర్వహిస్తున్నట్లు సహృదయ అధ్యక్షులు గిరిజా మనోహర్ బాబు చెప్పారు. ఈసారి ముంబైకి చెందిన డాక్టర్ అంబల్ల జనార్దన్‌కు ఈ పురస్కారం ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. తెలుగు విశ్వవిద్యాలయ ఉప కులపతి ఆచార్య వెలుదండ నిత్యానందరావు, ప్రసిద్ధ విమర్శకులు కేపీ.అశోక్ కుమార్, ప్రముఖ చారిత్రకులు సంచిక అంతర్జాల పత్రికా సంపాదకులు కస్తూరి మురళీకృష్ణ తదితర ప్రముఖులు పాల్గొంటారని గిరిజా మనోహర్‌బాబు చెప్పారు.

రేపు వాణిదేవి గ్రంథాల ఆవిష్కరణ

హనుమకొండ కల్చరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ రచయిత్రి డాక్టర్ దేవులపల్లి వాణి కలం నుంచి జాలువారిన యాసంగి ముచ్చట్లు, విశ్వపరిమళ వీచిక గ్రంథాల ఆవిష్కరణ ఆదివారం ఉదయం 10 గంటలకు హనుమకొండ వాగ్దేవి సెమినార్ హాల్‌లో నిర్వహిస్తున్నారు. ప్రముఖ రచయిత్రి ఐనంపూడి శ్రీలక్ష్మి అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో తెలంగాణ పరిశోధకులు సంగిశెట్టి శ్రీనివాస్, ఆచార్య బన్న అయిలయ్య, సినీ గేయ రచయిత కాసర్ల శ్యామ్, కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్, సాహితి ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు.

కేయూలో నూతన మెస్ హాల్ షురూ

కేయూ క్యాంపస్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కేయూ డిజిటల్ బాలుర హాస్టల్‌లో శుక్రవారం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్ నూతన మెస్ హాల్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్, డీవో ప్రొఫెసర్ కె.వాసుదేవారెడ్డి, ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, భారవిశర్మ, నరేందర్, సోమయ్య, నాగేశ్వరరావు, సంజీవ్, డాక్టర్‌ఓ.మోహన్ తదితరులుపాల్గొన్నారు.

డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్‌పై అవగాహన ఉండాలి

రైల్వే డీపీవో జీఆర్. సుధీర్‌కుమార్

కాజీపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రతీ రైల్వే పెన్షనర్‌కు డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్‌పై అవగాహన కలిగి ఉండాలని, కాలానుగుణంగా బ్యాంకింగ్ విధానంపై వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సికింద్రాబాద్ డివిజనల్ సీనియర్ డివిజనల్ పర్సనల్ అధికారి (డీపీవో) జీఆర్ సుధీర్‌కుమార్ అన్నారు. కాజీపేట రైల్వే జనరల్ ఇనిస్టిట్యూట్‌లో శుక్రవారం రైల్వే పెన్షనర్‌లతో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జీఆర్ సుధీర్ కుమార్ హాజరై పెన్షనర్‌ల కు డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్‌పై అవగాహన కల్పించారు. పెన్షన్‌లు పేపర్‌పై లైఫ్ సర్టిఫికెట్‌కు స్వస్తి చెప్పి డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ పొందాలన్నారు. పెన్షనర్‌ల అసోసియేషన్‌లు గత రెండేళ్లుగా పెన్షనర్‌ల ఇంటి వద్దకు వెళ్లి మొబైల్ ఫోన్‌ల ద్వారా లైఫ్ సర్టిఫికెట్ ఇస్తున్నారని, వారిని ప్రత్యేకంగా అభినందిస్తున్నామని చెప్పారు. అనంతరం 150 మంది పెన్షనర్‌లకు డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్‌లు అందజేశారు. కార్యక్రమంలో ఇనిస్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్, వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్‌లు వి.రాజేంద్రప్రసాద్, సీవీవీ రెడ్డి, ఎంఎంఎల్ ప్రసాద్, జూనియర్ అకౌంటెంట్ అసిస్టెంట్‌లు మంజిత్ సింగ్, కేతన్ సింగ్‌తోపాటు పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్ష , కార్యదర్శులు పి. క్రిష్ణమూర్తి, గుర్రపు సుధాకర్, ఏఐఆర్‌ఆర్‌ఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు కె. సంఘమయ్య, కేవీ.రావు, నాయకులు ఎస్‌ఆర్‌వీ.రావు, సీహెచ్ కొమ్మాలు, పెన్షనర్‌లు పాల్గొన్నారు.

ఆర్వోబీ పైనుంచి కిందికి దూసుకెళ్లిన లారీ

డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

హసన్‌పర్తి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వైజాగ్ నుంచి చంద్రాపూర్ వెళ్తున్న బొగ్గు లారీ గురువారం రాత్రి గ్రేటర్ 65వ డివిజన్ పరిధి ఎల్లాపూర్ ఆర్‌వోబీపై నుంచి అదుపుతప్పి కిందకు దూసుకెళ్లింది. ఈ ఘటనలో వనపర్తి జిల్లా కొత్తకోట మండల కేంద్రానికి చెందిన డ్రైవర్ ఎద్దుల నరేందర్‌రెడ్డి తలకు బలమైన గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఇన్‌స్పెక్టర్ వట్టి చేరాలు, ఎస్సై దేవేందర్ ఘటనా స్థలానికి చేరుకుని డ్రైవర్‌ను 108 ద్వారా ఎంజీఎంకు తరలించారు. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు ప్రశంస

కేయూ క్యాంపస్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇటీవల గుజరాత్ పటాన్‌లోని హేమచంద్ర నార్త్ గుజరాత్ వర్సిటీలో జరిగిన వెస్ట్ జోన్ ప్రీ ఆర్‌డీ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల జాతీయ సేవ పథకం శిబిరంలో పాల్గొని శిక్షణ పూర్తి చేసుకున్న వలంటీర్లను శుక్రవారం కేయూ వీసీ, రిజిస్ట్రార్లు ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి, వల్లూరి రామచంద్రంలు ప్రశంసాపత్రాలను అందచేసి అభినందించారు. శిక్షణ పూర్తిచేసుకున్న వారిలో శివ, అక్షయశ్రీ, ప్రీతి, సంజయ్, సామ్రాట్‌లున్నారు ఈ కార్యక్రమంలో కేయూ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ, అధ్యాపకురాలు డాక్టర్ కె.కవిత తదితరులు పాల్గొన్నారు.

బీఎస్‌పీ జిల్లా అధ్యక్షుడిగా ప్రశాంత్



వడ్డేపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ వడ్డేపల్లిలోని ప్రశాంత్‌నగర్‌కు చెందిన అంబాల ప్రశాంత్ బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్ పీ) హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. బీఎస్‌పీ జాతీయ అధ్యక్షురాలు బహెన్‌జీ మాయావతి ఆదేశం మేరకు రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రాంశేఖర్ సూచన ప్రకారం రాష్ట్ర కో ఆర్డినేటర్ దయానందరావు శుక్రవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. హనుమకొండ జిల్లాలో బీఎస్‌పీని బలోపేతం చేసి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ప్రశాంత్ పేర్కొన్నారు.

ఘనంగా నెహ్రూ జయంతి వేడుకలు

హనుమకొండ సిటీ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాన మంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలు శుక్రవారం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగాయి. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈవీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో నెహ్రూ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నెహ్రూ సేవలను ఈ సందర్భంగా ఈవీ శ్రీనివాస్ స్మరించారు. ఆయన ఆశయాలను నెరవేర్చేందుకు యువత కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళాదేవితో పాటు డాక్టర్ పెరుమాండ్ల రామక్రిష్ణ, మార్క విజయ్‌కుమార్, బంక సంపత్ యాదవ్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మల్లికాంబ మనోవికాస కేంద్రంలో..

హనుమకొండ టౌన్: హనుమకొండ బాలసముద్రంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలో చిల్డ్రన్స్ డే వేడుకలు శుక్రవారం సంస్థ నిర్వాహకురాలు బండ రామలీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా సెరి కల్చర్ అధికారి జి. అనసూయ పాల్గొని నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మానసిక దివ్యాంగులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేసి స్వీట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కోడం కల్యాణ్, బండ సదానందరావు, ప్రొఫెసర్ పద్మ తదితరులు పాల్గొన్నారు.



డీసీసీ భవన్‌లో నెహ్రూ జయంతి వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

స్పందన మానసిక దివ్యాంగుల ఆశ్రమంలో..

బాలసముద్రం (ఆంధ్రజ్యోతి): బాలల హక్కులను కాపాడడం అందరి బాధ్యత అని మానసిక దివ్యాంగ పిల్లలకు కూడా అందరి పిల్లలకు ఉన్న హక్కులు వర్తిస్తాయని హనుమకొండ ఏసీపీ నర్సింహరావు అన్నారు. శుక్రవారం బాలల దినోత్సవం సందర్భంగా హనుమకొండలోని స్పందన మానసిక దివ్యాంగుల ఆశ్రమంలో అనురాగ్ హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలల దినోత్సవ వేడుకలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్మషం ఎరుగని మానసిక దివ్యాంగుల మధ్య బాలల దినోత్సవంలో పాల్గొనడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్ కె. అనితారెడ్డి మాట్లాడుతూ దేశ భవిష్యత్తుకు ఉపయోగపడే చిన్నారులకు అందమైన బాల్యాన్ని బహుమతిగా అందించాలన్నారు. ఈ సందర్భంగా పిల్లల చేత పాటలు పాడించి, ఆటలు ఆడించి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పిల్లలకు పండ్లు, మిఠాయిలు, నోట్ బుక్కులు పంపిణీ చేశారు. ఆశ్రమ నిర్వాహకులు సుచరిత, రాజేందర్‌రెడ్డి, వసుధ, హరిత, భార్గవి పాల్గొన్నారు.

కాజీపేటలో..

కాజీపేట (ఆంధ్రజ్యోతి): భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలు కాజీపేటలో ఘనంగా జరిగాయి. 47వ డివిజన్ బాపూజీనగర్, రైల్వే కాలనీలో నెహ్రూ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు డివిజన్ అధ్యక్షులు షేక్ అజ్గర్ నాయకులు పసునూరి మనోహర్, బొడ్డు దేవయ్యలు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశ ప్రధానికి ఆయన సేవలను కొనియాడారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సెయింట్ ఫ్రాన్సిస్ అక్షర హైస్కూల్ ప్రిన్సిపాల్ ఆర్. నవీన్‌రెడ్డి, నాయకులు దువ్వ రాజులు, ఎన్. భాను చందర్, ఇప్ప శ్రీకాంత్, కె. రమేశ్‌తో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

అఖండ శివతాండవం



'సనాతన హిందూ ధర్మం శక్తి, పరాక్రమం 'అఖండ 2' చిత్రంలో చూస్తారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలకి ఈ సినిమా చూపించాలి' అని నందమూరి బాలకృష్ణ అన్నారు. ఆయన కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'అఖండ 2: తాండవం'. ఎం. తేజస్విని నందమూరి సమర్పణలో రామ్ ఆచంట, గోపీ ఆచంట సంయుక్తంగా నిర్మిస్తున్నారు. డిసెంబర్ 5న ప్రేక్షకుల ముందుకొస్తోంది. శుక్రవారం ముంబైలో జరిగిన ఈవెంట్‌లో ఫస్ట్ సింగిల్ 'ది తాండవం' పూర్తి పాటను మేకర్స్ విడుదల చేశారు. కల్యాణ్ చక్రవర్తి సాహిత్యం అందించారు. కైలాశ్ ఖేర్, శంకర్ మహదేవన్ ఆలపించగా, తమన్ స్వరపరిచారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ 'బోయపాటి గారితో మూడు సినిమాలు చేశా. అవన్నీ సూపర్‌హిట్. ఈ సినిమా కూడా అంతకు మించి ప్రేక్షకులను అలరిస్తుంది' అని చెప్పారు. ఈ చిత్రంలో ఆది పినిశెట్టి, సంయుక్త, హర్షాలీ మల్హోత్రా కీలకపాత్రలు పోషించారు.

అన్నయ్య ఆశయాన్ని కొనసాగిస్తోన్న మహేశ్



'శంషాబాద్‌లో ఉన్న పద్మాలయా స్టూడియోస్‌లో సూపర్‌స్టార్ కృష్ణ విగ్రహం ఏర్పాటు చేయబోతున్నామని, అక్కడే ఒక ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌ను కూడా ఏర్పాటు చేస్తామని సీనియర్ నిర్మాత, హీరో కృష్ణ సోదరుడు ఆదిశేషగిరిరావు వెల్లడించారు. కృష్ణ వర్ధంతి సందర్భంగా ఆయన 'చిత్రజ్యోతి'తో మాట్లాడారు. 'పద్మాలయాలో పనిచేసిన వాళ్లు సంస్థ గురించి గొప్పగా చెబుతూ ఉంటారు. నేను ఏర్పాటు చేయబోయే ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ పొందే వారు కూడా భవిష్యత్తులో అలాగే చెప్పుకోవాలని మేము ఆశిస్తున్నాం' అని ఆయన అన్నారు. భారత ప్రేక్షకులనే కాకుండా లోకల్ ఆడియన్స్‌ని అలరించే విధంగా రాజమౌళి-మహేశ్ బాబు కాంబినేషన్‌లో వస్తోన్న సినిమా విజయవంతం అవుతుందని ఆయన పేర్కొన్నారు. 'కొత్త ప్రయోగాలు చేయడానికి అన్నయ్య ఉత్సాహం చూపించేవారు. ఈ చిత్రానికి సంబంధించి గ్లోబల్ ట్రాటర్ పేరుతో రాజమౌళి నిర్వహిస్తోన్న భారీ ఈవెంట్ పట్ల అందరూ ఆసక్తి చూపుతున్నారు. హాలీవుడ్ చిత్ర నిర్మాణ సంస్థలు మాత్రమే ఇలాంటి వేడుకలు నిర్వహించేవి. మన తెలుగులో ఒక సినిమా ప్రమోషన్‌ను ఇంత భారీగా నిర్వహించడం, అదీ కృష్ణ గారి వర్ధంతి రోజు కావడం మా అందరికీ ఎంతగానో ఆనందం కలిగిస్తోంది. అన్నయ్య ఆశయాలను మహేశ్ ముందుకు తీసుకెళ్తున్నాడు' అని ఆదిశేషగిరి రావు అన్నారు.

మూడో తరం వస్తోంది

'మా వంశం నుంచి మూడో తరం హీరోగా జయకృష్ణ ప్రేక్షకుల ముందుకు వస్తున్నాడు. అతను న్యూయార్క్ ఫిల్మ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో మూడేళ్ల కోర్సు పూర్తి చేశాడు. ఒక కొత్త హీరోకి ఏయే లక్షణాలు, అర్హతలు ఉండాలో అవన్నీ సంపాదించుకున్నాడు. ఆ తర్వాతే ఎంట్రీ ఇస్తున్నాడు. తనతో సినిమా తీస్తున్న అశ్వనీదత్‌తో మాకు మంచి సంబంధాలు ఉన్నాయి. అన్నయ్యతో 'అగ్నిపర్వతం', మహేశ్‌తో 'రాజకుమారుడు' సినిమాలు తీశారు. ఇప్పుడు మూడో తరాన్ని కూడా పరిచయం చేస్తున్నారు' అని ఆదిశేషగిరిరావు చెప్పారు.

యువతకు సందేశం



రాజేంద్ర ప్రసాద్, పృథ్వీరాజ్, కేదార్ శంకర్, మణిచందన ప్రధాన పాత్రధారులుగా మహేశ్ చంద్ర దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'పిఠాపురంలో'. 'అలా మొదలైంది' దీని ఉపశీర్షిక. మహేశ్ చంద్ర సినిమా టీమ్ పతాకంపై దుండిగల్ల బాలకృష్ణ, ఆకుల సురేశ్ పటేల్, ఎఫ్ఎం మురళీ(గోదారి కిట్టయ్య) నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'కుటుంబ సమేతంగా యువతరం ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలి. ఎలా ఎదగాలనే సందేశం ఈ సినిమాలో ఉంది. ఈ చిత్రాన్ని అందరూ ఆదరించాలి' అని కోరారు. రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ "ఆ నలుగురు', 'మీ శ్రేయోభిలాషి', 'ఓనమాలు' చిత్రాల తరహాలోనే సందేశాన్ని ఇస్తూనే యువతరాన్ని ఆకట్టుకునే అంశాలున్న సినిమా ఇది' అని అన్నారు. కార్యక్రమంలో నటుడు పృథ్వీరాజ్, చిత్ర దర్శకుడు మహేశ్ చంద్ర పాల్గొన్నారు.

అలనాటి నటి కామిని కౌశల్ కన్నుమూత



బాలీవుడ్ నటి కామిని కౌశల్(98) కన్నుమూశారు. కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమె గురువారం అర్ధరాత్రి ముంబైలోని తన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. 1927 ఫిబ్రవరి 24న లాహోర్‌లో కామిని జన్మించారు. ఆమె అసలు పేరు ఉమా కశ్యప్. దర్శకుడు చేతన్ ఆనంద్ ఆమెకు కామిని కౌశల్ అనే పేరుపెట్టారు. చిన్ననాటి నుంచే కామిని కళల పట్ల ఆసక్తిని కనబరిచేవారు. 1946లో 'నీచా నగర్' చిత్రం ద్వారా సినీరంగ ప్రవేశం చేశారు. 1940- 50 దశకాల్లో బాలీవుడ్‌లో ఓ వెలుగు వెలిగారు. దిలీప్ కుమార్, దేవ్ ఆనంద్, రాజ్ కపూర్ వంటి సినీ దిగ్గజాల సరసన కథానాయికగా నటించారు. దో భాయ్(1947), జిద్ధి(1948), షబ్నం(1949), పరాస్(1949), ఆర్జూ(1950), బిరాజ్ బహూ(1954), గోదాన్(1963) చిత్రాలు ఆమెకు మంచి పేరు తెచ్చిపెట్టాయి. 1960 నుంచి ఆమె పూర్తిగా క్యారెక్టర్ పాత్రలకే పరిమితమయ్యారు. షారుక్ ఖాన్- దీపికా పదుకొణె నటించిన 'చెన్నై ఎక్స్‌ప్రెస్'లో అమ్మమ్మ పాత్ర పోషించి అందర్నీ ఆకట్టుకున్నారు.

అధికారం పోయాక అంతటా ఓటమే!

లోక్‌సభతోపాటు రెండు ఉప ఎన్నికల్లో ఖాతా తెరవని బీఆర్ఎస్

- వరుస ఓటములు, అంతర్గత సమస్యలతో సతమతం
- తలనొప్పిగా మారిన కల్వకుంట్ల కవిత వ్యవహారం
- గ్రేటర్ హైదరాబాద్‌లో పట్టు కోల్పోతోందన్న అభిప్రాయాలు



హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు ఏవైనా గెలుపు తమదే నంటూ అధికారంలో ఉన్నప్పుడు గొప్పగా చెప్పుకున్న బీఆర్ఎస్ పార్టీ పరిస్థితి.. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో అధికారం కోల్పోయాక పూర్తిగా తిరగబడింది. అధికారం చేజారినప్పటి నుంచి జరిగిన ఏ ఎన్నికల్లోనూ ఆ పార్టీ ఖాతా తెరవలేదు. 2024లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలవలేక చతికిలపడింది. ఆ పార్టీ చరిత్రలో మొదటిసారి లోక్‌సభలో ప్రాతినిధ్యం లేకుండా పోయింది. అసెంబ్లీ ఎన్నికల్లో తెచ్చుకున్న ఓట్లలో సగం కూడా లోక్‌సభ ఎన్నికల్లో తెచ్చుకోలేకపోయింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీకి 87.53 లక్షల ఓట్లు (37.35 శాతం) రాగా, లోక్‌సభ ఎన్నికల్లో 36.48 లక్షల (16.68 శాతం) ఓట్లు మాత్రమే వచ్చాయి. ఆ తర్వాత వచ్చిన కంటోన్మెంట్ ఉప ఎన్నికలో సిట్టింగ్ స్థానాన్ని కోల్పోయింది. తాజాగా మరో సిట్టింగ్ స్థానం జూబ్లీహిల్స్‌ను కూడా పోగొట్టుకుంది. ఈ రెండు ఉప ఎన్నికల్లోనూ అధికార కాంగ్రెస్ గెలిచి మరింత బలపడితే, వరుస ఓటములతో బీఆర్ఎస్ డీలా పడింది.

తల బొప్పి కట్టిస్తున్న కవిత వ్యవహారం

వరుస ఓటములతో కుంగిపోతున్న బీఆర్ఎస్ పార్టీకి.. కల్వకుంట్ల కవిత తిరుగుబాటు మరింత తల బొప్పి కట్టేలా చేస్తోందనే వాదన వినిపిస్తోంది. 'నా తండ్రి కేసీఆర్ దేవుడు.. ఆయను చుట్టూ దెయ్యాలున్నాయి.. బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేస్తున్నారు.. దీన్ని నేను వ్యతిరేకిస్తున్నాను' అని ఆమె చేసిన ప్రకటనలు బీఆర్ఎస్‌ను మరింత ఇరుకున పెట్టేకుందుకు ప్రత్యర్థి పార్టీలకు ఆయుధాలుగా మారాయి. పార్టీ నుంచి ఆమెను బహిష్కరించినా జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఇప్పటికీ ఆమె బీఆర్ఎస్ నేతలు హరీశ్‌రావు, సంతోష్‌రావులను టార్గెట్ చేస్తూ పదునైన విమర్శలు చేస్తుండటంతో ఎదురుదాడి చేయలేక, ఊరుకోలేక బీఆర్ఎస్ నేతలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన 39 మంది ఎమ్మెల్యేల్లో 10 మంది కాంగ్రెస్‌కు టచ్‌లోకి వెళ్లడం గులాబీ దళాన్ని మరింత ఒత్తిడిలోకి నెట్టింది.

సరిదిద్దుకోవాల్సిందే...!

తాజా రాజకీయ పరిణామాలే కాకుండా అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఓటమికి గల కారణాలను విశ్లేషించే క్రమంలో పార్టీ దృష్టికి వచ్చిన సమస్యలను ఇప్పటివరకూ పరిష్కరించలేదని ఆ పార్టీకి చెందిన సీనియర్ కార్యకర్త ఒకరు అభిప్రాయపడ్డారు. ఓటమిపై విశ్లేషణ అంటూ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమావేశాలు పెడితే... జిల్లా, నియోజకవర్గ స్థాయి నేతలు స్థానిక పరిస్థితులను సభాముఖంగా చెప్పారని, దిద్దుబాటు చర్యలు చేపడతామన్న కేటీఆర్ నేటికీ స్పందించడం లేదని ఆయన అసంతృప్తి వ్యక్తంచేశారు. ఇప్పటికైనా దిద్దుబాటు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

గత అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్ నగరం, దాని సమీప నియోజకవర్గాల్లో సగానిపైగా గెలిచిన బీఆర్ఎస్.. క్రమంగా ఇక్కడ పట్టు కోల్పోతోందనే అభిప్రాయాలు బలపడుతున్నాయి. ఇక్కడ జరిగిన రెండు ఉప ఎన్నికల్లో

పట్నంపై పట్టు పోతుందా?

సిట్టింగ్ స్థానాలను బీఆర్ఎస్ కోల్పోవటమే అందుకు కారణం. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్‌లోని 24 నియోజకవర్గాలకుగాను 16 చోట్ల బీఆర్ఎస్ విజయం సాధించింది. ఆ తర్వాత కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు జరగ్గా.. రెండు చోట్లా ఆ పార్టీ ఓటమి మూటగట్టుకుంది. హైదరాబాద్ నగరం తమ అడ్డా అని చెప్పుకుంటున్న బీఆర్ఎస్‌కు ఉప ఎన్నికల ఫలితాలు షాకిచ్చాయి. 'ఉప ఎన్నికల ఫలితాలు అధికార పార్టీకి అనుకూలంగా ఉంటాయని సర్ది చెప్పుకునే పరిస్థితి లేదు. పార్టీకి పెట్టని కోటలా ఉన్న చోట పరాజయం సాధారణ విషయం కాదు. ఈ విషయంపై పార్టీలో చర్చ జరగాలి. మనం వెళ్తోన్న మార్గం సరైనదేనా..? ఏ విధంగా ముందుకు వెళ్లాలన్నది పునరాలోచించుకోవాల్సిన అవసరం ఉంది' అని గ్రేటర్ ఎమ్మెల్యే ఒకరు అభిప్రాయపడ్డారు. తాజా ఫలితం నేపథ్యంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి.. ఉప ఎన్నికలకు వెళ్లే అవకాశం లేకపోలేదని, అదే జరిగితే బీఆర్ఎస్ మరో అగ్ని పరీక్షకు సిద్ధం కావాల్సి ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రాహుల్, కేటీఆర్‌లు ఐరన్‌లెగ్స్

- వారే మా బ్రాండ్ అంబాసిడర్లు
- మైనారిటీల ఓట్లతోనే జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ విజయం: బండి సంజయ్

న్యూఢిల్లీ, హైదరాబాద్, మెదక్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): 'తెలంగాణలో కేటీఆర్.. దేశంలో రాహుల్ గాంధీలు ఐరన్‌లెగ్‌లు.. వారే మాకు బ్రాండ్ అంబాసిడర్లు' అని కేంద్రమంత్రి బండి సంజయ్ ఎద్దేవా చేశారు. దేశంలో కాంగ్రెస్ ప్రాంతీయ పార్టీగా మారిపోగా.. తెలంగాణలో కాంగ్రెస్‌కు బీఆర్ఎస్ ఉప ప్రాంతీయ పార్టీగా మారిందన్నారు. రాహుల్ నాయకత్వంలో కాంగ్రెస్‌కు మనుగడ కష్టమని చెప్పారు. 'కేటీఆర్ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అయ్యాక జీహెచ్ఎంసీలో ఆ పార్టీ బలం 99 నుంచి 56కు పడిపోయింది. ఉప ఎన్నికల్లో ఆ పార్టీ ఓడిపోతూనే ఉంది. చెల్లెలు ఓడిపోయింది. ఆమె పార్టీకి దూరమయ్యారు. సిటింగ్ ఎమ్మెల్యే స్థానాలనూ బీఆర్ఎస్ కోల్పోయింది' అని సంజయ్ అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఓట్ చోరీ జరిగిందా? లేదా? అనేదానికి రాహుల్, రేవంత్‌లు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మైనారిటీల ఓట్లతోనే కాంగ్రెస్ గెలిచిందని, మజ్లిస్ పార్టీ సొంతంగా గెలవలేక కాంగ్రెస్ తరఫున అభ్యర్థిని నిలబెట్టిందని ఆరోపించారు. హిందూ సమాజాన్ని ఏకం చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతామని చెప్పారు. 'మీరూ కేటీఆర్ ఒక్కటికాకుంటే దివంగత నేత మాగంటి గోపీనాథ్ ఆస్తులపై విచారణ జరపాలి. ఆయన తల్లికి, మొదటి భార్య, కుమారుడికి న్యాయం చేయాలి' అని సీఎం రేవంత్‌కు సంజయ్ సవాల్ విసిరారు.

కాంగ్రెస్ డబ్బులిచ్చి గెలిచింది

- జూబ్లీహిల్స్‌లో మేం ఏనాడూ గెలవలేదు: కిషన్‌రెడ్డి

జూబ్లీహిల్స్‌లో ఏనాడూ తమ పార్టీ ఎమ్మెల్యేగా గానీ, కార్పొరేటర్‌గా గానీ గెలవలేదని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్‌లో ఉప ఎన్నిక స్థానం తమ పార్టీ ప్రాతినిధ్యం ఉన్న పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోకి రావడంతో తప్పనిసరిగా ఓ రాజకీయ పార్టీగా ఎన్నికలో పాల్గొన్నామన్నారు. భారత మండపంలో జరుగుతున్న ఇండియా ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్‌లో తన శాఖలకు సంబంధించిన పెవిలియన్‌లను కిషన్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితాలను సమీక్షించుకుంటామన్నారు. జూబ్లీహిల్స్‌లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నందుకు రేవంత్‌కు జనాలు ఓటేశారా? కాదు.. డబ్బులిచ్చి కాంగ్రెస్ గెలిచిందన్నారు. మజ్లిస్ పూర్తిస్థాయిలో సహకరించిందని చెప్పారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కోట్ల కొద్ది రూపాయలను పంచాయని, దీనిపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో డబ్బు, అధికార దుర్వినియోగంతో కాంగ్రెస్ గెలిచిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు ఆరోపించారు. సిటింగ్ సీటును కోల్పోయినా కాంగ్రెస్‌కు తామే ప్రత్యామ్నాయమని బీఆర్ఎస్ ప్రకటించుకోవడం సిగ్గుచేటన్నారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాంచందర్‌రావు మాట్లాడుతూ.. ఈ ఉప ఎన్నికలో కాంగ్రెస్ గుర్తుపై ఎంఐఎం పోటీచేసిన మాటను కాదనగలరా? అని సవాల్ చేశారు.

'హస్త'గతానికి అష్ట సూత్రాలు!

సంక్షేమ, అభివృద్ధి పథకాల నుంచి బీసీ ఫ్యాక్టర్ దాకా..

- కాంగ్రెస్‌కు ఆక్సిజన్‌లా మజ్లిస్ మద్దతు
- 7డివిజన్లకు ఇన్‌చార్జులుగా మంత్రులు
- పరిస్థితులను మలుపు తిప్పిన ముఖ్యమంత్రి రేవంత్ ప్రచారం
- నవీన్‌కు కలసివచ్చిన సానుభూతి ఓటింగ్
- అధికార పార్టీగా ఉన్న అనుకూలతలు..



హైదరాబాద్/ హైదరాబాద్ సిటీ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారం జరిగినంతసేపూ నువ్వా నేనా అన్నట్టు పోటాపోటీగా కనిపించిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక.. కాంగ్రెస్ 'హస్త'గతం కావడం వెనుక ఎనిమిది అంశాలు కీలకంగా మారాయి. కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, బీసీ ఫ్యాక్టర్, మజ్లిస్ మద్దతు, అధికార పార్టీ కావటం, అభివృద్ధి నినాదం, సీఎం రేవంత్‌రెడ్డి సుడిగాలి ప్రచారం, పోల్ మేనేజ్‌మెంట్, నవీన్ యాదవ్‌పై సానుభూతి వంటివి కాంగ్రెస్ విజయానికి మార్గం వేశాయి. అదీ మంచి మెజారిటీతో గెలవడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.

తొలుత బీఆర్ఎస్‌కు మొగ్గు కనిపించినా..

మాగంటి గోపీనాథ్ మృతితో వచ్చిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను ప్రధాన పార్టీలన్నీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. గోపీనాథ్ భార్య సునీతను బీఆర్ఎస్, స్థానిక యువ నాయకుడు నవీన్ యాదవ్‌ను కాంగ్రెస్ బరిలోకి దింపాయి. తొలుత బీఆర్ఎస్‌కు అనుకూల వాతావరణం కనిపించినా పరిస్థితి మారింది. పోలింగ్‌కు రెండు రోజుల ముందు కాంగ్రెస్ వైపు మళ్లింది. ఇందులో సీఎం రేవంత్ ప్రచారం కీలకంగా మారింది. ఆయన వారంపాటు నాలుగు రోడ్డు షోలు, ప్రచార కార్యక్రమాలు నిర్వహించి నియోజకవర్గంలోని అన్ని డివిజన్లను చుట్టేశారు.

అభివృద్ధి, సంక్షేమ నినాదంతో..

రేవంత్, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ ఉప ఎన్నికను ముందు నుంచే ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. షెడ్యూల్ విడుదలకు ముందే మంత్రులకు డివిజన్ల వారీగా బాధ్యతలు అప్పగించారు. అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో ప్రజల్లోకి వెళ్లి.. అభివృద్ధి నినాదాన్ని బలంగా వినిపించారు. అదేక్రమంలో సన్నబియ్యం, గృహాలకు ఉచిత విద్యుత్, రూ.500 కే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్‌కార్డులు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి సంక్షేమ పథకాలనూ ప్రజల్లోకి తీసుకెళ్లారు. ప్రచారం సందర్భంగా జూబ్లీహిల్స్‌లో 4వేల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని, మైనార్టీలకు ఖబరస్తాన్ సమస్యను పరిష్కారిస్తానని, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలను మెరుగుపర్చడంతోపాటు ఇళ్లపై ఉన్న హైటెన్షన్ విద్యుత్ వైర్లను తొలగిస్తానని హామీ ఇవ్వడం కూడా ప్రభావం చూపింది. కాంగ్రెస్ అధికార పార్టీ కావడంతో.. ఆ పార్టీ అభ్యర్థి గెలిస్తే.. మరో మూడేళ్లు అభివృద్ధి పనులకు ఢోకా ఉండదన్న అభిప్రాయంతో ఓటర్లు నవీన్ యాదవ్ వైపు మొగ్గు చూపారు.

నవీన్ యాదవ్- రేవంత్‌రెడ్డి కాంబో!

కాంగ్రెస్ పార్టీకి నవీన్ యాదవ్ రూపంలో స్థానికంగా బలమైన అభ్యర్థి దొరికారు. యువకుడు, విద్యావంతుడు కావటంతోపాటు సుదీర్ఘ కాలం నుంచి రాజకీయాల్లో ఉండటం కలిసొచ్చింది. సీఎం రేవంత్ కూడా ఆయనను వ్యూహాత్మకంగా ఎంపిక చేశారు. అదే సమయంలో 2023 ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నుంచి పోటీ చేసి ఓడిపోయిన అజారుద్దీన్‌ను ఎన్నికలకు ముందే ఎమ్మెల్సీ పదవికి సిఫార్సు చేసి, సర్దుబాటు చేశారు. తర్వాత ఆయనను మంత్రివర్గంలోకి కూడా తీసుకున్నారు. తద్వారా నవీన్ యాదవ్‌కు మార్గం సుగమం చేశారు. మరోవైపు గత రెండు ఎన్నికల్లో జూబ్లీహిల్స్‌లో పోటీ చేసి ఓడిపోయిన నవీన్ యాదవ్‌కు ఆ సానుభూతి కూడా కలిసి వచ్చింది.

బీసీ అభ్యర్థి.. మజ్లిస్ మద్దతు..

ఈ ఉప ఎన్నికలో మజ్లిస్ పోటీచేయలేదు. కాంగ్రెస్ అభ్యర్థికే మద్దతు ప్రకటించింది. దీంతో ఎంఐఎం ఓట్లు సింహభాగం కాంగ్రెస్‌కు వచ్చాయి. అజారుద్దీన్‌కు మంత్రి పదవి నేపథ్యంలోనూ ముస్లింల ఓట్లు కాంగ్రెస్ వైపు మళ్లాయి. ఇక కాంగ్రెస్ తీసుకున్న 'బీసీ నినాదం' కూడా ఉపయోగపడింది. బీఆర్ఎస్ కమ్మ సామాజికవర్గానికి చెందిన మాగంటి సునీతను పోటీలో దింపగా, బీజేపీ రెడ్డి సామాజికవర్గానికి చెందిన లంకల దీపక్‌రెడ్డిని బరిలో దింపింది. కాంగ్రెస్ తరఫున బీసీ అయిన నవీన్ యాదవ్ రంగంలో ఉండటం కలిసివచ్చింది.

పకడ్బందీ పోల్ మేనేజ్‌మెంట్‌తో..

కాంగ్రెస్ పార్టీ ప్రచారంలోనే కాదు పోల్ మేనేజ్‌మెంట్‌లోనూ పకడ్బందీగా వ్యవహరించింది. నిజానికి తొలి నుంచీ బీఆర్ఎస్ పోల్ మేనేజ్‌మెంట్‌లో దిట్ట. గతంలో చాలా ఉప ఎన్నికల్లో అలాగే గెలిచింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో మాత్రం కాంగ్రెస్ పైచేయి సాధించింది. ఇంటింటి ప్రచారం, ఓటర్ల మ్యాపింగ్, దూర ప్రాంతాల్లో ఉన్న ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తరలించడం, బూత్ వారీగా కాంగ్రెస్ శ్రేణుల మోహరింపు ఫలితాన్ని ఇచ్చాయి.

తెలంగాణ ప్రభుత్వం
జిల్లా కలెక్టర్ జయశంకర్ భూపాలపల్లి వారి డిక్లరేషన్ ప్రచురణ

జయశంకర్ భూపాలపల్లి జిల్లా రాజపత్రము నెం. భూపాలపల్లి /ఎల్.ఎ./33/, దిది: 29-10-2025
(శ్రీయుత జిల్లా కలెక్టర్ జయశంకర్ భూపాలపల్లి వారి ఉత్తర్వు సంఖ్య అ/837/2025, దిది: 24-10-2025)

ఫారం-7

(చట్టం-30/2013లోని సెక్షన్ 19(1) లోని సబ్ రూల్ -1 రూల్ 25 ప్రకారం)

ఈ దిగువ నిర్దిష్టపరిచిన జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ఘణపూర్ (ములుగు) మండలములో ధర్మరావుపేట గ్రామములోని పట్టాభూమి విస్తీర్ణం ఎ.26-22 గుంటలు ప్రజా ప్రయోజనం నిమిత్తం అనగా కె.టి.కె. ఓపెన్ కాస్టు-III నిర్మాణము చేయుట కొరకు ఈ దిగువ చూపిన పట్టా భూమి అవసరము అయి ఉన్నదని భావించినందున భూసేకరణలో సముచిత పరిహారము మరియుపారదర్శకత, పునరావాస, పునరాశ్రయ హక్కుచట్టం, 2013లోని సెక్షన్19(1) అనుసరించి ప్రకటన జారీచేయనైనది.

కావున ఈ ప్రాజెక్టు క్రింద జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ఘణపూర్ (ములుగు) మండలములో ధర్మరావుపేట గ్రామములోని ఉన్న పట్టా భూమి విస్తీర్ణం ఎ. 26-22 గుంటలు గల భూమి ఈ క్రింద చూపిన విధముగా భూసేకరణలో ఉన్నదని డిక్లరేషన్ ప్రచురణ జారీ చేయనైనది.

షెడ్యూల్

గ్రా: ధర్మరావుపేట మం: ఘణపూర్ (ములుగు) జిల్లా: జయశంకర్ భూపాలపల్లి

క్రమ సంఖ్య	సర్వే నెంబర్	భూమి రకం	[illegible]	పట్టాదారుపేరు (పహాణీ ప్రకారంగా)	ఎంజాయర్ పేరు (మోకా సర్వే ప్రకారంగా)	విస్తీర్ణం	చెట్లు/ నిర్మాణాలు
1	2	3	4	5	6	7	8
1	318/61	పట్టా	0-05	లింగంపల్లి పుష్పలీల భర్త రాజేశ్వర్ రావు మామిడి కోమల భర్త రమణాకర్ యం.డి. యాకూబ్ తండ్రి ఇబ్రహీం సుంకరి రాము, భర్త తిరుపతి రెడ్డి ముక్కెర విజయ భర్త రాఘవులు పాశం శంకరయ్య తండ్రి హనుమంతు మామిడి రాజయ్య తండ్రి కనకయ్య అట్లూరి వెంకట లక్ష్మీ నరసింహారావు తండ్రి శివాజీరావు అట్లూరి అరుంధతి భర్త రాధాకృష్ణ ఎడ్ల సురేష్ తండ్రి బుచ్చయ్య ఎడ్ల పర్వయ్య తండ్రి బుచ్చయ్య ఎడ్ల సదయ్య తండ్రి బుచ్చయ్య ఎడ్ల రాములు తండ్రి బుచ్చయ్య	మామిడి కోమల భర్త రమణాకర్	0-06	-
				మొత్తం		0-05	
2	318/62	పట్టా	1-02	సుంకరి రామ భర్త. చిన్న రాజిరెడ్డి బరిదుల సంధ్యా రాణి, భర్త. కృష్ణ రెడ్డి సుంకరి మాధవ రెడ్డి తండ్రి యాకూబ్ రెడ్డి సుంకరి లక్ష్మీ భర్త. జగ్గా రెడ్డి సుంకరి రామ భర్త. మాధవ రెడ్డి బలోని అభినయ రెడ్డి తండ్రి. రామచంద్రారెడ్డి సుంకరి వినోద భర్త చంద్రారెడ్డి మామిడి సరళలక్ష్మి భర్త రాజయ్య ఏటూరి వెంకట లక్ష్మీనరసింహారావు తండ్రి శివాజీరావు అట్లూరి రాధాకృష్ణ తండ్రి సచ్చిదానందరావు అట్లూరి అరుంధతి తండ్రి రాధాకృష్ణ సుంకరి సుధాకర్ రెడ్డి తండ్రి యాకూబ్ రెడ్డి ముక్కెర శంకరయ్య, తండ్రి రాములు సుంకరి శ్రీలత భర్త జగ్గారెడ్డి ముక్కెర రాఘవులు తండ్రి సాయిలు	సుంకరి మాధవరెడ్డి తండ్రి యాకూబ్ రెడ్డి	1-02	-
				మొత్తం		1-02	
3	318/63	పట్టా	0-35	శ్రీపెల్లి బ్రహ్మాచారి తండ్రి. వెంకటాద్రి సుంకరి మాధవ రెడ్డి తండ్రి యాకూబ్ రెడ్డి కొండం బాల రాజేంద్ర ప్రసాద్ రెడ్డి తండ్రి. లక్ష్మా రెడ్డి దండేబోయిన సర్వయ్య తండ్రి. దుర్గయ్య అట్లూరి ఉదయ లక్ష్మీ భర్త. జగన్ మోహన్ రెడ్డి మామిడి రాజయ్య తండ్రి. సమ్మయ్య గాలిబ్ పద్మ భర్త. రమేష్ సుంకరి లక్ష్మీ భర్త జగ్గారెడ్డి	సుంకరి మాధవరెడ్డి తండ్రి యాకూబ్‌రెడ్డి	0-17 1/2	-
					దండేబోయిన సర్వయ్య తండ్రి దుర్గయ్య	0-17 1/2	వేప-2
				మొత్తం		0-35	
4	318/64	పట్టా	0-19	కొండం బాల రాజేంద్ర ప్రసాద్ రెడ్డి తండ్రి. లక్ష్మా రెడ్డి టి.యస్.జెన్ కొ గొల్ల కవిత భర్త విద్యాసాగర్ కనుకుంట్ల రామ భర్త నాగేందర్ దండేబోయిన సర్వయ్య తండ్రి దుర్గయ్య అట్లూరి ఉదయ లక్ష్మీ భర్త జగన్ మోహనరావు	దండేబోయిన సర్వయ్య తండ్రి దుర్గయ్య	0-19	వేప-60, సైఫాన్, బోర్-1
				మొత్తం		0-19	
5	318/73	పట్టా	3-02	అప్పిరెడ్డి వేణుగోపాలరెడ్డి తండ్రి తిరుపతిరెడ్డి మాదాటి కరుణాకర్ రెడ్డి తండ్రి నారాయణరెడ్డి నల్ల రాజమహేంద్రరెడ్డి తండ్రి వీరారెడ్డి కనుకుంట్ల రమ భర్త నాగేందర్	దండేబోయిన సర్వయ్య తండ్రి దుర్గయ్య	0-11	-
					కనుకుంట్ల రమ భర్త నాగేందర్	2-00	[illegible]
					మామిడి సర్వయ్య తండ్రి కనకయ్య		
					మాదాటి కరుణాకర్ రెడ్డి తండ్రి నారాయణరెడ్డి	0-31	వేప-2
				మొత్తం		3-02	
6	318/74	పట్టా	5-08	శ్రీపల్లి వెంకటాద్రి తండ్రి కిష్టయ్య మనే స్వప్న భర్త అశోక్ మామిడి రాజయ్య తండ్రి సమ్మయ్య మాదాటి కరుణాకర్ రెడ్డి తండ్రి నారాయణరెడ్డి నల్ల రాజమహేంద్రరెడ్డి తండ్రి వీరారెడ్డి	మాదాటి కరుణాకర్ రెడ్డి తండ్రి నారాయణరెడ్డి	3-03	-
					శ్రీపెల్లి బ్రహ్మాచారి తండ్రి వెంకటాద్రి	0-29	బోర్-1 [illegible] ట్రీ-1
					మనే స్వప్న భర్త అశోక్	0-38	-
					దండేబోయిన సర్వయ్య తండ్రి దుర్గయ్య	0-10	-
					సుంకరి మాధవరెడ్డి తండ్రి యాకూబ్ రెడ్డి	0-08	-
				మొత్తం		5-08	
7	318/75	పట్టా	4-26	గొల్ల సరళ భర్త మల్లేష్ గల్ల విజయలక్ష్మి భర్త వెంకటరామారెడ్డి పోచేటి రాజేందర్‌రెడ్డి తండ్రి సమ్మిరెడ్డి మామిడి రాజయ్య తండ్రి సమ్మయ్య అట్లూరి వెంకటలక్ష్మి భర్త శివాజీరావు సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (యస్.సి.సి.యల్)	మనే స్వప్న భర్త అశోక్	0-08	-
					శ్రీపెల్లి బ్రహ్మాచారి తండ్రి వెంకటాద్రి	1-09	వేప-5, తాటి-2, వే-3
					సుంకరి మాధవరెడ్డి తండ్రి యాకూబ్ రెడ్డి	0-19	బోర్-2, వే-1, ట్రీ-1
					సుంకరి సతీష్ రెడ్డి తండ్రి పెద్ద రాజయ్య	0-15	[illegible]
					గల్ల సరళ భర్త. మల్లేశం	0-24	ట్రీ-1, పైప్‌లైన్, పామ్ ఆయిల్ 38 చెట్లు
					మామిడి రాజయ్య తండ్రి సమ్మయ్య	1-31	బోర్-1, పైప్‌లైన్, ట్రీ, పామ్ ఆయిల్ 116 చెట్లు, [illegible]
				మొత్తం		4-26	
8	318/76	పట్టా	1-14	మంద జయపాల్‌రెడ్డి గంగారపు వెంకన్న తండ్రి ఎల్లయ్య నల్ల రాజమహేంద్రరెడ్డి తండ్రి వీరారెడ్డి పాతూరి రమాదేవి భర్త రాజిరెడ్డి మంద సత్యనారాయణరెడ్డి మామిడి రమణాకర్ తండ్రి రాజయ్య కొయ్యడ సుదర్శన్ తండ్రి కొమురయ్య కొయ్యల కుమారస్వామి తండ్రి మల్లయ్య అట్లూరి వెంకటలక్ష్మి భర్త శివాజీరావు బలోని గౌతమిరెడ్డి తండ్రి రామచంద్రారెడ్డి	గంగారపు వెంకన్న తండ్రి ఎల్లయ్య	0-19	-
					మామిడి రమణాకర్ తండ్రి రాజయ్య	0-35	బోర్-2, పైప్‌లైన్, పైప్స్, పామ్ ఆయిల్ 61 చెట్లు, టేకు-18
				మొత్తం		1-14	
9	318/86	పట్టా	7-21	వంగ రవి తండ్రి పెద్ద మల్లయ్య దాసరి విజయ భర్త లక్ష్మయ్య పోలుసాని సుజాత భర్త రంగారావు మాలోతు కవిత భర్త. చంద్రయ్య సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (యస్.సి.సి.యల్)	దాసరి లక్ష్మయ్య తండ్రి ఓదెలు	7-21	యూకలిప్టస్ చెట్లు
					దాసరి విజయ భర్త లక్ష్మయ్య		
					వంగ రవి తండ్రి పెద్ద మల్లయ్య		ట్రీ-1
				మొత్తం		7-21	
10	318/87	పట్టా	2-04	వంగ మంజుల భర్త రవి దాసరి లక్ష్మయ్య తండ్రి ఓదెలు వంగ రవి తండ్రిపెద్ద మల్లయ్య విశారి మహేందర్ తండ్రి లింగ స్వామి టి.యస్ జెన్ కొ సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (యస్.సి.సి.యల్)	దాసరి లక్ష్మయ్య తండ్రి ఓదెలు	2-04	వేప-80
					దాసరి విజయ భర్త లక్ష్మయ్య		ట్రీ-1
					వంగ రవి తండ్రి పెద్ద మల్లయ్య		వేప-3
				మొత్తం		2-04	
11	318/96	పట్టా	0-06	సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (యస్.సి.సి.యల్) బొజ్జపెల్లి తిరుపతి తండ్రి నారాయణ బోనగాని భద్రయ్య తండ్రి పుల్లయ్య [illegible] రేపాల సర్వయ్య బలిని స్వప్న సో సురేందర్ పోరిక దశరథం తండ్రి వెంకట్రామ్ టి.యస్ జెన్ కొ పానగంటి తిరుపతిరావు తండ్రి రాజేశ్వరరావు	దాసరి లక్ష్మయ్య తండ్రి ఓదెలు	0-06	-
					దాసరి విజయ భర్త లక్ష్మయ్య		బోర్-1
					వంగ రవి తండ్రి పెద్ద మల్లయ్య		బోర్-1
				మొత్తం		0-06	
				మొత్తం విస్తీర్ణం		26-22	

సెక్షన్ (15) చట్టం 30/2013 క్రింద భూసేకరణపై వచ్చిన అభ్యంతరాలను పరిశీలించిన పిదప ఇట్టి ప్రకటన (డిక్లరేషన్) జారీచేయనైనది. ఇట్టి ప్రాజెక్ట్ నిర్మాణం భూసేకరణ ద్వారా ఏ కుటుంబం కూడా ఈ గ్రామంలో నిర్వాసితులుగా భావించబడరు.

భూసేకరణ తలపెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, స్లేట్ మరియు ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో ఆ ఖనిజాలు ప్రాజెక్ట్ నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో, వాటిని స్వీకరించబడును. లేనిచో స్వీకరించబడవు.

పైన చూపిన భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ ఏదైన పని దినములలో మరియు కార్యాలయ పని వేళలలో జిల్లా కలెక్టర్ జయశంకర్ భూపాలపల్లి మరియు భూసేకరణ అధికారి మరియు రెవెన్యూ డివిజనల్ అధికారి భూపాలపల్లి వారి కార్యాలయములో పరిశీలించుకొను నిమిత్తం అందుబాటులో ఉండును.

సం/-	సం/-	సం/-
భూసేకరణ అధికారి మరియు రెవెన్యూ డివిజనల్ అధికారి భూపాలపల్లి	అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జయశంకర్ భూపాలపల్లి	జిల్లా కలెక్టర్ జయశంకర్ భూపాలపల్లి

DIPR R.O.No. 829/LA/PP/ADVT/AGENCY/2025-26

నితీశే సీఎం?



» మరోసారి ఆయనకే పగ్గాలు ఖాయమంటున్న ఎన్డీయే వర్గాలు

» కేంద్రంలో ప్రభుత్వ మనుగడకు జేడీయూ ఎంపీలే కీలకం

న్యూఢిల్లీ, నవంబరు 14: బిహార్‌లో బీజేపీకి జేడీయూ కన్నా ఎక్కువ సీట్లు వచ్చినా.. అధికారంలో కొనసాగడానికి గతంలోలాగా జేడీయూ అవసరం అంతగా లేకపోయినా.. ఈసారి కూడా నీతీశే సీఎం అయ్యే అవకాశం ఉందని, ఆయన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మోదీ హాజరవుతారని ఎన్డీయే వర్గాలు చెబుతున్నాయి. బీజేపీ నేత రామ్ కృపాల్ యాదవ్, ఎల్జేపీ ఎంపీ శాంభవి చౌదరి, హిందుస్థానీ అవామ్ మోర్చా నేత జితన్ రామ్ మాంఝీ వంటివారు నీతీశే సీఎం అవుతారని, అందులో సందేహం లేదని తేల్చిచెబుతున్నారు. మహిళలు, దళితులు, అత్యంత వెనుకబడిన వర్గాల్లో (ఈబీసీలు) నీతీశ్‌కున్న పట్టు.. ప్రస్తుత ఘన విజయంలో ఆయా వర్గాల పాత్ర నేపథ్యంలో.. బీజేపీ ఆయన్ను కాదని మరొకరిని సీఎంగా చేయలేదని ఎన్డీయే వర్గాలు పేర్కొంటున్నట్టు తెలుస్తోంది. వీటన్నింటికీ మించి.. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వంలో జేడీయూ ఎంపీలు అత్యంత కీలకం. బీజేపీ, టీడీపీ తర్వాత అత్యధికంగా ఎంపీలు ఉన్నది ఆ పార్టీకే. ఆ కోణంలో కూడా బీజేపీ తప్పనిసరి పరిస్థితుల్లో నీతీశ్‌కు సీఎం పీఠం అప్పజెప్పక తప్పదని రాజకీయ నిపుణులు గుర్తుచేస్తున్నారు. అయితే.. ఐదేళ్లూ నీతీశ్ ఆ పదవిలో ఉండకపోవచ్చని.. బీజేపీకి వరుసగా రెండు ఎన్నికల్లో జేడీయూ కన్నా ఎక్కువ స్థానాలు వచ్చిన నేపథ్యంలో ఒకటి-రెండేళ్లు మాత్రమే ఆయన్ను సీఎంగా ఉండనిచ్చి, తర్వాత తమ పార్టీ నేతను సీఎంగా చేయడానికి బీజేపీ ప్రయత్నిస్తుందని కొందరు అంచనా వేస్తున్నారు. నీతీశ్‌కుమార్ ఆరోగ్య పరిస్థితి సరిగ్గా లేదని.. జేడీయూలోనే కొందరు నేతలు ఆయన ప్రభుత్వాన్ని నడపడానికి అవసరమైనంత ఫిట్‌గా లేరని భావిస్తున్నట్టు సమాచారం. దీన్ని సాకుగా చూపి బీజేపీ తమ పార్టీకి చెందిన నేతను ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెట్టే ప్రయత్నం చేయొచ్చని విశ్లేషిస్తున్నారు.

నితీశ్ సీఎం అయితే.. పదోసారి!

గిట్టనివాళ్ల దృష్టిలో నీతీశ్ కుమార్.. పదే పదే జట్టును మార్చే 'పల్టూ రామ్'! దశాబ్దాల తరబడి సాగిన ఆటవిక పాలనలో మగ్గిన బిహార్ ప్రజలకు మాత్రం.. ఆయన అభివృద్ధి రుచి చూపిన 'సుశాసన్ బాబు'!! అందుకే ఆయన ఎన్నిసార్లు రాజకీయ పిల్లిమొగ్గలు వేసినా.. ఒకసారి బీజేపీతో, మరొకసారి ఆర్జేడీతో.. మళ్లీ అంతలోనే బీజేపీతో కలిసి రాజకీయం చేసినా.. బిహార్ ప్రజల దృష్టిలో మాత్రం ఆయన పరపతి ఏ మాత్రం తగ్గలేదు. 2000 సంవత్సరంలో తొలిసారి సీఎం పదవిని చేపట్టి.. అందులో కేవలం వారం రోజులే(2000 మార్చి 3 నుంచి మార్చి 10 దాకా) ఉన్న నీతీశ్.. సభలో తన పార్టీకి తగిన మెజారిటీ లేకపోవడంతో రాజీనామా చేశారు. 2005లో మరోసారి సీఎం అయ్యి ఐదేళ్లూ పాలించారు. 2010 నవంబరు నుంచి 2014 మే దాకా మూడోసారి సీఎంగా వ్యవహరించారు. ఆ ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో జేడీయూకి కేవలం 2 సీట్లే రావడంతో సీఎం పదవికి రాజీనామా చేసి జితన్ రామ్ మాంఝీని ముఖ్యమంత్రిని చేశారు. మళ్లీ 2015 ఫిబ్రవరిలో ఆయన్ను తప్పించి తానే సీఎం అయ్యారు. ఆ ఏడాదిలో బిహార్ అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో జనతా పరివార్ అలయన్స్ గ్రూప్ తరఫున సీఎంగా పాలనాపగ్గాలు చేపట్టారు. 2017 దాకా ఆ కూటమి తరఫునే సీఎంగా ఉన్న నీతీశ్.. 2017 జూలై నుంచి 2020 నవంబరు దాకా బీజేపీతో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేసి సీఎంగా ఉన్నారు. మళ్లీ 2020లో బీజేపీతో కలిసి పోటీ చేసి ఆ ఏడాది నవంబరులో ఏడోసారి సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు. 2022లో ఎన్డీయే కూటమిని వదిలి మహాగఠ్బంధన్‌తో జట్టుకట్టి.. ఆ ఏడాది ఆగస్టులో ఎనిమిదోసారి సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు. మళ్లీ 2024 జనవరిలో ఎన్డీయేతో చేతులు కలిపి మరోసారి సీఎం అయ్యారు. అలా ఇప్పటికి తొమ్మిదిసార్లు ఆయన సీఎం అయ్యారు. ఇప్పుడు మరోసారి ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపడితే.. పదోసారి ఆ పదవిని చేపట్టినట్టు అవుతుంది. నీతీశ్ విషయంలో మరో రికార్డు ఏంటంటే.. ఇప్పటికి దాదాపు 20 ఏళ్లపాటు బిహార్‌కు సీఎంగా వ్యవహరించిన ఆయన ఆ రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికైంది రెండుసార్లే. 1985లో ఒకసారి.. 1995లో మరోసారి ఆయన ఎమ్మెల్యే అయ్యారు. కానీ తొలిసారి సీఎం అయింది 2000లో. అప్పట్నుంచీ ఇప్పటిదాకా.. తొమ్మిదిసార్లూ ఆయన విధాన పరిషత్తు (శాసనమండలి) సభ్యుడుగానే సీఎం పదవి చేపట్టారు.

ఇదిగో రూ.10వేలు..

» ఎన్నికలకు కాస్త ముందు సీఎం నితీశ్ ఎత్తుగడ

» సీఎం మహిళా రోజ్‌గార్ యోజన కింద

2.72 కోట్ల మహిళల ఖాతాలో డబ్బులు వేసిన నితీశ్

పట్నా, నవంబరు 14: "నేను సీఎంగా గెలిస్తే ఈ పథకం అమలు చేస్తానని హామీ ఇస్తున్నా" అనడం వేరు.. "ఇదిగో హామీ ఇస్తున్నాను.. అమలు కూడా చేస్తున్నాను" అని చెప్పడం వేరు! ఇందులో రెండోమాటను చెప్పి.. ఓటర్ల మనసు కొల్లగొట్టింది ఎన్డీయే సీఎం అభ్యర్థి నితీశ్ కుమార్! ఇదే బిహార్‌లో ఎన్డీయేను అధికారం నిలబెట్టుకునేలా చేసింది. అప్పటికి బిహార్‌లో ఎన్నికల హడావుడి మొదలై.. వేడి రాజుకుంటోంది. షెడ్యూల్ మాత్రం ఇంకా విడుదల కాలేదు.. తమను గెలిపిస్తే.. 'మై బహిన్ సమ్మాన్ యోజన' అనే పథకం కింద అర్హులైన మహిళలకు ప్రతినెలా రూ.2,500 ఇస్తామని మహాగఠ్‌బంధన్ తరఫు సీఎం అభ్యర్థి తేజస్వీ యాదవ్ ప్రకటించారు. నితీశ్ వెంటనే పావులు కదిపారు. మహిళలూ ఈ డబ్బుతో స్వయం ఉపాధి పొందండి అంటూ 'ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన' పథకాన్ని తెరపైకి తెచ్చారు. బిహార్ వ్యాప్తంగా 2.72 కోట్ల మహిళల ఖాతాల్లో రూ.10వేల చొప్పున డబ్బులు వేశారు. ఆ తర్వాత కొన్ని రోజులకే కేంద్రం.. బిహార్ ఎన్నికల షెడ్యూల్‌ను ఖరారు చేసింది. నితీశ్ ఈ ఒక్క ఎత్తుగడే ఎన్నికల వార్‌ను వన్‌సైడ్ చేసేసింది. ఇండీ కూటమి.. 'ఇంటికో ప్రభుత్వ ఉద్యోగం ఇస్తాం' అని ఆర్భాటంగా ప్రకటించింది. అయితే ఈ హామీని ఆర్జేడీ మద్దతుదారులే నమ్మలేదంటూ బాగా ప్రచారం జరిగింది. తేజస్వీ మరో హామీ గుప్పించారు. గృహ వినియోగం కోసం అర్హులైన కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు ఇస్తామని హామీ ఇచ్చారు. నితీశ్ ఇక్కడ వ్యూహాత్మకంగా పావులు కదిపారు. తాను మళ్లీ అధికారంలోకొస్తే 125 యూనిట్ల చొప్పున ఉచితంగా విద్యుత్తు ఇస్తానని చెప్పారు.

కాంగ్రెస్ ఇక ముక్కలే

» కాంగ్రెస్ పరాన్నజీవి పార్టీగా మారింది

» బిహార్ విజయోత్సవ సభలో ప్రధాని మోదీ వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, నవంబరు 14: కాంగ్రెస్ పార్టీ పరాన్నజీవిగా మారిందని, త్వరలో ముక్కలు కాబోతోందని ప్రధాని మోదీ చెప్పారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే ఘన విజయం సాధించడంతో ఢిల్లీ బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన విజయోత్సవ సభలో మోదీ ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ ముస్లింలీగ్-మావోయిస్ట్ కాంగ్రెస్‌లా మారిందన్నారు. కాంగ్రెస్ నకరాత్మక అజెండాతో ఆ పార్టీతో జతకట్టిన పార్టీలన్నింటినీ ముంచుతోందని, జాగ్రత్తగా ఉండాలని ఆయా పార్టీల నేతలకు సూచించారు. కాంగ్రెస్ నేతలే ఆ పార్టీ అధిష్ఠాన విధానాలను వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ త్వరలో మరోసారి ముక్కలు కాబోతుందన్నారు. 2014 నుంచి ఇప్పటివరకు జరిగిన 3లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కనీసం మూడంకెల సీట్లను సాధించలేకపోయిందని మోదీ ఎద్దేవా చేశారు. తుష్టీకరణ రాజకీయలను, అబద్ధాలను తిరస్కరించి బిహార్ ఓటర్లు సుపరిపాలనకు పట్టం కట్టారని చెప్పారు. విపక్షాల ఎంవై(ముస్లిం-యాదవ్) సూత్రం మతపరమైనదని, అయితే ఎన్డీయే ఎంవై ఫార్ములా సామాజిక సంక్షేమం, న్యాయాన్ని సాధించేదన్నారు. తాజా విజయంతో బిహార్ మహిళలు, యువత ఎన్డీయేకు కొత్త ఫార్ములా ఇచ్చారని మో దీ చెప్పారు. బిహార్‌లో ఇక ఎప్పటికీ జంగిల్‌రాజ్ ప్రభుత్వం తిరిగి రాదన్నారు. ఈ విజయం పశ్చిమబెంగాల్‌లో బీజేపీ విజయానికి మార్గం సుగమం చేసిందన్న ప్రధాని.. బెంగాల్‌లో జంగిల్‌రాజ్‌ను తొలగిస్తామన్నారు.

డబుల్ ఇంజన్ సెంచరీ

(మొదటి పేజీ తరువాయి)

సాధించారు! గత ఎన్నికల్లో కేవలం ఒక్క సీటుకే పరిమితమైన ఆయన.. ఈసారి 28 సీట్లలో పోటీ చేసి 19 స్థానాల్లో తన పార్టీని గెలిపించారు. ఇక, సీఎం నితీశ్ కుమార్ నేతృత్వంలోని జేడీయూ కూడా 101 సీట్లలో పోటీ చేసి 85 స్థానాల్లో గెలుపును సొంతం చేసుకుంది. ప్రధాని మోదీ చరిష్మా, సుశాసన్‌బాబుగా నితీశ్‌కుమార్‌కు ఉన్న పేరు, కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్డీయే డబుల్ ఇంజన్ సర్కారుతో అభివృద్ధి అనే నినాదాలు కూటమికి ఘన విజయం కట్టబెట్టాయి. బిహార్లో కాంగ్రెస్, ఆర్జేడీ కూటమి తుడిచిపెట్టుకుపోయింది! గత అసెంబ్లీ ఎన్నికల్లో 110 సీట్లు సాధించిన ఆ కూటమి ఈసారి అందులో మూడోవంతు(35)కే పరిమితమైంది! శకునం చెప్పే బల్లి కుడితిలో పడినట్లు.. మోదీ, జగన్, మమత, స్టాలిన్ తదితరులను గెలిపించానని చెప్పుకొన్న ప్రశాంత్ కిశోర్ వ్యూహాలు సొంత రాష్ట్రం బిహార్లో పని చేయలేదు! జన సురాజ్ పేరిట పార్టీ పెట్టి.. పాదయాత్ర చేసి.. ఎన్నికల బరిలోకి దిగిన ఆయనను బిహారీలు ఏమాత్రం పట్టించుకోలేదు! ఆయన పార్టీ అభ్యర్థులు సోదిలో కూడా లేకపోవడమే ఇందుకు నిదర్శనం! వెరసి, అసెంబ్లీ ఎన్నికల్లో బిహారీలు ఎన్డీయేకు పట్టం కట్టారు. తేజస్వి ఇచ్చిన అలవిమాలిన హామీల కంటే నితీశ్ కుమార్ సుపరిపాలనకే ఓటేశారు. నిజానికి, కాంగ్రెస్, ఆర్జేడీ నేతృత్వంలోని మహా గఠ్ బంధన్ కూటమి ప్రధానంగా 'ముస్లిం-యాదవ్' ఓటు బ్యాంకును నమ్ముకుంది. వారి మద్దతుతో ఎన్నికలను గట్టెక్కవచ్చని భావించింది. కానీ, ముస్లిం, బీసీల ఓట్లు చీలిపోవడం ఆ పార్టీకి అశనిపాతమైంది. అదే సమయంలో, ఎన్డీయే మాత్రం మహిళలు, అత్యంత వెనకబడిన వర్గాలను ఆకర్షించింది. మహిళలకు ప్రత్యేకంగా పథకాలను అమలు చేయడమే కాదు.. ఎన్నికలకు కొద్ది రోజుల ముందు 'ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన' పేరిట దాదాపు 1.4 కోట్ల మందికి రూ.10 వేల చొప్పున పంపిణీ చేసింది. అంతేనా.. ఐదేళ్లుగా మద్యపాన నిషేధాన్ని సమర్థంగా అమలు చేస్తున్నారు. దాంతో, పోలింగ్ రోజు ఓటు వేయడానికి మహిళలు పోటెత్తారు. పురుషుల కంటే దాదాపు పది శాతం అదనంగా ఓటేశారు. ఎన్డీయే కూటమి విజయంలో ఇది కీలకంగా చెప్పవచ్చు. అలాగే, అత్యంత వెనుకబడిన వర్గాలు (ఈబీసీ), ఇతర వెనకబడిన వర్గాలు (ఓబీసీ) కూడా నితీశ్‌కే జైకొట్టారు. ఒకప్పుడు జంగిల్ రాజ్‌గా పిలిచే బిహార్‌కు రోడ్లు, పరిశ్రమలు తదితర మౌలిక సదుపాయాలు తీసుకొచ్చారు. ఇక, అగ్ర వర్ణాలను బీజేపీ ఆకర్షిస్తే.. దళితులను చిరాగ్ పాసవాన్ నేతృత్వంలోని ఎల్జేపీ ఆకర్షించింది. ఇలా కూటమిలోని వివిధ పార్టీలు దళితులు, అగ్ర వర్ణాలు, బీసీలు, మహిళలు తదితరులను ఆకర్షించడం ద్వారా ఎన్డీయే విజయ బావుటా ఎగరేసింది. ఎన్డీయే ఇప్పటికే హరియాణా, మహారాష్ట్ర, ఢిల్లీల్లో ఘన విజయాలు నమోదు చేసింది. ఇప్పుడు బిహార్లో గెలిచి బెంగాల్ దిశగా పయనిస్తోంది. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే విజయం సాధించడం వెనక చిరాగ్ పాసవాన్ కూడా కీలక పాత్ర పోషించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం ఒకే ఒక స్థానంలో గెలిచిన ఆయన పార్టీ ఈసారి ఏకంగా 28 స్థానాల్లో పోటీ చేసి 19 సీట్లలో విజయం సాధించింది. దళితులను ఎన్డీయే వైపు ఆకర్షించడంలో క్రియాశీల పాత్ర పోషించింది. ఎన్డీయే కూటమిలోని హెచ్‌ఏఎంఎస్ 5, ఆర్‌ఎల్‌ఎం 4 సాధించాయి. ఇక, కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల ఎజెండాగా ప్రజలకు సంబంధించిన అంశాన్ని ఎత్తుకోవడంలో ఘోరంగా విఫలమైంది. ఓటు చోరీ పేరిట హడావుడి చేసింది. ఓట్ అధికార యాత్ర పేరిట రాహుల్ గాంధీ విస్తృతంగా ప్రచారమూ చేశారు. రిజర్వేషన్లకు 50% పరిమితిని ఎత్తేస్తామని హామీ ఇచ్చారు. కానీ, ఆ పార్టీని ప్రజలు అస్సలు పట్టించుకోలేదు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సింగిల్ డిజిట్ (6)కే పరిమితం కావడం గమనార్హం. 'సర్' ప్రభావిత నియోజకవర్గాల్లోనూ ఎన్డీయేనే విజయం సాధించడం ఇక్కడ విశేషం. ఇక, తేజస్వి అధికారంలోకి వస్తే మళ్లీ జంగిల్ రాజ్ వస్తుందని ప్రజలు భయపడ్డారు. ఆ భయం ఓట్ల రూపంలో సుస్పష్టంగా కనిపించింది. 34 సీట్లకే పరిమితమైన మహా గఠ్ బంధన్ కూటమిలో జేడీయూ 25, కాంగ్రెస్ 6, సీపీఐ ఎంఎల్ 2, సీపీఐ 1 స్థానంలో మాత్రమే గెలిచాయి. ఇక ఏ కూటమిలోనూ లేని ఎంఐఎం 5 సీట్లు, బీఎస్పీ, ఐఐపీ ఒక్కో సీటు సాధించాయి. ఇక, బిహార్ ఎన్నికల్లో గేమ్ చేంజర్‌గా చెప్పుకొన్న ప్రశాంత్ కిశోర్ పార్టీ జన సురాజ్ మొత్తం 243 స్థానాల్లోనూ బరిలోకి దిగింది. కనీసం ఒక్కటంటే ఒక్క సీటు కూడా గెలుచుకోలేకపోయింది. గెలవడం మాట అటుంచితే.. ఎన్నికల్లో ఆ పార్టీ అసలు ప్రభావమే చూపించలేకపోయింది. 'మాకు వస్తే పది లోపు సీట్లు వస్తాయి. లేకపోతే 150 పైన వస్తాయి' అని ప్రశాంత్ కిశోర్ ఎన్నికల ముందు చెప్పారు. కానీ, అరంగేట్రంతోనే ప్రజలు డకౌట్ చేసి పంపించారు. ఇక, గత అసెంబ్లీ ఎన్నికల్లో ఐదు సీట్లను గెలిచిన మజ్లిస్.. ఈ ఎన్నికల్లోనూ వాటిని నిలబెట్టుకుంది. ఏ కూటమిలోనూ చేరకుండా విడిగా 29 సీట్లలో పోటీ చేసిన ఎంఐఎం.. ముస్లింల ప్రాబల్యం ఎక్కువగా ఉన్న సీమాంచల్‌లో ప్రభావం చూపింది.



విజయోత్సవ సభలో మోదీని సన్మానిస్తున్న రాజ్‌నాథ్, అమిత్ షా, జేపీ నడ్డా

ఓటర్లకు కృతజ్ఞతలు

బిహార్ సీఎం నితీశ్ కుమార్

బిహార్ ఓటర్లకు, ప్రధాని మోదీకి, ఎన్డీయే నాయకులకు సీఎం నితీశ్ కృతజ్ఞతలు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి భారీ విజయం అనంతరం 'ఎక్స్' వేదికగా ఆయన స్పందించారు. 'అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు మాకు అఖండ మెజార్టీని అందించి మా ప్రభుత్వంపై విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఓటర్లందరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు. ప్రధాని మోదీ మద్దతుకు ధన్యవాదాలు. ఎన్నికల్లో ఎన్డీయే కూటమి పూర్తి స్థాయిలో ఐక్యతను ప్రదర్శించి భారీ విజయాన్ని అందుకుంది. ఎన్డీయే కూటమిలోని భాగస్వాములైన చిరాగ్ పాసవాన్, జితన్‌రామ్ మాంఝీ, ఉపేంద్ర కుష్వాహాలకు కృతజ్ఞతలు. మీ అందరి సహకారంతో బిహార్ మరింత అభివృద్ధి చెందబోతోంది' అని నితీశ్ కుమార్ పేర్కొన్నారు.

బిహార్ ఫలితాలు నిజంగా ఆశ్చర్యకరం

న్యూఢిల్లీ, నవంబరు 14: బిహార్ ఎన్నికల ఫలితాలు నిజంగా ఆశ్చర్యం కలిగించాయని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ఈ ఎన్నికల ప్రక్రియలో మొదటి నుంచీ అక్రమాలు జరిగాయని, ఇలాంటి పరిస్థితుల్లో విజయం సాధించలేకపోయామని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు హిందీ భాషలో ఎక్స్‌లో పోస్టు పెట్టారు. "మహాగఠ్‌బంధన్‌పై విశ్వాసం ఉంచిన లక్షలాది మంది ఓటర్లకు కృతజ్ఞతలు. బిహార్ ఎన్నికల ఫలితాలు నిజంగా ఆశ్చర్యం కలిగిస్తున్నాయి. మొదటి నుంచీ అన్యాయంగా జరుగుతున్న ఈ ఎన్నికల్లో విజయం సాధించలేకపోయాం. రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాటాన్ని కొనసాగిస్తాం. ఫలితాలపై కాంగ్రెస్, ఇండియా కూటమి లోతైన విశ్లేషణ జరుపుతుంది" అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

ఎన్డీఏ సుపరిపాలనకు ఆమోదం

» కేంద్ర హోంమంత్రి అమిత్ షా

పట్నా/న్యూఢిల్లీ, నవంబరు 14: ఎన్డీఏ ప్రభుత్వ అభివృద్ధి మోడల్, సుపరిపాలనకు బిహార్ ప్రజలు ఆమోదముద్ర వేశారని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అన్నారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ఘన విజయం సాధించటంపై ఆయన హర్షం వ్యక్తంచేస్తూ శుక్రవారం ఎక్స్‌లో వరుస ట్వీట్లు చేశారు. 'బిహారీలు వేసిన ప్రతి ఓటు దేశభద్రతకు ముప్పుగా మారిన చొరబాటుదారులకు వ్యతిరేకంగా ప్రధాని మోదీ అనుసరిస్తున్న విధానాలపై విశ్వాసాన్ని ప్రతిబింబిస్తోంది. చొరబాటుదారులకు మద్దతిస్తున్న వారిని బిహారీలు తిరస్కరించారు. ఈ అద్భుత మెజారిటీ ఎన్డీఏ సుపరిపాలనకు బిహారీల ఆమోదముద్ర. ఓటుబ్యాంకు రాజకీయాల కోసం చొరబాటుదారులకు కొమ్ముకాస్తున్న వారికి బిహారీలు తగిన బుద్ధి చెప్పారు' అని విమర్శించారు.

ఎస్ఐఆర్ కుట్ర బయటపడింది

» ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్

న్యూఢిల్లీ, నవంబరు 14: బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఎస్ఐఆర్ కుట్రను బయటపెట్టాయని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ అన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ ఆట చెల్లదని శుక్రవారం ట్వీట్ చేశారు. 'ఇకపై వారి(బీజేపీ) ఆటలు సాగనివ్వం. సీసీటీవీల మాదిరిగా మా పీడీఏ(వెనుకబడిన, దళిత, మైనార్టీ వర్గాలు) కాపలాదారులు అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ, బీజేపీ కుట్రలను తిప్పికొడతారు. పశ్చిమబెంగాల్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్ వంటి ఏ రాష్ట్రంలోనూ ఇలాంటి ఎన్నికల కుట్రలను సాగనివ్వం' అని పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాలు క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించటం లేదని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య అన్నారు. బిహార్ ఎన్నికలు ఎన్డీఏ, మహాఘట్‌బంధన్ మధ్య జరగలేదని.. ఇది దేశ ప్రజలు, సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ మధ్య ప్రత్యక్ష పోరాటం' అని కాంగ్రెస్ నేత పవన్ ఖేరా అన్నారు.

ఎగ్జిట్‌పోల్స్ అంచనాలను మించిన ఎన్డీయే

న్యూఢిల్లీ, నవంబరు 14: బిహార్ ఎన్నికల్లో 202 స్థానాలు గెలుపొందిన ఎన్డీయే కూటమి ఎగ్జిట్‌పోల్స్ అంచనాలను మించిన విజయం సాధించింది. బిహార్ అసెంబ్లీలో 243 స్థానాలు ఉండగా.. రెండో విడత పోలింగ్ ముగిసిన తర్వాత ఎగ్జిట్‌పోల్ సంస్థలు తమ అంచనాలను వెలువరించాయి. ఎన్డీయే కూటమి కనిష్ఠంగా 120 సీట్లు, అత్యధికంగా 172 స్థానాల్లో విజయం సాధిస్తుందని మెజార్టీ సంస్థలు అంచనా వేశాయి. కానీ ఎన్డీయే కూటమి ఆ అంచనాలను మించి తిరుగులేని విజయాన్ని దక్కించుకుంది. ముఖ్యంగా పోల్ డైరీ అనే సంస్థ వెలువరించిన అంచనాకు చాలా దగ్గరగా ఎన్నికల ఫలితం వెలువడింది. ఎన్డీయేకు అత్యధికంగా 209 సీట్లు వచ్చే అవకాశముందని పోల్ డైరీ అంచనా వేయగా కూటమి ఆ మార్కుకు చాలా దగ్గరగా వచ్చింది. అదే సమయంలో మహాగఠ్‌బంధన్(ఎంజీబీ) 32-49 స్థానాల్లో గెలుస్తుందని పోల్ డైరీ అంచనా వేయగా.. శుక్రవారం నాటి ఫలితాల్లో మహాగఠ్ బంధన్ 35 స్థానాలకు పరిమితమైంది. కాగా, ఎన్నికల ఫలితంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా అంచనాను కూడా ఎన్డీయే కూటమి దాటేసింది. అమిత్ షా బిహార్‌లో ఎన్డీయే కూటమి 160కి పైగా స్థానాల్లో గెలుస్తుందని చెప్పారు.

ఎగ్జిట్ పోల్స్

సంస్థ	ఎన్డీయే	ఎంజీబీ
చాణక్య స్ట్రాటజీస్	130-138	100-108
దైనిక్ భాస్కర్	145-160	73-91
మాట్రిజ్	147-167	70-90
పీ-మార్క్	142-162	80-98
పీపుల్స్ పల్స్	133-159	75-101
పీపుల్స్ ఇన్‌సైట్	133-148	87-102
పోల్ డైరీ	184-209	32-49
అసలు ఫలితం	202	35

5 ఎన్డీయే విజయానికి మెట్లు



పట్నాలో బీజేపీ శ్రేణుల సంబరాలు

సంక్షేమ పథకాలతో.. భారీగా పడ్డ మహిళల ఓట్లు

న్యూఢిల్లీ, నవంబరు 14: సాధారణంగా ఐదేళ్లపాటు పరిపాలించిన ప్రభుత్వంపై ప్రజల్లో ఎంతో కొంత వ్యతిరేకత ఉంటుంది! అలాంటిది 2014-15 నడుమ కొంతకాలం తప్ప 2005 నుంచి దాదాపు రెండు దశాబ్దాలపాటు (కూటములు మారుతూ) నితీశే అధికారంలో ఉన్నా.. ఆయన ప్రభుత్వంపై వ్యతిరేకత ఎందుకు రాలేదు? అంటే.. అందుకు ఐదు ప్రధాన కారణాలు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు! అవేంటంటే..

సాఫీగా సీట్ల సర్దుబాటు: ఎన్నికలకు చాలా కాలం ముందే ఎన్డీయే కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు సాఫీగా జరిగిపోయింది.

మహిళలు-ఈబీసీల ఓట్లు: ఈ ఎన్నికల్లో ఎన్డీయే కూటమికి మహిళలు, అత్యంత వెనుకబడిన వర్గాల ఓట్లు పెద్ద ఎత్తున పడ్డాయి. రాష్ట్రవ్యాప్తంగా చూస్తే ఈ ఎన్నికల్లో పురుషులతో (62.8%) పోలిస్తే ఓటేసిన మహిళల శాతం (71.6%) దాదాపు 9 శాతం ఎక్కువ. ఏడు జిల్లాల్లో ఆ తేడా దాదాపు 14% ఉంచి 20% దాకా కూడా ఉండడం గమనార్హం. వీటిలో ఎక్కువ శాతం ఎన్డీయే కూటమి అభ్యర్థులకే పడ్డాయి. ముఖ్యంగా.. ఎన్నికలకు ముందు ఆగస్టు 29న నితీశ్ సర్కారు ప్రకటించిన 'ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన'ను గేమ్ చేంజర్‌గా చెప్పొచ్చు. ఆ పథకం కింద.. ప్రతి కుటుంబంలో ఒక మహిళకు వ్యాపారం చేసుకోవడానికి సీడ్‌మనీ కింద రూ.10 వేలు చొప్పున పంపిణీ చేశారు. 1.4 కోట్ల మంది బిహారీ మహిళలకు ఈ సొమ్ము సరిగ్గా ఎన్నికలకు ముందు అందింది. అలాగే.. బాలికలకు ఉచిత విద్య, సైకిళ్లు, యూనిఫారాల వంటి పథకాలు, వితంతు పింఛన్ల పెంపు వంటి పథకాలతో మహిళల ఓట్లు పెద్ద ఎత్తున ఎన్డీయేకి పడ్డాయి.

ఎంవై వర్సెస్ ఎంఈ: ముస్లింలు, యాదవుల(ఎంవై) ఓట్లపై కాంగ్రెస్, ఆర్జేడీ కూటమి గట్టిగా నమ్మకం పెట్టుకుంటే.. వారికి దీటుగా ఎన్డీయే కూటమి ఎంఈ(మహిళలు-ఈబీసీలు) మంత్రాన్ని పఠించింది. బీజేపీ ఒకవైపు సంప్రదాయ అగ్రకులాలవారి ఓట్లపై దృష్టి సారించగా.. జేడీయూ కుర్మీలు, ఈబీసీల ఓట్లపై దృష్టి సారించింది (బిహార్‌లో ఈ రెండు వర్గాల ఓట్లే 36% దాకా ఉంటాయి). మరోవైపు.. కూటమిలోని లోక్‌జనశక్తి, రాష్ట్రీయ లోక్ మోర్చా, హిందుస్థానీ అవామ్ మోర్చా పార్టీలు దళితులు, వెనుకబడిన వర్గాల ఓట్లను రాబట్టడంలో కీలకపాత్ర పోషించాయి. సీమాంచల్ ప్రాంతంలో ముస్లింల ఓట్లు అత్యధికంగా మజ్లిస్ పార్టీకే పడ్డాయి. ముస్లిం ఓట్లలో చీలిక.. మహాగఠ్‌బంధన్‌కు బలమైన పట్టున్న ప్రాంతాల్లో కూడా ఓటమికి కారణమైంది. ఆర్జేడీకి కోర్ ఓట్ బ్యాంకు అయిన యాదవుల ఓట్లు సైతం ఈసారి చీలి.. కొందరు ఎన్డీయేవైపు మొగ్గుచూపినట్టు సమాచారం.

తొలగని జంగిల్‌రాజ్ భయం: బిహార్ ఓటర్లలో చాలామందికి.. ఒకప్పటి జంగిల్ రాజ్ భయం ఇంకా తొలగిపోలేదు. బిహారీలనగానే ఇతరప్రాంతాల్లో ఒకప్పుడు చిన్నచూపు చూసే పరిస్థితి ఉండేదని.. నితీశ్ పాలనతో ఆ మరక పోయి, బిహార్‌ను గౌరవంగా చూస్తున్నారనే భావన చాలా మంది బిహారీల్లో ఉంది. అందుకే.. అధికారం కోసం ఎవరితోనైనా అంటకాగే 'పల్టూరామ్' అనే అపప్రథ బిహార్ సీఎం నితీశ్ కుమార్‌పై ఉన్నప్పటికీ ఓటర్లు దాన్ని పట్టించుకోలేదు.

మోదీ మ్యాజిక్

ఎప్పటిలాగానే ఈసారి కూడా బిహార్‌లో మోదీ మ్యాజిక్ కొనసాగింది. ఆయన సభలు, సంక్షేమ పథకాలు.. తటస్థంగా ఉన్న ఓటర్లను ఎన్డీయే వైపు సంఘటితం చేయడంలో కీలక పాత్ర పోషించాయి. బిహార్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన 13 బహిరంగ సభల్లో పాల్గొన్నారు. పట్నాలో భారీ రోడ్‌షో నిర్వహించారు. చొరబాటుదారులకు ఆర్జేడీ-కాంగ్రెస్ మద్దతు ఉందని.. ఆ పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు ప్రజాధనాన్ని దోచుకుతిన్నాయని, ఆటవిక పాలన కొనసాగించాయని పదేపదే గుర్తుచేశారు. రాష్ట్రంలోని పెద్దలందరూ ఆర్జేడీ పాలనలో సాగిన అరాచకాల గురించి ఈ తరం యువతకు తెలపాలని పిలుపునిచ్చారు. దీనిపై విస్తృతంగా జరిగిన చర్చ ఓటర్లపై బాగా ప్రభావం చూపింది.

ఫలించిన ఎన్డీయే వ్యూహం!

హిందూ ఓట్లు సంఘటితం

న్యూఢిల్లీ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బిహార్‌లో హిందూ ఓట్లను సంఘటితం చేయడంతో పాటు ముస్లిం ఓట్లను చీల్చడానికి ఎన్డీయే చేసిన ప్రయత్నాలు ఫలించాయి. అధికార కూటమి వ్యూహాత్మకంగా వ్యవహరించడంతో భారీ విజయం సొంతం చేసుకుంది. మహాగఠ్‌బంధన్ (ఎంజీబీ) ఘోరంగా దెబ్బతిందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఎస్ఐఆర్ పేరుతో ఓట్లను చోరీ చేస్తున్నారని రాహుల్ గాంధీ చేసిన విస్తృత ప్రచారంకంటే.. బిహార్‌లోకి ముస్లింలు అక్రమంగా చొరబడ్డారనే అభిప్రాయమే ప్రజల్లోకి ఎక్కువగా వెళ్లిందని పేర్కొంటున్నారు. దేశవ్యాప్తంగా ఉగ్ర దాడులకు చేసిన కుట్రను పోలీసులు ఛేదించడం, భారీగా పేలుడు సామగ్రిని స్వాధీనం చేసుకోవడం.. రెండో విడత పోలింగ్‌కు ఒక రోజు ముందు ఢిల్లీలో కారు బాంబు పేలుడు జరగడం కూడా బిహార్ హిందూ ఓటర్లపై బాగా ప్రభావం చూపిందని అభిప్రాయపడుతున్నారు. బిహార్‌లో మహిళలు, ప్రధానంగా వారిలోనూ హిందువులు పెద్దఎత్తున ఎన్డీయేకు మద్దతిచ్చారు. అలాగే మిత్రపక్షాల మధ్య ఓట్ల బదిలీ కోసం క్షేత్రస్థాయిలో నేతలు కలిసికట్టుగా కృషి చేశారు. ప్రధాని మోదీ బిహార్‌లో అనేక సార్లు పర్యటించి, ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొన్నారు. అమిత్ షా రాష్ట్రంలో 19 రోజులు ఉండి.. ఎన్డీయేకు చెందిన 100 మంది తిరుగుబాటు అభ్యర్థులను పూర్తిగా శాంతింపజేయడంతో ఓట్లు ఏమాత్రం చీలిపోలేదు. జేడీయూ, లోక్ జనశక్తి (పాశ్వాన్) పోటీ చేసిన నియోజకవర్గాల్లో ముస్లింలు ఆ పార్టీ అభ్యర్థులకు ఓటేసేలా చూసుకున్నారు. దీంతో ముస్లింల ఆధిపత్యం ఉన్న 16 సీట్లు వారికి దక్కాయి. 2020లో ఆర్జేడీ గెలిచిన ఏడు ముస్లిం ఆధిపత్య సీట్లను ఈ సారి కోల్పోగా, కాంగ్రెస్ కూడా నాలుగు సీట్లు కోల్పోయింది. బిహార్‌లో 17.7 శాతం ఉన్న ముస్లింలలో 80 శాతం ఎంజీబీకే ఓటు వేయాల్సి ఉండగా జనసురాజ్ పార్టీ(జేఎస్పీ), మజ్లిస్‌లు ముస్లింల ఓట్లను చీల్చడంలో కీలక పాత్ర పోషించాయి. సీమాంచల్‌లో ముస్లింలు అత్యధికంగా మజ్లిస్‌కు ఓటు వేశారు. జేఎస్పీ, మజ్లిస్ ప్రధానంగా ఎన్డీయే ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చాయి. బీజేపీ అగ్రవర్ణాల హిందూ ఓట్లను సంఘటితం చేసుకోగా జేడీయూకు మహిళలతో పాటు అతి వెనకబడిన వర్గాలు, యాదవేతర ఓబీసీలు, దళితులు ఓట్లు వేశారు. లోక్ జనశక్తి (పాశ్వాన్) కూడా పాసీ, ఇతర దళితులను తమ వైపు తిప్పుకోగా.. రాష్ట్రీయ లోక్ మోర్చా, హిందూస్థాన్ అవామీ మోర్చా వంటి చిన్న పార్టీలు దళితులు, కొయిరీ వర్గాల మద్దతును కూడగట్టుకున్నాయి.

అన్ని కలిసినా ఎన్డీయేనే టాప్!

న్యూఢిల్లీ, నంబరు 14: బిహార్‌లో రెండు కూటములకు దూరంగా ఉండి స్వతంత్రంగా పోటీచేసిన కొన్ని పార్టీలు మహా గఠ్‌బంధన్‌లో చేరి ఉంటే 'ఎన్డీయే'పై ఆ కూటమి ఆధిపత్యం సాధించేదా? అంటే.. సాధ్యం కాకపోయేది. ఈ విషయం పార్టీలవారీగా పోలైన ఓటింగ్ శాతాన్ని పరిశీలిస్తే స్పష్టమవుతోంది. ఎన్డీయేలోని అన్ని పార్టీలకు కలిపి 45.06% ఓట్లు వచ్చాయి. మహా గఠ్‌బంధన్‌లోని పార్టీలకు కలిపి 34.84% ఓట్లు వచ్చాయి. అయితే తటస్థంగా ఉన్న జేఎస్పీ (3.44%), మజ్లిస్(1.85%), బీఎస్పీ (1.61%), ఎన్సీపీ (0.03%), ఆప్ (0.30%) పార్టీలు చేతులు కలిపినా అదనంగా 7.23శాతంతో మహా కూటమి ఓట్ల శాతం 42.07శాతానికి పెరిగేది. అయినా.. అప్పటికి కూడా ఎన్డీయే 45.06శాతంతో స్పష్టమైన ఆధిపత్యం కనబర్చేది!!

రాహుల్ నాయకత్వానికి తీవ్ర అగ్ని పరీక్ష

న్యూఢిల్లీ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాహుల్ గాంధీ సారథ్యంలో కాంగ్రెస్ మరోసారి బిహార్‌లో ఘోరపరాజయం కావడంతో ఆయన నాయకత్వానికి తీవ్ర అగ్నిపరీక్ష ఎదురుకానుంది. పార్టీయే కాక ఇండియా కూటమి కూడా రాహుల్ నాయకత్వంలో విజయాలు సాధించలేదనే చర్చ జరుగుతోంది. నిజానికి కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే అయినప్పటికీ పార్టీలో అనేక కీలక నిర్ణయాలు రాహుల్ మాత్రమే తీసుకోవడం, ఆయన టీమ్ సభ్యులే అన్ని విషయాల్లో చక్రం తిప్పుతుండటం మూలంగా బిహార్‌లో ఓటమికి రాహుల్ నైతిక బాధ్యత వహించక తప్పదన్న చర్చ జరుగుతోంది. బిహార్‌లో సీట్ల పంపిణీ, పొత్తు నుంచి ప్రచార సరళి వరకు రాహుల్ నిర్ణయించారని, అన్ని నిర్ణయాలు ఆయన నియమించిన ఇన్‌చార్జి కృష్ణ అల్లవారు, పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తీసుకున్నారని పార్టీ నేతలు భావిస్తున్నారు. సీట్ల పొత్తు విషయంలో చివరి వరకు కృష్ణ అల్లవారు నాన్చడం, దానికి వేణుగోపాల్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో అనేక మంది మాజీ ఎమ్మెల్యేలకు, సీనియర్లకు టికెట్లు దక్కలేదు. మరోవైపు 9 నియోజకవర్గాల్లో మిత్రపక్షాలతోనే పోటీ పడాల్సి రావడం, తేజస్వీ యాదవ్‌ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించేందుకు చివరి నిమిషం వరకు వెనుకాడటం మూలంగా మహాగఠ్‌బంధన్ విఫల ప్రయోగంగా మిగిలిపోయింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ 'ఇండియా కూటమి' నాయకత్వాన్ని కూడా కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. వయోభారంతో సతమతమవుతున్న ఖర్గేతో రాజీనామా చేయించి మరొకరికి నాయకత్వ బాధ్యతలు అప్పగించాలని చాలా రోజులుగా పార్టీలో చర్చ జరుగుతోంది. బహుశా ప్రియాంకాగాంధీ వాద్రాకు ఆ బాధ్యతలు అప్ప జెప్పి పార్టీని బలోపేతం చేసే బాధ్యతలు అప్పగించే అవకాశాలు లేకపోలేదని పార్టీ వర్గాల్లో చర్చసాగుతోంది. కాగా శుక్రవారం ఓట్ల లెక్కింపులో ఎన్డీఏ అప్రతిహత విజయం సాధిస్తోందని తెలియడంతో రాహుల్ గాంధీ తీవ్ర షాక్‌కు గురైనట్లు తెలిసింది. ఆయన ఏ వ్యాఖ్యలు చేయకుండా మౌనం పాటించారు.

ఉప పోరులో రెండుచోట్ల కాంగ్రెస్ గెలుపు

న్యూఢిల్లీ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయాన్ని మూటగట్టుకున్న కాంగ్రెస్ ఉప ఎన్నికల్లో మాత్రం కొంత హవా కనబరిచింది. బిహార్‌తోపాటు దేశవ్యాప్తంగా 8 అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో.. హస్తం పార్టీ రెండుచోట్ల విజయం సాధించింది. అయితే, ఆ రెండు స్థానాలు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలవి కావడం గమనార్హం. జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి, రాజస్థాన్‌లోని అంటాలో బీజేపీ అభ్యర్థిపై కాంగ్రెస్ విజయబావుటా ఎగురవేసింది. జమ్మూకశ్మీర్‌లో అధికార పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం ఒమర్ అబ్దుల్లా రెండు స్థానాల నుంచి విజయం సాధించారు. తన కుటుంబానికి కంచుకోటైన గందర్‌బాల్‌లో కొనసాగుతూ, బుద్గాం అసెంబ్లీకి ఆయన రాజీనామా చేశారు. ఉప ఎన్నికలో నేషనల్ కాన్ఫరెన్స్ అభ్యర్థిపై పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి ఆగా సయ్యద్ ముంతజీర్ మెహదీ విజయం సాధించారు. అలాగే, జమ్మూకశ్మీర్‌లోనే నగ్రోటా అసెంబ్లీలో బీజేపీ అభ్యర్థి దేవయాని రాణా విజయం సాధించారు. ఒడిసాలోని నౌపడ అసెంబ్లీ స్థానంలో బిజు జనతాదళ్ (బీజేడీ) సీనియర్ నేత, మాజీ మంత్రి రాజేంద్ర ధోలాకియా మరణంతో జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిపై అధికార బీజేపీ అభ్యర్థి జై ధోలాకియా గెలుపొందారు. పంజాబ్‌లోని తరణ్ తరణ్ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో శిరోమణి అకాలీదళ్ అభ్యర్థి సుఖ్వీందర్ కౌర్‌పై ఆప్ అభ్యర్థి హర్మీత్ సింగ్ సంధు గెలుపొందారు. జార్ఖండ్ విద్యాశాఖ మంత్రి, జేఎంఎం సీనియర్ నేత రాందాస్ సోరెన్ మృతితో ఘాట్సిలా ఉప ఎన్నిక అనివార్యమైంది. అధికార జేఎంఎం తన స్థానాన్ని నిలబెట్టుకుంది. మిజోరంలోని డంపా అసెంబ్లీ స్థానంలో మిజో నేషనల్ ఫ్రంట్ ఎమ్మెల్యే లాల్రింట్లుంగా సైలా మరణంతో జరిగిన ఉప ఎన్నికలో అదే పార్టీ నేత గెలుపొందారు.

19న పీఎం కిసాన్ నిధుల విడుదల

న్యూఢిల్లీ, నవంబరు 14: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ పథకం కింద 21వ విడత నిధులను ఈ నెల 19న ప్రధాని నరేంద్ర మోదీ విడుదల చేయనున్నారు. అర్హులైన రైతుల ఖాతాల్లో ఏటా రూ.6,000 వంతున జమ చేయడం ఈ పథకం ఉద్దేశం. 2019 ఫిబ్రవరి 24న ప్రారంభమైన ఈ పథకం కింద ఇంతవరకు రూ.3.70 లక్షల కోట్లను కేంద్రం చెల్లించింది.

వృక్షమాత తిమ్మక్క కన్నుమూత


సాలుమరద తిమ్మక్క (ఫైల్)

బెంగళూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): వృక్షమాతగా పేరొందిన సాలుమరద తిమ్మక్క(114) వయోసహజ ఆరోగ్య సమస్యలతో బెంగళూరులో శుక్రవారం కన్నుమూశారు. బెంగళూరు దక్షిణ (రామనగర) జిల్లా మాగడి తాలూకా హులికల్ గ్రామ వాసి తిమ్మక్క బెంగళూరులో పెంపుడు కుమారుడు ఉమేశ్ బల్లూరతో కలసి ఉంటున్నారు. తీవ్రశ్వాస సమస్య తలెత్తడంతో 2 రోజుల క్రితం ఆమెను ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స ఫలించక ఆమె తుదిశ్వాస విడిచారు. తిమ్మక్క, చిక్కయ్య దంపతులకు పిల్లలు లేరు. సంతానం లేదనే బాధనుంచి బయటపడేందుకు ఆమె హులికల్ గ్రామ రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటి, కన్న బిడ్డల తరహాలో పెంచారు. తిమ్మక్క మృతిపట్ల ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. అటవీ శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రె ఆస్పత్రికి వెళ్లి నివాళులు అర్పించారు. కేంద్రమంత్రి కుమారస్వామి ఎక్స్‌లో సంతాపం తెలిపారు. పచ్చదనమే జీవనమని జీవితకాలం సేవలందించిన తిమ్మక్క మృతి బాధాకరమని మాజీ ప్రధాని దేవెగౌడ పేర్కొన్నారు. హోం మంత్రి పరమేశ్వర్ సహా పలువురు మంత్రులు, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

ఢిల్లీ పేలుడు నిందితుడి ఇల్లు పేల్చివేత

న్యూఢిల్లీ, నవంబరు 14: ఢిల్లీ బాంబు పేలుడు ఘటనపై భద్రతా దళాలు దర్యాప్తు ముమ్మరం చేశాయి. నిందితుడు డాక్టర్ ఉమర్ నబీ ఇంటిని శుక్రవారం తెల్లవారు జామున పేల్చివేశాయి. జమ్మూకశ్మీర్‌లోని పుల్వామా జిల్లా కోలీ గ్రామంలోని నివాసాన్ని కూల్చేసినట్లు అధికారులు తెలిపారు. సోమవారం ఎర్రకోట వద్ద జరిగిన కారు పేలుడులో 13 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. అయితే ఈ పేలుడుకు కారణమైన హ్యుందాయ్ ఐ20 కారును ఉమర్ నబీనే నడిపినట్లు పోలీసులు గుర్తించారు. కారులో సేకరించిన డీఎన్ఏ నమూనాలు.. నబీ తల్లి డీఎన్ఏతో సరిపోలినట్లు వెల్లడించారు. ఈ కేసులో కొత్తగా అరెస్టయిన ఐదుగురిలో ఫరీదాబాద్‌లోని అల్ ఫలాహ్ యూనివర్సిటీకి చెందిన ఇద్దరు వైద్యులు, ఇద్దరు సిబ్బంది ఉన్నారు. వీరిలో యూపీలో పనిచేస్తున్న జమ్మూ కశ్మీర్‌కు చెందిన కార్డియాలజిస్టు మహమ్మద్ ఆరిఫ్ మిర్ (32), గైనకాలజిస్టు ఫారుక్ ఉన్నారు. ఇటు మరో ఇద్దరు అనుమానితులతో కలిసి తుర్కియేను సందర్శించిన వైద్యుడి కోసం దర్యాప్తు అధికారులు గాలింపు మొదలుపెట్టారు. ఇప్పటివరకు అరెస్టయిన వారిని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) విచారణ కోసం ఢిల్లీకి తరలించారు. కాగా, ఢిల్లీ పేలుళ్ల వెనకున్న జైషే మహమ్మద్ ఉగ్ర సంస్థతో సంబంధమున్న నలుగురు వైద్యులైన ముజఫర్ అహ్మద్, అదిల్ అహ్మద్ రాథర్, ముజామిల్ షకీల్, షాహీన్ షాహిద్‌ల రిజిస్ట్రేషన్లను రద్దు చేస్తున్నట్లు జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) ప్రకటించింది.

శ్రీనగర్ నౌగామ్ పోలీస్ స్టేషన్ వద్ద భారీ పేలుడు

- ఒకరు మృతి, 8మందికి గాయాలు
- అమ్మోనియం నైట్రేట్‌ను పరిశీలిస్తుండగా పేలుడు

శ్రీనగర్, నవంబరు 14: జమ్మూకశ్మీర్ రాజధాని శ్రీనగర్‌లోని నౌగామ్ పోలీస్ స్టేషన్ ఆవరణలో శుక్రవారం రాత్రి పదకొండు గంటల 20 నిమిషాల సమయంలో భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఒకరు మృతిచెందారు. 8 మంది గాయపడ్డారు. పేలుడు ధాటికి పలు వాహనాలకు మంటలు అంటుకున్నాయి. పోలీసులు సీసీటీవీ ఫుటేజీని పరిశీలించారు. ఢిల్లీ ఉగ్రదాడిపై దేశవ్యాప్తంగా జరుగుతున్న దర్యాప్తులో నౌగామ్ పోలీసులు కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఉగ్రవాద నెట్‌వర్క్ నుంచి ఫరీదాబాద్‌లో ఇటీవల స్వాధీనం చేసుకున్న అమ్మోనియం నైట్రేట్ నిల్వల శాంపిల్స్‌ను పరిశీలిస్తుండగా పేలుడు జరిగినట్లు తెలుస్తోంది.

సారీ.. సర్!



ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై రాహుల్ గాంధీ పోరాటం ప్రభావం శూన్యం!

పట్నా, నవంబరు 14: బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్జేడీ, కాంగ్రెస్ మహాగఠ్‌బంధన్ కూటమి మహా గట్టి ఓటమిని మూటగట్టుకుంది. ఎగ్జిట్ పోల్స్ సర్వేలు కూడా అంచనా వేయని స్థాయిలో పరాజయం పాలైంది. బిహార్ ఎన్నికల వేదికగా రాహుల్ గాంధీ పేల్చిన ఓటు చోరీ 'హైడ్రోజన్ బాంబు' తుస్సుమంది. ఆయన 1,300 కిమీ మేర చేపట్టిన 'ఓటర్ అధికార యాత్ర' ఏమాత్రం ప్రభావం చూపలేదు. దానికితోడు కూటమిలో సీట్ల పంపకాల లుకలుకలు, అలవిమాలిన హామీలపై ప్రజల్లో అసంతృప్తి కనిపించింది. లాలూ 'జంగిల్ రాజ్' నేపథ్యంతోనూ దెబ్బపడింది. కూటమిలోని ఆర్జేడీ 25 సీట్లలో, కాంగ్రెస్ 6, సీపీఐఎంల్ 2, సీపీఐ ఒక స్థానంలోనే విజయం సాధించగలిగాయి.

గురి తప్పిన ఓటు చోరీ!

దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన రాహుల్ గాంధీ ఓటు చోరీ ఆరోపణలను బిహారీలు పట్టించుకోలేదు. మీడియాలో, సోషల్ మీడియాలో రాహుల్ ఆరోపణలు, ఓటర్ అధికార యాత్ర, ఎస్ఐఆర్ పేరిట ప్రతిపక్షాల ఓట్లను తొలగిస్తున్నారన్న ఆరోపణలకు ప్రచారం లభించడంతో.. మహాగఠ్‌బంధన్ కూటమి కూడా దీన్నే ప్రధాన ప్రచారాస్త్రంగా ఎంచుకుంది. కానీ క్షేత్రస్థాయిలో ఓటర్లపై ఈ అంశాలేవీ ప్రభావం చూపలేదు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ కొన్ని హామీలు మినహా స్థానిక అంశాలపై పెద్దగా దృష్టిపెట్టకపోవడం వంటివి ఓటర్లను ఆకట్టుకోలేకపోయాయి.

అలవిమాలిన హామీలతోనూ దెబ్బ

బిహార్‌లో ఎలాగైనా అధికారంలోకి రావాలని మహాగఠ్‌బంధన్ కూటమి ఇచ్చిన అలవిమాలిన హామీలు ఓటర్లను ఆకట్టుకోకపోగా, వ్యతిరేక ప్రభావం చూపాయి. తమ కూటమి అధికారంలోకి వచ్చిన 20 రోజుల్లోగా బిహార్‌లో ఇంటికొక ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని ఆర్జేడీ నేత తేజస్వియాదవ్ చేసిన ప్రకటన విస్మయం కలిగించింది. సుమారు 2.76 కోట్ల మందికి ఉద్యోగాలు ఎలా ఇస్తారనే చర్చ జరిగింది. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరిస్తామన్న హామీపై యువతలో వ్యతిరేకత వ్యక్తమైంది.

రాహుల్ యాత్ర చేసిన అన్ని సీట్లలో ఓటమి

ఈ ఏడాది ఆగస్టులో బిహార్‌లో రాహుల్ గాంధీ చేపట్టిన 'ఓటరు అధికార యాత్ర' కొనసాగిన అన్ని స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఓటమి పాలయ్యారు. 25 జిల్లాల్లోని 110 స్థానాల్లో 1,300 కిమీ మేర రాహుల్ ఈ యాత్ర చేశారు. నిజానికి లోక్‌సభ ఎన్నికలకు ముందు ఆయన చేపట్టిన 'భారత్ జోడో' యాత్రలు పార్టీకి కొత్త ఊపిరినిచ్చాయి. రాహుల్ యాత్ర మార్గంలో 41 ఎంపీ సీట్లు కాంగ్రెస్ గెలుచుకుంది. తెలంగాణలో అధికారంలోకి వచ్చింది. ఆ విజయాలకు మరెన్నో కారణాలున్నా.. బిహార్‌లో యాత్రతోనూ సానుకూల ఫలితం ఉంటుందని కాంగ్రెస్ ఆశించింది. కానీ పరిస్థితి తలకిందులైంది.

కూటమిలో లుకలుకలు, స్నేహపూర్వక పోటీ..

బిహార్‌లో ఈసారి గెలిచే అవకాశం ఉందన్న భావనతో మహాగఠ్‌బంధన్ కూటమి పక్షాలన్నీ ఎక్కువ సీట్లలో పోటీ కోసం పట్టుబట్టాయి. ముఖ్యంగా కాంగ్రెస్ క్షేత్రస్థాయిలో ఉన్న బలం కన్నా ఎక్కువ సీట్లు అడిగింది. అభ్యర్థుల ఎంపిక, వనరుల పంపిణీ, ప్రచారంలో కూటమి పార్టీల మధ్య సమన్వయం కొరవడింది. కాంగ్రెస్ హైకమాండ్ పెద్దలు తరచూ కల్పించుకుని చర్చలు జరపాల్సి వచ్చింది. కూటమిగా పోటీ చేసినా.. 12 చోట్ల కాంగ్రెస్, ఆర్జేడీ అభ్యర్థులు స్నేహపూర్వక పోటీలో ఉండటం.. కూటమి లుకలుకలపై ప్రజల్లోకి వ్యతిరేక సంకేతాలు పంపింది. సీట్ల పంపిణీపై అసంతృప్తితో జేఎంఎం పార్టీ కూటమిని వీడటం కూడా ప్రభావం చూపింది.

కొన్ని వర్గాల ఓట్లపైనే దృష్టిపెట్టడం..

మహాగఠ్‌బంధన్ కూటమి ప్రధానంగా ముస్లింలు, యాదవ్‌ల ఓ ట్లనే నమ్ముకోవడమూ దెబ్బతీసింది. కూటమి తరఫున ఏకంగా 52 మందికిపైగా యాదవ్‌లకే టికెట్లివ్వడం ఇతర వర్గాల్లో వ్యతిరేకత వ్యక్తమైంది. తొలి నుంచీ ఆర్జేడీ వెంట ఉన్న దళితులు ఈసారి బీజేపీకి మద్దతునిచ్చారు. నితీశ్‌కు మద్దతుగా నిలుస్తూ వచ్చిన ఈబీసీలను ఆకట్టుకునేందుకు ఈ కూటమి ప్రయత్నించినా సఫలం కాలేదు. అదే టైంలో కాంగ్రెస్‌కు మద్దతుగా ఉంటూ వచ్చిన అగ్రవర్ణాల ఓట్లూ ఈసారి బీజేపీ వైపు మళ్లాయి.

రాహుల్ గాంధీకి.. నో సర్..

బిహార్ గత అసెంబ్లీ ఎన్నికల్లో 70 స్థానాల్లో పోటీ చేసి 19 సీట్లు గెలుచుకున్న కాంగ్రెస్.. ఈసారి 61 స్థానాల్లో పోటీ చేసి, కేవలం 6 సీట్లలోనే గెలిచింది. అంటే కేవలం 6% సీట్లలోనే విజయం సాధించింది. కాంగ్రెస్‌కు కాసింత బలమున్న సీమాంచల్, మిథిల, మగధ ప్రాంతాల్లోనూ దారుణంగా దెబ్బ తగిలింది. ఓటు చోరీ ఆరోపణలు, హైడ్రోజన్ బాంబు వంటి ప్రకటనలతో విశేష ప్రచారం లభించినా.. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్ - సర్)ను తప్పుబడుతూ ఓటరు అధికార యాత్ర పేరిట బిహార్‌లో రాహుల్ గాంధీ కాలికి బలపం కట్టుకుని తిరిగినా ఓటర్లు ఆదరించలేదు. కాంగ్రెస్ పార్టీకి బలమైన రాష్ట్ర నేత లేకపోవడం కూడా ఇబ్బందిగా మారింది. కాంగ్రెస్ దెబ్బవల్ల మొత్తంగా కూటమి సీట్లూ దారుణంగా తగ్గాయి

తేజస్విని వీడని 'జంగిల్ రాజ్'!

గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎక్కువ సీట్లు సాధించి బిహార్ భావి సీఎం అన్న స్థాయిలో ప్రచారం పొందిన తేజస్వియాదవ్‌కు తాజా ఫలితాలు చుక్కలు చూపించాయి. 143 సీట్లలో పోటీ చేసిన ఆర్జేడీ కేవలం 25 సీట్లే.. అంటే 20శాతమే గెలుచుకుంది. ఎన్డీయే కూటమి హవాకు తోడు లాలూ కుటుంబ పాలన సమయంలో బిహార్‌లో అరాచకాలకు పేరుపడిన 'జంగిల్ రాజ్' కూడా గట్టి ప్రభావమే చూపింది. ఎన్డీయే కూటమి తమ ప్రచారంలో నితీశ్ చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రస్తావిస్తూనే.. ఆర్జేడీ, కాంగ్రెస్ కూటమి గెలిస్తే బిహార్ మళ్లీ 'జంగిల్ రాజ్'లోకి వెళ్లిపోతుందన్న ఆరోపణలు తీవ్రస్థాయిలో గుప్పించింది. ప్రధాని మోదీ కూడా స్వయంగా జంగిల్ రాజ్ ఆరోపణలు చేశారు. 2020 బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో 75 సీట్లతో అతిపెద్ద పార్టీగా నిలిచిన ఆర్జేడీ ఈసారి 25 సీట్లకు పడిపోవడం గమనార్హం.

ఎంఐఎం సత్తా!



25 స్థానాల్లో పోటీ.. ఐదింట విజయం

- గత అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇదే స్కోరు
- నాడు గెలిచిన నాలుగు మళ్లీ కైవసం

బిహార్‌లో ఎంఐఎం మరోసారి తన ఉనికిని చాటుకుంది. ఐదు స్థానాల్లో విజయం సాధించింది. 25 స్థానాల్లో పోటీ చేసిన ఆ పార్టీ.. ముస్లింలు అధికంగా ఉండే సీమాంచల్ ప్రాంతంలో ఉన్న మొత్తం 24 నియోజకవర్గాల్లో బరిలో దిగి ఐదు స్థానాలు గెలుచుకుంది. అన్నింటా 20 వేలకుపైగా మెజారిటీ సాధించింది. ఆమోర్ స్థానంలోనైతే ఏకంగా 38,928 ఓట్ల మెజారిటీ దక్కటం గమనార్హం. 2020 అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఐదు స్థానాల్లో విజయం సాధించటం గమనార్హం.

పదేళ్ల కిందట తొలిసారి

బిహార్ రాజకీయాల్లోకి ఎంఐఎం పదేళ్ల కిందట ప్రవేశించింది. 2015 అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు స్థానాలకు పోటీ చేసి ఓడిపోయింది. 2019లో కిషన్‌గంజ్‌లో జరిగిన ఉప ఎన్నిక ఎంఐఎంకు మరో అవకాశం ఇచ్చింది. ఆ ఎన్నికలో బీజేపీ అభ్యర్థిపై 10 వేలకుపైగా ఓట్ల మెజారిటీతో విజయం సాధించి బిహార్ అసెంబ్లీకి పార్టీ నుంచి తొలిసారిగా ఎమ్మెల్యేను పంపించింది. ఈ తొలి విజయం అందించిన ఊపుతో మరుసటి ఏడాది 2020లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీ, ఆర్ఎల్ఎస్పీతో పొత్తు పెట్టుకొని 20 స్థానాల్లో పోటీ చేసి ఐదు స్థానాల్లో విజయం సాధించి.. రాజకీయ విశ్లేషకుల దృష్టిని తన వైపునకు తిప్పుకొంది. ఈ ఐదింటిలో నాలుగు ఆర్జేడీ-కాంగ్రెస్ కూటమికి చెందిన సిట్టింగ్ స్థానాలు కావటం విశేషం. తద్వారా, సెక్యులర్ పార్టీల ఓట్లను ఎంఐఎం కొల్లగొట్టి వాటికి నష్టం చేకూరుస్తుందన్న వాదనలు బయల్దేరాయి. తదనంతర కాలంలో, ఆ ఐదుగురు ఎమ్మెల్యేల్లో నలుగురు పార్టీని వీడి ఆర్జేడీలో చేరారు. దీంతో, అసెంబ్లీలో ఎంఐఎంకు ఒక్క ఎమ్మెల్యే మాత్రమే మిగిలారు. 2022లో గోపాల్‌గంజ్ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో పోటీ చేసిన ఎంఐఎం 12,214 ఓట్లను సాధించి మూడోస్థానంలో నిలిచింది. ఈ ఎన్నికలో ఆర్జేడీ అభ్యర్థిపై గెలిచిన బీజేపీ అభ్యర్థి మెజారిటీ దాదాపు 2 వేలు మాత్రమే. అంటే, ఎంఐఎం ఓట్ల చీలికతోనే బీజేపీ గెలిచిందని, తద్వారా ఆ పార్టీకి పరోక్షంగా సాయపడుతోందన్న సందేహాలు పెద్ద ఎత్తున వ్యక్తమయ్యాయి. మరోవైపు, రాష్ట్ర రాజకీయాల్లో ఎంఐఎం ప్రాధాన్యం కూడా పెరిగింది.

ఎంఐఎంతో పొత్తుకు లాలూ యోచన

ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల ముందు జరిగిన కసరత్తులో భాగంగా.. ఎంఐఎంను మహాగఠ్‌బంధన్‌లోకి తీసుకోవటానికి ఆర్జేడీ అధినేత లాలూప్రసాద్ యోచించారు. అంతకుముందు ఆర్జేడీ తమ ఎమ్మెల్యేలను లాక్కొందనే ఆగ్రహం ఉన్నా.. అసదుద్దీన్ ఒవైసీ కూడా ఈ ప్రతిపాదనకు సానుకూలంగానే స్పందించారు. కానీ, కాంగ్రెస్ అడ్డుపుల్ల వేసిందని సమాచారం. ఈసారి, మైనారిటీ ఓట్లు గంపగుత్తగా తమకే పడతాయని ఆ పార్టీ.. ఎంఐఎంను కూడా కలుపుకొంటే కొన్ని సీట్లను వారికి ఇవ్వటానికి తిరస్కరించినట్లు రాజకీయ వర్గాలు పేర్కొన్నాయి. 2024లో జరిగిన లోక్‌సభ ఎన్నికల సమయంలోనూ ఇండియా కూటమితో కలిసి పని చేయటానికి అసదుద్దీన్ సిద్ధం కాగా, ఆర్జేడీ అంగీకరించలేదు. అప్పుడు ఆర్జేడీ, ఇప్పుడు కాంగ్రెస్ ఎంఐఎంను కూటమిలోకి రాకుండా అడ్డుకున్నాయి. కొన్ని చిన్నపార్టీలతో కలిసి పోటీకి దిగిన ఎంఐఎం అధినేత అసదుద్దీన్.. ఏకంగా వంద స్థానాల్లో పోటీ చేస్తామని ప్రకటించినా 25 స్థానాలకే పరిమితమయ్యారు. తాము ముస్లింలకు పరిమితం కాదని చెప్పుకోవడానికి రెండింటిలో హిందువులకు అసదుద్దీన్ టికెట్లు ఇచ్చారు. బిహార్‌లో ముస్లిం ఓటు కీలకం. రాష్ట్ర జనాభాలో వారి వాటా 17.7%. మొత్తం 243 అసెంబ్లీ స్థానాల్లో సీమాంచల్‌లోని 24 సీట్లతో కలిపి 110 స్థానాల్లో ముస్లింల ప్రభావం ఉంది.

ఎంఐఎం విజయం

నియోజకవర్గం	మెజారిటీ
ఆమోర్	38,928
జోకిహాట్	28,803
బహదూర్‌గంజ్	28,726
బైసీ	27,251
కొచాధామన్	23,021

చిరాగ్ కమాల్!

'యువ బిహారీ'గా అవతరణ

- ఫలితాల్లో అనూహ్య దూకుడు
- సీట్లలో 67% స్ట్రైకింగ్ రేట్



న్యూఢిల్లీ, నవంబరు 14 : బిహార్‌లో ఎన్డీయే ఘన విజయం సొంతం చేసుకుంది. ఎన్డీయే పక్షాలు ఐక్యంగా పని చేసి మరోసారి అధికారం నిలబెట్టుకున్నాయి. ఎన్డీయేలోని పార్టీలు బీజేపీ, జేడీయూ గత ఎన్నికల కంటే మెరుగైన ఫలితాలను సొంతం చేసుకోగా, మరో భాగస్వామి చిరాగ్ పాసవాన్ నేతృత్వంలోని లోక్‌జనశక్తి పార్టీ (రామ్ విలాస్) అనూహ్యంగా దూసుకొచ్చింది. పోటీచేసిన 28 స్థానాల్లో 19 చోట్ల... 67 శాతం స్ట్రైకింగ్ రేట్‌తో సత్తా చాటి 'యువ బిహారీ'గా చిరాగ్ అవతరించారు. రామ్ విలాస్ నాయకత్వంలో లోక్‌జనశక్తి పార్టీ 2005లో 29 చోట్ల విజయం సాధించింది. ఆ పార్టీ ఏర్పాటయ్యాక అదే అత్యున్నత ప్రదర్శన.

ప్రతి దశలోనూ ఎదురీతే..

2020లో ఎన్డీయే సీఎం నితీశ్‌కుమార్‌ను బహిరంగంగా ఆయన వ్యతిరేకించి. బీజేపీతోనే పొత్తు పెట్టుకున్నారు. 137 చోట్ల పోటీచేసి ఒక్క స్థానమే చిరాగ్ గెలిచారు. ఆ వెంటనే పార్టీలో సంక్షోభంతో తండ్రి రామ్ విలాస్ పాసవాన్ అధికార నివాసాన్నీ, ఆయన పార్టీనీ.. రెండింటినీ కోల్పోయి.. చిరాగ్ వేరే పార్టీని పెట్టుకున్నారు. మోదీకి తాను హనుమంతుడినని చెప్పుకొనేవారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో 5కు 5 సీట్లూ గెలిచారు. రామ్ విలాస్‌కు చిరాగ్ తగిన వారసుడని బీజేపీ సరిగ్గానే గుర్తించింది. గత ఏడాది కేంద్ర మంత్రి పదవిని ఇచ్చి రాజకీయంగా ఆయన ఎదుగుదలకు తోడ్పడింది. సీఎం పదవిని కోరుకుంటున్నట్టు దాపరికం లేకుండా చెప్పేవారు.

బెంగాల్‌పై 'బిహార్' వార్!

కోల్‌కతా, నవంబరు 14 : వచ్చే ఏడాది ఎన్నికలు జరగనున్న పశ్చిమ బెంగాల్‌లోని బీజేపీ శ్రేణులకు బిహార్ ఘన విజయం గొప్ప ఊపును తెచ్చింది. బెంగాల్‌ను గెలుచుకోవాలనే చిరకాల వాంఛను ఈసారి సాధించి తీరాలన్న పట్టుదల వారితో కనిపిస్తోంది. అయితే, అది ఈజీ అంత కాదని విశ్లేషకులంటున్నారు. ఓ 3 అంశాలు ఈసారి బెంగాల్ ఫలితాలను ప్రభావితం చేస్తాయంటున్నారు. అవి 1. సర్ (ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ) 2. తాయిలాల రాజకీయం 3. మహిళా ఓటు. బిహార్ ఎన్నికల్లో మహిళలే కీలక భూమిక పోషించారని అందరూ అంగీకరిస్తున్నారు. మహిళల ఖాతాల్లో రూ.10 వేలు చొప్పున నితీశ్‌కుమార్ సర్కారు వేయడం గేమ్ చేంజర్‌గా మారిందని, మమతా దీదీ కూడా నితీశ్ బాటలో నడిచి.. బెంగాల్‌లో తాయితాల రాజకీయం చేసే అవకాశాన్ని కొట్టిపడేయలేమని ఆయన తెలిపారు.

బిహార్‌లో తొలిసారి శాంతి మంత్రం

న్యూఢిల్లీ. నవంబరు 14: బిహార్‌లో ఎన్నికలు అంటేనే పోలింగ్ బూత్‌ల వద్ద హింస, రక్తపాతం, మరణాలు ఆపై రీపోలింగ్.. గుర్తు వస్తాయి. అలాంటి బిహార్‌లో 2025 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా శాంతిమంత్రం కనిపించింది. పోలింగ్ 2 విడతల్లో జరిగినా.. ఈసారి ఒక్క ప్రాణం కూడా పోలేదు. ఏ పోలింగ్ బూత్‌లోనూ రీపోలింగ్ నిర్వహించలేదు. ఓ మరణం, రీపోలింగ్ లేకుండా బిహార్‌లో పూర్తయిన తొలి ఎన్నికలు ఇవే కావడం విశేషం. బిహార్ గతాన్ని చూస్తే.. 1985 ఎన్నికల సందర్భంగా జరిగిన ఘటనల్లో 63 మంది ప్రాణాలు కోల్పోగా 156 బూత్‌ల్లో రీపోలింగ్ జరిగింది. 1990 ఎన్నికల సందర్భంగా జరిగిన హింసలో 87 మంది చనిపోయారు. ఇక, 1995లో అయితే మితిమీరిన హింస, పోలింగ్ బూత్‌ల వద్ద జరిగిన అవాంఛనీయ ఘటనల వల్ల నాటి చీఫ్ ఎలక్షన్ కమిషనర్ టీఎన్ శేషన్ ఎన్నికలను ఏకంగా 4 సార్లు వాయిదా వేశారు. 2005 ఎన్నికల్లో 660 బూత్‌ల్లో రీపోలింగ్ నిర్వహించారు. ఇక, 2025కు వచ్చేసరికి ఎస్ఐఆర్, ఓట్ చోరీ అంటూ ప్రతిపక్షాల ఆరోపణలతో ఎప్పుడేం జరుగుతుందోనని అంతా భయపడ్డా బిహార్ ఎన్నికలు చరిత్రలో తొలిసారి ప్రశాంతంగా ముగిశాయి.

ఆ స్వరమే.. భాస్వరమై..

- ఎమ్మెల్యేగా ఎన్నికైన గాయని మైథిలి
- అతిపిన్న వయస్కురాలిగా రికార్డు



పట్నా, నవంబరు 14: బిహార్ రాజకీయాల్లో సరికొత్త సంచలనం..! బీజేపీ తరఫున బరిలో దిగిన ప్రముఖ గాయని మైథిలి ఠాకూర్ అలీనగర్ నియోజకవర్గం నుంచి గెలుపొందారు! 2008లో ఏర్పడిన ఈ నియోజకవర్గంలో దాదాపు 50 శాతం ముస్లిం ఓటర్లే ఉన్నారు. ఇక్కడ ఇప్పటి వరకు బీజేపీ గెలవనేలేదు. అలాంటి స్థానం నుంచి పోటీ చేసిన 25 ఏళ్ల మైథిలి ఠాకూర్.. ఘన విజయం సాధించారు! గాయనిగా దేశవ్యాప్తంగా పేరుప్రతిష్ఠలు సంపాదించుకున్న మైథిలి.. బిహార్ ఎన్నికలకు కొద్దివారాల ముందే బీజేపీలో చేరారు. అయినా ఆమెను అలీనగర్ ప్రజలు ఆదరించారు. హిందీ, భోజ్‌పురిల్లో ప్రత్యేక ప్రదర్శనలు ఇవ్వడం ద్వారా మైథిలి ఠాకూర్ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. అలాగే ప్రధాని మోదీ కూడా ఆమెను పలుమార్లు ప్రశంసించారు. తాజా ఎన్నికల్లో మైథిలి తన సమీప ప్రత్యర్థి, ఆర్జేడీ సీనియర్ నేత వినోద్ మిశ్రాపై 11,730 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. బిహార్‌లో అత్యంత పిన్నవయస్కురాలైన ఎమ్మెల్యేగా నిలిచారు. ఎన్నికల ప్రచారంలో మైథిలికి కుటుంబ సభ్యులు ఎంతగానో సహకరించారు. 2000 జూలై 25న జన్మించిన మైథిలి.. 11 ఏళ్ల వయసులోనే సరిగమప లిటిల్ చాంప్స్ రియాలిటీ షోకు వెళ్లారు. ఇండియన్ ఐడల్ జూనియర్ పోటీల్లోనూ పాల్గొన్నారు. 2017లో రైజింగ్ స్టార్ కార్యక్రమంలో రన్నరప్‌గా నిలిచారు. అక్కడి నుంచి ఆమెకు ప్రజాదరణ పెరిగింది.

అందరికీ శకునాలు చెప్పిన పీకే..

- బిహార్‌లో ప్రభావం చూపని ప్రశాంత్ కిషోర్ పార్టీ
- 200 స్థానాల్లో పోటీ చేసినా ఒక్కసీటూ దక్కలే..



న్యూఢిల్లీ, నవంబరు 14: 'అందరికీ శకునాలు చెప్పే బల్లి తాను కుడితిలో పడ్డట్టు..'గా బిహార్ అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంత్ కిషోర్‌కు చేదు అనుభవాన్ని మిగిల్చాయి అత్యంత విజయవంతమైన రాజకీయ వ్యూహకర్త (పొలిటికల్ స్ట్రాటజిస్ట్)గా జాతీయ స్థాయిలో ఓ వెలుగు వెలిగిన పీకే, రాజకీయ నేతగా ఏ మాత్రం ప్రభావం చూపలేకపోయారు. రాజకీయ వ్యూహకర్తగా బీజేపీ, జేడీ(యూ), కాంగ్రెస్, ఆప్, వైసీపీ, డీఎంకే, టీఎంసీ పార్టీలను విజయపథంలో నడిపించి.. అధికార పీఠంపై కూర్చోబెట్టిన పీకే, ఓ పార్టీ అధినేతగా బిహార్ ఎన్నికల్లో ఒక్కటంటే ఒక్కసీటూ గెలవలేకపోయారు. జన్‌సురాజ్ (జేఎస్పీ) పేరుతో ఏడాదిన్నర క్రితం పార్టీని స్థాపించి.. పాదయాత్రతో బిహార్‌ను చుట్టేశారాయన. రాష్ట్రంలో వేళ్లూనుకున్న కుల ఆధారిత రాజకీయాలకు ప్రత్యామ్నాయం జేఎస్పీ అని గొంతెత్తారు. ఏకబిగిన 3 వేల కిలోమీటర్ల పాదయాత్ర చేశారు. పీకేను చూసేందుకు, ఆయన మాటలు వినేందుకు జనం తండోపతండాలుగా వచ్చినా ఓట్లు మాత్రం పడలేదు. ఎందుకు? అనంటే.. విశ్లేషకులు అనేక కారణాలు చెబుతున్నారు. మార్పు తెస్తా, మిగతా పార్టీలకు జేఎస్పీనే ప్రత్యామ్నాయమంటూ తన ప్రసంగాల్లో ఊదరగొట్టిన పీకే.. మిగతా పార్టీల మాదిరిగా మేనిఫెస్టోతో రాకపోవడం, ఎన్నికల తర్వాత ఆయన వ్యూహం ఏమిటి? ఏ పార్టీతో పొత్తు పెట్టుకుంటారు? అనేవి చెప్పకపోవడం ఓటర్లను గందరగోళపరిచింది. పైగా పీకే 200 పైచిలుకు స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టారు. అలాకాకుండా.. తమ పార్టీ ప్రభావం చూపే కొన్ని స్థానాలను గుర్తించి, అక్కడే అభ్యర్థులను నిలబెట్టి ఉంటే ఎంతో కొంత ప్రభావం ఉండేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పైపెచ్చు.. జిల్లా, మండల, గ్రామ, బూత్ స్థాయి కమిటీలతో మిగతా పార్టీల మాదిరిగా జేఎస్పీ క్షేత్రస్థాయిలో బలంగా లేకపోవడం అతిపెద్ద మైనస్ అయింది. ఇక గతంలో తాను వ్యూహకర్తగా బీజేపీ, జేడీయూల తరఫున పనిచేసి, తాజాగా ఆయా పార్టీల నేతలకు వ్యతిరేకంగా ఆయన ప్రచారం చేయడం వెనుక ఔచిత్యం ఓటర్లకు బోధపడలేదు. అన్నింటికీ మించి.. ఎన్నికల్లో పీకే పోటీ చేయలేదు. దీన్నే చాలామంది ఓటర్లు అర్థం చేసుకోలేకపోయారు. దీంతో ఎన్నికల్లో జేఎస్పీ 3.44శాతం ఓట్లకే పరిమితమైంది.

కేటీఆర్ సెల్ఫ్ గోల్!

బెడిసికొట్టిన సవాల్

- ఉప ఎన్నిక కాంగ్రెస్ సర్కార్‌కు రెఫరెండం అని ప్రకటన
- ఈ ఎన్నిక.. తెలంగాణ ప్రజానీకానికి ఓ కనువిప్పు అని వ్యాఖ్యలు
- అధికార పార్టీ సవాల్ చేయకముందే..

తానే సవాల్ విసిరి ఓడిపోయిన బీఆర్ఎస్



హైదరాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక వేళ సెల్ఫ్‌గోల్ వేసుకున్నారు. అధికార కాంగ్రెస్ ఎలాంటి సవాల్ చేయక ముందే.. తానే ఓ అడుగు ముందుకేసి సవాల్ విసిరి ఇరకాటంలో పడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతున్న సమయంలో జరుగుతున్న ఈ ఉపఎన్నిక.. కాంగ్రెస్ ప్రభుత్వానికి రెఫరెండమని కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. అంతటితో ఆగకుండా ఈ ఎన్నిక.. తెలంగాణ ప్రజానీకానికి ఓ కనువిప్పు అవుతుందని అన్నారు. ఇటీవల 'ఏబీఎన్- ఆంధ్ర జ్యోతి' ప్రత్యేక ఇంటర్వ్యూలో కేటీఆర్ చేసిన ఈ వ్యాఖ్యలు కలకలం రేపాయి. అయితే ఉప ఎన్నిక ఫలితం వెలువడిన తర్వాత కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. జూబ్లీ హిల్స్ సిటింగ్ స్థానాన్ని నిలబెట్టుకోవాలని వ్యూహాలు పన్నిన బీఆర్ఎస్.. చివరికి ఓటమిపాలైంది. కంటోన్మెంట్ నియోజకవర్గ ఉప ఎన్నికలో చేసిన ప్రయోగం విఫలం అయినప్పటికీ.. మళ్లీ జూబ్లీహిల్స్‌లో అదే ప్రయోగం చేసి మరో అపజయాన్ని మూటగట్టుకుంది. మాగంటి సునీత సెంటిమెంట్ అస్త్రం కూడా ఫలించలేదు. అయితే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ హోదాలో కేటీఆర్ ఎన్నికల బాధ్యతను భుజాన వేసుకున్నారు. పార్టీకి చెందిన మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎన్నికల్లో అనుభవం కలిగిన పార్టీ సీనియర్లను జూబ్లీహిల్స్‌లో మోహరించారు. వార్డులు, పోలింగ్ బూత్‌ల వారిగా ఇన్‌చార్జులను నియమించారు. ప్రతి వంద మంది ఓటర్లకొక బాధ్యుడినీ పెట్టారు. గతంలో ఎక్కడ ఉప ఎన్నిక వచ్చినా.. సునాయసంగా గెలిచిన బీఆర్ఎస్ జూబ్లీహిల్స్‌లో మాత్ర బొక్కబోర్లా పడింది. వర్కింగ్ ప్రెసిడెంట్ హోదాలో కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు పార్టీని కాస్త ఇరకాటంలో పెట్టాయనే చెప్పవచ్చు. ఈ ఉప ఎన్నిక.. కాంగ్రెస్ ప్రభుత్వానికి రెఫరెండమని కీలక వ్యాఖ్యలు చేశారు. అంతటితో ఆగకుండా ఈ ఎన్నిక.. తెలంగాణ రాష్ట్ర ప్రజానీకానికి ఓ కనువిప్పు అవుతుందని అన్నారు. బీజేపీ, కాంగ్రెస్ కలిసి పనిచేస్తున్నాయని, రేవంత్ రెడ్డి-నరేంద్రమోదీ చోటాభాయ్, బడా భాయ్ సంబంధమనీ వ్యాఖ్యలు చేసి ప్రజలను ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేసినా.. ఫలించలేదు. ఓటర్లు కాంగ్రెస్ పార్టీకే పట్టం కట్టారు. సాధారణంగా 'రెఫరెండం' అనే సవాల్‌ను అధికారంలో ఉన్న పార్టీలు చేస్తుంటాయి. తమ పాలనకు ప్రజల్లో ఆదరణ ఎలా ఉంది? ఎన్నికల్లో గెలిస్తే పాలనను ఆమోదించినట్లు.. గెలవకపోతే పాలనను తిరస్కరించినట్లు.. అని సవాల్ విసరుతుంటారు. కానీ ఈ ఉప ఎన్నికలో అధికారపార్టీ నుంచి ఎలాంటి సవాల్ రాకపోయినా.. ప్రతిపక్ష నేత కేటీఆర్ ఓ అడుగు ముందుకేసి రెఫరెండం సవాల్ విసిరి సెల్ఫ్‌గోల్‌లో పడినట్లయింది.


రేవంత్ పాలనకు ప్రజామోదం: మంత్రి సీతక్క



హైదరాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ విజయం చరిత్రాత్మకమైనదని మంత్రి సీతక్క అన్నారు. ఈ ఫలితం బీఆర్ఎస్ పార్టీ తప్పుడు ప్రచారాలకు ప్రజలు చెప్పిన గుణపాఠమని, రేవంత్‌రెడ్డి రెండేళ్ల పాలనకు లభించిన ప్రజామోదమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియాలో తప్ప తెలంగాణ సమాజంలో లేదని ఈ ఎన్నిక ఫలితంతో తేలిపోయిందని అన్నారు. ఇకనైనా బీఆర్ఎస్ నేతలు బుద్ధి తెచ్చుకుని హుందాగా రాజకీయాలు చేయాలని, రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని సూచించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీని గెలిపించిన సీఎం రేవంత్‌రెడ్డి.. కెప్టెన్‌గా సక్సెస్ అయ్యారని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక ఎన్నికల్లోనూ ఇదే మాదిరిగా పార్టీ నేతలు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని సూచించారు. తెలంగాణలో పోల్ మేనేజ్‌మెంట్ చేసినట్లుగానే, కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా చేయాల్సిన అవసరం ఉందని గాంధీభవన్‌లో శుక్రవారం మీడియా సమావేశంలో అభిప్రాయపడ్డారు.

ఇక రేవంత్ 2.0

జూబ్లీహిల్స్‌లో నవీన్ యాదవ్ గెలుపుతో మారిన సీన్



ఇప్పటిదాకా సమన్వయానికే సమయం

అధిష్ఠానం వద్ద సీఎం రేవంత్ రెడ్డికి పెరగనున్న ప్రాధాన్యం

- రేవంత్ నిర్ణయాలకు తప్పక అండగా నిలవాల్సిన పరిస్థితి
- రాష్ట్రంలో పాలనా పరంగా కఠినంగా వ్యవహరించనున్న సీఎం
- త్వరలో మంత్రివర్గ సమూల ప్రక్షాళన.. కొత్తవారికి అవకాశం
- పనితీరు బాగాలేని మంత్రుల నుంచి కీలక శాఖలు వెనక్కి
- మూసీ రివర్ ఫ్రంట్, ఫోర్త్ సిటీ, విజన్ 2047పై ప్రత్యేక దృష్టి

హైదరాబాద్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికలో నవీన్ యాదవ్ గెలుపుతో సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ ప్రభుత్వాధినేతగానే కాక, కాంగ్రెస్ పార్టీలోనూ శక్తిమంతుడిగా మారిపోయారు. బిహార్‌లో కాంగ్రెస్ చావు దెబ్బ తిన్న నేపథ్యంలో, రేవంత్ నేతృత్వంలో తెలంగాణలో ఆ పార్టీ అభ్యర్థి భారీ ఆధిక్యంతో విజయం సాధించడం... అధిష్ఠానం వద్ద రేవంత్ ప్రాధాన్యాన్ని తప్పక పెంచుతుందని విశ్లేషకులు, పార్టీ నేతలు అభిప్రాయపడుతున్నారు. ఫలితంగా రేవంత్ నిర్ణయాలకు, ఆయన ప్రతిపాదించిన విజన్ 2047కు కాంగ్రెస్ అధిష్ఠానం మద్దతివ్వక తప్పని పరిస్థితి నెలకొందని పేర్కొంటున్నారు. జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక ప్రభుత్వ పనితీరుకు లిట్మస్ టెస్ట్ అంటూ ప్రకటించి మరీ గెలిపించడంతో ఇటు ప్రభుత్వం, అటు పార్టీపైన పూర్తిస్థాయి పట్టు సాధించేందుకు రేవంత్‌కు ఆస్కారం ఏర్పడిందని విశ్లేషిస్తున్నారు. ఇదే అదనుగా.. అధిష్ఠానం అండతో మంత్రివర్గంలో పెద్ద ఎత్తున ప్రక్షాళనకు సీఎం రేవంత్‌రెడ్డి ఉపక్రమించనున్నట్లు చెబుతున్నారు. డిసెంబర్ లేదా జనవరి మొదటి వారంలో ఉంటుందని అంటున్నారు. మంత్రుల శాఖలనూ సమూలంగా మార్చే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. వాస్తవానికి మంత్రుల శాఖల్లో పనితీరుపై ఇప్పటికే సమీక్షించిన అధిష్ఠానం.. పలువురు సీనియర్ మంత్రులు తమ శాఖల నిర్వహణలో వెనుకబడినట్లుగా నివేదిక ఇచ్చింది. కీలక శాఖల్లో పనితీరు బాగా లేకపోవడంతో ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తోందన్న అభిప్రాయాన్నీ వ్యక్తం చేసింది. దీంతో, రేవంత్ ఆయా మంత్రుల నుంచి కీలక శాఖలను తప్పించనున్నట్లు చెబుతున్నారు. అలాగే కొందరు మంత్రుల శాఖల పనితీరుతో పాటు ఆయా మంత్రుల వ్యవహార శైలిపైనా విమర్శలున్నాయి. వారి స్థానంలో కొత్త మంత్రులను నియమించేందుకూ ఆస్కారం ఉంది.

అభ్యర్థి ఎంపిక నుంచి వ్యూహాత్మకంగానే

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రభుత్వ పనితీరుకు లిట్మస్ టెస్ట్ అని ముందే ప్రకటించిన రేవంత్.. అభ్యర్థి ఎంపిక నుంచీ ఎన్నికల్లో గెలుపు దాకా వ్యూహాత్మకంగా వ్యవహరించారు. బీసీ నేత, స్థానికంగా పట్టున్న నాయకుడు నవీన్‌యాదవ్‌ను అభ్యర్థిగా అధిష్ఠానానికి సిఫార్సు చేశారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందే మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్‌రావు, వివేక్ వెంకటస్వామికి బాధ్యతలు అప్పగించి.. వివిధ కార్పొరేషన్ల చైర్మన్లను డివిజన్ల వారీ ఇన్‌చార్జులుగా నియమించి వారికి అటాచ్ చేశారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల నాటికి ఈ టీమ్.. బూత్ స్థాయి ఏజెంట్లను నియమించి నియోజకవర్గంలో పార్టీని సంస్థాగతంగా పటిష్ఠం చేసింది. స్థానికులను విస్తృతంగా కలిసి సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కరించే ప్రయత్నం చేసింది. ఒకట్రెండు సర్వేలు బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపడంతో అలర్ట్ అయిన రేవంత్.. మంత్రులు, పార్టీ నేతలనూ అలర్ట్ చేశారు. డివిజన్ల వారీగా మంత్రులకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించి ప్రచార ఉధృతిని పెంచారు. తానూ స్వయంగా రంగంలోకి దిగి ప్రచారాన్ని పతాక స్థాయికి తీసుకెళ్లారు.

కొత్త ఏడాదిలో రేవంత్ మార్కు పాలన

అధిష్ఠానం అండ, పాలనపైన పట్టుతో కొత్త ఏడాదిలో సీఎం రేవంత్‌రెడ్డి తన మార్కు పాలన చూపించబోతున్నారని పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. వందేళ్ల ప్రగతి కోసం రూపొందించుకున్న విజన్ 2047 అమలుపైన దృష్టి సారించనున్నట్లు చెబుతున్నారు. అభివృద్ధి ప్రణాళికలతో ప్రభుత్వ ఆదాయాన్ని పెంచి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తామని ఎన్నికల వేళ ప్రకటించిన రేవంత్‌రెడ్డి.. దానికి అనుగుణంగా మూసీ రివర్ ఫ్రంట్, ఫోర్త్ సిటీ ప్రాజెక్టులను చేపట్టారు. అయితే అన్ని వర్గాల నుంచి సరైన సహకారం లేకపోవడంతో ఆ రెండు ప్రాజెక్టులూ ప్రణాళికల వద్దే ఆగిపోయాయి. ఇప్పుడు రేవంత్ వాటిని పట్టాలెక్కించనున్నట్లు చెబుతున్నారు.

డిసెంబరులో సీఎం రేవంత్ ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకోబోతోంది. అయితే ఒక జాతీయ పార్టీ ప్రభుత్వాధినేతగా మంత్రులు, పాలనపైన పట్టు సాధించడానికే ఆయనకు ఈ సమయం సరిపోయింది. అటు అధిష్ఠానాన్ని, ఇటు పార్టీని, సీనియర్ మంత్రులనూ అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాల్సి వచ్చింది. ఈ క్రమంలో చాలా అంశాల్లో సీఎం రేవంత్ తగ్గాల్సి వచ్చింది. పలు శాఖల్లో మంత్రుల పనితీరుతో ప్రభుత్వానికి ఇబ్బందులు ఏర్పడినా భరించాల్సి వచ్చింది. మరోవైపు, ప్రతిపక్ష నేతలు సీఎం రేవంత్‌రెడ్డిపై ఇష్టమొచ్చినట్లు ఆరోపణలు చేస్తున్నా.. తిప్పి కొట్టడానికి ఆయా మంత్రులు ముందుకు రాలేదు. ప్రతిపక్షాల ఆరోపణలను తిప్పి కొట్టడంలో, ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన ప్రచారాన్ని ప్రజలదాకా తీసుకెళ్లడంలో పార్టీ యంత్రాంగం సహకారం ఆశించిన మేరకు లేదన్న విమర్శలు ఉన్నాయి. సహకారం అందించక పోగా ఫెయిల్యూర్ సీఎం అన్న ప్రచారాన్ని పలువురు మంత్రులు, నేతలు అధిష్ఠానం దాకా తీసుకెళ్లారన్న వార్తలూ వచ్చాయి. అధికారంలోకి వచ్చే నాటికే రాష్ట్రాభివృద్ధిపై తన విజన్ ఏమిటో ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డికి ఈ పరిణామాలు అడ్డంకులుగా మారాయి. దీంతో ఈ రెండేళ్లూ ప్రభుత్వ యంత్రాంగం, మంత్రులు, పార్టీ యంత్రాంగంపైన పట్టు సాధించడానికే సరిపోయింది.

9 ఉప ఎన్నికల్లో.. 7 సార్లు అధికార పార్టీ విజయం



- రెండింట విపక్షాల గెలుపు..

ఆ రెండూ బీజేపీవే

హైదరాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఏర్పడిన తర్వాత ఇప్పటిదాకా రాష్ట్రంలో 9 అసెంబ్లీ స్థానాల్లో ఉప ఎన్నికలు జరగ్గా.. 7 సార్లు అధికార పార్టీయే విజయం సాధించింది. రెండు చోట్ల బీజేపీ గెలిచింది. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్ర సమితి(టీఆర్ఎస్) 63 స్థానాల్లో విజయం సాధించగా.. కాంగ్రెస్ 21, తెలుగుదేశం 15, మజ్లిస్ 7, బీజేపీ 5.. వైసీపీ, బీఎస్పీ, ఫార్వర్డ్‌బ్లాక్‌లు కలిపి 8 స్థానాల్లో గెలిచాయి. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీకి చెందిన నారాయణఖేడ్ ఎమ్మెల్యే పటోళ్ల కిష్టారెడ్డి చనిపోవడంతో 2016 ఫిబ్రవరి 13న ఉప ఎన్నిక జరిగింది. ఆ ఎన్నికలో టీఆర్ఎస్ విజయం సాధించింది. పాలేరు కాంగ్రెస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి రాంరెడ్డి వెంకట్‌రెడ్డి అకాల మరణంతో 2016 మేలో ఉప ఎన్నిక జరగ్గా.. టీఆర్ఎస్ నుంచి తుమ్మల నాగేశ్వర రావు విజయం సాధించారు. హుజూర్‌నగర్ ఎమ్మెల్యేగా ఉన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి 2019 పార్లమెంటు ఎన్నికల్లో ఎంపీగా విజయం సాధించడంతో ఆ స్థానం ఖాళీ అయింది. 2019 అక్టోబరులో జరిగిన ఉప ఎన్నికలో టీఆర్ఎస్ నుంచి శానంపూడి సైదిరెడ్డి గెలిచారు. 2020లో దుబ్బాక టీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉన్న సోలిపేట రామలింగారెడ్డి ఆకస్మిక మరణంతో దుబ్బాక ఉప ఎన్నిక వచ్చింది. 2020 నవంబరులో జరిగిన ఎన్నికలో అక్కడ బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు గెలుపొందారు. 2018 ఎన్నికల్లో నాగార్జునసాగర్ ఎమ్మెల్యేగా గెలిచిన నోముల నర్సింహయ్య చనిపోవడంతో 2021 ఏప్రిల్‌లో ఉప ఎన్నిక జరిగింది. ఆ ఎన్నికలో నర్సింహయ్య తనయుడు భగత్ గెలుపొందారు. రాష్ట్ర మంత్రివర్గంలో కీలక పాత్ర పోషించిన ఈటల రాజేందర్‌ను టీఆర్ఎస్ పొమ్మనలేక పొగబెట్టి బయటికి పంపడంతో హుజూరాబాద్ ఎమ్మెల్యేగా ఉన్న ఆయన రాజీనామా చేశారు. అనంతరం బీజేపీలో చేరిన ఆయన 2021లో జరిగిన ఉప ఎన్నికలో విజయం సాధించారు. 2018లో కాంగ్రెస్ తరఫున విజయం సాధించిన కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి రాజీనామా చేయడంతో 2022లో ఉప ఎన్నిక వచ్చింది. ఆ ఎన్నికలో టీఆర్ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి గెలుపొందారు. 2023 డిసెంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. 2024 ఫిబ్రవరి 23న కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. తర్వాత జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి శ్రీగణేశ్ విజయం సాధించారు. తాజాగా జూబ్లీహిల్స్ ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపొందారు. 2023 ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్ విజయం సాధించగా.. ఆయన అనారోగ్యంతో చనిపోయారు.

కాంగ్రెస్‌లో గెలుపు జోష్!

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక విజయంతో ఇక 'స్థానికం'పై నజర్

- పంచాయతీ నుంచి కార్పొరేషన్ల వరకు మార్చిలోపే జరిగే చాన్స్?
- జీహెచ్ఎంసీని 2 నుంచి 4 కార్పొరేషన్లుగా విభజించే చాన్స్



గాంధీభవన్‌లో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

హైదరాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక గెలుపు కాంగ్రెస్‌లో జోష్ నింపింది. ఆ పార్టీ స్థానిక ఎన్నికలకూ వెళ్లే కొత్త ఉత్సాహాన్ని ఇచ్చింది. తాజా ఎన్నికల్లో ప్రధాన ప్రతిపక్షం డీలా పడటంతో ఇదే ఊపులో స్థానిక ఎన్నికలకు వెళ్తే మంచిదన్న అభిప్రాయం పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించే ప్రయత్నాల్లో ఉన్న ప్రభుత్వం.. పంచాయతీ, పరిషత్, మునిసిపాలిటీ, కార్పొరేషన్ల ఎన్నికలను కొంతకాలంగా వాయిదా వేసుకుంటూ వస్తున్న సంగతి తెలిసిందే. ఈ అంశంపై డిసెంబర్‌లో తుది ప్రయత్నం చేసి ఎన్నికలకు వెళ్లాలని యోచిస్తోంది. అయితే సీఎం రేవంత్ పాలనా వైఫల్యంతో క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ గ్రాఫ్ పూర్తిగా పడిపోయిందని, అందుకే స్థానిక ఎన్నికలు నిర్వహించడానికి వెనుకాడుతున్నారని బీఆర్ఎస్ పెద్ద ఎత్తున ప్రచారం చేసింది. కానీ.. ఉప ఎన్నికలో బీఆర్ఎస్ సిటింగ్ సీటునే కాంగ్రెస్ కైవసం చేసుకోవడంతో రాష్ట్రవ్యాప్తంగా ఆ పార్టీ నేతలు, కార్యకర్తల్లో ఉత్సాహం పెరిగింది. ఈ నేపథ్యంలోనే స్థానిక ఎన్నికలు నిర్వహిస్తే మెజార్టీ పరిషత్‌లు, మునిసిపాలిటీలు, కార్పొరేషన్లూ దక్కించుకోవచ్చని పార్టీ నేతలు చెబుతున్నారు. ఇటు స్థానిక ఎన్నికలకు వెళ్తేనే మేలన్న ఆలోచనలో ప్రభుత్వ పెద్దలు, పార్టీ ముఖ్యులు పడినట్లు తెలుస్తోంది. డిసెంబరు 1 నుంచి పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ఢిల్లీ కేంద్రంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌పై తుది ప్రయత్నంగా ఒత్తిడి కార్యాచరణ అమలు చేసి.. బీసీ చాంపియన్‌గా నిలవాలని, అనంతరం స్థానిక ఎన్నికలకు వెళ్లాలన్న అంశాన్ని ప్రభుత్వ పెద్దలు పరిశీలిస్తున్నారు. ఒకటి, రెండు రోజుల్లో పార్టీ ముఖ్య నేతలు, మంత్రులతో సీఎం రేవంత్ నిర్వహించనున్న సమావేశంలో దీనిపై స్పష్టత రానుంది. కాగా.. ఉప ఎన్నిక గెలుపుతో జనవరిలో ప్రారంభించి మార్చిలోపు అన్ని స్థాయుల్లోని స్థానిక ఎన్నికల నిర్వహణను ప్రభుత్వం పూర్తి చేసే అవకాశమున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. బీఆర్ఎస్ కంచుకోట అయిన జూబ్లీహిల్స్‌లో అధికార పార్టీని ప్రజలు ఆదరించినప్పుడు.. స్థానిక ఎన్నికల్లోనూ ఆదరిస్తారని పార్టీ నేతలు ధీమాతో ఉన్నారు. ఉప ఎన్నికలో గెలుపు ప్రజల్లో సానుకూల దృక్పథాన్ని తెస్తుందని అంటున్నారు.

జీహెచ్ఎంసీ పరిధిలోనూ ప్రభావం..

గత సార్వత్రిక ఎన్నికల్లో హైదరాబాద్ జిల్లాలో ఒక్క సీటు గెలవని కాంగ్రెస్‌కు.. కంటోన్మెంట్ ఉప ఎన్నిక గెలుపుతో ప్రాతినిధ్యం దక్కినట్లయింది. తాజాగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో దక్కిన ఘన విజయం ప్రభావం.. జీహెచ్ఎంసీ ఎన్నికలపైనా ఉంటుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. జనవరి నెలలో జీహెచ్ఎంసీ పాలకమండలి పదవీ కాలం ముగియనుంది. అయితే నగర విస్తరణ, ఫోర్త్ సిటీ ఏర్పాటు దృష్ట్యా జీహెచ్ఎంసీని 2 నుంచి 4 కార్పొరేషన్లుగా విభజించాలన్న ప్రతిపాదన ప్రభుత్వం వద్ద ఉంది. రెండే కార్పొరేషన్లయితే హైదరాబాద్, సైబరాబాద్‌లుగానూ.. మూడైతే హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌లుగానూ, నాలుగు కార్పొరేషన్లయితే హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్, శంషాబాద్ కార్పొరేషన్లుగానూ విభజించాలన్న ప్రతిపాదన ఉన్నట్లు చెబుతున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ఫలితం ఇచ్చిన ఉత్సాహంతో ఈ ప్రణాళికనూ అమలు చేసి త్వరితగతిన ఎన్నికలు నిర్వహించే అవకాశముందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

మంత్రులు పాస్..!

డివిజన్ల వారీగా బాధ్యతలు అప్పగించిన సీఎం

అన్ని డివిజన్లలోనూ ఆధిక్యత ప్రదర్శించిన కాంగ్రెస్

హైదరాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల్లో రాష్ట్ర మంత్రులు తమకు అప్పగించిన బాధ్యతల్లో పాస్ అయ్యారు. తద్వారా గెలుపులో భాగస్వాములూ అయ్యారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఒక్కో డివిజన్‌కు ఇద్దరు చొప్పున మంత్రులకు ఇన్‌చార్జి బాధ్యతలను సీఎం రేవంత్‌రెడ్డి అప్పగించారు. ఇందులో భాగంగా ఆయా డివిజన్లలో ప్రచారం.. ఇతర కార్యక్రమాలను వారు నిర్వహించారు. ఈ ఎన్నికలను కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో వారం రోజుల పాటు తమకు కేటాయించిన డివిజన్లలో విస్తృతంగా ప్రచారం చేశారు. ఇంటింటి ప్రచారాలూ చేశారు. వారి కష్టానికి తగినట్లుగానే అన్ని డివిజన్లలోనూ కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన ఆధిక్యత వచ్చింది. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇన్‌చార్జిలుగా బాధ్యతలు వహించిన రెహమత్‌నగర్‌లో కాంగ్రెస్ అభ్యర్థికి అత్యధికంగా 6,025 ఓట్ల ఆధిక్యత వచ్చింది. అయితే ఈ డివిజన్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి.. పార్టీ అభ్యర్థిత్వం కోసం నవీన్‌యాదవ్‌తో చివరి వరకూ పోటీ పడ్డారు. నామినేటెడ్ పదవిని ఆశిస్తున్న ఆయన.. ఈ ఎన్నికల్లో పార్టీ తరఫున విస్తృతంగా పని చేశారు. కాగా.. మంత్రులు పొన్నం ప్రభాకర్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలకు యూసుఫ్‌గూడ డివిజన్‌ను అప్పగించగా.. అక్కడ కాంగ్రెస్ అభ్యర్థికి 4,973 ఓట్ల ఆధిక్యత వచ్చింది. అలాగే వెంగళ్‌రావు నగర్ బాధ్యతలను మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరిలకు అప్పగించగా.. అక్కడ 4,182 ఓట్ల ఆధిక్యత వచ్చింది. సోమాజిగూడ డివిజన్ బాధ్యతలు మంత్రులు శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్‌లకు అప్పగించగా.. అక్కడ పార్టీ అభ్యర్థికి 3,002 ఓట్ల ఆధిక్యత వచ్చింది. మంత్రి సీతక్క, ఎంపీ మల్లు రవిలు ఇన్‌చార్జిలుగా బాధ్యత వహించిన బోరబండ డివిజన్‌లో 2,482 ఓట్ల ఆధిక్యత వచ్చింది. మంత్రులు కొండా సురేఖ, వివేక్ వెంకటస్వామిలు ఇన్‌చార్జిలుగా ఉన్న షేక్‌పేట డివిజన్‌లో 1,940 ఓట్ల ఆధిక్యత వచ్చింది. మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావులు ఇన్‌చార్జిలుగా బాధ్యతలు వహించిన ఎర్రగడ్డ డివిజన్‌లో 2,107 ఓట్ల ఆధిక్యత వచ్చింది.

బీజేపీకి భారీ షాక్

జూబ్లీహిల్స్‌లో డిపాజిట్ గల్లంతు.. గత ఎన్నిక కంటే ఈసారి తక్కువ ఓట్లు



హైదరాబాద్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో బీజేపీకి భారీ షాక్ తగిలింది. గత ఎన్నికల కంటే తక్కువ ఓట్లు సాధించడం, డిపాజిట్ కూడా కోల్పోవడంతో ప్రత్యర్థికి కనీస పోటీ కూడా ఇవ్వలేకపోయిందన్న విమర్శను మూటగట్టుకుంది. ముఖ్యంగా గత అసెంబ్లీ ఎన్నికల కంటే 8వేలకుపైగా ఓట్లు ఈసారి తక్కువగా రావడం ఆ పార్టీ నేతలకు మింగుడు పడడం లేదు. గత అసెంబ్లీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్‌లో బీజేపీకి 25,866 ఓట్లు వచ్చాయి. ఆ తర్వాత జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో 64,673 ఓట్లు వచ్చాయి. తాజా ఉపఎన్నికలో 17,061 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఇక, జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బీజేపీకి 34వేల సభ్యత్వం ఉంది. కానీ, అందులో సగం ఓట్లు మాత్రమే రావడం గమనార్హం. 'గౌరవప్రదమైన ఓట్లు కూడా సాధించలేకపోవడం మమ్మల్ని విస్మయానికి గురి చేసింది. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు సీనియర్ నాయకులు చెమటోడ్చినా ప్రత్యర్థులకు కనీస పోటీ కూడా ఇవ్వలేకపోయాం' అంటూ బీజేపీ సీనియర్ నేత ఒకరు వాపోయారు. 'జూబ్లీహిల్స్‌లో ఉపఎన్నిక ఖాయమని తేలినప్పటి నుంచే మేం స్థానికంగా బలోపేతం కావాల్సింది. మా ప్రత్యర్థుల వ్యూహాలను పసిగట్టి తిప్పికొట్టడంలో విఫలమయ్యాం' అని మరో సీనియర్ నేత అభిప్రాయపడ్డారు. 'హిందూత్వ నినాదంతో బండి సంజయ్‌ని చివరి నిమిషంలో రంగంలోకి దింపారు. ఆయన్ను ముందుగా రంగంలోకి దింపితే ఫలితం ఇంత దారుణంగా ఉండేది కాదు' అని మరికొందరు అంటున్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిదే భారం అన్నట్లుగా కొంతమంది సీనియర్ నేతలు వ్యవహరించడమూ భారీ ఓటమికి కారణమని మరికొందరు విశ్లేషిస్తున్నారు.

బన్సల్ అందుకే దూరంగా ఉండిపోయారా ?

జూబ్లీహిల్స్ ఉపఎన్నికను బీజేపీ జాతీయ నాయకత్వం సీరియస్‌గా తీసుకుందా?లేదా? అన్న అంశంపై స్పష్టత లేకున్నా, పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి సునీల్ బన్సల్ మాత్రం ఇక్కడి పార్టీ ప్రచార శైలిపై అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. 'ఉపఎన్నిక నోటిఫికేషన్ విడుదలైన తర్వాత రాష్ట్ర పర్యటనకు వచ్చిన బన్సల్.. ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. అప్పుడు సమన్వయలోపం విస్పష్టంగా కనిపించింది. బహుశా అందుకేనేమో ఆయన మళ్లీ రాలేదు' అని బీజేపీ ముఖ్యనేత ఒకరు తెలిపారు.

హస్తానికే మైనార్టీల సలాం


- బీఆర్ఎస్‌కు దూరమై అధికార పార్టీకి దగ్గరై
- కాంగ్రెస్‌కు కలిసొచ్చిన

బీజేపీ ముస్లిం వ్యతిరేక ప్రచారం

హైదరాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ విజయ కేతనం ఎగరేయడంలో మైనార్టీల మద్దతు కీలకంగా మారింది. రాష్ట్రంలో మజ్లిస్ సులభంగా గెలుపొందే ఏడు అసెంబ్లీ స్థానాల తర్వాత.. అదే స్థాయిలో మైనార్టీలు, అందులోనూ అత్యధిక ముస్లిం ఓటర్లు కలిగిన నియోజకవర్గాల్లో జూబ్లీ హిల్స్ ఒకటి. హైదరాబాద్‌లో 15 అసెంబ్లీ స్థానాలు ఉండగా... వాటిలో చాంద్రాయణగుట్ట, యాకుత్‌పురా, నాంపల్లి, బహదూర్‌పుర, చార్మినార్, కార్వాన్, మలక్‌పేట నియోజకవర్గాలు మజ్లిస్ కంచుకోటలు. ముషీరాబాద్, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల్లో గెలుపోటములను శాసించే స్థాయిలో ముస్లిం ఓటర్లు ఉన్నారు. జూబ్లీ హిల్స్‌లో 4.01 లక్షల ఓటర్లు ఉండగా... అందులో 30 శాతం వీరే ఉండటం గమనార్హం. నియోజకవర్గంలోని ఆరు మున్సిపల్ డివిజన్లలో రహ్మత్‌నగర్, బోరబండ, ఎర్రగడ్డ, షేక్‌పేట డివిజన్లలో మైనార్టీల ఓట్లు అధికంగా ఉన్నాయి. ఈ ఉప ఎన్నికలో ఇవన్నీ గంపగుత్తగా కాంగ్రెస్‌కు పడినట్లు తెలుస్తోంది. దీంతో ఆ పార్టీ అభ్యర్థి నవీన్‌యాదవ్ 24,729 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఆయనకు పోలైన మొత్తం ఓట్లు 98,988.

బెడిసికొట్టిన బీజేపీ వ్యూహం

ప్రధానంగా బీజేపీ బలంగా చేసిన ముస్లిం వ్యతిరేక ప్రచారం కాంగ్రెస్‌కు కలిసి వచ్చినట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. అప్పటిదాకా బీఆర్ఎస్ వైపే మైనార్టీలు మొగ్గుచూపగా... బీజేపీకి చెందిన కేంద్ర సహాయ మంత్రి రంగంలోకి దిగిన తర్వాత పరిస్థితి మారినట్లు తెలుస్తోంది. మొలతాడు, టోపీ వంటి నినాదాలతో క్రమంగా మైనార్టీ ఓటు బ్యాంకు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపినట్లు సమాచారం. మజ్లిస్ మద్దతు కూడా కలిసి వచ్చింది. ఆ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీతో పాటు పార్టీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ తరఫున ప్రచారం చేశారు. ఓటింగ్ ప్రక్రియలోనూ ఆ పార్టీ నుంచి కాంగ్రెస్‌కు సహకారం లభించింది. వీటితో పాటు మైనార్టీలకు మంత్రివర్గంలో చోటు కల్పించడం, నియోజకవర్గంలో మైనార్టీల శ్మశాన వాటిక సమస్యను పరిష్కరించడం వంటి అంశాలు అధికార పార్టీ గెలుపులో కీలకంగా మారినట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. 2018 శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి కొంత మేర మద్దతు ఇచ్చిన మైనార్టీ వర్గాలు... 2019 పార్లమెంట్ ఎన్నికల్లో బలంగా సమర్థించాయి. తాజాగా గ్రేటర్ హైదరాబాద్‌లో ఇప్పటిదాకా జరిగిన రెండు ఉప ఎన్నికల్లోనూ అధికార పార్టీ వైపు మొగ్గుచూపుతున్నట్లు స్పష్టమవుతోంది.



జూబ్లీహిల్స్‌పై కాంగ్రెస్ జెండా


నవీన్ యాదవ్ ఇంట్లో సంబరాలు


గాంధీభవన్ ఆవరణలో బాణాసంచా కాలుస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు


సీఎం రేవంత్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న నవీన్, చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, పొన్నం, వివేక్, వాకిటి శ్రీహరి

(మొదటిపేజీ తరువాయి)

ఓట్ల భారీ ఆధిక్యంతో గెలుపొందారు. తమ కుటుంబం నుంచి ఒకరు శాసనసభలో అడుగు పెట్టాలన్న తన తండ్రి చిన్న శ్రీశైలం యాదవ్ ఆకాంక్షను నెరవేర్చి గెలుపును బహుమతిగా ఇచ్చారు. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ సిటింగ్ స్థానాన్ని కోల్పోగా.. బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డికి డిపాజిట్ కూడా దక్కలేదు. డిపాజిట్ దక్కించుకోవడానికి కావాల్సిన ఓట్లలోనూ సగం దూరంలోనే ఆయన నిలిచిపోయారు. నియోజకవర్గంలో 4.01 లక్షలకుపైగా ఓట్లు ఉండగా.. 1.94 లక్షలకుపైగా ఓట్లు (48.49 శాతం) పోలయ్యాయి. ఇందులో కాంగ్రెస్ అభ్యర్థికి 98,988, బీఆర్ఎస్ అభ్యర్థికి 74,259 ఓట్లు వచ్చాయి. 17,061 ఓట్లతో బీజేపీ డిపాజిట్ దక్కించుకుంది. మిగిలిన అభ్యర్థులెవరికీ కనీసం 240 ఓట్లు కూడా దాటలేదు. నోటాకు 924 ఓట్లు పోలవడం విశేషం. ఈనెల 11న జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక జరగగా.. శుక్రవారం యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో ఓట్ల లెక్కింపు చేపట్టారు. షేక్‌పేట డివిజన్‌కు సంబంధించిన ఓట్లు లెక్కించిన మొదటి రౌండ్‌లో కాంగ్రెస్‌కు కేవలం 47 ఓట్ల మెజారిటీ మాత్రమే వచ్చింది. ఈ రౌండ్‌లో నవీన్‌కు 8,911 ఓట్లు, సునీతకు 8,864 ఓట్లు వచ్చాయి. దీంతో, పోరు హోరాహోరీగా ఉంటుందని భావించారు. కానీ, రెండో రౌండ్ నుంచి హస్తం హవా కొనసాగింది. రెండో రౌండ్‌లో 2,948 ఓట్ల ఆధిక్యం రాగా.. అక్కడి నుంచి ఏడో రౌండ్ వరకూ కాంగ్రెస్ అభ్యర్థి ఆధిక్యం క్రమేణా పెరుగుతూ వచ్చింది. ఆ రౌండ్లో అత్యధికంగా 4000 ఓట్ల ఆధిక్యం వచ్చింది. చివరకు, హోం ఓటింగ్‌తో కలిపి నవీన్ యాదవ్ 24,729 ఓట్ల ఆధిక్యంతో ఘన విజయం సాధించారు. విజేత నవీన్ యాదవ్‌కు రిటర్నింగ్ అధికారి సాయిరాం గెలుపు ధ్రువీకరణ పత్రం అందజేశారు. నిజానికి, జూబ్లీహిల్స్ నియోజక వర్గం ఏర్పాటైన తొలిసారి, ఉమ్మడి రాష్ట్రంలో 2009లో ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థిగా విష్ణువర్ధన్ రెడ్డి గెలుపొందారు. ఆ తర్వాత 2014 ఎన్నికల్లో టీడీపీ తరఫున, 2018, 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగానూ మాగంటి గోపీనాథ్ విజయం సాధించారు. 16 ఏళ్ల తర్వాత మళ్లీ ఇక్కడ కాంగ్రెస్ విజయం సాధించినట్లయింది.

హోం ఓటింగ్‌లోనూ..

85 ఏళ్ల దాటిన వయోధికులు, దివ్యాంగులకు ఇంటి నుంచే ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించింది. ఇందులో భాగంగా 103 మందికి హోం ఓటింగ్ అవకాశం కల్పించింది. దరఖాస్తు చేసిన తర్వాత ఇద్దరు మరణించగా.. 101 ఓట్లు పోలయ్యాయి. వీటిలో 5చెల్లుబాటు కాలేదు. మిగిలిన వాటిలో కాంగ్రెస్‌కు 43, బీఆర్ఎస్‌కు 25, బీజేపీకి 20 ఓట్లు పడ్డాయి. స్వతంత్ర అభ్యర్థులకు ఆరుగురు.. నోటాకు ఇద్దరు ఓటు వేశారు.

గతానికి భిన్నంగా..

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గతానికి భిన్నంగా పుంజుకుంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో షేక్‌పేట డివిజన్‌లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన అజారుద్దీన్‌కు 1,305 ఓట్ల ఆధిక్యం లభించింది. ఇతర ప్రాంతాల్లో కాంగ్రెస్ వెనకబడింది. దీంతో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్ 16,337 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. కానీ ఉప ఎన్నికలో గతంలో బీఆర్ఎస్ ఆధిక్యం చూపిన ప్రాంతాలు ఇప్పుడు కాంగ్రెస్ వైపు నిలిచాయి. బీఆర్ఎస్‌కు అనుకూలంగా ఉందని ప్రచారం జరిగిన వెంగళ్‌రావునగర్, బోరబండ ప్రాంతాల్లోనూ అధికార పార్టీ హవా కొనసాగింది. చెరిసగం ఓట్లు పడే అవకాశముందని భావించిన రహ్మత్‌నగర్, యూసుఫ్‌గూడలోనూ కాంగ్రెస్ వైపు ఓటర్లు మొగ్గు చూపారు. ఎర్రగడ్డలో నూ అధికార పార్టీ ఆధిక్యం సాధించింది.

ఎక్కువ టేబుళ్లు.. త్వరగా ఫలితాలు

ఓట్ల లెక్కింపు త్వరగా పూర్తి చేసేందుకు ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గంలో 407 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. 42 టేబుళ్లు ఏర్పాటు చేసి 10 రౌండ్లలో కౌంటింగ్ పూర్తి చేశారు. ఒక్కో రౌండ్‌లో 42 పోలింగ్ బూత్‌ల ఈవీఎంల్లోని ఓట్ల లెక్కింపు జరిగింది. ఉదయం 8 గంటలకు లెక్కింపు ప్రారంభం కాగా.. చివరి రౌండ్ మధ్యాహ్నం 12.30 గంటలకే పూర్తయింది. తుది ఫలితాన్ని అధికారికంగా 2.25 గంటలకు ప్రకటించారు. లెక్కింపు ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ పర్యవేక్షించారు.

రౌండ్లవారీగా పార్టీలకు వచ్చిన ఓట్లు

రౌండ్	కాంగ్రెస్	బీఆర్ఎస్	బీజేపీ	మెజార్టీ
1	8911	8864	2167	47
2	8963	6015	1308	2948
3	11082	8083	1866	2999
4	9567	6020	1935	3547
5	12283	8983	1273	3300
6	9553	6615	1666	2938
7	9939	5939	1688	4000
8	9293	7418	2320	1875
9	11793	9544	2105	2249
10	7561	6753	713	808
మొత్తం	98945	74234	17041	24711

కలిసొస్తున్న ఉప ఎన్నికలు

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కాంగ్రెస్ పార్టీకి ఉప ఎన్నికలు కలిసొస్తున్నాయి. కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చిన రెండేళ్ల తర్వాత జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లోనూ విజయ దుందుభి మోగించింది. కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో రసవత్తరమైన పోరు జరగకపోయినా.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో హోరాహోరీగా ప్రచార పర్వం సాగింది. గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు మునుగోడు, నాగార్జున సాగర్ ఉప ఎన్నికల్లో ఏవిధంగా పోల్ మేనేజ్‌మెంట్ చేపట్టిందో.. అదే తరహా మేనేజ్‌మెంట్‌ను ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్‌లో అనుసరించింది. ఆ పార్టీకి జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బూత్‌ల వారీగా సరైన పట్టు లేకపోయినా.. అభివృద్ధి మంత్రాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి గెలుపొందింది.

గాంధీభవన్‌లో సంబరాలు

హైదరాబాద్ సిటీ/మర్కుక్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ భారీ మెజార్టీతో గెలుపొందడంతో కాంగ్రెస్ శ్రేణులు బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు. గాంధీభవన్‌లో నిర్వహించిన సంబరాల్లో వీ హనుమంతరావుతో పాటు సీనియర్ కాంగ్రెస్ నేతలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొంతమంది నేతలు 'తగ్గేదేలే.. 2028లో 100', 'రప్పా.. రప్పా' అనే పోస్టర్లు ప్రదర్శించారు. జూబ్లీహిల్స్ గెలుపుపై గాంధీభవన్‌తో పాటు గ్రేటర్ వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు స్వీట్లు పంచి, టపాసులు పేలుస్తూ, నృత్యాలు చేస్తూ సందడి చేశారు. మరోవైపు, మాజీ సీఎం కేసీఆర్ దత్తత గ్రామం అయిన సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లిలో కూడా కాంగ్రెస్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో బాణాసంచా పేల్చి, స్వీట్లు పంచారు.

కాంగ్రెస్ సరికొత్త రికార్డ్!

మెజార్టీలో పి.విష్ణువర్ధన్‌రెడ్డి రికార్డును బద్దలు కొట్టిన నవీన్

ఓట్ల శాతంలోనూ 50.83తో రికార్డు

ఇప్పటి వరకు ఏ అభ్యర్థికీ దక్కని వైనం

హైదరాబాద్ సిటీ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక ఫలితాలు సంచలనం సృష్టించాయి. కాంగ్రెస్ అభ్యర్థి వల్లాల నవీన్‌యాదవ్ తిరుగులేని విజయం సాధించడమే కాకుండా ఈ నియోజకవర్గ చరిత్రలో దశాబ్దంన్నరకు పైగా చెక్కు చెదరకుండా ఉన్న మెజార్టీ రికార్డును బద్దలు కొట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2009లో తొలిసారిగా ఏర్పడిన జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ నుంచి బరిలో దిగిన పి.విష్ణువర్ధన్‌రెడ్డి అప్పట్లో 21,741 మెజార్టీ ఓట్లతో సొంతం చేసుకున్న రికార్డును.. తెలంగాణ ఏర్పడిన తర్వాత 2014, 2018, 2023లలో జరిగిన సాధారణ ఎన్నికల్లో పోటీ పడిన ఏ అభ్యర్థీ కూడా అధిగమించలేకపోయారు. అయితే.. తాజా ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ తన సమీప ప్రత్యర్థి బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతకంటే అధికంగా 24,729 ఓట్ల మెజార్టీ సాధించారు. విష్ణువర్ధన్‌రెడ్డికి వచ్చిన మెజార్టీ 21,741 కంటే కూడా.. నవీన్‌యాదవ్ 2,988 ఓట్లు అధికంగా సాధించారు. కాంగ్రెస్‌కు జూబ్లీహిల్స్ కోటపై రికార్డు స్థాయి విజయాన్ని అందించారు. మరో వైపు ఇప్పటి వరకు జూబ్లీహిల్స్ ఎన్నికల్లో గెలిచిన ఏ అభ్యర్థికీ 50 శాతానికి మించి ఓట్లు రాలేదు. కానీ.. నవీన్‌యాదవ్ మాత్రం తొలిసారి 50.83 శాతం ఓట్లు సాధించారు.

స్వతంత్రులకంటే నోటాకే అధికం

924 ఓట్లు నమోదు



హైదరాబాద్ సిటీ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ఈసారి వివిధ పార్టీల అభ్యర్థులు, స్వతంత్రులకంటే కూడా నోటా(నన్ ఆఫ్ ది ఎబవ్)కే ఎక్కువ ఓట్లు వచ్చిన పరిస్థితి నెలకొంది. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ వంటి ప్రధాన పార్టీలతో కలిపి మొత్తం 58 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. ఇందులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్‌యాదవ్ భారీ మెజార్టీతో విజయం సాధించారు. అయితే ప్రధాన పార్టీల అభ్యర్థుల తర్వాత నోటాకే అత్యధికంగా 924 ఓట్లు రావడం ఆసక్తికరంగా మారింది. ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన ఓ అభ్యర్థికి మరీ దారుణంగా 9 ఓట్లే రావడం చర్చనీయాంశమైంది. ఇదిలా ఉండగా 2023 సాధారణ ఎన్నికల్లో కూడా నోటాకు 1,374 ఓట్లు రావడం గమనార్హం.

ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయను

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్‌యాదవ్

నైతిక విజయం నాదే: మాగంటి సునీత


ఎన్నిక ఫలితంపై డబ్బు ప్రభావం: దీపక్ రెడ్డి

బంజారాహిల్స్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): 'నన్ను నమ్మి భారీ మెజారిటీతో గెలిపించారు. నాపై ప్రజలు, కార్యకర్తలు ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేస్తాను. నన్ను, నా కుటుంబ వ్యక్తిత్వాన్ని కించపరుస్తూ ఓట్లడిగిన కొంత మందికి ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పారు. కక్షపూరిత రాజకీయాలు చేశారు. నేను అలాంటివి చేయదలుచుకోలేదు' అని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలిచిన కాంగ్రెస్ అభ్యర్థి వల్లాల నవీన్ యాదవ్ అన్నారు. 'అందరిని కలుపుకుని ముందుకెళతా. నియోజకవర్గ సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషిచేస్తాను. భారీగా నిధులు తెచ్చేందుకు నా వంతు పని చేస్తాను. రిగ్గింగ్, దౌర్జన్యం చేసినట్టు వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదు. తప్పుడు మాటలు మాట్లాడొద్దు' అని చెప్పారు. ఉప ఎన్నికలో పోటీ చేసి ఓటమి పాలైన బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత మాట్లాడుతూ.. 'మాగంటి గోపీనాథ్ ఉన్నప్పుడు నోరు మెదపని వారూ ఇప్పుడు పట్టపగలే ప్రజలను భయభ్రాంతులను గురి చేశారు. పోలింగ్‌కు 2 రోజుల ముందు బహిరంగంగా డబ్బు పంచి ఓట్లు కొనుక్కున్నారు. దౌర్జన్యం చేసి బెదిరించడంతో ప్రజలు ఓట్లేశారు. ఒక మహిళను ఓడించడానికి సీఎం, మంత్రులంతా రంగంలోకి దిగారు. నైతికంగా నాదే విజయం' అని చెప్పారు. బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి మాట్లాడుతూ.. ఉప ఎన్నిక ఫలితంపై డబ్బు ప్రభావం ఉందన్నారు. బీజేపీ డబ్బు రాజకీయాలకు దూరంగా ఉంటుందన్నారు. అయినా నేను ప్రజలకు అందుబాటులో ఉంటడంతోపాటు ఎవరికే అవసరమొచ్చినా తనను సంప్రదించవచ్చునన్నారు.

మురిపించిన 3 డివిజన్లు

కాంగ్రెస్ మొత్తం మెజార్టీలో వాటి నుంచే

61 శాతం దన్నుగా నిలిచిన రహమత్‌నగర్, యూసుఫ్‌గూడ, వెంగళరావునగర్




యూసుఫ్‌గూడలో నవీన్‌యాదవ్ భారీ ర్యాలీ

హైదరాబాద్ సిటీ బ్యూరో ప్రతినిధి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉత్కంఠ రేపిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ విజయం సాధించి, బీఆర్ఎస్‌కు చెందిన సిట్టింగ్ స్థానాన్ని ఎగరేసుకుపోయింది. అయితే, ఇక్కడి ఓట్ల గణాంకాలు విప్పుతున్న గెలుపు గుట్టు ఏమిటి? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఈ నియోజకవర్గ పరిధిలో మొత్తం ఆరు డివిజన్ల ఉండగా.. సోమాజిగూడ డివిజన్ కొంత భాగం కూడా నియోజకవర్గ పరిధిలో ఉంటుంది. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు వచ్చిన మెజార్టీలో కీలక భూమిక పోషించింది మాత్రం రహమత్ నగర్ డివిజన్. ఇక్కడ 6,025 ఓట్ల మెజార్టీని ఆయన సొంతం చేసుకున్నారు. మొత్తం ఆరున్నర డివిజన్లలో కేవలం మూడు డివిజన్లలో వచ్చిన మెజార్టీనే మొత్తం మెజార్టీలో 61 శాతం కావటం విశేషం. రహమత్ నగర్, యూసఫ్‌గూడ, వెంగళరావునగర్‌లలో వచ్చిన ఆధిక్యత కాంగ్రెస్ అభ్యర్థి మెజార్టీని పాతిక వేల మార్కుకు దగ్గరగా తీసుకొచ్చింది.ఉత్సాహాన్నిచ్చిన షేక్‌పేటగత అసెంబ్లీ ఎన్నికల్లో షేక్‌పేట డివిజన్‌లో అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి అజారుద్దీన్ ఆధిక్యత సాధించారు. అయితే, ఉప ఎన్నికలో ఇక్కడ తమకు మెజార్టీ వచ్చే అవకాశం లేదని కాంగ్రెస్ వర్గాలు భావించాయి. అదే సమయంలో బీఆర్ఎస్ వర్గాలు షేక్‌పేట డివిజన్‌లో తమకు 3 వేల వరకు మెజార్టీ వస్తుందని బలంగా నమ్మాయి. అంచనాలకు భిన్నంగా ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థికి 1,940 మెజార్టీ రావటం గమనార్హం. షేక్‌పేట డివిజన్ మొత్తంలో 76 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. ఓట్ల లెక్కింపు మొదటి రౌండ్ పరిధిలోకి వచ్చిన 42 కేంద్రాల్లో కలిపి కాంగ్రెస్‌కు 47 ఓట్ల మెజార్టీ వచ్చింది. అయితే, వీటిలో బీఆర్ఎస్ కంటే కాంగ్రెస్‌కు ఎక్కువగా ఓట్లు వచ్చిన కేంద్రాలు 20 మాత్రమే. షేక్‌పేట డివిజన్‌లోని మిగిలిన పోలింగ్ కేంద్రాల ఓట్లను రెండు, మూడు రౌండ్లలో ఎర్రగడ్డ, వెంగళరావునగర్ డివిజన్ల పరిధిలోని మరికొన్ని పోలింగ్ కేంద్రాలతో కలిపి లెక్కించారు. కాంగ్రెస్‌కు అధిక మెజార్టీ వచ్చిన డివిజన్లలో వెంగళరావునగర్ రెండో స్థానంలో నిలిచింది. ఈ ఎన్నికలో కాంగ్రెస్‌కు రహమత్‌నగర్ కొండంత అండగా నిలిచింది. ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థికి అత్యధికంగా 6,025 ఓట్ల మెజార్టీ లభించింది. క్వారీ స్థలాలు ఎక్కువగా ఉండే ఈ డివిజన్‌లో వడ్డెర సామాజిక వర్గం ఓటర్లు అధికంగా ఉంటారు. ఈ సామాజిక వర్గానికి చెందిన ముఖ్యనేత ఒకరు ఎన్నికలో కాంగ్రెస్ తరఫున పని చేయటం ఆ పార్టీకి లాభించింది. ఈ ప్రాంతంలో పీజేఆర్ సానుభూతి పరులు ఎక్కువగా ఉన్నారు. ఆయన శిష్యులు పలువురు కాంగ్రెస్ తరఫున పని చేయటం కూడా సానుకూల ఫలితానికి కారణమైంది. తమకు నష్టం చేసే డివిజన్లలో బోరబండ ఒకటి అని కాంగ్రెస్ వర్గాల్లో ఆందోళన ఉండేది. అయితే, స్థానిక నేతలను తమవైపు తిప్పుకోవటంలో విజయం సాధించటంతో కాంగ్రెస్ 2,842 ఓట్ల మెజార్టీ సాధించగలిగింది.

ఊహించని మెజార్టీ

ఓట్ల లెక్కింపులో రౌండ్ల వారీగా చూసినప్పుడు కాంగ్రెస్‌కు అత్యధిక మెజార్టీ ఏడో రౌండ్‌లో వచ్చింది. ఈ రౌండ్‌లో 4,000 వేల ఓట్ల మెజార్టీ సాధించింది. ఈ రౌండ్ పరిధిలోకి యూసఫ్‌గూడ, సోమాజిగూడ వస్తాయి. ఇందులో యూసఫ్‌గూడ తమకు అనుకూలంగా ఉంటుందని.. సోమాజిగూడలో వ్యతిరేక ఫలితం వస్తుందని కాంగ్రెస్ నేతలు భావించగా, అందుకు భిన్నంగా రెండు డివిజన్లలోనూ ఆ పార్టీకి ఆధిక్యత రావటం విశేషం.



విజయం సాధించిన నవీన్ యాదవ్‌కు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికల ప్రచారంలో తాను ఇన్‌చార్జిగా పనిచేసిన యూసుఫ్‌గూడ డివిజన్‌లోనే కాంగ్రెస్‌కు అధిక మెజార్టీ వచ్చిందని, అది తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. పోల్‌మేనేజ్‌మెంట్ సహకారం అందించిన ఆరా సంస్థకు చెందిన మస్తాన్‌కు ధన్యవాదాలు తెలిపారు.



కాంగ్రెస్ పార్టీ విజయం.. బీఆర్ఎస్ నేతలకు చెంపపెట్టు అని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కాంగ్రెస్ పాలనకు ఈ ఎన్నికలు రెఫరెండం అన్న కేటీఆర్.. ఇప్పుడు ముఖం ఎక్కడ పెట్టుకుంటారని శుక్రవారం ప్రశ్నించారు. ఇకనైనా తప్పుడు ఆరోపణలు మాని అభివృద్ధికి సహకరించాలని హితవు పలికారు.

పట్టు వదలని విక్రమార్కుడు



ముచ్చటగా మూడో ప్రయత్నంలో..

గతంలో రెండుసార్లు జూబ్లీహిల్స్‌లో పోటీచేసి ఓటమి

మూడో ప్రయత్నంలో కలసాకారం చేసుకున్న యువ నేత

హైదరాబాద్ సిటీ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేగా అసెంబ్లీలో అడుగుపెట్టాలని పదేళ్లుగా పట్టిన పట్టు వదలకుండా ప్రయత్నిస్తున్న వల్లాల నవీన్‌యాదవ్.. ఎట్టకేలకు మూడో ప్రయత్నంలో తన కలను నిజం చేసుకున్నారు. నిజానికి ఆయన తండ్రి చిన్న శ్రీశైలం యాదవ్ కూడా ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు గతంలో తీవ్రంగా ప్రయత్నించారు. చిన్న శ్రీశైలంకు చాలాసార్లు పలు రాజకీయ పార్టీలు ఎమ్మెల్యే టికెట్ ఆశచూపి, చివరకు మొండిచెయ్యి చూపాయి. తన కుటుంబం నుంచి ఎమ్మెల్యే ఉండాలన్న ఆయన ఆశయాన్ని చివరకు ఆయన కుమారుడు సాధించాడు. నవీన్‌యాదవ్ 2014లో ఎంఐఎం తరఫున పోటీ చేసి 41,656 ఓట్లు (25.19 శాతం) సాధించి రెండో స్థానంలో నిలిచారు. ఆ ఎన్నికల్లో ఆయన టీడీపీ తరఫున పోటీచేసిన మాగంటి గోపీనాథ్ చేతిలో ఓడిపోయారు. 2018లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసిన నవీన్‌యాదవ్.. 18,817 ఓట్లు (12.09 శాతం) సాధించి మూడో స్థానానికి పరిమితమయ్యారు. 2023 ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయన.. ఎమ్మెల్యే టికెట్ కోసం ప్రయత్నించగా.. మాజీ క్రికెటర్ అజారుద్దీన్‌కు టికెట్ లభించింది. దీంతో భవిష్యత్‌లో అవకాశం ఇస్తామని అప్పుడే కాంగ్రెస్ పెద్దలు నవీన్‌యాదవ్‌కు హామీ ఇచ్చారు. అన్నట్లుగానే ఉప ఎన్నికల్లో ఆయనకు టికెట్ ఇవ్వటంతో 98,988 ఓట్లు సాధించి, మాగంటి గోపీనాథ్ సతీమణి సునీతపై 24,729 ఓట్ల మెజార్టీతో గెలిచారు. నవీన్‌యాదవ్ కుటుంబానికి మొదటి నుంచీ కాంగ్రెస్ దివంగత నేత పీ జనార్దన్‌రెడ్డితోపాటు ఎన్టీఆర్, చంద్రబాబు, వైఎస్సార్, కేసీఆర్ కుటుంబాలతో పరిచయాలున్నాయి.

పెరిగిన కాంగ్రెస్ ఓటు బ్యాంక్!




హైదరాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ క్రమంగా ఓట్లు పెంచుకుంటూ వస్తోంది. వరుసగా గత మూడు ఎన్నికల్లో ఆ పార్టీ ఓటు బ్యాంక్ పెరిగింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీకి 64,212 ఓట్లు రాగా.. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో 89,705 ఓట్లు వచ్చాయి. తాజా ఉప ఎన్నికలో ఆ పార్టీ ఓటు బ్యాంకు మరింత పెరిగి.. 98,988కి చేరింది. చిత్రం ఏమిటంటే.. 2024 పార్లమెంట్ ఎన్నికల్లోనూ, 2025 ఉప ఎన్నికలోనూ కాంగ్రెస్‌కు వచ్చిన ఓట్ల శాతం ఒకే రకంగా 50.83 శాతం చొప్పున ఉంది. కానీ.. ఆ పార్టీకి వచ్చిన ఓట్లలో మాత్రం 9,283 వ్యత్యాసముంది. పోలైన మొత్తం ఓట్ల సంఖ్య 2024 పార్లమెంట్ ఎన్నికల్లో 1,76,466 ఓట్లు కాగా.. ఈ ఉప ఎన్నికలో 1,94,631 ఓట్లు రికార్డయ్యాయి.

వరుసగా 3 ఎన్నికల్లో పార్టీల వారీగా వచ్చిన ఓట్ల వివరాలు

	కాంగ్రెస్	బీఆర్ఎస్	బీజేపీ
2023 అసెంబ్లీ	64,212 (35.03)	80,549 (43.94)	25,866 (14.11)
2024 పార్లమెంట్	89,705 (50.83)	18,405 (10.4)	64,673 (36.64)
2025 ఉపఎన్నిక	98,988 (50.83)	74,259 (38.13)	17,061 (8.76)

ఉప ఎన్నిక అభ్యర్థి గుండెపోటుతో మృతి


అన్వర్ (ఫైల్)

ఎర్రగడ్డ, నవంబర్ 14 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో నేస్తం నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసిన అభ్యర్థి మొహమ్మద్ అన్వర్ (40) గుండెపోటుతో మృతిచెందారు. హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ బి.శంకర్‌లాల్ నగర్‌కు చెందిన అన్వర్‌కు గురువారం ఉదయం గుండెపోటు రావడంతో కేర్ ఆస్పత్రికి తీసుకెళ్లగా స్టెంట్ వేశారు. అదేరోజు రాత్రి మరోసారి గుండెపోటు రావడంతో ప్రాణాలు కోల్పోయారు. ఆయనకు భార్య, ముగ్గురు కూమార్తెలున్నారు. ఈ ఎన్నికలో అన్వర్‌కు 24 ఓట్లు వచ్చాయి.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,27,850 ▲	1,17,200 ▲	1,83,100 ▲
విజయవాడ	1,29,000 ▼	1,21,000 ▼	1,64,400 ▼
విశాఖపట్నం	1,28,610 ▼	1,17,150 ▲	1,83,100 ▲
రాజమండ్రి	1,27,850 ▼	1,17,200 ▼	1,65,000 ▼
ప్రొద్దుటూరు	1,27,000 ▲	1,16,840 ▲	1,64,500 ▼
ముంబై	1,24,794 ▼	1,14,311 ▼	1,59,367 ▼

అందరికీ పెన్షన్ మా లక్ష్యం

వృద్ధాప్యాని కల్లా సంపన్నులు కావాలి

పీఎఫ్ఆర్‌డీఏ చైర్‌పర్సన్ రామన్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేసే అందరికీ పెన్షన్ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకురావటమే తమ లక్ష్యమని పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్ఆర్‌డీఏ) చైర్‌పర్సన్ ఎస్ రామన్ తెలిపారు. ఇందుకోసం 'వృద్ధాప్యం సమీపించే లోపే ధనవంతులు కండి' అనే నినాదంతో పనిచేస్తున్నట్టు ప్రకటించారు. నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్) ఎంపవరింగ్ కార్పొరేట్స్, ఎనేబిలింగ్ భారత్ అనే అంశంపై జరిగిన ఒక సదస్సులో ఆయన ఈ విషయం ప్రకటించారు. దేశంలో 55 కోట్ల మంది ఉద్యోగుల్లో సంఘటిత రంగంలో పనిచేస్తున్న 10 కోట్ల మంది ఉద్యోగులకు మాత్రమే ప్రస్తుతం పెన్షన్ సదుపాయం ఉందన్నారు. 20-40 సంవత్సరాల మధ్య వయసు ఉన్న సంఘటిత రంగంలోని ఉద్యోగుల్లోనూ చాలా మందికి పెన్షన్ పథకాలపై సరైన అవగాహన లేదన్నారు. ప్రతి ఒక్కరూ బ్యాంకు ఖాతా తెరిచేటప్పుడే తమ రిటైర్మెంట్ జీవితానికి ఆర్థిక చేయూత ఇచ్చే పెన్షన్ ఫండ్ ఖాతా కూడా ప్రారంభించాలని రామన్ కోరారు.

నెలకు రూ.3,000 పెట్టుబడితో పెన్షన్ ఫండ్ ఖాతా ప్రారంభించి ఏటా 2-3 శాతం పెంచుకుంటూ పోతే ఏటా సగటున 9.2 శాతం రాబడులు పొందవచ్చన్నారు. ఇప్పుడు అందుబాటులో ఉన్న టెక్నాలజీ సాయంతో మొబైల్ ఫోన్ ద్వారా రెండు మూడు నిమిషాల్లోనే పెన్షన్ ఫండ్ ఖాతా ఓపెన్ చేయవచ్చన్నారు. పెన్షన్ ఫండ్ ఖాతా చెల్లింపులూ అంతే ఈజీగా చేయవచ్చని పీఎఫ్ఆర్‌డీఏ చైర్‌పర్సన్ రామన్ తెలిపారు.

ఎగుమతి ఆదాయాలు 15 నెలల్లో తెచ్చుకోవచ్చు

అమెరికా సుంకాల నేపథ్యంలో ఆర్‌బీఐ ఊరట



ముంబై: ఎగుమతిదారులకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) భారీ ఊరట కల్పించింది. ఎగుమతుల ద్వారా వచ్చిన ఆదాయాలను వారు 15 నెలల్లోగా దేశానికి తెచ్చుకోవచ్చంటూ నిబంధన సడలించింది. ఇప్పటి వరకు ఈ గడువు 9 నెలలే ఉండేది. భారతీయ ఎగుమతులపై అమెరికా ఆగస్టు నుంచి సుంకాలు 50 శాతానికి పెంచిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఎగుమతిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిగణనలోకి తీసుకుని ఆర్‌బీఐ ఈ సడలింపు ఇచ్చింది. విదేశీ మారక ద్రవ్య నిర్వహణ (వస్తుసేవల ఎగుమతులు) నిబంధనలకు సవరణలు చేయడంతో ఆర్‌బీఐ కూడా తన నిబంధనల్లో తగు మార్పులు చేసింది. విదేశీ మారక ద్రవ్య నిర్వహణ (వస్తు సేవల ఎగుమతులు) (రెండో సవరణ) నిబంధనలు, 2025 పేరిట ఆర్‌బీఐ రీజినల్ డైరెక్టర్ రోహిత్.పి.దాస్ నవంబరు 13వ తేదీతో గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నోటిఫికేషన్ గెజిట్‌లో అధికారికంగా ప్రచురించిన తేదీ నుంచి ఈ కొత్త నిబంధన అమలులోకి వస్తుందని ఆర్‌బీఐ తెలిపింది. గతంలో కొవిడ్ సమయంలో కూడా 2020 సంవత్సరంలో ఎగుమతిదారులకు ఇలాంటి సడలింపు ఇచ్చారు. ఎగుమతిదారులకు ప్రయోజనం చేకూర్చే లక్ష్యంతో బుధవారం నాటి సమావేశంలో కేంద్ర క్యాబినెట్ రూ.45,000 కోట్ల విలువ గల రెండు పథకాలకు ఆమోదముద్ర వేసిన విషయం విదితమే.

కేంద్ర బ్యాంక్ ప్రకటనలు సమతూకంగా ఉండాలి

కేంద్ర బ్యాంక్ చేసే ప్రకటనలు పారదర్శకత, గోప్యత రెండింటి మధ్య సమతూకంగా ఉండాలని ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ శిరీష్ చంద్ర ముర్ము సూచించారు. సీసెన్ సెంటర్, ఆర్‌బీఐ ఉమ్మడిగా నిర్వహించిన కేంద్ర బ్యాంక్ అకౌంటింగ్ విధానాల అంతర్జాతీయ సదస్సులో ప్రధానోపన్యాసం చేస్తూ కేంద్ర బ్యాంకుల ప్రధాన బాధ్యత ద్రవ్య విధానం, ఆర్థిక స్థిరత్వం నెలకొల్పడమే అయినప్పటికీ అవి జారీ చేసే ఆదేశాలు విభిన్న అధికార పరిధుల్లో ఉంటాయని ఆయన తెలిపారు. అయితే కేంద్ర బ్యాంకులకు ప్రపంచవ్యాప్తంగా వర్తించే అకౌంటింగ్ ప్రమాణం ఒక్కటీ లేదని, అందువల్ల కేంద్ర బ్యాంకులు అనుసరించే ప్రమాణాల్లో నిర్దిష్ట స్వభావం, లోతు, ప్రాధాన్యత ఉండాలని ముర్ము సూచించారు.

రూ.1,000లోపు ఉత్పత్తులకు జీరో కమీషన్

ప్రకటించిన ఫ్లిప్‌కార్ట్

న్యూఢిల్లీ: దేశీయ ఈ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్.. రూ.1,000 లోపు ఉత్పత్తులకు జీరో కమీషన్ మోడల్‌ను ప్రవేశపెట్టింది. ఫ్లిప్‌కార్ట్‌కు చెందిన హైపర్ వాల్యూ ప్లాట్‌ఫామ్ షాప్సీ.కామ్‌లోనైతే ధరతో సంబంధం లేకుండా అన్ని ఉత్పత్తులకు జీరో కమీషన్ మోడల్ వర్తిస్తుంది. ఈ మోడల్‌లో భాగంగా తమ ప్లాట్‌ఫామ్‌లో రూ.1,000 లోపు ఉత్పత్తులను లిస్ట్ చేసే అర్హులైన విక్రేతల నుంచి ఎలాంటి కమీషన్ వసూలు చేయబోమని ఫ్లిప్‌కార్ట్ స్పష్టం చేసింది. సూక్ష్మ, చిన్న, మధ్య స్థాయి పరిశ్రమల (ఎంఎస్ఎంఈ)ను ప్రోత్సహించడమే దీని ముఖ్యోద్దేశమని తెలిపింది. తద్వారా కస్టమర్లకు అందుబాటు ధరల్లో ఉత్పత్తులు లభిస్తాయని, విక్రేతలకు వ్యాపార వ్యయం తగ్గుతుందని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఫ్లిప్‌కార్ట్ పేర్కొంది.

నష్టాల్లోకి జీవీకే పవర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దివాలా ప్రక్రియలో ఉన్న జీవీకే పవర్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (జీవీకేపీఐఎల్) సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.1.21 కోట్ల నికర నష్టాలను ప్రకటించింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో కంపెనీ రూ.811.19 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. సమీక్షా త్రైమాసికంలో మొత్తం ఆదాయం రూ.412.80 కోట్ల నుంచి ఏకంగా రూ.1.32 కోట్లకు పడిపోయింది. దివాలా ప్రక్రియలో భాగంగా బ్యాంకులు/రుణదాతల ద్వారా సంస్థకు చెందిన వివిధ రుణ ఖాతాలను నిరర్థక ఆస్తులుగా ప్రకటించటంతో పాటు రుణాల రీపేమెంట్స్, వడ్డీల్లో జాప్యం వంటి వాటి కారణంగా నష్టాలను ప్రకటించాల్సి వచ్చిందని కంపెనీ పేర్కొంది.

తగ్గిన నాట్కో లాభం

క్యూ2లో 518 కోట్లుగా నమోదు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): నాట్కో ఫార్మా.. సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికం (క్యూ2)లో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.517.90 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలం (రూ.676.50 కోట్లు)తో పోల్చితే లాభం 23.44 శాతం తగ్గింది. ఆర్ అండ్ డీ వ్యయాలు పెరిగిపోవటంతో పాటు వన్ టైమ్ ఎంప్లాయీ బోనస్ పనితీరుపై ప్రభావం చూపించిందని కంపెనీ తెలిపింది. త్రైమాసిక సమీక్షా కాలంలో కంపెనీ మొత్తం ఆదాయం రూ.1,434.90 కోట్ల నుంచి రూ.1,463 కోట్లకు పెరిగింది. ఈ కాలంలో మొత్తం వ్యయాలు రూ.616.70 కోట్ల నుంచి రూ.849.30 కోట్లకు పెరిగినట్లు నాట్కో వెల్లడించింది. సెప్టెంబరు త్రైమాసికంలో ఫార్ములేషన్స్ ఎగుమతుల ఆదాయం రూ.1,147 కోట్లు, దేశీయ ఫార్ములేషన్స్ ఆదాయం రూ.105.40 కోట్లుగా ఉండగా ఏపీఐ విభాగం రెవెన్యూ రూ.53.9 కోట్లుగా ఉంది. కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గాను రూ.2 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు రూ.1.50 రెండో మధ్యంతర డివిడెండ్‌ను కంపెనీ ప్రకటించింది.

రూ.532 కోట్లతో శ్రీసిటీ ప్లాంట్ విస్తరణ

బాల్ కార్పొరేషన్

న్యూఢిల్లీ: అమెరికాకు చెందిన సస్టేనబుల్ అల్యూమినియం ప్యాకేజింగ్ రంగంలో కార్యకలాపాలు సాగించే బాల్ కార్పొరేషన్.. ఆంధ్రప్రదేశ్, శ్రీసిటీలోని తమ ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యాల విస్తరణపై దృష్టి పెట్టింది. 6 కోట్ల డాలర్ల (రూ.532.5 కోట్లు) వ్యయంతో ఆ ప్లాంట్‌ను విస్తరించనున్నట్టు ప్రకటించింది. ఆసియాలో అమిత వేగంగా వృద్ధి చెందుతున్న వినియోగ మార్కెట్లో పెరుగుతున్న అవసరాలు తీర్చేందుకు, ప్రాంతీయ సరఫరా వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు ఈ పెట్టుబడి ఉపయోగపడుతుందని కంపెనీ తెలిపింది. 2024లో బాల్ కార్పొరేషన్ 5.5 కోట్ల (రూ.488 కోట్లు) వ్యయంతో మహారాష్ట్రలోని తలోజాలో క్యాన్ల తయారీ ప్లాంట్ ఏర్పాటు చేసింది. భారత్‌లో అల్యూమినియం ప్యాకేజింగ్‌ను ఎంచుకుంటున్న ప్రజలు, బ్రాండ్ల సంఖ్య నానాటికీ పెరుగుతున్న నేపథ్యంలో మరిన్ని పెట్టుబడి అవకాశాల కోసం కూడా అన్వేషిస్తున్నట్టు కంపెనీ ప్రెసిడెంట్ (ఈఎంఈఏ, ఆసియా) మాండీ గ్లూ తెలిపారు. తలోజా, శ్రీసిటీ ప్లాంట్ల ద్వారా ఈ కంపెనీ దేశీయ, ప్రపంచ మార్కెట్ల కోసం 185 ఎంఎల్, 250 ఎంఎల్, 330 ఎంఎల్, 500 ఎంఎల్ క్యాన్లు తయారుచేస్తోంది.

చివర్లో కొనుగోళ్లతో లాభాల్లోకి..

84 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

ముంబై: వారాంతం ట్రేడింగ్‌లో స్టాక్ మార్కెట్ సూచీలు రోజంతా నష్టాల్లో కొనసాగినప్పటికీ, ఆఖరి అరగంటలో కొనుగోళ్లు భారీగా పుంజుకోవడంతో స్వల్ప లాభాలతో ముగిశాయి. బిహార్ ఎన్నికల్లో ఎన్‌డీఏ భారీ విజయం సాధించడం ఇందుకు ఒకింత దోహదపడింది. గురువారం ముగింపు స్థాయితో పోలిస్తే, శుక్రవారం 449.35 పాయింట్ల నష్టంతో ప్రారంభమైన సెన్సెక్స్.. ఎఫ్ఎంసీజీ, బ్యాంకింగ్, టెలికాం స్టాక్స్‌లో కొనుగోళ్లతో 84.11 పాయింట్ల లాభంతో 84,562.78 వద్ద స్థిరపడింది.

నిఫ్టీ కూడా 138.35 పాయింట్ల నష్టంతో ట్రేడింగ్ ఆరంభించినప్పటికీ, చివరికి 30.90 పాయింట్ల వృద్ధితో 25,910.05 వద్ద క్లోజైంది. సూచీలు లాభపడటం వరుసగా ఇది నాలుగో రోజు. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 19 లాభపడ్డాయి.

- ఢిల్లీ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత బంగారం 10 గ్రాముల రేటు రూ.1,500 తగ్గి రూ.1,29,400కు జారుకుంది. కిలో వెండి రూ.4,200 తగ్గి రూ.1,64,800కు జారుకుంది. ఇంటర్నేషనల్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ రేటు దాదాపు ఒక శాతం తగ్గి 4,137 డాలర్లకు దిగిరాగా.. సిల్వర్ 52.03 డాలర్లకు పరిమితమైంది.

21న కోటక్ బ్యాంక్ షేర్ల విభజనపై నిర్ణయం: దేశంలో మూడో అతిపెద్ద ప్రైవేట్ బ్యాంకింగ్ సంస్థ కోటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లను విభజించనుంది. ఈ ప్రతిపాదనపై 21న జరగనున్న సమావేశంలో తమ బోర్డు నిర్ణయం తీసుకోనుందని బ్యాంక్ వెల్లడించింది. 15 ఏళ్ల క్రితం (2010లో) ఈ బ్యాంక్ ఒక షేరును రెండుగా విభజించింది.

శరత్ ఇండస్ట్రీస్ లాభంలో 54% వృద్ధి

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు కేంద్రంగా రొయ్యల సాగు, ఎగుమతి, దాణా వ్యాపారాలను నిర్వహిస్తున్న శరత్ ఇండస్ట్రీస్ సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ.149.73 కోట్ల ఆదాయంపై రూ.5.74 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలం (రూ.3.73 కోట్లు)తో పోల్చితే లాభం 54 శాతం వృద్ధి చెందింది. కొత్త ప్రాంతాలకు విస్తరించటం, కొత్త మార్కెట్లలో ఉత్పత్తులను విడుదల చేయటం ఎంతగానో కలిసివచ్చిందని కంపెనీ పేర్కొంది. అమెరికా సుంకాల ప్రభావం గణనీయంగా ఉండటంతో రష్యా, చైనా వంటి మార్కెట్లకు కొత్త ఉత్పత్తులను విడుదల చేయటం కలిసి వచ్చిందని కంపెనీ ఈడీ శరత్ రెడ్డి తెలిపారు. అమెరికా సుంకాల ప్రభావం ఉన్నప్పటికీ ఆ దేశానికి ఎగుమతులు కొనసాగుతూనే ఉన్నాయని ఆయన చెప్పారు.

27 నెలల కనిష్ఠానికి టోకు ద్రవ్యోల్బణం

న్యూఢిల్లీ: పప్పులు, కూరగాయలు వంటి నిత్యావసర వస్తువుల ధరలు తగ్గడంతో అక్టోబరు నెలలో టోకు ద్రవ్యోల్బణం 27 నెలల కనిష్ఠ స్థాయి మైనస్ (-) 1.21 శాతానికి దిగి వచ్చింది. సెప్టెంబరు నెలలో ఇది 0.13% ఉండగా గత ఏడాది అక్టోబరులో 2.75% ఉంది. ఉల్లి, బంగాళాదుంప, కూరగాయలు, పప్పుల ధరలు తగ్గడంతో ఆహార వస్తువుల విభాగంలో ధరల తగ్గుదల రేటు 8.31% ఉంది. కూరగాయల ధరలు 34.97% మేరకు తగ్గాయి. తయారీ వస్తువుల విభాగంలో సైతం ధరల తగ్గుదల 1.54% ఉంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

15వ తేదీ			
హైదరాబాద్	605	విజయవాడ	625
వరంగల్	607	గోదావరి	615
చిత్తూరు	653	విశాఖపట్నం	600
		దజను గుడ్లు రూ. 84	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	112	విజయవాడ	111
వరంగల్	112	గుంటూరు	115
కరీంనగర్	112	ఒంగోలు	115
మహబూబ్‌నగర్	112	చిత్తూరు	117
కర్నూలు	112	నెల్లూరు	122
విశాఖపట్నం	110	అనంతపురం	122
గోదావరి	111		


ధీరజ్

ధీరజ్ పసిడి పట్టాడు..

అంకిత, రికర్వ్ పురుషుల జట్టుకు స్వర్ణాలు

ఆసియా ఆర్చరీ చాంపియన్‌షిప్

ఢాకా: ఆసియా ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో చివరిరోజు భారత రికర్వ్ ఆర్చర్లు అదరహో అనిపించారు. శుక్రవారం ముగిసిన ఈ పోటీల్లో మూడు స్వర్ణాలు సహా ఓ రజతం, కాంస్యం సాధించారు. ఇక, స్వర్ణం నెగ్గిన వాళ్లలో ధీరజ్ బొమ్మదేవర కూడా ఉండడం విశేషం. పురుషుల వ్యక్తిగత రికర్వ్ ఈవెంట్ ఫైనల్లో విజయవాడ ఆర్చర్ ధీరజ్ 6-2తో భారత్‌కే చెందిన రాహుల్‌ను ఓడించి పసిడి పట్టేశాడు. దీంతో ఈ విభాగంలో స్వర్ణం, రజతం భారత్ ఖాతాలోకే చేరాయి. ఇక, మహిళల వ్యక్తిగత రికర్వ్ తుదిపోరులో భారత ఆర్చర్ అంకితా భకత్ 7-3తో సుహేన్ (కొరియా)ను చిత్తుచేసి స్వర్ణం దక్కించుకుంది. ఇదే విభాగం కాంస్యం పోరులో భారత అమ్మాయి సంగీత షూటాఫ్‌లో 6-5తో సహచర ఆర్చర్, దీపికా కుమారిపై నెగ్గి పతకం అందుకుంది. ఇక, పురుషుల రికర్వ్ టీమ్ ఈవెంట్ ఫైనల్లో యశ్‌దీప్, అతాను దాస్, రాహుల్‌లతో కూడిన భారత త్రయం 5-4తో కొరియాను ఓడించి 18 ఏళ్ల తర్వాత తొలిసారి పసిడి పతకం సొంతం చేసుకుంది. రికర్వ్ టీమ్‌లో భారత పురుషుల జట్టు చివరిసారిగా 2007లో విజేతగా నిలిచింది. ఇక, ఈసారి భారత్ 6 స్వర్ణాలు, 3 రజతాలు, ఓ కాంస్యంతో కలిపి మొత్తం 10 పతకాలతో అగ్రస్థానం అందుకొంది.

స్పోర్ట్స్



ఇషా కంచు మోత

వ్యక్తిగత విభాగంలో తొలి పతకం

షూటింగ్ ప్రపంచ చాంపియన్‌షిప్

కైరో (ఈజిప్టు): తెలుగు షూటర్ ఇషా సింగ్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో తొలి వ్యక్తిగత పతకం సాధించింది. మహిళల 25 మీటర్ల పిస్టల్ వ్యక్తిగత విభాగంలో ఇషా కాంస్యం సాధించింది. ఫైనల్స్‌లో ఇషా 30 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంలో నిలిచింది. చైనా షూటర్ యావో కియాన్‌గ్జున్ (38) రజతం దక్కించుకోగా, కొరియాకు చెందిన ఒలింపిక్ చాంపియన్ యాంగ్ జిన్ (40) స్వర్ణం కొల్లగొట్టింది. కాగా, హైదరాబాద్ షూటర్ ఇషాకు ఈ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఇది మూడో పతకం కావడం విశేషం. ఇప్పటికే ఆమె 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో మిక్స్‌డ్ టీమ్‌తో పాటు మహిళల టీమ్ ఈవెంట్‌లో రజతాలు నెగ్గింది. ఇషాకిది ఓవరాల్‌గా ఐదో ప్రపంచ చాంపియన్‌షిప్ పతకం. 2023లో బాకు వేదికగా జరిగిన టోర్నీలో మహిళల టీమ్, మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్లలో ఇషా స్వర్ణాలు అందుకుంది. కాగా, ఈ టోర్నీలో భారత్ మూడు స్వర్ణాలు, ఐదు రజతాలు, నాలుగు కాంస్యాలతో మూడో స్థానంలో ఉంది. 10 స్వర్ణాలతో చైనా టాప్‌లో, 6 స్వర్ణాలతో కొరియా రెండో స్థానంలో కొనసాగుతున్నాయి.

వైభవ్ విధ్వంసం

- 32 బంతుల్లో శతకం
- భారత్ 'ఏ' భారీ విజయం

యూఏఈతో టీ20



1 35 అంతకన్నా తక్కువ బంతుల్లోనే రెండు టీ20 సెంచరీలు బాదిన ఏకైక బ్యాటర్‌గా వైభవ్. ఈ ఏడాది ఐపీఎల్‌లో తను రాజస్థాన్ తరఫున 35 బంతుల్లో శతకం సాధించాడు.

దోహా: ఆసియాకప్ రైజింగ్ స్టార్స్‌లో భాగంగా యూఏఈతో జరిగిన రెండో టీ20లో టీనేజీ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ ఏకంగా 32 బంతుల్లోనే సెంచరీ బాదేశాడు. మొత్తంగా 42 బంతులు ఎదుర్కొన్న 14 ఏళ్ల వైభవ్ 11 ఫోర్లు, 15 సిక్సర్లతో 144 పరుగులు సాధించాడు. అతడి ధాటికి భారత్ 'ఏ' 148 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా భారత్ 'ఏ' 20 ఓవర్లలో 297/4 స్కోరు సాధించింది. 16 బంతుల్లోనే హాఫ్ సెంచరీ చేసిన వైభవ్ మరో 16 బంతుల్లో శతకం సాధించాడు. భారీ ఛేదనలో యూఏఈ 20 ఓవర్లలో 149/7 స్కోరుకే పరిమితమైంది.

అర్జున్, హరి గేమ్‌లు డ్రా

పనాజి (గోవా): ఫిడే ప్రపంచ కప్‌లో ఐదో రౌండ్‌ను అర్జున్, హరికృష్ణ డ్రాలతో మొదలుపెట్టారు. శుక్రవారం జరిగిన ఐదో రౌండ్ తొలి గేమ్‌లో అరోనియన్ (అమెరికా)తో అర్జున్.. మెక్సికోకు చెందిన జోస్ మార్టినెజ్‌తో హరికృష్ణ పాయింట్ పంచుకున్నారు.

సెమీస్‌లో లక్ష్య సేన్

కుమమోటో: భారత స్టార్ షట్లర్ లక్ష్య సేన్ జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో సెమీఫైనల్‌కు చేరుకున్నాడు. లక్ష్య క్వార్టర్స్‌లో మాజీ వరల్డ్ చాంపియన్ లో కీన్ యూ (సింగపూర్)పై 21-13, 21-17తో గెలుపొందాడు.

బుమ్రా ధాటికి విలవిల

ఐదు వికెట్లతో అదుర్స్

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ 159 ఆలౌట్

భారత్ మొదటి ఇన్నింగ్స్ 37/1


బుమ్రా (5/27)
కుల్దీప్ (2/36)

కోల్‌కతా: ప్రఖ్యాత ఈడెన్ గార్డెన్స్‌లో భారత బౌలర్లు చెలరేగారు. ముఖ్యంగా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా (5/27) ధాటికి వరల్డ్ టెస్టు చాంపియన్ సౌతాఫ్రికా విలవిల్లాడింది. శుక్రవారం ఆరంభమైన ఈ తొలి టెస్టులో ఇతర బౌలర్లు కూడా ప్రభావం చూపడంతో సఫారీలు తమ తొలి ఇన్నింగ్స్‌లో 55 ఓవర్లే ఆడి కేవలం 159 పరుగులకు కుప్పకూలారు. ఓపెనర్ మార్‌క్రమ్ (31), ముల్డర్ (24), జోర్జి (24), రికెల్టన్ (23) ఫర్వాలేదనిపించారు. పేసర్ సిరాజ్, స్పిన్నర్ కుల్దీప్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత బరిలోకి దిగిన భారత్ ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 20 ఓవర్లలో వికెట్ నష్టానికి 37 రన్స్ చేసింది. పిచ్ బౌలర్లకు సహకరించడంతో భారత్‌కు కూడా పరుగులు రావడం కష్టంగా మారింది. జైస్వాల్ (12) ఏడో ఓవర్‌లో వెనుదిరిగాడు. మరో ఓపెనర్ రాహుల్ (59 బంతుల్లో 13 బ్యాటింగ్), వన్‌డౌన్ బ్యాటర్ సుందర్ (38 బంతుల్లో 6 బ్యాటింగ్) జాగ్రత్తగా ఆడగా, వెలుతురులేమితో మ్యాచ్‌ను 15 ఓవర్లు ముందుగానే ముగించారు. సాయి సుదర్శన్‌ను పక్కనబెట్టి ఆల్‌రౌండర్ అక్షర్‌ను తీసుకోవడంతో భారత జట్టు నలుగురు స్పిన్నర్లతో బరిలోకి దిగినట్టయ్యింది.

ఆరంభం బాగున్నా..: టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన సౌతాఫ్రికా ఇన్నింగ్స్ ధాటిగానే ఆరంభమైంది. ముందుగా ఓపెనర్ రికెల్టన్ వన్డే తరహాలో ఆడేస్తూ బౌలర్లపై ఒత్తిడి పెంచాడు. మార్‌క్రమ్ మాత్రం ఖాతా తెరిచేందుకు 23 బంతులు తీసుకున్నాడు. కానీ ఆ తర్వాత బౌండరీలతో జోరు చూపాడు. అక్షర్‌ను లక్ష్యం చేసుకుని ఎదురుదాడికి దిగాడు. వీరి ధాటికి తొలి పది ఓవర్లలోనే స్కోరు 57కి చేరింది. ఈ క్రమంలో 2008 తర్వాత భారత్‌లో తొలి వికెట్‌కు 50+ భాగస్వామ్యం అందించగలిగారు. అటు పేసర్ బుమ్రా మాత్రం కొత్త బంతితో బౌన్స్‌ను రాబట్టి రన్స్‌ను కట్టడి చేయగలిగాడు. వికెట్లను లక్ష్యం చేసుకుని బంతులు విసిరిన బుమ్రా ప్రయత్నం 11వ ఓవర్‌లో ఫలించింది. ఓ చక్కటి లెంగ్త్ బాల్‌తో రికెల్టన్‌ను బౌల్డ్ చేశాడు. తన తర్వాతి ఓవర్‌లోనే ఎక్స్‌ట్రా బౌన్స్‌తో మార్‌క్రమ్‌ను కూడా దెబ్బతీశాడు. కుడిపక్కకు డైవ్ చేస్తూ కీపర్ పంత్ సూపర్ క్యాచ్ తీసుకున్నాడు. అటు స్పిన్నర్ కుల్దీప్ తన రెండో ఓవర్‌లోనే కెప్టెన్ బవుమా (3)ను అవుట్ చేశాడు. అనంతరం ముల్డర్, డి జోర్జి ఓపిగ్గా ఆడి 105/3 స్కోరు దగ్గర తొలి సెషన్‌ను ముగించారు.

బౌలర్ల హవా: రెండో సెషన్‌లో భారత బౌలర్లు మరింత బెంబేలెత్తించారు. చక్కగా కుదురుకున్న ముల్డర్‌ను కుల్దీప్, జోర్జిని బుమ్రా స్వల్ప వ్యవధిలోనే పెవిలియన్‌కు చేర్చారు. దీంతో 120/5 స్కోరుతో జట్టు కష్టాల్లో పడింది. ఈ దశలో స్టబ్స్ కాస్త పోరాటం చూపినా.. మరో ఎండ్‌లో అతడికి సహకారం కరువైంది. బంతి పాతదిగా మారాక సిరాజ్ 45వ ఓవర్‌లో వెరీన్ (16), యాన్సెన్ (0)ల వికెట్లు తీయగా.. టీ బ్రేక్‌కు ముందు ఓవర్‌లో బాష్ (3)ను అక్షర్ అవుట్ చేశాడు. దీంతో ఈ సెషన్‌లో ఏకంగా ఐదు వికెట్లు కోల్పోయిన దక్షిణాఫ్రికా 49 పరుగులు మాత్రమే జోడించింది. ఇక ఆఖరి సెషన్ మూడో ఓవర్‌లోనే బుమ్రా మిగిలిన రెండు వికెట్లను పడగొట్టి కెరీర్‌లో 16వ సారి ఐదు వికెట్ల మైలురాయిని అందుకున్నాడు.

సాయి సుదర్శన్‌కు చోటేది?: కుంబ్లే

బ్యాటర్ సాయి సుదర్శన్‌కు జట్టులో చోటు కల్పించకపోవడాన్ని మాజీ కెప్టెన్ అనిల్ కుంబ్లే తప్పుపట్టాడు. ఏకంగా ఆరుగురు ఎడమచేతి వాటం ఆటగాళ్లను ఆడించడాన్ని కూడా ప్రశ్నించాడు. టీమిండియా చరిత్రలో గతంలో ఎప్పుడూ ఇలా ఆరుగురు లెఫ్టాండర్లను ఆడించలేదు.

స్కోరుబోర్డు

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: మార్‌క్రమ్ (సి) పంత్ (బి) బుమ్రా 31, రికెల్టన్ (బి) బుమ్రా 23, ముల్డర్ (ఎల్బీ) కుల్దీప్ 24, బవుమా (సి) జురెల్ (బి) కుల్దీప్ 3, జోర్జి (ఎల్బీ) బుమ్రా 24, స్టబ్స్ (నాటౌట్) 15, వెరీన్ (ఎల్బీ) సిరాజ్ 16, యాన్సెన్ (బి) సిరాజ్ 0, బాష్ (ఎల్బీ) అక్షర్ 3, హార్మర్ (బి) బుమ్రా 5, కేశవ్ (ఎల్బీ) బుమ్రా 0; **ఎక్స్‌ట్రాలు: 15, మొత్తం: 55 ఓవర్లలో 159 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-57, 2-62, 3-71, 4-114, 5-120, 6-146, 7-147, 8-154, 9-159, 10-159; **బౌలింగ్:** బుమ్రా 14-5-27-5, సిరాజ్ 12-0-47-2, అక్షర్ 6-2-21-1, కుల్దీప్ 14-1-36-2, జడేజా 8-2-13-0, సుందర్ 1-0-3-0.

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (బి) యాన్సెన్ 12, రాహుల్ (బ్యాటింగ్) 13, సుందర్ (బ్యాటింగ్) 6; **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 20 ఓవర్లలో 37/1. వికెట్ పతనం:** 1-18; **బౌలింగ్:** యాన్సెన్ 6-2-11-1, ముల్డర్ 5-1-15-0, కేశవ్ 5-1-8-0, బాష్ 3-2-1-0, హార్మర్ 1-1-0-0.

అమన్, నేహాపై సస్పెన్షన్ ఎత్తివేత

న్యూఢిల్లీ: ఈ ఏడాది రెండు అంతర్జాతీయ చాంపియన్‌షిప్స్‌లలో అధిక బరువుతో అనర్హత వేటుకు గురైన ఒలింపిక్ పతక విజేత అమన్ సెహ్రావత్, జూనియర్ మహిళా రెజ్లర్ నేహా సాంగ్వాన్‌లపై విధించిన సస్పెన్షన్‌ను భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) ఎత్తివేసింది. తొలి తప్పిదం కావడంతో పాటు రెజ్లర్లు ఇచ్చిన వివరణతో సంతృప్తి చెందిన డబ్ల్యూఎఫ్ఐ.. వాళ్లిద్దరిపై సస్పెన్షన్ ఎత్తివేసింది.

ఐర్లాండ్‌పై బంగ్లా ఇన్నింగ్స్ విజయం

సిల్హెట్: రెండు టెస్టుల సిరీస్‌లో భాగంగా జరిగిన తొలి మ్యాచ్‌లో ఐర్లాండ్‌పై బంగ్లాదేశ్ ఇన్నింగ్స్ 47 పరుగులతో గెలిచింది. ఓవర్‌నైట్ స్కోరు 86/5తో శుక్రవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఐర్లాండ్ 254 పరుగులకు ఆలౌటై భారీ ఓటమిని మూటగట్టుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో ఐర్లాండ్ 286, బంగ్లా 587/8 (డిక్లేర్) రన్స్ చేశాయి.

అతను మరుగుజ్జు కదా..

బవుమాపై బుమ్రా కామెంట్

కోల్‌కతా టెస్టులో శుక్రవారం తొలి రోజు ఆటలో దక్షిణాఫ్రికా కెప్టెన్ బవుమాను భారత పేసర్ బుమ్రా మరుగుజ్జుతో పోల్చడం చర్చనీయాంశమైంది. బుమ్రా తన ఏడో ఓవర్‌లో వేసిన బంతి బవుమా ప్యాడ్లను తాకింది. దీంతో భారత్ ఎల్బీకి అప్పీల్ చేయగా అంపైర్ తిరస్కరించాడు. అయితే బంతి ఎత్తులో వెళ్లిందా? అనే విషయమై కీపర్ పంత్‌తో చర్చించగా... అతను కూడా రివ్యూకు నిరాకరించాడు. దీంతో బౌలింగ్ చేసేందుకు వెనక్కి వెళుతూ 'క్రీజులో ఉన్నది మరుగుజ్జు కదా..' అని బుమ్రా అనడం మైక్ స్టంప్‌లో వినిపించింది. మరోవైపు ఈ ఘటనపై సఫారీ జట్టు బ్యాటింగ్ కోచ్ ప్రిన్స్ స్పందిస్తూ.. 'ఈ వ్యవహారంపై జట్టులో ఎలాంటి చర్చా జరగలేదు. ఇలా జరగడమైతే ఇదే తొలిసారి' అని అన్నాడు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar, Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.